అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
శుక్రవారం 20-12-2024
సంపుటి : 10 సంచిక : 351 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

మనువాద దృక్పథాన్ని బయటపెట్టారు



ప్రజల మనోభావాలను గాయపరిచారు
ఆయనకు కేంద్ర హోం మంత్రిగా ఉండే హక్కు లేదు
ప్రధాని మోడీ సమర్థించిన విధానం అన్యాయం : అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలకు
సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో ఖండన 6లో..



ఓఆర్ఆర్ టెండర్లపై సిట్

అసెంబ్లీలో సీఎం రేవంత్ ప్రకటన

బీఆర్ఎస్ అప్పనంగా టెండర్‌దారులకు అప్పగించిందంటూ వ్యాఖ్య

హరీశ్‌రావు కోరిక మేరకు ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్) లీజు టెండర్లపై విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాసనసభలో ప్రకటించారు. బీఆర్ఎస్ సభ్యుడు తన్నీరు హరీశ్‌రావు కోరిక మేరకు, సభ్యులందరి ఆమోదంతో ఈ విచారణకు ఆదేశిస్తున్నట్టు ఆయన తెలిపారు. మంత్రివర్గంలో చర్చించి, విధి విధానాలను రూపొందిస్తామని చెప్పారు. గురువారం అసెంబ్లీలో సీఎం మాట్లాడుతూ... ఓఆర్ఆర్‌పై హరీశ్‌రావు విచారణ కోరటం అభినందనీయమన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి జైకా నిధులతో ఓఆర్ఆర్‌ను నిర్మించారని గుర్తు చేశారు. దాన్ని బీఆర్ఎస్ సర్కారు అప్పనంగా టెండర్‌దారులకు అప్పగించిందని విమర్శించారు. అంతర్జాతీయ విమానాశ్రయం, ఓఆర్ఆర్‌ను నిర్మించటంతోపాటు ఐటీ కంపెనీలను హైదరాబాద్‌కు తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని అన్నారు. తద్వారా తమ పార్టీ నగరాన్ని విశ్వనగరంగా మార్చిందని తెలిపారు. హైదరాబాద్ నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు వీలుగా కృష్ణా, గోదావరి జలాలను తరలించాలంటూ తమ పార్టీ నేత పీజేఆర్ ఉద్యమాలు నిర్వహించారని గుర్తు చేశారు. భాగ్యనగరానికి ...13లో


రాత్రి 11 గంటల వరకు కొనసాగిన అసెంబ్లీ

మున్సిపాల్టీ సవరణ బిల్లు, పంచాయతీరాజ్ సవరణ బిల్లుకు ఆమోదం 5లో..

కేటీఆర్‌పై ఎఫ్ఐఆర్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌పై నాలుగు కేసులు

ఫార్ములా-ఈ కార్ రేసింగ్ కేసులో ఏసీబీ నమోదు
ఐఏఎస్ అరవింద్ కుమార్,
హెచ్ఎండీఏ మాజీ సీఈఓ బీఎల్ఎన్ రెడ్డిల పైనా
ఏసీబీ కోర్టుకు ఎఫ్ఐఆర్ సమర్పించిన దర్యాప్తు అధికారులు



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై ఏసీబీ అధికారులు ఫార్ములా-ఈ కార్ రేసింగ్‌కు సంబంధించి నాలుగు కేసులను నమోదు చేశారు. కేటీఆర్‌తో పాటు అప్పటి హెచ్ఎండీఏ కమిషనర్, సీనియర్ ఐఏఎస్ అధికారి, ప్రస్తుత ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిల పైనా కేసులు నమోదయ్యాయి. ఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో ఏ1గా కేటీఆర్, ఏ2గా అరవింద్ కుమార్, ఏ3గా బీఎల్ఎన్ రెడ్డి ల పేర్లను చేర్చారు. అలాగే, ఫార్ములా-ఈ కార్ రేసింగ్‌కు సంబంధించి భాగస్వాములైన దాదాపు నాలుగు కంపెనీల పేర్లను కూడా ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారు.

నాన్-బెయిలెబుల్ కేసులు నమోదు

ప్రభుత్వానికి చెందిన రూ.55 కోట్లను ఎలాంటి అనుమతులూ తీసుకోకుండా ఫార్ములా-ఈ కార్ రేసింగ్ నిర్వహణ కోసం ఏకపక్షంగా సదరు కంపెనీలకు విడుదల చేసి పైన నిందితులుగా పేర్కొనబడిన ముగ్గురు అవినీతికి పాల్పడినట్టు ఏసీబీ ఆరోపించింది. దీని ఆధారంగా ముగ్గురి పైనా అవినీతి నిరోధక చట్టంలోని 13(1), 13(2)తో పాటు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని 409, 120బి సెక్షన్ల కింద కేసులను నమోదు చేశారు. అయితే, ఈ కేసులన్నీ నాన్-బెయిలబుల్ కిందకే వస్తాయి.

దర్యాప్తు కోసం స్పెషల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్

ఎఫ్ఐఆర్ నమోదు చేశాక దీనికి సంబంధించిన సమాచారాన్ని నాంపల్లిలోని ఏసీబీ కేసుల ప్రత్యేకకోర్టుకు అధికారులు అందజేశారు. నమోదు చేసిన కేసులకు సంబంధించిన సమాచారాన్ని కేటీఆర్, అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలకు ఏసీబీ అధికారులు అందజేయనున్నారు. అనంతరం, దర్యాప్తు ప్రక్రియను ముందుకు సాగించనున్నారు. కాగా, ఈ కేసులో సమగ్రంగా దర్యాప్తు సాగించటానికి ఏసీబీలో దాదాపు 45 మందికి పైగా అధికారులు, సిబ్బందితో స్పెషల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్‌ను ఆ విభాగం అధిపతి విజయ్‌కుమార్ ఏర్పాటు చేశారు.

కేటీఆర్ ఇచ్చిన మౌఖిక ఆదేశాల మేరకే.. : అరవింద్ కుమార్

ఫార్ములా-ఈ కార్ రేసింగ్ నిర్వాహణకు సంబంధించి అప్పటి పట్టణ, మునిసిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఇచ్చిన మౌఖిక ...13లో

అవినీతే జరగనప్పుడు కేసు ఎలా నమోదు చేస్తారు ?

ఫార్ములా ఈ-రేసు కేసుపై కేటీఆర్ 6లో..

ఎదురుదాడి

అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలతో ఆత్మరక్షణలో బీజేపీ

అంబేద్కర్‌ను అమిత్ షా అవమానించడాన్ని నిరసిస్తూ ప్రతిపక్షాలు గురువారం దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టాయి. ఈ నేపథ్యంలో చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా పార్లమెంటులో నాటకీయ పరిణామాలు, ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. అమిత్ షా అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ దేశవ్యాప్త ఆందోళనలు వెల్లువెత్తటంతో బీజేపీ దిక్కుతోచని స్థితిలో పడింది. ఈ అంశం నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు బీజేపీ నాయకత్వం ప్రతిపక్షంపైకి తమ ఎంపీలను ఉసిగొల్పింది. మకరద్వార్ ముందు సమావేశమైన బీజేపీ ఎంపీలు అంబేద్కర్‌ను కాంగ్రెస్సే అవమానించిందని ప్రత్యారోపణలు చేస్తూ ఎదురుదాడికి దిగారు. పార్లమెంటు లోకి ప్రతిపక్ష ఎంపీల ప్రవేశాన్ని పూర్తిగా అడ్డుకుంటూ అధికార పక్షం నిరసనకు దిగటం తోపులాటకు దారి తీసింది. ఈ తోపులాటలో మల్లిఖార్జున్ ఖర్గే సహా పలువురు ఎంపీలు గాయపడ్డారు.



పార్లమెంట్ ఆవరణలో నిరసన సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీపై దూసుకెళ్తున్న బీజేపీ ఎంపీ హిమాంగ్ జోషి

- ప్రజల దృష్టి మళ్లించే యత్నాలు
- ప్రతిపక్ష ఎంపీలకు వ్యతిరేకంగా ఆందోళన
- మకరద్వార్ వద్ద బీజేపీ, ఎన్డీఏ ఎంపీల హల్‌చల్
- ప్రతిపక్ష ఎంపీలను అడ్డుకున్న వైనం
- స్పీకర్ ఓం బిర్లా ఆదేశాలు బేఖాతరు
- పార్లమెంటులో గందరగోళం
- నెట్టుకున్న ఎంపీలు.. కిందపడ్డ సభ్యులు
- ప్రతిపక్ష నేత ఖర్గేను కిందకు నెట్టేసిన బీజేపీ ఎంపీలు...ఆయనకు గాయాలు
- ఇద్దరు బీజేపీ ఎంపీలకు కూడా..
- పోలీస్ స్టేషన్లో అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్, ఇతర పార్టీల పరస్పర ఫిర్యాదులు

రాహుల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ఆందోళన చేసిన అనంతరం పార్లమెంట్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించిన ప్రతిపక్ష ఎంపీలను బీజేపీ ఎంపీలు మకరద్వార్ ముందు అడ్డుకున్నారు. అడ్డంకిని దాటుకుని ముందుకు వెళ్లేందుకు యత్నించిన ప్రతిపక్ష ఎంపీలను బీజేపీ ఎంపీలు నిరోధించారు. ఆ తర్వాత జరిగిన తోపులాట లో పలువురు ఎంపీలు కింద పడిపోయారు. ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కూడా కింద పడిపోయారు. ఆయనకు గాయాలయ్యాయి. ఇద్దరు బీజేపీ ఎంపీలకూ స్వల్ప గాయాలయ్యాయి. పార్లమెంట్ ఎదుట ఈ ఘర్షణ జరగటంతో గురువారం ఉభయ సభలూ పూర్తిగా స్తంభించాయి. కాగా, గాయాలైన బీజేపీ ఎంపీలు ప్రతాప్ సారంగి, ముఖేశ్ రాజ్‌పుత్‌ను ఆర్ఎంఎల్ ఆస్పత్రికి తరలించారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వారిద్దరినీ నెట్టారని బీజేపీ ఆరోపించింది. రాహుల్ గాంధీ భయపెట్టే విధంగా ప్రవర్తించారని బీజేపీ రాజ్యసభ సభ్యుడు ఫాంగ్నాన్ కొన్యాక్ రాజ్యసభ స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. పార్లమెంట్ ఎదుట జరిగిన ఘటనలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ స్పీకర్ ఓం బిర్లాకు మల్లికార్జున్ ఖర్గే లేఖ రాశారు. తనను బీజేపీ ఎంపీలు నెట్టారని కూడా ఖర్గే లేఖలో పేర్కొన్నారు. ఎంపీలపై రాహుల్ గాంధీ దాడి చేశారంటూ బీజేపీ పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మల్లికార్జున్ ఖర్గేను పడగొట్టారని కాంగ్రెస్ కూడా పోలీసులకు ఫిర్యాదు చేసింది.

స్తంభించిన ఉభయ సభలు

పార్లమెంట్ ఎదుట జరిగిన ఘర్షణతో గురువారం ఉభయ సభలు పూర్తిగా స్తంభించాయి. ఉదయం లోక్‌సభ సమావేశమైన వెంటనే అంబేద్కర్‌ను అమిత్ షా అవమానించడాన్ని నిరసిస్తూ ప్రతిపక్షాలు ...14లో

నాపై జులుం



నెట్టేశానన్న ఆరోపణలు నిరాధారం: రాహుల్ గాంధీ

బీజేపీ ఎంపీలను తాను నెట్టివేశానన్న ఆరోపణలు నిరాధారమని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. "ఇది మీ కెమెరాలో ఉండవచ్చు. నేను పార్లమెంటు ప్రవేశద్వారం నుంచి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా, బీజేపీ ఎంపీలు నన్ను అడ్డుకుని, నెట్టేందుకు, బెదిరించేందుకు ప్రయత్నించారు. కాబట్టి, ఇది జరిగింది. మల్లికార్జున్ ఖర్గేను నెట్టేశారు. కానీ మేము కుట్రకు ప్రభావితం కాలేదు. ఇది ప్రవేశ ద్వారం. లోపలికి వెళ్లే హక్కు మాకున్నది. బీజేపీ ఎంపీలు మమ్మల్ని లోపలికి వెళ్లకుండా అడ్డుకునేందుకు ప్రయత్నించారు. కేంద్రం ఉద్దేశ్యం ఏమిటంటే వారు రాజ్యాంగంపై దాడి చేయడం, అంబేద్కర్ స్మృతిని అవమానించడం" అని ఆయన తెలిపారు. అదానీ ఘటన నుంచి దృష్టి మరల్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. మోడీ స్నేహితుడు అదానీపై అమెరికాలో ఆరోపణలు వచ్చాయనీ, మోడీ భారత్‌ను అదానీకి అమ్మేస్తున్నారని రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

సర్వేయర్లను నియమిస్తాం

ఫారెస్టు, రెవెన్యూ సరిహద్దుల సమస్యలను పరిష్కరిస్తాం

30 నుంచి 35 నియోజకవర్గాల్లో సమస్య : మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో భూముల సరిహద్దుల సమస్యను పరిష్కరించేందుకు సరిపడ సర్వేయర్లు లేరనీ, మండలానికి అవసరాన్ని బట్టి ఒకరిద్దరు సర్వేయర్లను నియమిస్తామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. శాసనసభలో గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. రెవెన్యూ, ఫారెస్టు శాఖల మధ్య సరిహద్దుల సమస్య, పోడు భూముల సమస్య 30 నుంచి 35 నియోజకవర్గాల్లో ఉందని మంత్రి చెప్పారు. పోడుభూముల సమస్యను పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. అయితే, సభ్యులు లెటర్‌హెడ్‌మీద రాసి ఇస్తే వాటిని పరిశీలించి రైతులకు న్యాయం చేస్తామని హామీనిచ్చారు. రాష్ట్రంలో 892 సర్వేయర్లకు గానూ కేవలం 242 మాత్రమే ఉన్నారని చెప్పారు. వీలైనంత త్వరలో సర్వేయర్లను నియమిస్తామన్నారు. ధరణి సమస్యల విషయంలో సభ్యులు చెప్పినవన్నీ నగ్న సత్యాలేనన్నారు. ధరణిని ప్రక్షాళన చేసేందుకే భూ భారతిని తీసుకొస్తున్నామని ...6లో

మార్చి 21 నుంచి పది పరీక్షలు

ఏప్రిల్ 4 వరకు నిర్వహణ

గ్రేడింగ్ విధానం రద్దు
విద్యార్థులకు మార్కులతోనే మెమోలు
టైంటేబుల్ విడుదల



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పదోతరగతి వార్షిక పరీక్షలు వచ్చే ఏడాది మార్చి 21 నుంచి ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ నాలుగో తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు గురువారం టైంటేబుల్‌ను విడుదల చేశారు. పదోతరగతి పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. ఈ టైం టేబుల్ రెగ్యులర్, ప్రయివేటు విద్యార్థులకు వర్తిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో పదో తరగతి విద్యార్థులకు ఆరు పేపర్లకు ఏడు సబ్జెక్టులతో పరీక్షలను నిర్వహిస్తున్నట్టు వివరించారు. గతంలో జనరల్ సైన్స్ పేరుతో ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ సబ్జెక్టులకు ...13లో



అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న తమ్మినేని

అమిత్ షా దేశప్రజలకు క్షమాపణ చెప్పాలి

అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలకు ఖండన
కేంద్ర హోం మంత్రి వ్యాఖ్యలను ప్రధాని మోడీ సమర్థించడం సరికాదు
సీపీఐ (ఎం) ఖమ్మం జిల్లా 22వ మహాసభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
వివరాలు 5లో

నల్లగొండలో టీఎస్‌యూటీఎఫ్ 6వ విద్యా వైజ్ఞానిక మహాసభలు

28,29,30 తేదీల్లో నిర్వహణ
ముఖ్యఅతిథులుగా మండలి చైర్మెన్ గుత్తా, మంత్రి కోమటిరెడ్డి
పదేండ్లలో విద్యారంగం విధ్వంసం : ఎమ్మెల్సీ నర్సిరెడ్డి
విద్యారంగం, ఉపాధ్యాయ సమస్యలపై కార్యాచరణ రూపొందిస్తాం : టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జంగయ్య, చావ రవి
రాష్ట్ర మహాసభల గోడపత్రిక ఆవిష్కరణ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర ఆరో విద్యా వైజ్ఞానిక మహాసభలు ఈనెల 28,29,30 తేదీల్లో నల్లగొండ పట్టణంలో జరగనున్నాయి. గురువారం హైదరాబాద్‌లోని దోమల్‌గూడలో ...13లో



రూపాయి చారిత్రాత్మక పతనం

డాలర్ @ 85
మోడీ హామీలు బొక్కబోర్లా
ఆర్థిక వ్యవస్థకు సవాళ్లే..
2014లో 60లోపే..

న్యూఢిల్లీ : తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువను పడిపోనివ్వబోమని.. అమాంతం పెంచుతామని..రూపాయి కరెన్సీల కోసం విదేశాలు లైన్ కట్టాలని నరేంద్ర మోడీ 2013లో చేసిన ప్రచార ఆర్భాటాలు బొక్కబోర్లా ...13లో

విజేతలు రాసిందే చరిత్రకాదు

పదేండ్లలో తెలంగాణ చరిత్రకు వక్రభాష్యం

"విజేతలు రాసిందే చరిత్ర కాదు.. గెలిచిన వారు ఎవరైనా తమ గురించే రాసుకుంటారు. వారి రాజకీయ ఆకాంక్షలకు అనుగుణంగా చరిత్రకు వక్రభాష్యం చెబుతారు. పదేండ్ల తెలంగాణలో అదే జరిగింది. మరుగున పడ్డ తెలంగాణ ఉద్యమ చరిత్రను, అమరుల త్యాగాలను పునఃర్లిఖించాల్సిన అవసరం ఉంది. అందుకు కవులు, కళాకారులు తమ కలాలకు, గళాలకు పదును పెట్టి ముఖ్య భూమిక పోషించాలి" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో కొలువుదీరిన హైదరాబాద్ బుక్‌ఫెయిర్ 37వ జాతీయ పుస్తక ప్రదర్శనను గురువారం ఆయన ప్రారంభించారు.

- కవులు, కళాకారులు తిరిగి రాయాలి
- డిజిటల్ యుగంలో పుస్తక పఠనం తగ్గుతోంది
- బుక్‌ఫెయిర్‌కు శాశ్వత భవనం పరిశీలిస్తాం : హైదరాబాద్ బుక్‌ఫెయిర్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గత పదేండ్లుగా మరుగున పడిపోయిన చరిత్రను వెలికితీసేందుకు ప్రయత్నిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. "నిజాం, తొలి, మలి తెలంగాణ పోరాటాల్లో అమరులైన వారికంటే రాజకీయ ప్రయోజనం పొందిన వారి గురించే చర్చ జరుగుతోంది. చరిత్రకారులు వాస్తవాలు రాయకుంటే అమరులకు అన్యాయం జరుగుతుంది. ఈ సమాజం ప్రజాపోరాటాలు నిర్వహించేందుకు వారే స్ఫూర్తిదాయకం. ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన సభలో తెలంగాణ బిల్లును ప్రవేశ పెట్టినప్పుడు నేను ఇదే విషయాన్ని ప్రస్తావించాను" అని సీఎం గుర్తు చేశారు. ఈ క్రమంలోనే నిజాంకు వ్యతిరేకంగా తన కలం ద్వారా ప్రజలను చైతన్యం చేసిన సురవరం ప్రతాపరెడ్డి పేరును పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయానికి పెట్టినట్టు తెలిపారు. తెలంగాణ తొలి, మలి ఉద్యమ కవులు దాశరథి, కాళోజీ, అందెశ్రీ, గద్దర్, గోరటి వెంకన్న, గూడ అంజయ్య, బండియాదగిరి మొదలగు వారిని గుర్తించినట్టు పేర్కొన్నారు. "ముఖ్యమంత్రిగా నేను కూడా పుస్తకాలు చదివే జ్ఞానాన్ని పెంపొందించుకున్నాను. ఆధునిక సాంకేతికత, డిజిటల్ ...3లో

అమిత్‌షా వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అన్ని వర్గాల ప్రజల కోసం రాజ్యాంగాన్ని రూపకల్పన చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై పార్లమెంట్‌లో కేంద్ర హోం శాఖ మంత్రి హోదాలో ఉంటూ చట్టాన్ని, రాజ్యాంగాన్ని గౌరవించాల్సిన అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలు ఆయన హోదాకు తగ్గట్టుగా లేవని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. ఈ వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశ ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. దేశాన్ని మనువాదం వైపు నడిపించే ఈ చర్యను తీవ్రంగా ఖండించారు. ఆ స్థానంలో కొనసాగడానికి అమిత్‌షా ఏమాత్రం అర్హుడు కాదని తెలిపారు. ఈ వ్యాఖ్యలపట్ల రాష్ట్రంలోని బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర నాయకులు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఓవైసీ అక్రమ నిర్మాణాలు కూలుస్తాం

- చెరువులో స్కూళ్లు, కాలేజీ కట్టకపోతే ఎందుకు భయపడుతున్నారు : బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా గురువారం బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ఓవైసీ మధ్య మాటలు తూటాల్లా పేలాయి. ఢీ.. అంటే ఢీ అని పరస్పరం విమర్శలు చేసుకున్నారు. ఓవైసీకి చెందిన స్కూళ్లు, కాలేజీలు చెరువులో కట్టకపోతే వారు ఎందుకు భయపడుతున్నారని ఏలేటి ప్రశ్నించారు. పట్టా ల్యాండ్‌లో నిర్మాణాలుంటే ఎందుకు భయమని నిలదీశారు. బీజేపీ సభ్యుల వైపు వేలెత్తి చూపించి ఎందుకు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనారిటీ పిల్లలకోసం చెరువులో ఎలా కడతారన్నారు. అంబేద్కర్ ను తాము గౌరవిస్తామనీ, అక్బరుద్దీన్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని ఏలేటి డిమాండ్ చేశారు. హైడ్రా పేరిట పేదల ఇండ్లను కూల్చినప్పుడు చెరువును ఆక్రమించి ఓవైసీ అక్రమ నిర్మాణాలను కూల్చాలని మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక కచ్చితంగా కూలుస్తామని హెచ్చరించారు. తాను ఇల్లీగల్ కట్టడాలపై మాట్లాడుతున్నాననీ, ఎవరినీ ఉద్దేశించి కాదని స్పష్టం చేశారు. హైడ్రా పేరుతో కూల్చిన నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తుందా? లేదా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి పేరు మర్చిపోతే తమపై కూడా కేసు పెడతారనే భయం కలుగుతోందని సెటైర్లు వేశారు. హైడ్రా వల్ల చెడ్డ పేరు వస్తోందని మంత్రి శ్రీధర్ బాబే చెప్పారని గుర్తుచేశారు.

ఏలేటి కి అక్బర్ కౌంటర్

బీజేపీ సభ్యులు తమను భయపెట్టి బెదిరించాలని చూస్తున్నారని, పదేండ్ల నుంచి బీజేపీ ప్రభుత్వాన్ని చూస్తున్నామని అక్బర్ అన్నారు. మహేశ్వర్ రెడ్డి అక్రమ కట్టడాలను కూల్చుతామంటున్నారని, వారి బుల్డోజర్లకు భయపడబోమని కౌంటర్ ఇచ్చారు. తన భవనాలన్నింటికీ అనుమతి ఉందన్నారు. సభలో మహేశ్వర రెడ్డి తన పేరు తీసుకోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. తాము కోర్టులను, కోర్టు తీర్పులను గౌరవిస్తామని చెప్పుకొచ్చారు.

ఖాళీ భూములకు కాంపౌండ్ వాల్స్


- ఆక్రమణలకు గురికాకుండా ప్రభుత్వ చర్యలు
- టెండర్లను పిలిచామన్న హౌసింగ్ బోర్డు



తెలంగాణలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురి కాకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇప్పటికే తెలంగాణ హౌసింగ్ బోర్డు ఆధీనంలో 703 ఎకరాల ల్యాండ్ బ్యాంకు ఉండగా, దాని అనుబంధ డెక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ల్యాండ్ హోల్డింగ్స్ లిమిటెడ్ (డీఐఎల్ఎల్) ఆధీనంలో 1821 ఎకరాల ల్యాండ్ బ్యాంకు ఉన్నట్టు ప్రభుత్వం గుర్తించింది. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురి కాకుండా వాటి చుట్టూ పటిష్టమైన కాంపౌండ్ వాల్స్ నిర్మించాలని సూచించిందని తెలంగాణ హౌసింగ్ బోర్డు ఓ ప్రకటనలో పేర్కొంది. అందుకోసం డీజీపీఎస్ సర్వే నిర్వహించాలని సూచిస్తూ , పరిపాలనా మంజూరు క్రింద రూ.25 కోట్లు కేటాయించినట్టు తెలిపింది. ఇప్పటికే సర్వే నిర్వహించామని, హౌసింగ్ బోర్డు భూములకు కాంపౌండ్ వాల్స్ నిర్మాణ పనులు చేపట్టామని, మొదటి దశలో 422 ఎకరాలను కవర్ చేసి 16 ప్యాకేజీల క్రింద టెండర్లకు పిలుపునిచ్చినట్టు హౌసింగ్ బోర్డు పేర్కొంది. మొదటి దశలోని ఈ ప్రాజెక్ట్ విలువను రూ.10 కోట్లుగా తెలిపింది. నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయని, 28,500 మీటర్ల నిర్మాణానికి ప్రతిపాదించగా 7500 మీటర్లు పూర్తయినట్టు తెలిపింది. డీఐఎల్ఎల్ ఆధీనంలోని ఖాళీ భూములకు కూడా కాంపౌండ్ వాల్స్ నిర్మాణ బాధ్యత చేపట్టామని తెలిపింది. దీని క్రింద ఎలాంటి లిటిగేషన్ లేని 620 ఎకరాలకు మొదటి దశలో నిర్మాణ పనులు చేపట్టామని, 17 ప్యాకేజీల క్రింద టెండర్ల ప్రక్రియ పురోగతిలో ఉన్నట్టు తెలిపింది. ఈ ప్రాజెక్ట్ విలువను రూ.12 కోట్లుగా పేర్కొంది. కాంపౌండ్ వాల్స్ నిర్మాణానికి సంబంధించి ఈనెల 17న తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మెన్, హౌసింగ్ కమిషనర్, హౌసింగ్ శాఖ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి వి .పి.గౌతమ్ అధ్యక్షతన సమీక్ష జరిగిందని హౌసింగ్ బోర్డు తెలిపింది. కాంపౌండ్ వాల్స్ నిర్మాణ పనులను వచ్చే ఏడాది జనవరి వరకల్లా పూర్తి చేయాలని, డీఐఎల్ఎల్ భూముల పనులను సంక్రాంతికి ముందే ప్రారంభించాలని ఆ సమావేశంలో నిర్ణయించినట్టు పేర్కొంది.

అంబేద్కరిస్టులు ఊరుకోరు

- బీజేపీ పతనం తప్పదు : బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు మంద ప్రభాకర్
- అమిత్ షా రోజులు లెక్కబెట్టుకో : బీఎస్పీ స్టేట్ కోఆర్డినేటర్ ఇబ్రాం శేఖర్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు అంబేద్కరిస్టులను మరింత రెచ్చగొట్టినట్లయిందనీ, బీజేపీని పతనం చేసే వరకు అంబేద్కరిస్టులు ఊరుకోబోరని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు మంద ప్రభాకర్ హెచ్చరించారు. పార్లమెంట్ లో అంబేద్కర్ పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ బీఎస్పీ రాష్ట్ర కార్యాలయం నుంచి ట్యాంక్ బండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్దకు ర్యాలీ చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభాకర్ మాట్లాడుతూ.. వందల ఏండ్ల దేశ బానిసత్వాన్ని చెరిపేసిన మహనీయుడు అంబేద్కర్ అని ఆయన కొనియాడారు. అలాంటి వ్యక్తిపై అమిత్ షా.. చిల్లర, జుగుప్సాకర వ్యాఖ్యలు దుర్మార్గమని ఫైరయ్యారు. అమిత్ షా వెంటనే క్షమాపణ చెప్పాలనీ, లేదంటే, బహుజనుల సత్తా ఏంటో చూపిస్తామని హెచ్చరించారు. అనంతరం బీఎస్పీ స్టేట్ కోఆర్డినేటర్ ఇబ్రాం శేఖర్ మాట్లాడుతూ.. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఇక రోజులు లెక్కపెట్టుకోవాల్సిందేనన్నారు. అంబేద్కర్‌ను అవమానించడంతోనే బీజేపీ పతనం మొదలైందన్నారు. ఆర్ఎస్ఎస్ ఎజెండాను బీజేపీ అమలు చేస్తోందనీ, మనువాద భావజాలం దేశంలో జడలు విప్పిందని విమర్శలు చేశారు. అంబేద్కర్ రాజ్యాంగం వల్లే అమిత్ షా మంత్రి అయ్యారని గుర్తుపెట్టుకోవాలని సూచించారు. అమిత్ షాను వెంటనే బర్తరఫ్ చేయాలన్నారు. అమిత్ షా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

వ్యవసాయ మార్కెట్లపై క్రూరమైన పాలసీని ఉపసంహరించుకోవాలి

- పాలసీ కాపీలను దహనం చేయండి : 23న దేశవ్యాప్త నిరసనలకు ఏఐకేఎస్ పిలుపు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

వ్యవసాయ మార్కెటింగ్‌పై క్రూరమైన నేషనల్ పాలసీ ఫ్రేమ్‌వర్క్‌ను కేంద్రం ఉపసంహరించుకోవాలని ఏఐకేఎస్ డిమాండ్ చేసింది. క్రూరమైన వ్యవసాయ చట్టాలను తిరిగి తీసుకొచ్చే ప్రయత్నాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలకు ఏఐకేఎస్ పిలుపునిచ్చింది. దేశంలోని అన్ని జిల్లాల్లో ఈనెల 23న పాలసీ కాపీలను దహనం చేయాలనీ, ఎస్కేఎం ఇచ్చిన పిలుపులో భాగస్వామ్యం కావాలని తెలిపింది. ఈ మేరకు గురువారం ఏఐకేఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ దావలే, విజూ కృష్ణన్ ప్రకటన విడుదల చేశారు.

వ్యవసాయ మార్కెటింగ్‌పై జాతీయ విధాన ముసాయిదా ఆర్ఎస్ఎస్, బీజేపీ నేతృత్వంలోని కేంద్రం దుష్ట ఉద్దేశాలను వెల్లడించిందని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలను బలిపెట్టి కార్పొరేట్ల లాభాలను పెంచాలనే కుట్రలో భాగమని వారు పేర్కొన్నారు. చిన్న ఉత్పత్తిదారులు ప్రతికూలంగా దెబ్బతింటారనీ, వ్యవసాయం నుంచి నెట్టబడతారని వివరించారు. జాతీయ విధాన ఫ్రేమ్‌వర్క్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మూడు క్రూరమైన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా చారిత్రాత్మక పోరాటంతో నయా ఉదారవాద, ఛాందసవాదులు వెనక్కి తీసుకున్నారనీ, అయితే అందులోని అంశాలనే ఇప్పుడు జాతీయ విధాన ఫ్రేమ్‌వర్క్‌లో తీసుకువచ్చారని పేర్కొన్నారు. ఆ ముసాయిదాలో ఎంఎస్‌పీ చట్టబద్ధం గురించి, వ్యవసాయంలో ప్రభుత్వ పెట్టుబడి పెంపుదల, రైతు అనుకూల రుణ సదుపాయాలు మొదలైన రైతులు ఉద్యమం లేవనెత్తిన డిమాండ్లు లేవని వివరించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 246 ప్రకారం వ్యవసాయ మార్కెటింగ్ అనేది రాష్ట్ర పరిధిలోని అంశమనీ, రాష్ట్ర ప్రభుత్వాల అధికారాన్ని లాక్కోవడం, రాష్ట్ర మద్దతుతో ఉన్న మార్కెట్‌ను రద్దు చేయడం ముసాయిదాలో స్పష్టమైందన్నారు. మౌలిక సదుపాయాలు, ఏపీఎంసీల పాత్రను దెబ్బతీస్తుందనీ, ప్రయివేటు ట్రేడింగ్ కార్టెల్‌ల దోపిడీకి చిన్న, మధ్య తరగతి రైతులు కుదేలైపోతారని పేర్కొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయించండి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు సర్పంచుల సంఘాల జేఏసీ వినతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తమ పెండింగ్ బిల్లులను అసెంబ్లీ సమావేశాలు ముగిసేలోపు విడుదల చేయించాలని తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. గురువారం హైదరాబాద్‌లోని అసెంబ్లీలో డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ మాజీ సర్పంచులు డబ్బులను వడ్డీలకు తెచ్చి ఊర్లల్లో అభివృద్ధి పనులు చేశారని వివరించారు. వడ్డీలు చెల్లించలేక బాధతో సర్పంచుల కుటుంబాలు ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. అసెంబ్లీ సమావేశంలో తమ బిల్లులపై స్పష్టమైన ప్రకటన చేసి అండగా ఉండాలని కోరామన్నారు. స్థానిక సంస్థ ఎన్నికలు పెట్టే లోపే మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి, మాట్ల మధు కోశాధికారి పూడూరి నవీన్ గౌడ్ , కార్యదర్శి మెడబోయిన గణేష్, కేశ బోయిన మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మణికొండ అల్కపూరి టౌన్‌షిప్‌లో హైడ్రా పంజా

కమర్షియల్ షెట్టర్స్ తొలగింపు



నవతెలంగాణ-సిటీబ్యూరో

రెసిడెన్షియల్‌గా అనుమతులు తీసుకొని కమర్షియల్‌గా షెట్టర్లు వేసి నిబంధనలకు విరుద్ధంగా వ్యాపార సముదాయాలు నిర్వహిస్తున్న వాటిపై హైడ్రా పంజా వేసింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండల పరిధిలోని మణికొండ అల్కపూరి టౌన్‌షిప్‌లో అనుహర్ మార్నింగ్‌రాగా అపార్టుమెంట్‌లో రెసిడెన్షియల్‌కు బదులుగా గ్రౌండ్‌ఫ్లోర్‌ను కమర్షియల్‌గా కొనసాగిస్తున్న అంశంపై రెండు వారాల కిందట హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు ఫిర్యాదు అందింది. 7 రోజుల్లో షెట్టర్లను తొలగించాలంటూ గత నెల 27న మణికొండ మున్సిపల్ అధికారులు నోటీసులిచ్చారు. అయితే, సంబంధికులు స్పందించకపోవడంతో కమిషనర్ ఆదేశాల మేరకు అక్రమంగా నడుస్తున్న వ్యాపార సముదాయాలను గురువారం హైడ్రా అధికారుల సమక్షంలో మున్సిపల్ సిబ్బంది తొలించారు. ఈ క్రమంలో అధికారులకు, వ్యాపారస్తులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. కొన్ని సంవత్సరాలుగా తాము వ్యాపారం కొనసాగిస్తున్నామని, మణికొండ మున్సిపాల్టీకి లక్షల రూపాయల కమర్షియల్ ట్యాక్స్ చెల్లిస్తున్నామంటూ అధికారులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. రెసిడెన్షియల్ నుంచి కమర్షియల్‌గా కన్వర్షన్ అయిందని వాదనలకు దిగారు. ఓ వ్యక్తి తమ వద్ద డబ్బులు డిమాండ్ చేశాడని, ఇవ్వని కారణంగా సదరు వ్యక్తి పలుకుబడితో ఒత్తిడి మేరకే కూల్చేస్తున్నారని ఆరోపించారు. ఎలాంటి నోటీసులూ ఇవ్వకుండా తెల్లవారుజామున కూల్చివేతలు జరిపాలని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆ టౌన్‌షిప్‌లో దాదాపు 38 ఫ్లాట్స్‌కుపైగా ఉన్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా వ్యాపార సముదాయాలు కొనసాగిస్తున్నారని చర్యలు తీసుకోవాలంటూ అందులో నివసిస్తున్న వారు మూడేండ్ల కిందట నార్సింగ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బిల్డర్ వ్యాపారులకు ఎలాంటి సమాచారమూ ఇవ్వకపోగా, నోటీసులకు సైతం స్పందించలేదు. నోటీసులిచ్చిన తర్వాతే కూల్చివేశారు. అయితే నోటీసులు ఇవ్వలేదని, ఎలాంటి సమాచారమూ లేకుండానే హైడ్రా, మున్సిపాల్టీ అధికారులు చర్యలు తీసుకున్నారని బిల్డర్ ఆరోపించడంతోపాటు ప్రచారం చేశాడు. దీన్ని కమిషనర్ తీవ్రంగా పరిగణించారు. జీహెచ్ఎంసీ మినహా ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలోని అన్ని మున్సిపాలిటీలలో తెలంగాణ మున్సిపాల్టీ యాక్టు 2019 సెక్షన్178(2) ప్రకారం కూల్చివేతలకు ఆదేశాలు జారీ చేసినట్టు కమిషనర్ తెలిపారు. అనుమతి లేని వ్యాపార సముదాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తొలగిస్తామని స్పష్టం చేశారు. ఈ విషయంలో చిరు వ్యాపారులు ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. ట్రాఫిక్‌కు, స్థానికులకు ఇబ్బందులు లేకుండా వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు.

గురుకులాల్లో ఐదో తరగతి ప్రవేశానికి నోటిఫికేషన్

టీజీడబ్ల్యూఆర్ఈఐఎస్ కార్యదర్శి అలుగు వర్షిణి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ బీసీ సాధారణ గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడింది. ప్రస్తుతం నాలుగోతరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చని టీజీడబ్ల్యూఆర్ఈఐఎస్ కార్యదర్శి అలుగు వర్షిణి తెలిపారు. ఐదో తరగతి ప్రవేశానికి తేదీ23.2.25నాడు ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు అన్ని జిల్లాల్లో(ఎంపిక చేసిన కేంద్రాల్లో) ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. అభ్యర్థులు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో సమర్పించాలనిసూచించారు. https://tgswreis.telangana.gov.in,ttps://tgtwgurukulam.telangana.gov.in,https://mjptbcwreis.telengano.gov.in , https://tgcet.cgg.gov.in అభ్యర్థులు తమ అర్హతలను పరిశీలించుకుని 21-12-2024 నుండి 1-2-2025 వరకు ఆన్‌లైన్‌లో రూ.100 రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఒక ఫోన్ నెంబర్ తో మాత్రమే చేయవచ్చును. 2. అభ్యర్థికి బదులుగా వేరేవారి ఫోటోలు పెట్టి దరఖాస్తు చేసినచో అట్టివారిపై సెక్షన్ 1860 ప్రకారం క్రిమినల్ చర్యలు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. విద్యార్థుల ఎంపికకు "పాతజిల్లా" ఒక యూనిట్‌గా పరిగణింపబడుతుంనీ, అభ్యర్థికి మరింత సమాచారం అవసరమైనా, ఏదైనా సమస్య ఉంటే - 040-23391598,9491063511,040-23328266-040-24734899 ఈ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలి : పీఎంటీఏటీఎస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని పీఎంటీఏటీఎస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖాధికారులు (డీఈవో), జిల్లా ఇంటర్ విద్యాధికారులు (డీఐఈవో)లను కలిసి వినతిపత్రాలను సమర్పించారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాలను చేపట్టారు. ఈ మేరకు పీఎంటీఏటీఎస్ రాష్ట్ర అధ్యక్షులు తరాల జగదీశ్ ఒక ప్రకటన విడుదల చేశారు. దశాబ్ద కాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూల నిర్ణయం తీసుకుని మోడల్ స్కూళ్లను విద్యాశాఖలో విలీనం చేయాలనీ, 010 పద్దు కింద వేతనాలను చెల్లించాలని కోరారు. ఒకే నోటిఫికేషన్ కింద ఎంపికైన మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు నోషనల్ సర్వీస్ కల్పించాలని తెలిపారు. హెల్త్ కార్డులు ఇవ్వాలనీ, మరణించిన ఉపాధ్యాయుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టాలని పేర్కొన్నారు. పదోన్నతులు చేపట్టాలని తెలిపారు.

కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి : వ్యకాస

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్‌పై రాజ్యసభలో అవమానకర వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను మంత్రి మండలి నుంచి బర్తరఫ్ చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం అన్ని మండల, జిల్లా కేంద్రాల్లో నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.నాగయ్య, ఆర్.వెంకట్రాములు ఒక ప్రకటన విడుదల చేశారు. భారత రాజ్యాంగాన్ని తీసేసి మనువాద రాజ్యాంగాన్ని ప్రవేశపెట్టే ఆలోచనలతోనే అమిత్‌షా ఇలాంటి అహం కారపూరిత, అవమానకర వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచే రాజ్యాంగంపైనా, దళిత, గిరిజన, ఆదివాసీ వర్గాల ప్రజలపైనా అనేక రూపాల్లో దాడులు తీవ్రమయ్యాయని తెలిపారు. వెంటనే అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలకు
సంగారెడ్డి జిల్లాలో విస్తృత ప్రచారం

- వైద్య, రక్తదాన శిబిరాలు, సెమినార్ల నిర్వహణ
- ఇంటింటికీ సీపీఐ(ఎం) పేరుతో మాస్ విరాళాల సేకరణ
- ప్రజల నుంచి ఎర్రజెండా మహాసభలకు అపూర్వ ఆదరణ



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభల జయప్రదం కోసం ఆహ్వాన సంఘం విస్తృతంగా ఏర్పాట్లు చేస్తోంది. సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలు 2025 జనవరి 25-28 తేదీల్లో సంగారెడ్డి పట్టణంలో జరగ నున్నాయి. మహాసభలు, బహిరంగ సభకు సీపీఐ(ఎం) జాతీయ నాయకత్వం హాజరు కానుంది. మహాసభలను విజయవంతంగా జరిపేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. మహాసభల విశిష్టతను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు విస్తృత ప్రచారం జరిగేలా జిల్లా వ్యాప్తంగా ఊరూవాడా వాల్ రైటింగ్, పోస్టర్స్, కరపత్రాల రూపంలో ప్రచారం చేస్తున్నారు. పార్టీ అనుసరిస్తున్న ప్రత్యామ్నాయ రాజకీయ, ఆర్థిక విధానాలు, ప్రజల పక్షాన నిర్వహించిన పోరాటాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఇంటింటికీ సీపీఐ(ఎం) నినాదంతో మాస్ విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. మహాసభల సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు-ప్రజలపై మోపుతున్న భారాలు, లౌకిక విధానం, రాజ్యాంగ పరిరక్షణ-మతోన్మాద ప్రమాదం, 4 లేబర్ కోడ్స్ వంటి అంశాలపై సెమినార్స్ నిర్వహిస్తున్నారు. ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు.

సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా వైద్య, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు చేయించి మందుల్ని అందజేస్తున్నారు. పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా 50 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సీపీఐ(ఎం) చేపట్టిన కార్యక్రమం పట్ల ప్రజల ఉంచి మంచి ఆదరణ లభిస్తోంది. పలు అంశాలపై సెమినార్లు నిర్వహిస్తున్నారు. "లౌకిక విధానం, రాజ్యాంగ పరిరక్షణ- మతోన్మాదం" అనే అంశంపై సంగారెడ్డిలో నిర్వహించిన సెమినార్‌కు సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు హాజరై ప్రసంగించారు. పటాన్‌చెరులో "కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు- కార్మిక వర్గ కర్తవ్యం" అనే అంశంపై సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు ప్రసంగించారు. ప్రధాన రహదారులు, పట్ట ణాల్లోని గోడలపై రాసిన ప్రచార రాతలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. మహా సభల నిర్వహణ, ప్రజా పోరాటాల కోసం చేస్తున్న విరాళాలకు ప్రజల నుంచి ఆదరణ లభిస్తోంది. ఉద్యోగ, కార్మిక వర్గం, ప్రజల పక్షాన నికరంగా పోరాడుతున్న ఎర్రజెండా మహాసభలు జయప్రదం కావాలని ఆకాంశిస్తూ తోచిన సహాయం చేస్తున్నారు.

అపూర్వ ఆదరణ
చుక్క రాములు, ఆహ్వాన సంఘం చైర్మెన్

సంగారెడ్డిలో జరగనున్న సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభల జయప్రదం కోసం ఆహ్వాన సంఘం ఏర్పాట్లు చేస్తోంది. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సెమినార్లు, మాస్ విరాళాల సేకరణ, వాల్‌రైటింగ్, పోస్టర్స్, కరపత్రాల ప్రచారం, వైద్య శిబిరాల వంటి బహుముఖ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. సీపీఐ(ఎం) మహాసభల జయప్రదం కోసం ప్రజల వద్దకెళ్తున్నాం.

జిల్లావ్యాప్తంగా విస్తృత ప్రచారం
గొల్లపల్లి జయరాజు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి

జిల్లావ్యాప్తంగా వివిధ రూపాల్లో ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నాం. సంగారెడ్డిలో మహాసభలు జరగడం తొలిసారి అయినందున విజయవంతంగా జరిపేందుకు పార్టీ శ్రేణులు సమిష్టిగా పనిచేస్తున్నాయి. జిల్లాలో ప్రజా సమస్యలపై సీపీఐ(ఎం) నిర్వహించిన పోరాటాలు, విజయాల్ని ప్రజల దృష్టికి తీసుకెళ్లిన సందర్భంగా వారి నుంచి మంచి స్పందన వస్తుంది.



పీఎఫ్, ఈఎస్ఐ
ఉద్యోగ భద్రత కల్పించాలి

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఆశాల భారీ ప్రదర్శన

బస్సు జాతాకు పూలతో స్వాగతం

నవతెలంగాణ-కంఠేశ్వర్/కామారెడ్డి

ఫిబ్రవరిలో జరిగే బడ్జెట్ సమావేశాల్లో ఆశా వర్కర్లకు రూ.18 వేలను ఫిక్స్‌డ్ వేతనంగా నిర్ణయించాలని, అలాగే పీఎఫ్, ఈఎస్ఐతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో జరుగుతున్న బస్సుయాత్ర గురువారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పర్యటించింది. జగిత్యాల నుంచి నిజామాబాద్ జిల్లాకు చేరుకున్న బస్సుజాతా బృందానికి ఆశావర్కర్లు పూలుజల్లుతూ స్వాగతం పలికారు. బస్సు జాతాలో పాల్గొన్న నాయకులను శాలువాలతో సత్కరించారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద నుంచి సుభాష్‌నగర్, నిర్మల హృదయ పాఠశాల, హమాల్‌వాడీ చౌరస్తా మీదుగా సీఐటీయూ కార్యాలయం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో సభ నిర్వహించారు. అక్కడ నుంచి సాయంత్రానికి కామారెడ్డికి జాతా చేరుకుంది. ఈ జాతాకు ఆశావర్కర్లు పెద్దఎత్తున స్వాగతం పలికారు. ఈ జాతాకు అంగన్వాడీ టీచర్స్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నిజామాబాద్, కామారెడ్డిల్లో జరిగిన సభల్లో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి.జయలక్ష్మి మాట్లాడారు. ఎన్నికల కన్నా ముందు ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని, కనీస వేతనం రూ.18 వేలు అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీనిచ్చి అధికారంలోకి వచ్చి ఏడాదయినా సమస్యలు పరిష్కరించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాలకు చెందిన ఆశావర్కర్లు రాత్రనకా, పగలనకా ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారని, అయినప్పటికీ చాలీచాలని వేతనాలతో తమ జీవితాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు జరపాలని నిర్వహిస్తున్న ఈ బస్ జాతాలో ఆశా వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ఆశా కార్యకర్తలు, కామారెడ్డి ఆశా వర్కర్ల జిల్లా అధ్యక్షులు కేసరి ఇందిర, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశ్రీ, నాయకులు పల్లవి, మమత, పద్మ, మంజుల, సుధమ్మ, లావణ్య, భాగ్యలక్ష్మి, కామారెడ్డి సీఐటీయూ జిల్లా నాయకులు చంద్రశేఖర్, రాజనర్సు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

విజేతలు రాసిందే చరిత్రకాదు

(మొదటి పేజీ తరువాయి)



ప్రభావంతో నేడు సమాజంలో పుస్తక పఠనం తగ్గుతోంది. ఇలాంటి కీలక తరుణంలో హైదరాబాద్ బుక్ ఫెయిర్ ప్రజల్లో పుస్తక పఠనాన్ని పెంచేందుకు ప్రధాన పాత్ర పోషిం చాలి. ప్రజలకు మరింత చేరువై భవి ష్యత్ తరాలకు స్ఫూర్తినివ్వాలి" అని సీఎం ఆకాంక్షించారు. హైదరాబాద్ బుక్‌ఫెయిర్ సంస్థ కోరినట్టు వారికి శాశ్వత భవనం ఇతర సౌకర్యాలకు సంబంధించి పరిశీలిస్తామని ఈ సందర్భంగా సీఎం హామీ ఇచ్చారు. పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ఒక సిరా చుక్క లక్ష మెదళ్లను కదిలిస్తుందని కాళోజీ చెప్పిన మాటలు అక్షర సత్యాలని అన్నారు. సమాజాన్ని చైతన్యం చేసేది పుస్తకమేనని గుర్తు చేశారు. పుస్తక పఠనంతో వ్యక్తిత్వం, ఆలోచనా విధానం వికసించి మనిషి సంపూర్ణంగా తయారవుతారని అన్నారు. రాష్ట్రంలోని విద్యార్థులు, పుస్తక ప్రియులు బుక్‌ఫెయిర్‌ను సందర్శించి మరింత జ్ఞానాన్ని పొందాలని సూచించారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌ను బతికించుకునేందుకు చేస్తున్న కృషిని కొనియాడారు. ప్రభుత్వ పరంగా తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. బుక్‌ఫెయిర్ అధ్యక్షులు, కవి యాకూబ్ మాట్లాడుతూ తమ సంస్థ గత నాలుగు దశాబ్దాలుగా పుస్తకాల జ్ఞాన యజ్ఞం చేస్తోందని అన్నారు. బుక్ ఫెయిర్ చరిత్రలో ముఖ్యమంత్రి ప్రారంభించిన తొలి పుస్తక ప్రదర్శన ఇదేనని గుర్తు చేశారు. ఆ గొప్పతనం ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని వ్యాఖ్యానించారు. బుక్‌ఫెయిర్ కార్యదర్శి ఆర్.శ్రీనివాస్(వాసు) మాట్లాడుతూ ఇంటర్నెట్ యుగంలోనూ ప్రజల్లో పుస్తక పఠనం తగ్గకుండా తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు. అక్షర సేద్యం చేస్తున్న తమ సంస్థకు శాశ్వత భవనం, ఇతర సౌకర్యాలు కల్పించి తోడ్పాటునందించాలని సీఎంను కోరారు. తెలంగాణ సాహితి అకాడమి ప్రచురించిన పుస్తకాన్ని ఈ సందర్భంగా సీఎం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఎం ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, హైదరాబాద్ బుక్‌ఫెయిర్ సలహాదారులు ఎమ్మెల్సీ కోదండరామ్, జస్టిస్ బి.సుదర్శన రెడ్డి, కె.రామచంద్రమూర్తి, ప్రొఫెసర్ రమామేల్కోటే, తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమి చైర్మెన్ శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర గ్రంథాలయాల చైర్మెన్ డాక్టర్ రియాజ్, భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, నవతెలంగాణ మేనేజర్ కృష్ణారెడ్డి, కవులు, కళాకారులు పాల్గొన్నారు.

అమిత్ షా పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయాలి

ఆయనపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టాలి : కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జాన్‌వెస్లీ, టి. స్కైలాబ్‌బాబు

- సుందరయ్య పార్క్ వద్ద భారీ నిరసన
- రాష్ట్రవ్యాప్తంగా దిష్టిబొమ్మల దహనం



నవతెలంగాణ-ముషీరాబాద్

అంబేద్కర్‌పై అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, ఆయనపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జాన్‌వెస్లీ, టి.స్కైలాబ్‌బాబు డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం రాష్ట్ర వ్యాప్తంగా కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. దిష్టిబొమ్మలు దహనం చేశారు. హైదరాబాద్ సుందరయ్య పార్క్ వద్ద కేవీపీఎస్ నగర నాయకులు ఎం.దశరథ్ అధ్యక్షతన ప్లకార్డులు, జెండాలు చేబూని భారీ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ.. హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయా లని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇది అంబేద్కర్‌పై మాత్రమే కాదని, సామాజిక న్యాయం కోసం పోరాటాన్ని కొన సాగిస్తున్న లక్షలాది మంది అణగారిన వర్గాల వారికి జరిగిన అవ మానమని అన్నారు. భారత రాజ్యాంగంపై బీజేపీ చేస్తున్న దాడికి వ్యతిరేకంగా ప్రజల నుంచి పెరుగుతున్న ప్రతిఘటన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేశారన్నారు. స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ భారత ప్రజలపై మనువాద భావజాలాన్ని రుద్దేందుకు ఈ శక్తులు అవిశ్రాంతంగా పని చేస్తున్నాయన్నారు. టీపీఎస్‌కే రాష్ట్ర కన్వీనర్ జి.రాములు, గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీరాం నాయక్ మాట్లాడుతూ.. అమిత్ షా, బీజేపీ నేతలు ఆలోచనలు కులతత్వంతో కూడుకున్నవని, రాజ్యాంగం పట్ల వారికి గౌరవం లేదని మరోసారి రుజువైందని అన్నారు.

ఎన్నికల సమయంలోనే కాకుండా ఆర్ఎస్ఎస్, బీజేపీ తరచుగా వ్యక్తం చేసే అసహనం.. దేశంలో సామాజిక న్యాయం, సమానత్వం కోసం అంబేద్కర్ పోరాడి నడిపిన ఉద్యమాలు, ఆదర్శాల పట్ల వారి లోతైన ద్వేషాన్ని వెల్లడిస్తోందన్నారు. డిసెంబర్ 20, 21 తేదీల్లో అన్ని సామాజిక ప్రజాసంఘాలతో కలిసి రాష్ట్ర వ్యాప్త నిరసనలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.దశరథ్, బి.సుబ్బారావు, వివిధ ప్రజాసంఘాల నాయకులు కె.రమేష్, జి.రాములు, కృష్ణ ప్రసాద్, శంకర్, ప్రేమ, రజిత, లక్ష్మి, జగదీష్, మల్లేష్, శ్రీరాములు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్రాంతి తర్వాత కొత్త రేషన్‌కార్డులు

ఒకట్రెండు నెలల తర్వాత సన్నబియ్యం ఇస్తాం | నగదు బదిలీ ప్రక్రియను మేం అమలు చేయం

- రేషన్‌డీలర్ల సమస్యల పరిష్కారం, ఇన్సూరెన్స్ సౌకర్యంపై పరిశీలిస్తున్నాం : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్


రాష్ట్రంలో అర్హులందరికీ సంక్రాంతి తర్వాత కొత్త రేషన్‌కార్డులను ఇవ్వబోతున్నట్టు శాసనసభ సాక్షిగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. ఒకట్రెండు నెలల తర్వాత రేషన్ కార్డులపై సన్నబియ్యాన్ని ఇస్తామని చెప్పారు. లబ్దిదారులకు నగదు బదిలీ ప్రక్రియను అమలు చేయబోమని స్పష్టం చేశారు. గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో రేషన్‌కార్డులు, రేషన్‌డీలర్ల సమస్యపై సీపీఐ పక్ష నేత కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. రేషన్ కార్డులపై 9 రకాల సరుకులు ఇవ్వాలని కోరారు. కల్తీని నియంత్రించాలనీ, రీసైక్లింగ్ ప్రక్రియకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాపంపిణీ వ్యవస్థను రద్దు చేసి నగదు బదిలీ చేస్తారనే చర్చ నడుస్తున్నదనీ, అది వాస్తవమేనా అని ప్రశ్నించారు. నిరుపేద డీలర్లకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని కోరారు. అందరికీ ఎప్పటిలోగా రేషన్‌కార్డులు ఇస్తారనే దానిపై స్పష్టత ఇవ్వాలని కోరారు. బీఆర్ఎస్ సభ్యులు మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ..డీలర్లకు కమీషన్ పెంచాలని కోరారు. గన్నీ బ్యాగుల తూకం తీసేయకపోవడం, వాటికి తూట్లు పడి రవాణా సమయంలో పోవడం, తదితర కారణాలతో ప్రతిబస్తాలోనూ రెండు, మూడు కేజీల బియ్యం తక్కువ వస్తున్న అంశాన్ని లేవనెత్తారు. నేరుగా ప్రతి లబ్దిదారునికీ ఆరుకేజీల బ్యాగుల్లో బియ్యం ఇచ్చే ఆలోచన చేయాలని సూచించారు. రేషన్ డీలర్లకు పెండింగ్‌లో ఉన్న రూ.500 కోట్లు విడుదల చేయాలని కోరారు. కాంగ్రెస్ సభ్యులు వాకిటి శ్రీహరి మాట్లాడుతూ..రెండు, మూడు గ్రామాలకు ఒకే రేషన్ షాపు ఉంటే..ఆ రెండు గ్రామాల్లోనూ కొన్ని రోజుల చొప్పున బియ్యం ఇస్తే లబ్దిదారులకు మేలు జరుగుతుందన్నారు.

సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సమాధానమిచ్చారు. రాష్ట్రంలో 17,256 రేషన్ షాపులున్నాయని తెలిపారు. రేషన్‌డీలర్లకు ప్రతి క్వింటాపైనా రూ.140 చొప్పున కమీషన్ ఇస్తున్నామన్నారు.

రేషన్‌డీలర్లు తమ కమీషన్‌ను రూ.300కు పెంచాలని అడిగారనీ, వేతనం కాకుండా గ్రామీణప్రాంతాల డీలర్లకు రూ.30 వేలు, పట్టణ ప్రాంత డీలర్లకు రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారని తెలిపారు. వారు అడిగినంత కాకపోయినా దానిపై త్వరలో ఏదో ఒక నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. రేషన్‌కార్డుపై లబ్దిదారులకు 9 సరుకుల అందజేత గురించి ఆలోచిస్తామని చెప్పారు. పీడీఎస్ బియ్యాన్ని ఏ డీలరైనా పక్కదోవ పట్టించినట్టు తేలితే పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. కొత్త రేషన్‌షాపులు ఇస్తూ పోతే డీలర్లకు కోటా తగ్గే అవకాశముందన్నారు. అయితే, కొత్త పంచాయతీల్లో అవసరాలను గుర్తించి కొత్తవాటిని మంజూరు చేస్తామని హామీనిచ్చారు. డీలర్ల వద్ద కొచ్చే బియ్యం బస్తాల్లో ఒకటి నుంచి మూడు కేజీలు తక్కువ వస్తున్న మాట వాస్తవమేనన్నారు. దీన్ని నివారించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే ప్రత్యేకంగా వే బ్రిడ్జిలను ఏర్పాటు చేస్తామన్నారు. డీలర్లకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలనే ఆలోచన తమ ప్రభుత్వ దృష్టిలో ఉందని చెప్పారు.

ఉద్దేశపూర్వకంగానే సభాసమయం వృథా

సీపీఐ పక్ష నేత కూనంనేని సాంబశివరావు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కొందరు సభ్యులు ఉద్దేశపూర్వకంగానే సభాసమయాన్ని వృథా చేస్తున్నారనీ, ఈ తప్పిదం అధికార, ప్రతిపక్షం అనే తేడా లేకుండా ఇరువైపుల నుంచీ జరుగుతున్నదని సీపీఐ పక్ష నేత కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన జోక్యం చేసుకుని మాట్లాడుతూ..సభ్యులు ప్రశ్నోత్తరాల్లో లేని విషయాలను, వేర్వేరు అంశాలను తమ మాటల్లో జొప్పించి రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. దీంతో ఒకట్రెండు ప్రశ్నలకు మాత్రమే సమాధానాలు సభలో వస్తున్నాయన్నారు.

ఒక్క ప్రశ్నపై అరగంటకుపైగా చర్చ ఏంటి? అని ప్రశ్నించారు. నిబంధనల మేరకు ఒక్కో ప్రశ్నకు ఆరు నిమి షాలు కేటాయించారనీ, సభ్యుల కోరికమేరకు అదనంగా రెండు, మూడు నిమిషాలు మాత్రమే ఇవ్వాలని స్పీకర్‌ను కోరారు. అంతకంటే ఎక్కువ సమయం కావాలంటే ఆ అంశంపై ప్రత్యేకంగా చర్చించాలని సూచించారు.

మంత్రులే ప్రశ్నలు అడగడమేంటి?

- ప్రశ్నోత్తరాల అర్థాన్నే మార్చేస్తున్నారు
- సభలో కొత్త సంస్కృతిని తీసుకురావొద్దు : బీఆర్ఎస్ సభ్యులు టి.హరీశ్‌రావు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఓ మంత్రి మరో మంత్రిని ప్రశ్నలు అడగడమేంటి? అని బీఆర్ఎస్ సభ్యులు టి.హరీశ్‌రావు ప్రశ్నించారు. క్యాబినెట్ నిర్ణయమంటేనే సమిష్టి నిర్ణయమనీ, దానికి భిన్నంగా ఇక్కడ ప్రశ్నలు అడగడమేంటి? అని నిలదీశారు. గురువారం శాసనసభ ప్రశ్నోత్తరాల్లో భాగంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నల్లగొండ జిల్లాలోని ప్రాజెక్టుల నిర్మాణ సమస్యల గురించి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని పలు ప్రశ్నలు అడగటాన్ని హరీశ్‌రావు తప్పుబట్టారు. మంత్రులే ప్రశ్నలు అడిగితే ప్రశ్నోత్తరాలకు అర్థమే మారిపోతుందనీ, సభలో కొత్త సంస్కృతిని తీసుకురావొద్దని స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కోరారు. ఇలా మరోమారు మైకులు ఇవ్వొద్దని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీనే ఎక్కువ కాలం పాలించిం దన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో కోమటిరెడ్డి మంత్రిగా ఉన్నారనీ, వారి హయాంలోనే మూసీ మురికి కూపంగా మారిందని విమర్శించారు. అప్పుడు వారు సరిగ్గా చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని చెప్పారు. మూసీ వల్ల నల్లగొండ జిల్లా ప్రజలు బాధపడుతున్నారంటే దానికి ప్రధాన ముద్దాయి కాంగ్రెస్ పార్టీయే అని స్పష్టం చేశారు. ఎస్ఆర్ఎస్‌పీ స్టేజ్ 2 పనులు పూర్తిచేసి కాళేశ్వరం జలాలను ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలు నియోజకవర్గాలకు సాగు, తాగు నీటిని అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని చెప్పారు. నల్లగొండ జిల్లాకు కాంగ్రెస్ పార్టీ ఏం చేసింది? తాము ఏం చేశాం? అనేదానిపై చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రశ్నోత్తరాల్లో ప్రశ్నకు మంత్రులు సూటిగా జవాబు ఇస్తే బాగుంటుందని సూచించారు. అలాగైతే, పది ప్రశ్నలకు జవాబులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. మంత్రులు, అధికార పార్టీ సభ్యులు సుదీర్ఘ ప్రసంగాల వల్ల ప్రతిరోజు మూడు నాలుగు ప్రశ్నలకే సభాసమయం సరిపోతుందన్నారు. ఒక్కో ప్రశ్నకు సూటిగా సమాధానం వచ్చేలా చూడాలన్నారు. మంత్రులు లేచి రాజకీయ ప్రసంగాలు చేస్తే తాము కల్పించుకోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు.

ఏ హోదాలో మైకు అడుగుతున్నారు?

హరీశ్‌రావుపై మంత్రి కోమటిరెడ్డి అటాక్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆయన ఎల్పీ లీడర్ కాదు..డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కాదు..పదేపదే ఏ హోదాలో మైకు అడుగుతున్నారు? అని బీఆర్ఎస్ సభ్యులు హరీశ్‌రావును మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రశ్నించారు. ఇంత మంది సభ్యులుండగా ఆయనకే ఎందుకు మైకు ఇస్తున్నారని స్పీకర్‌ను అడిగారు. అడిగిన ప్రతిసారీ ఆయనకు మైకు ఇవ్వొద్దని కోరారు. గురువారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ..ప్రతిపక్ష నాయకుడు ఏడాదిగా సభకు రావడం లేదనే విషయాన్ని ప్రజలు చర్చించుకుంటున్నారన్నారు. నల్లగొండ జిల్లా ప్రజలు ఫ్లోరైడ్, మూసీ నీళ్లతో చనిపోతున్నారని వాపోయారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నల్లగొండ జిల్లా ప్రాజెక్టులపై పూర్తిగా నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు. పదేండ్ల కిందనే 70 శాతం పనులు పూర్తయిన ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం పనులను బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. గతంలో ఇరిగేషన్ మంత్రిగా ఉన్న హరీశ్‌రావు ఒక్కనాడైనా ఎస్ఎల్‌బీసీని సందర్శించారా? పనులపై ఆరా తీశారా? అని నిలదీశారు. అందుకే నల్లగొండ జిల్లాలో బీఆర్ఎస్ నుంచి ఏకలింగాన్నే గెలిపించారనీ, అదీ రెండు, మూడు వేల మెజార్టీతోనే అని చెప్పారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను 40 నుంచి 70 వేల ఓట్లకుపైగా మెజార్టీతో గెలిపించారని చెప్పారు. ఏకలింగం అనడంపై బీఆర్ఎస్ సభ్యులు జగదీశ్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేస్తూ..'ఆయన నల్లగొండ ఇజ్జత్ తీస్తుండు' అని కోమటిరెడ్డిని ఉద్దేశించి అన్నారు.

సంపాదకీయం

ట్రంప్ బెదిరింపు!



అమెరికా అధ్యక్ష పదవికి ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ మరోసారి మనదేశాన్ని బెదిరించాడు. తమ ఉత్పత్తులను దిగుమతి చేసుకొనే ఏ దేశమైనా వాటి మీద పన్నులు విధిస్తే తాము కూడా దెబ్బకు దెబ్బతీస్తామని అలాంటి దేశాలలో భారత్ కూడా ఉందని ట్రంప్ విలేకర్ల సమావేశంలో చెప్పాడు. తొలిసారి అధికారానికి వచ్చినపుడు చైనాపై వాణిజ్యపోరును ప్రారంభించటమే కాదు, మన దేశం నుంచి చేసుకొనే దిగుమతులపై ప్రాధాన్యత వ్యవస్థ విధానం(జిఎస్‌పి)లో భాగంగా ఇస్తున్న రాయితీలను కూడా రద్దు చేసిన పెద్దమనిషి ట్రంప్. మనదేశాన్ని తమ వలలోకి లాక్కొనేందుకు అంతకు ముందు అమెరికా విసిరిన బిస్కెట్ వంటిది ఆ రాయితీ. ట్రంప్ చర్యకు ప్రతిగా మనం కూడా అమెరికా ఉత్పత్తులపై పన్ను విధింపుకు పూనుకున్నాం. వాటి మీద ప్రపంచ వాణిజ్య సంస్థలో పరస్పరం మూడేసి కేసులు దాఖలు చేశారు. వాటిని పరిష్కరించుకోవాలని కొద్ది నెలల క్రితం ఇరుదేశాలు ఒక అవగాహనకు వచ్చాయి. ఆ స్ఫూర్తిని దెబ్బతీసేందుకు ట్రంప్ పూనుకున్నట్లు కనిపిస్తోంది.

ప్రస్తుతం అమెరికా నుంచి మనం చేసుకొనే దిగుమతుల కంటే మన ఎగుమతులే ఎక్కువగా ఉండి వాణిజ్య మిగులులో ఉన్నాం. దాన్ని పూడ్చేందుకు తమ వస్తువులను కొనుగోలు చేయాలని లేకుంటే వాణిజ్యపోరుకు దిగుతానని హెచ్చరించటమే ట్రంప్ మాటల అంతరార్థం. పరస్పరం ఇచ్చిపుచ్చుకోవటమనే పదం ఎంతో ముఖ్యం. వారు ఒక సైకిలు పంపితే మేము మరో సైకిలు పంపుతాం. వారు గనుక వంద లేదా రెండువందల శాతం పన్ను విధిస్తే మేమూ అదే చేస్తాం. చైనా, బ్రెజిల్, భారత్ వంటి దేశాలు అలా చేస్తున్నాయన్నాడు. వారు మార్చుకుంటే మంచిది లేకుంటే మేమూ అదే చేస్తాం అన్నాడు.ప్రపంచ వాణిజ్య సంస్థ సమాచారం ప్రకారం 2023లో రక్షణ చర్యల్లో భాగంగా తృణధాన్యాలపై 193శాతం, పాల ఉత్పత్తుల మీద 188, ఖనిజాలు,లోహాలపై 187, నూనెగింజలు, ఖాద్యతైలాలపై 164, పానీయాలు, పొగాకుపై 150, పండ్లు, కూరగాయలపై 132, రసాయనాలపై 56, కాఫీ, టీ, సుగంధ ద్రవ్యాలపై 53, చేపలు, వాటి ఉత్పత్తులపై 35శాతాల చొప్పున అమెరికా దిగుమతి పన్ను విధిస్తున్నది. దాని నిర్వాకం ఇలా ఉంటే ఇతర దేశాలపై ఎదురుదాడికి దిగుతున్నది.

జో బైడెన్‌తో మన దేశం కుదుర్చుకున్న అవగాహన ప్రకారం ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులపై పన్ను తగ్గి ఎగుమతి అవకాశాలు మెరుగుపడతాయని ఆ రంగాల వారు ఆశిస్తుండగా ట్రంప్ చేసిన తాజా ప్రకటనతో పరిస్థితి తిరిగి మొదటికి వస్తుందా? అన్న అనుమానం కలుగుతున్నది. అయితే మీ ఇల్లు మా ఇంటికి ఎంత దూరమో మాదీ అంతే అన్న లోకోక్తి తెలిసిందే. అమెరికా లేకపోతే పూట గడవదు అనే పరిస్థితి ఎవరికీ లేదు, అమెరికాతో సహా అన్ని దేశాలూ ఏదో ఒకదాని కోసం ఇతరుల మీద ఆధారపడాల్సినవే. జపాన్ సంస్థ నోమురా అమెరికా అధ్యక్ష ఎన్నికలకు ముందు వెల్లడించిన నివేదికలో ట్రంప్ గెలిస్తే రెండు దేశాల మధ్య ఉన్న వాణిజ్య విభేదాలను పక్కన పెడతాడని, చైనాపై ఆంక్షలను పెంచుతాడని, దాని స్థానంలో భారత్‌ను ముందుకు తెస్తాడని, అది ఎంతో ఉపయోగమని చెప్పింది.

ఇక ట్రంప్ గతానికి వస్తే మన దేశం గురించి అన్న మాటలు ఇన్నిన్ని కాదు. అయినప్పటికీ 'అబ్‌కి బార్ ట్రంప్ సర్కార్' అంటూ ప్రధాని నరేంద్రమోడీ అమెరికా వెళ్లి మరీ అక్కడ ప్రచారం చేసి వచ్చారు.అయితే గత ఎన్నికల్లో ట్రంప్ మట్టికరిచాడు.మోడీ పరువు గంగలో కలిసింది. దిగుమతి పన్నులను భారత్ దుర్వినియోగపరుస్తున్నదన్నాడు ట్రంప్. ప్రపంచంలో ఎక్కువ మొత్తాలను విధిస్తున్న దిగుమతి పన్నుల చక్రవర్తి వంటి పదాలతో అవమానించాడు. అంతర్జాతీయ లావాదేవీలలో డాలర్‌ను పక్కన పెట్టాలన్న బ్రిక్స్ దేశాలు వెనక్కు తగ్గి అలాంటిదేమీ లేదని హామీ ఇవ్వాలని డిమాండ్ చేశాడు. లేకుంటే ప్రతికూల చర్యలు తప్పవని బెదిరించాడు.

ఇటీవలి సంవత్సరాలలో మనదేశ విదేశీ వాణిజ్య భాగస్వాములలో చైనా, అమెరికా ఒకటి రెండు స్థానాలలో ఉంటున్నాయి. ట్రంప్ ఎన్ని మాటలు మాట్లాడినా అమెరికా అధ్యక్షుడు భారత్‌కు మిత్రుడని, రెండుదేశాల సంబంధాలు మరింతగా విస్తరిస్తాయని కేంద్ర మంత్రి పియూష్ గోయల్ వంటివారు పొగుడుతూనే ఉన్నారు. హెచ్1బి వీసాల గురించి అనేక ఊహాగానాలు సాగుతున్నాయి. గడచిన పదేండ్లలో చూస్తే అవి తగ్గాయి తప్ప పెరగలేదు. అమెరికా విధాన జాతీయ సంస్థ (ఎన్ఎఫ్‌పిపి) సమాచారం ప్రకారం 2014-15లో ఉన్న వీసాల సంఖ్యతో పోలిస్తే ఎనిమిదేండ్ల కాలంలో 75శాతం తగ్గాయి, అమెరికాలోని మనదేశ కంపెనీల రిక్రూట్‌మెంట్లు కూడా తగ్గాయి. అమెరికాకు అగ్రస్థానమే తన లక్ష్యం అని చెబుతున్న ట్రంప్ అధ్యక్షుడుగా కొలువు తీరాక నిజంగా ఏం చేస్తాడో చూడాల్సి ఉంది.

> ట్రంప్ ఎన్ని మాటలు మాట్లాడినా అమెరికా అధ్యక్షుడు భారత్‌కు మిత్రుడని, రెండుదేశాల సంబంధాలు మరింతగా విస్తరిస్తాయని కేంద్ర మంత్రి పియూష్ గోయల్ వంటివారు పొగుడుతూనే ఉన్నారు. హెచ్1బి వీసాల గురించి అనేక ఊహాగానాలు సాగుతున్నాయి. గడచిన పదేండ్లలో చూస్తే అవి తగ్గాయి తప్ప పెరగలేదు. అమెరికా విధాన జాతీయ సంస్థ (ఎన్ఎఫ్‌పిపి) సమాచారం ప్రకారం 2014-15లో ఉన్న వీసాల సంఖ్యతో పోలిస్తే ఎనిమిదేండ్ల కాలంలో 75శాతం తగ్గాయి, అమెరికాలోని మనదేశ కంపెనీల రిక్రూట్‌మెంట్లు కూడా తగ్గాయి.

మెయిల్ @ నవతెలంగాణ

సినిమా కాకూడదు.. విషాదం!


ఒకప్పుడు సినిమాలు ప్రజలకు వినోదాన్ని, కొంత విజ్ఞానాన్ని కూడా ఇచ్చేవి. సినిమా ఒక ఖరీదైన కళగా ఉండి ప్రజల్లో ఒక ఆకర్షణగా కూడా ఉండేది. ఇప్పుడు ఆ ఆకర్షణ వెర్రిగా మారింది. మిగతా కళలు, హరికథ, బుర్రకథ, ఒగ్గుకథ, డోలు దెబ్బ, తోలుబొమ్మలాట, వీధి నాటకం, నాట్యం, సంగీత ప్రదర్శనలు ఇలాంటివన్నీ ఏ ఇబ్బంది లేకుండా తమ తమ ప్రేక్షకులను కలిగిఉండేవి. స్వాతంత్ర్య పూర్వం, ఆ తర్వాత కొన్ని ప్రజాకళల్ని ఉద్యమాలు పోషించాయి. చాలావరకు కళలు సినిమాల్లో కలిసిపోయాయి. (పుత్తడిబొమ్మ పూర్ణమ్మ) ఇలాంటివి సినిమాల్లో ప్రదర్శించి వాటిని బయటికంటే ఆకర్షణీయంగా చూపగలిగారు. సినిమాకు ఒక వెసులుబాటు ఉంది. తీరిగ్గా స్క్రిప్టు రాసుకుని ప్రతిష్టులైన కళాకారులను ఎంచుకొని, సంగీతాన్ని శ్రేష్టమైన పద్ధతిలో కూర్చుకుని, చక్కగా ఎడిట్ చేసి ప్రదర్శించటానికి వీలుగా ఉంటుంది. కానీ అది రానురానూ వ్యాపార ధోరణిగా మారింది. క్రేజ్ పేరుతో, ట్రెండ్ పేరుతో తమ లాభాల కోసం విస్తృతంగా ప్రమోషన్లకు కొత్త పద్ధతులను ఎంచుకుంటోంది.

వాస్తవానికి సినిమాలు వినోదాలనివ్వాలి, కానీ విషాదాలు కాదు. ఈ మధ్యకాలంలో సినీ ఇండస్ట్రీలో భారీ పెట్టుబడులు పెట్టి నిర్మాణ సంస్థలు సినిమాలను తీస్తున్నాయి.ఈ సినిమాలకు హైప్ క్రియేట్ చేస్తూ ప్రచార ఆర్భాటాలను నిర్వహిస్తూ ప్రి రిలీజ్, ట్రైలర్ రిలీజ్‌ల పేరుతో భారీ సభలను జరిపి పెట్టిన పెట్టుబడికంటే రెట్టింపు ఆదాయం వచ్చేవిధంగా ప్రజల్లో విస్తృతమైన ప్రచారాన్ని నిర్వహిస్తున్నాయి. సినిమాపై భారీ అంచనాలు వచ్చే విధంగా రిలీజ్‌కంటే ముందే టిక్కెట్లు అమ్ముడుపోయేలా బెనిఫిట్‌షోలు వేస్తూ ఇష్టారీతినా టిక్కెట్ల ధరలను పెంచుతున్నాయి. మూవీ నిర్మాణ సంస్థలు చేస్తున్న ప్రతిపాదనలకు తెలుగురాష్ట్రాల ప్రభుత్వాలు వంతపాడుతున్నాయి. ప్రజలపై, ప్రేక్షకులపై అదనపు భారాలు పడే విధంగా టిక్కెట్ల ధరలను పెంచుకునేందుకు, ప్రిమియర్‌షోలకు అనుమతులిస్తున్నాయి. ఈ షోలకు హీరోలు హాజరవ్వడం, తన అభిమాన నటుడు వస్తున్నాడని అభిమానులు, ప్రేక్షకులు థియేటర్లకు రావడం, హీరోను చూడాలనే తపనతో ముందుకు పరుగెత్తడం, బౌన్సర్లు వారిని నెట్టేయడం, దీంతో తొక్కిసలాటలు జరగడంతో ప్రజల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి.

అలాంటి ఘటనే ఈ మధ్య కాలంలో హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్‌లో జరిగింది. పుష్ప2 ప్రీమియర్‌షోకు అల్లుఅర్జున్ రావడంతో అభిమానులు భారీగా తరలివచ్చారు. పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంతో ప్రేక్షకులను అదుపు చేయలేకపోయారు. దీంతో హీరోకు ప్రయివేటు సెక్యూరిటీగా వచ్చిన బౌన్సర్లు అందరినీ నెట్టివేయడంతో ఒకరిమీద ఒకరు పడ్డారు. వారిపై నుంచే వందలాది మంది ఉరుకులు, పరుగులు పెట్టడంతో రేవతి అనే మహిళ ఊపిరాడక చనిపోయింది. ఆమె కొడుకు ఆస్పత్రిలో చావుబతుకుల మధ్య ఉన్నాడు. ఈ కుటుంబ శోకం ఎవరు తీరుస్తారు? తమ అభిమాన నటుని సినిమా ఫస్ట్‌షో చూడాలనే కోరికతో తల్లిని వెంటబెట్టుకుని వచ్చిన పిల్లాడు ఇప్పుడు వెంటిలేటర్‌పై చికిత్స పొందుతుంటే చూసేవారి గుండె తరుక్కుపోతోంది. ఈ ఘటనలో అల్లు అర్జున్ అరెస్టు కావడం, జైలు కెళ్లడం, ఒక్కరోజులోనే బెయిల్‌పై విడుదలవ్వడంతో సినీ ఇండ్రస్టీ అంతా కదిలింది. ప్రముఖులంతా అల్లు అర్జున్ ఇంటికెళ్లి మరీ పరామర్శిస్తున్న ఫొటోలు సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. మరి రేవతి కుటుంబానికి ఎందుకీ శిక్ష? ఆ కుటుంబాన్ని ఆదుకునేవారు ఎవరు? వారిని పరామర్శించేవారెవరు? రూ.25లక్షల పరిహారం ఆ కొడుక్కు తల్లి లేని లోటు తీరుస్తుందా? ఈ ఘటన జరిగాక హీరో అరెస్టుకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్‌ను మీడియా ప్రశ్నిస్తే ' మనిషి చనిపోతే ఊరుకుంటామా? అరెస్టు చేస్తే తప్పేంటి? చట్టానికి అందరూ సమానమే.' అన్నారు. వాస్తవమే కానీ, మరి ప్రీమియర్ షోలకు, టిక్కెట్ ధరల పెంపును ఎందుకు అనుమతులిచ్చినట్టు? ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడం అధికార యంత్రాంగం వైఫల్యం కాదా? ఒకే ప్రాంగణంలో ఉన్న రెండు థియేటర్లకు సంబంధించిన సౌకర్యాలను పర్యవేక్షించారా? తగు హెచ్చరికలు చేశారా? రెండు థియేటర్లకు ఇన్, అవుట్ గేట్లు మాత్రమే ఉన్నాయి. మరి ప్రేక్షకులు ఎలా వెళ్తారు? ఎలా బయటకొస్తారు. ఏదైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే ఇంకేలా ఉంటుంది పరిస్థితి. ఇప్పటికైనా ప్రజలు మేల్కోవాలి. సినిమాను ఆదరించాలి, వీక్షించాలి. అందులోని మంచిని స్వీకరించి, చెడును వదిలేయాలి. కానీ, ప్రాణాలు పోయేంతగా విషాదం కాకూడదు.

- అనగంటి వెంకటేష్, 9705030888

రామసేతు అబద్ధం : ఆడమ్స్ బ్రిడ్జి వాస్తవం!



డాక్టర్ దేవరాజు మహారాజు


ఇండియా శ్రీలంకల మధ్యగల బ్రిడ్జిని 'ఆడమ్స్ బ్రిడ్జి' అని అంటున్నాం. సంప్రదాయ వాదులు 'రామాయణం' ఆధారంగా దాన్ని రామసేతు' - అని అంటారు. సనాతనవాదులు రాసుకున్న వారి లెక్కల్నే ఒకసారి వివరంగా చూద్దాం. ఆనాడు నిర్మాణ పనులు ఏ విధంగా జరిగాయి? ఎన్ని వానరాలు (కోతులు) ఈపనిలో పాల్గొన్నాయి? వారధి పొడవూ వెడల్పులు ఎంతెంత? వివరాలన్నీ ఇందులో ఉన్నాయి. మొదటిరోజు వానరాలు కష్టపడి పద్నాలుగు యోజనాల వంతెన నిర్మించాయట! రెండవ రోజు ఇరవై : మూడవ రోజు - ఇరవై ఒకటి, నాలుగవ రోజు - ఇరవై రెండు, అయిదవ రోజు - ఇరవై మూడు - మొత్తం కలిపి వంద యోజనాల వారధి నిర్మించాయని పవిత్ర రామాయణ గ్రంథంలో ఉంది. ఇదే విషయం అందులోని 74వ శ్లోకంలో ఉంది.

"దశయోజన్ విస్తీర్ణమ్ శతయోజన్ మాయతమ్॥
దద్రు దేవ గంధర్వ్య నలసేతుమ్ సుదుష్కరమ్॥"

అసాధ్యమైన వంద యోజనాల పొడవూ పది యోజనాల వెడల్పాగల ఈ వంతెనను చూసి యక్షులు, గంధర్వులు ఆనందించారని ఈశ్లోకం తెలియజేసింది. ఇకయోజన అంటే ఎంత అనేది చూద్దాం!విష్ణు పురాణం ప్రకారం ఒక యోజన అంటే 14.63 కి.మీ. ఆ లెక్కన, వంద యోజనాలంటే 1463 కి.మీ. రామాయణం ప్రకారం కోతులు కట్టిన వారధి పొడవు 1463 కి.మీ; వెడల్పు 150 కి.మీ. ఇది ఇలా ఉండనిచ్చి ఇప్పుడు మనం చూస్తున్న ఆడమ్స్ బ్రిడ్జి పొడవెంత? కేవలం యాభై కి.మీ. సనాతనుల 1463 కి.మీ.లకు, ఆధునికుల 50కి.మీ. పొంతనే లేదు. దీనితో మనకు అర్థమయ్యేది ఏమిటి? అంటే.. ఆ రామాయణం రాసిన మహానుభావుడికి వారధి పొడవూ వెడల్పుల లెక్కలేవీ తెలియవని! పైగా, అదొక సృజనాత్మక రచన. ఖచ్చితమైన లెక్కలు ఉండటానికి అదేమీ వైజ్ఞానిక గ్రంథం కాదు. మనం అర్థం చేసుకోగలం. ఇలా తప్పుల తడకలు రాసారేమని ఇండియా, శ్రీలంకల మధ్య 1463 కి.మీ. దూరం ఉండేదనీ, అది కాలక్రమంలో తగ్గిపోయి ఇప్పటి 50 కి.మీ.లుగా మిగిలిందని చెప్పినా చెప్పగలరు. వారి సామర్థ్యం మనకు తెలియనిదా?

ఇక రామసేతు నిర్మాణంలో పాల్గొన్న కోతుల సంఖ్య రామాయణంలో చెప్పిన ప్రకారమే వెయ్యి కోట్లు! ఇక రామ రావణయుద్ధంలో పాల్గొన్న సైన్యం ఎంత అనేది అందులో చెప్పలేదు కానీ, రాముని పక్షాన వెయ్యి కోట్ల వానరాలే పాల్గొన్నాయని అనుకుందాం. అప్పుడు రావణుడి సైన్యం కూడా వెయ్యి కోట్లే అనుకుంటే - యుద్ధంలో పాల్గొన్న ఇరుపక్షాల సైన్యం రెండు వేల కోట్లు. క్రమంగా పెరుగుతున్న ప్రపంచ జనాభా ఇప్పుడెంత ఉండాలి? ఈ కాకి లెక్కలు పక్కనపెడితే ప్రస్తుత ప్రపంచ జనాభా సుమారు ఏడు వందల కోట్లు. మరి వేల సంవత్సరాల క్రితం ఇంత జనాభా ఉండదుకదా? అలాంట ప్పుడు నోటికొచ్చిన సంఖ్య ఏదోరాస్తూ పోతే అది నిజమౌతుందా? రామాయణం రాసిన రచయితకు జనాభా గురించి ఏమీ తెలియదని, అది ఒక కల్పితగాథ అని - అంటే సరిపోతుంది కదా? కానీ సనా తనులు అలా అనలేరు. జీవ పరిణామ సిద్ధాంత ప్రకారం రాముడనే మానవుడికి కోట్ల సంఖ్యలో కోతులు వచ్చి బాసటగా నిలబడ్డాయని గానీ, ఆ మానవుడి పక్షాన యుద్ధం చేసినట్లు గానీ, ఈ భూగోళ చరిత్రలో - ఖగోళ చరిత్రలో - విశ్వానికి సంబంధించిన ఏ చరిత్రలో ఎక్కడా నమోదు కాలేదు.

రామసేతు మూలాలకు సంబంధించి ఎలాంటి ఆధారాలు భారతీయ ఉపగ్రహాలు గుర్తించ లేదని కేంద్ర భూగోళ విషయాల మంత్రి జితేంద్ర సింగ్ పార్లమెంటులో తెలిపారు. రాజ్యసభలో అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా "భారత్-శ్రీలంక ప్రాంతాలను అనుసంధానం చేసే రామసేతు ఫొటోలను భారతీయ ఉపగ్రహాలు హైరెసల్యూష్యన్‌తో తీశాయి. కానీ 'రామసేతు ఉన్నట్టు ఆధారాలు దొరకలేదు' అని సభలో ప్రకటించాడు. దీనివల్ల మనకు ఏమర్థమవుతోందీ అంటే- ఆడమ్స్ బ్రిడ్జ్ సహజ సిద్ధంగా ఏర్పడిందేగానీ ఎవరో నిర్మించిన వారధి కాదు. అందుకే చెప్పేది - రామాయణం చెప్పే 'రామసేతు' - అబద్ధం - అని !!





ఇకపోతే, భారత కేంద్ర ప్రభుత్వం - దేశ ప్రజల చెవుల్లో 'పువ్వులు' పెట్టే పని గత పదేండ్లుగా చేస్తూనే ఉంది (2014-2024) ఇప్పుడు తాజాగా అలాంటిదే మరొక పనిచేసింది. పురాణాల్ని చరిత్రగా మార్చి చూపెట్టాలని తాపత్రయపడింది. గిట్టనివాళ్లు దాన్ని ఎలాగూ 'కుట్ర చేసింది'- అని అంటారు. అది వేరే విషయం! 'ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైంటిఫిక్ రీసెర్చ్'- అనే సంస్థ ద్వారా కొన్ని తేదీలు విడుదల చేయించింది. ఇది ఆరెస్సెస్ - బీజేపీ కేంద్ర ప్రభుత్వానికి ఒక భజన సంస్థ - శ్రీరాముడు పుట్టిన తేదీ - సాధారణ శకానికి ముందు 5114 జనవరి 10-మధ్యాహ్నం 12.05 నిముషాలకు అనీ. శ్రీరాముడు లంకలోని అశోక వనంలో సీతను కలిసిన సంవత్సరం సాధారణ శకానికి ముందు 5076 సంవత్సరాలు సెప్టెంబర్ 12 అనీ... ఇక మహాభారత యుద్ధం సాధారణ శకానికి ముందు 3139 అక్టోబర్ 13 నుండి ప్రారంభమైందనీ - కొన్ని తేదీలు విడుదల చేయించింది. రామాయణ మహాభారతాలు కల్పిత కావ్యాలు కావనీ, అవి చారిత్రక గ్రంథాలని ఆ సంస్థ ప్రకటించింది. ఇక్కడ గమనించాల్సిందేమంటే, వారు లోగడ చెప్పిన యుగాల లెక్కలు వారికే అసమంజసంగా తోచి, ఇప్పుడు వాడుకలో ఉన్న మామూలు తేదీలు, నెలలు, సంవత్సరాల్లోకి వచ్చారన్నమాట! ఒక అడుగు వెనక్కి వేసి, భ్రమల్లోంచి వాస్తవంలోకి రావడానికి ప్రయత్నించారంటే అభినందించాల్సిందే. కానీ, ఇచ్చిన ఆధారాలు సరిగాలేనప్పుడు మనం వాటిని కాకమ్మ కథలనే అంటాం! అని చారిత్రక గ్రంథాలని అన్నప్పుడు చారిత్రక ఆధారాలు చూపాల్సి ఉంటుంది. ఆధారాలు చూపకుండా ఊరికే తేదీలు ప్రకటిస్తే - ఆ తేదీలకు ఏ విలువా ఉండదు.

సనాతన ధర్మం ఎలా ఉంటుంది? అనేది భారతంలో వ్యాసుడు చెప్పాడు- "పరుషు రాముడు భూమ్మీద ఉన్న క్షత్రియులనందరినీ చంపేస్తాడు అప్పుడు భర్తలు లేని ఆ రాజుల భార్యలు బ్రాహ్మణులతో శారీరకంగా కలిసి, సంతానం పొందుతారు - అంటే వారసుల్ని కంటారు. రాజులకు పిల్లలు పుట్ట నప్పుడు ఆరాజు భార్యలు బ్రాహ్మణుల ద్వారా పిల్లల్ని కనొచ్చు"- భీష్ముడితో రచయిత వ్యాసుడు ఈ మాటలు చెప్పిస్తాడు. ఇదే సనాతన ధర్మమని - మహా భారతం : ఆది పర్వం 104వ అధ్యాయంలో వ్యాసుడు చెప్పాడు. అదే మహాభారతంలో 13వ, అనుశాసన పర్వం 88లో ధర్మరాజుతో భీష్ముడు ఇలా అంటాడు "ఓ యుధిష్టరా ! శ్రార్ధకర్మలో మనువు చెప్పిన ప్రకారం - చేపలు పెడితే పితదేవతలు రెండు నెలలు సంతోషిస్తారు. మాంసం పెడితే మూడు నెలలు, పక్షి మాంసం పెడితే ఏడు నెలలు; లేడీ మాంసంతో ఎనిమిది నెలలు, ఆవుమాంసంతో సంవత్సరమంతా పితదేవతలు ఆనందిస్తారు. ఇక శార్ధ కర్మలలో ఎద్దుమాంసం పెడితే ఏకంగా వారు పన్నెండు సంవత్సరాలు సంతోషిస్తారు!"- ఇక రామా యణం నుండి ఒక ఉదాహరణ చూద్దాం - అరణ్యకాండ 10 -9 వాల్మీకి రామాయణంలో ఇలా ఉంది: రాముడు సీతను ఉద్దేశించి ఇలా అంటాడు " సీతా! నేను నిన్ను కూడా త్యజింతును. లక్ష్మణుడిని కూడా వీడుతాను. కానీ బ్రాహ్మణులకు చేసిన వాగ్దానమును విడువను."

ప్రతిదాంట్లో ఇలా బ్రాహ్మణాధిక్యత, మనువాదధోరణీ కనిపిస్తుంటే- వీటిని మనం చారిత్ర గ్రంథాలని అంగీకరించాలా? ఇలాంటి అతి ఘోరమైన అంశాల్ని పక్కనపెట్టి మనం వీటిని చారిత్రక గ్రంథాలుగా స్వీకరించాలని మన మనువాద ఆరెస్సెస్-బీజేపీ నాయకులు తాపత్రయపడుతున్నారు. వాస్తవంగా ఈ దేశంలో పుట్టి, ఈ నేల నాలుగు చెరగులా తిరిగిన వారే చారిత్రక పురుషులవుతారు. ఒక రచయిత మెదడులో జన్మించిన కల్పితపాత్రలు, సంఘటనలూ చరిత్రలో భాగమెలా అవుతాయి?- అదేమిటో ఇలాంటి ప్రశ్నలతో కొందరి మనోభావాలు దెబ్బతింటాయి.

"భారతీయులు సంప్రదాయపరంగా ఎక్కువ విశ్వాసాలతోనూ, తక్కువ వివేచనతోనూ ఉంటారు. ఏ వ్యక్తి అయినా సాధారణానికి విరుద్ధంగా అందరి దష్టికి విడ్డూరంగా ఏదైనా చేస్తే- అతణ్ణి విదేశాల్లో పిచ్చివాడంటారు. కానీ, మన దేశంలో అలాంటి వాణ్ణి మహాత్ముడంటారు. యోగి, గురువు, బాబా అని కూడా అంటారు. పిచ్చిజనం అతణ్ణి గొర్రెల్లా అనుసరిస్తారు" - అని అన్నారు భారతరత్న డా.బి.ఆర్. అంబేద్కర్. వైదిక దేవీ దేవతలను రూపొందించుకున్న మన పూర్వీకుల వివేకం ఏ స్థాయిలో ఉండేదో ఒకసారి గమనించండి- శివుని వాహనం ఎద్దు. పార్వతి వాహనం సింహం. శివుని మెడలో పాము. ఒక కొడుకు వాహనం నెమలి. మరో కొడుకు వాహనం ఎలుక. పిట్ట కథలు తోచింది తోచిన విధంగా అల్లుకున్నారు. కానీ, ఇందులో లాజిక్ ఏడ్చిందా? శివుని వాహనం ఎద్దును పార్వతి వాహనం సింహం తినేస్తుంది. శివుని మెడలోని పాము ఒక కొడుకు వాహనమైన ఎలుకను తింటుంది. మరొక కొడుకు వాహనమైన నెమలి శివుని మెడలోని పామును చంపుతుంది. ఇది ఒక కుటుంబమైతే అందరూ కలిసి ఎలా ఉంటారూ! అందరు కలిసి ఉండకపోయినా, అప్పుడప్పుడు కలిసినా ఈ ప్రమాదం తప్పదు.

రామసేతు నిర్మాణంలో ప్రముఖపాత్ర వహించాడన్న ఆంజనేయుడిది కోతి తల అయినప్పుడు అందులో ఉండేది కోతి మెదడే కదా? వినాయకుడిది ఏనుగు తల అయినప్పుడు అందులో ఉండేది ఏనుగు మెదడే కదా? ఇవన్నీ జంతువుల మెదళ్లు ఆని ఈ మనుషులెప్పుడు గ్రహిస్తారో కదా? జంతు వుల మెదళ్లకన్నా మనిషి మెదడు ఎన్నోరెట్లు అభివద్ధి చెందిందనీ, అది, లోతుగా ఆలోచించగలదనీ, విశ్లేషించిగలదనీ ఈ మూఢభక్తులు ఎందుకు ఆలోచించరూ? అదే ఈ దేశంలోని విచిత్రం. జంతువుల తలలున్న 'దేవుళ్ల'కు భజనలు చేస్తుంటారు. తమను తాము తెలుసుకోరు. తమ మెదడులోని వివేకాన్ని నిద్రలేపరు. త్వరలో ఈ పరిస్థితి మారుతుందని ఆశిద్దాం! అంతకుముందు మూర్ఖపాలకుల్ని దించే యడం అత్యవసరం! జంతు మెదడ్లకు ప్రాముఖ్యమిచ్చే పాలకులు దేశ ప్రజల అవసరాలు తీర్చలేరు.

- సుప్రసిద్ధ సాహితీవేత్త, జీవశాస్త్రవేత్త(మెల్బోర్న్‌నుంచి)

> రామసేతు మూలాలకు సంబంధించి ఎలాంటి ఆధారాలు భారతీయ ఉపగ్రహాలు గుర్తించ లేదని కేంద్ర భూగోళ విషయాల మంత్రి జితేంద్ర సింగ్ పార్లమెంటులో తెలిపారు. రాజ్యసభలో అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా "భారత్-శ్రీలంక ప్రాంతాలను అనుసంధానం చేసే రామసేతు ఫొటోలను భారతీయ ఉపగ్రహాలు హైరెసలూష్యన్‌తో తీశాయి. కానీ 'రామసేతు ఉన్నట్టు ఆధారాలు దొరకలేదు' అని సభలో ప్రకటించాడు. దీనివల్ల మనకు ఏమర్థమవుతోందీ అంటే- ఆడమ్స్ బ్రిడ్జ్ సహజ సిద్ధంగా ఏర్పడిందేగానీ ఎవరో నిర్మించిన వారధి కాదు. అందుకే చెప్పేది - రామాయణం చెప్పే 'రామసేతు' - అబద్ధం - అని !!

> రామసేతు నిర్మాణంలో ప్రముఖపాత్ర వహించాడన్న ఆంజనేయుడిది కోతి తల అయినప్పుడు అందులో ఉండేది కోతి మెదడే కదా? వినాయకుడిది ఏనుగు తల అయినప్పుడు అందులో ఉండేది ఏనుగు మెదడే కదా? ఇవన్నీ జంతువుల మెదళ్లు ఆని ఈ మనుషులెప్పుడు గ్రహిస్తారో కదా? జంతు వుల మెదళ్లకన్నా మనిషి మెదడు ఎన్నోరెట్లు అభివద్ధి చెందిందనీ, అది, లోతుగా ఆలోచించగలదనీ, విశ్లేషించిగలదనీ ఈ మూఢభక్తులు ఎందుకు ఆలోచించరూ? అదే ఈ దేశంలోని విచిత్రం. జంతువుల తలలున్న 'దేవుళ్ల'కు భజనలు చేస్తుంటారు. తమను తాము తెలుసుకోరు. తమ మెదడులోని వివేకాన్ని నిద్రలేపరు. త్వరలో ఈ పరిస్థితి మారుతుందని ఆశిద్దాం! అంతకుముందు మూర్ఖపాలకుల్ని దించే యడం అత్యవసరం!

ప్రగతి చక్రంపై...ప్రయి'వేటు'!



గీట్ల ముకుందరెడ్డి
9490098857

ప్రభుత్వ శాఖగా నిజాం స్టేట్ రైల్ అండ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ (ఎన్ఎస్ఆర్-ఆర్టీడీ) 1932లో 27 బస్సులు, 116 మంది ఉద్యోగులతో ప్రారంభమైంది. నేటికి దాదాపు 92 ఏండ్లవుతోంది. ప్రస్తుతం అది ప్రభుత్వ ఆధీనంలోని కార్పొరేషన్ ద్వారా నడుపబడుతున్నది. కోట్లాదిమంది ప్రజల్ని గమ్యస్థానాలకు చేర్చి ఆర్టీసీ కుటుంబాలకు బాగా చేరువైంది. మొదట పట్టణాలు, ఆ తర్వాత గ్రామాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడి జనజీవనంలో మార్పులొచ్చిన మాట వాస్తవం. అందుకే 'బస్సు చక్రం.. ప్రగతి రథచక్రం' అన్నారు. అలాంటి ప్రగతిచక్రంపై ఇప్పుడు ప్రయివేటు దాడి చేస్తున్నది. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఒప్పందాల్ని కూడా చేసుకున్నాయి. ఇప్పుడు ప్రభుత్వ రంగంగా ఉన్న ఆర్టీసీ కాస్తా 'ఈ-బస్సుల' పేరుతో ప్రయివేటు, కార్పొరేట్ సంస్థల పరమవుతున్నది.

1958 జనవరిలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏపీఎస్ఆర్టీసీగా 22,628 బస్సులతో ఏర్పడింది. ఒక దశలో ఒక లక్ష 20వేల మంది పర్మినెంట్ ఉద్యోగులు కలిగిన సంస్థ ఏపీఎస్ఆర్టీసీ. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి సుమారు 59 వేల ఉద్యోగులు కలిగిన సంస్థ 2024 ఏడాదిలో 42 వేలకు పడిపోయింది. ప్రస్తుతం 9094 బస్సులు కలిగి ఉన్న టీజీఎస్ఆర్టీసీలో 6368 సొంత బస్సులు కాగా, 2726 అద్దె బస్సులు. జెడ్ సిరీస్ నెంబర్ ప్లేట్ కలిగినవి సొంత బస్సులు కాగా మిగతా సిరీస్ కలిగినవి అద్దె బస్సులు. అద్దె బస్సుల్లో డ్రైవర్లు ప్రయివేటు వారు కాగా కండక్టర్లు ఆర్టీసీ ఉద్యోగులు. ఆర్టీసీ పర్మినెంట్ డ్రైవర్ల సగటు నెల వేతనం రూ.45వేలు ఉండగా ప్రయివేటు అద్దె బస్సు డ్రైవర్ల సగటు నెల జీతం రూ.15వేలు మాత్రమే. ఎలక్ట్రికల్ బస్సుల్లో కండక్టర్లు లేనేలేరు. ఎలక్ట్రికల్ బస్సుల్లో టిక్కెట్లను టికెట్ ఇష్యూయింగ్ మిషిన్స్ (టీమ్స్) ద్వారా డ్రైవర్లే ఇవ్వాలి. గతంలో నాన్‌స్టాప్ బస్సుల్లో మాత్రమే డ్రైవర్లు టిమ్స్ ద్వారా టిక్కెట్లు ఇచ్చేవారు. ఇప్పుడు మల్టీస్టాపులు గల బస్సుల్లో కూడా టిమ్స్ ద్వారా టిక్కెట్లను డ్రైవర్లు ఇస్తున్నారు. ఒక చేత్తో డ్రైవింగ్ చేస్తూనే మరో చేత్తో టికెట్లు ఇవ్వడంతో డ్రైవింగ్‌పై ఏకాగ్రత కోల్పోయి బస్సులు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఏర్పడు తున్నాయి.

గ్రాస్ కాస్ట్ కాంటాక్ట్ (జిసిసి) పద్ధతి ద్వారా హైదరాబాద్, కరీంనగర్, నిజామాబాద్, రీజియన్‌లలో 75 'ఈ-బస్సులు' అక్టోబర్ 2024 నుండి రన్ అవుతున్నాయి. మొదటిసారిగా 2018లో నలభై ఏసీ ఎలక్ట్రికల్ బస్సులను హైదరాబాదులోని వివిధ ప్రాంతాల నుండి ఎయిర్‌పోర్టుకు ప్రవేశపెట్టింది. త్వరలోనే వెయ్యిబస్సులు, రాబోయే రెండేండ్లలో మూడువేల ఎలక్ట్రికల్ బస్సులు ప్రవేశపెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. 'జై భారత్ మారుతి (జేబీఎం) ద్వారా కరీంనగర్, హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్ డిపోల్లో ఈ-బస్సు సర్వీసులు నడిపిస్తున్నారు. 41 సీట్లు గల ఎలక్ట్రికల్ బస్సు ధర సుమారు కోటిన్నర రూపాయలు. ఎలక్ట్రికల్ బస్సు జీవితకాలం 12 నుండి 15ఏండ్లకు లేదా 15 లక్షల కిలోమీటర్లు. జేబీఎం కంపెనీకి ఆర్టీసీ కిలోమీటర్ కు రూ.39 చెల్లిస్తున్నది. ప్రస్తుత ఒప్పంద ప్రకారం బస్సు జీవి తకాలంలో జేబీఎం కంపెనీకి ఆర్టీసీ చెల్లించేది అక్షరాల రూ.5 కోట్ల 85 లక్షలు అన్నమాట. ఇందులో విద్యుత్తు చార్జింగ్ ఖర్చు కిలో మీటర్‌కు ఏడు రూపాయలు. కాగా, మెయింటనెన్స్‌తో పాటు సిబ్బంది ఖర్చు సుమారు రూ.4 మాత్రమే. ప్రజలకు టిక్కెట్ల ధర తగ్గించకుండా, డ్రైవర్లను, కండక్టర్లను సిబ్బందిని పర్మినెంట్‌గా నియమించకుండా, కార్పోరేట్ సంస్థలకు లాభాలు సమకూర్చడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉన్నది.



ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సులో డ్రైవర్ నౌకరి సంబురం మున్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఎలక్ట్రికల్ బస్సుల్లో డ్రైవర్లు అసమానజీతాలిస్తూ.. నియామక ఒప్పందాలు తుంగలో తొక్కుతూ ప్రయివేటు ఏజెన్సీలు దోపిడీకి గురిచేస్తున్నాయి. జేబీఎం సంస్థ 'చక్ర ఈ ట్రాన్స్', 'హంస' తదితర ప్రయివేటు ఏజెన్సీలకు అప్పగించి ఈ-బస్సుల డ్రైవర్లను నియమించారు. అవి ఓవర్ టైంకు అదనంగా ఒక్కరూపాయి ఇవ్వకుండా శ్రమను దోచుకుం టున్నాయి. పైగా అక్టోబర్ వేతనాల్లో సగమే ఇచ్చి... మిగిలిన నెలల వేతనాల్లో కోతలు విధిస్తూ ఇన్‌స్టాల్మెంట్ పద్ధతుల్లో అరకొరగా చెల్లిస్తున్నాయి. డ్రైవర్లకు ఒక్కొక్క డిపోలో ఒక్కోతీరు వేతనాలు, పనిగంటలు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాల్లో అసమానతలు ఉద్యోగంలో చేరిన నాటినుంచే మొదలయ్యాయి. కరీంనగర్‌లో ఈ బస్సుల డ్రైవర్లకు 26 రోజులు పనిచేస్తే పీఎఫ్ కటింగ్ మినహాయించి రూ.19,200 ఇస్తామని 'చక్ర ఈ ట్రాన్స్' ఏజెన్సీ ఒప్పందం కుదుర్చుకుంది. అది ఆచరణలో అమలు చేయడం లేదు. డ్రైవర్లకు ఐడీ నెంబర్లు ఇష్యూ చేసి ఆ ఐడీల మీదనే బస్సులు, టిక్కెట్ మిషన్లు ఇచ్చి విధుల్లోకి తీసుకుంది. అయితే జీతాల చెల్లింపులో మాత్రం కోతలు విధిస్తూ అర్థంకాని విధంగా వేతనాలు చెల్లిస్తూ శ్రమదోపిడీకి పాల్పడుతోంది. ఇందులో కరీంనగర్-2 డిపోకు 41 బస్సులు అప్పగించిన జేబీఎం సంస్థ డ్రైవర్లను అనేక ఇబ్బందులకు గురిచేస్తోంది. ఆగస్టులో శిక్షణ ఇచ్చి 50శాతం జీతం ఇస్తామని చెప్పి మోసం చేసింది. సెప్టెంబర్‌లో ఏడురోజుల జీతాన్ని పెండింగ్‌లో పెట్టింది. అక్టోబర్ జీతాలు అందరికీ ఇవ్వకుండా కొంతమందికి మాత్రమే రూ.5వేలు, రూ.8వేలు, రూ.10వేలు ఇన్‌స్టాల్‌మెంట్ రూపంలో జీతాలి చ్చింది.

ఈ జీతాల్లోనూ అనేక వ్యత్యాసాలున్నాయి. ఇరవై ఎనిమిది డ్యూటీలు చేసిన కార్మికుడికి రూ.15,524, అదే ఇరవై ఎనిమిది డ్యూటీలు చేసిన మరో కార్మికుడికి రూ13,400, ఇరవై ఆరు డ్యూటీలు చేసిన ఇంకో కార్మికునికి రూ.14,242, ఇరవై ఒక్క డ్యూటీలు చేసిన మరో కార్మికునికి రూ.12,436 జీతం ఇచ్చారు. ఇది ఏ లెక్కన ఇచ్చారో సమాధానం చెప్పకుండా అటు ఏజెన్సీ నిర్వాహకులు, ఇటు ఆర్టీసీ అధి కారులు దాటవేస్తూ వచ్చారు. టిక్కెట్ ఇష్యూ మిషన్లు (టిమ్స్)ల ద్వారా ఆర్టీసీ నుండి డ్రైవర్లకు టిక్కెట్‌కి రూ.2చొప్పున, వాటర్ బాటిల్స్ అమ్మకంపై ఒక్కో బాటిల్‌కు 50 పైసలు కమీషన్ ఇవ్వాలి. ఈ కమీషన్ కూడా ఆర్టీసీ అధికారులు ఇవ్వలేదు. ఒప్పందం ప్రకారం ఏజెన్సీలు జీతాలివ్వడం లేదు. పీఎఫ్, ఈ ఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యాలు అతీగతీ లేదు. ఓటీ సౌకర్యం కూడా లేదు. డ్యూటీకి ఎక్కిన తర్వాత ఎప్పుడు ఇంటికి వస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. నియామకపత్రాలు, పేస్లిప్పు తదితర అంశాలు ఏమీ ఇవ్వకుండా శ్రమదోపిడీ చేస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే.. సరైన సమాధానం లేకపోగా బెదిరింపులే ఎదురయ్యాయి. దీంతో కరీంనగర్-2 డిపోకు చెందిన ఈ- బస్సుల డ్రైవర్లంతా డిసెంబర్ 2న మెరుపు సమ్మెకు దిగారు. సీఐటీయూ సమ్మెకు సంఘీభావం తెలిపింది. దిగొచ్చిన ఏజెన్సీలు 3న డ్రైవర్ల డిమాండ్లు అంగీకరించాయి.

ఆర్టీసీలో గత టీ(బీ)ఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన విధానాలనే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అవలంబిస్తున్నది. 2019లో జరిగిన సమ్మె అనంతరం అప్పటి పభుత్వం యూనియన్లు లేకుండా చేసింది. డిపోల వారీగా అధికారులచే నియమించిన వెల్ఫేర్ కమిటీల ద్వారా కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని నమ్మబలికింది. యూనియన్ల విషయంలో అదేవిధానాన్ని కాంగ్రెస్ సర్కార్ అనుసరిస్తున్నది. పని భారం విపరీతంగా పెంచింది. 2021 ఏప్రిల్ నుండి రావాల్సిన పీఆర్సీ గురించి మాట్లాడటం లేదు. కనీసం స్పేర్ పార్ట్స్ కూడా ఇవ్వడం లేదు. ప్రయివేటీకరణ, కాంట్రాక్టీకరణ విధానాల్లో తేడా లేదు. ఆర్టీసీ సొంతబస్సులు, అద్దె బస్సులు, ఈ-బస్సులతో డ్రైవర్లలో విభజన రేఖలు సృష్టించింది. ప్రజలు, ఉద్యోగుల ప్రయోజనార్థం ఏర్పడింది ఆర్టీసీ. ఆ మాటకొస్తే ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలదే. ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ప్రభుత్వరంగ సంస్థల రక్షణ కోసం కార్మికవర్గం పోరాడాలి. అందుకు సహకరించేవి, పోరాటాలు చేసేది వామపక్షాలు మాత్రమే.

> ఒప్పందం ప్రకారం ఏజెన్సీలు జీతాలివ్వడం లేదు. పీఎఫ్, ఈ ఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యాలు అతీగతీ లేదు. ఓటీ సౌకర్యం కూడా లేదు. డ్యూటీకి ఎక్కిన తర్వాత ఎప్పుడు ఇంటికి వస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. నియామకపత్రాలు, పేస్లిప్పు తదితర అంశాలు ఏమీ ఇవ్వకుండా శ్రమదోపిడీ చేస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే.. సరైన సమాధానం లేకపోగా బెదిరింపులే ఎదురయ్యాయి. దీంతో కరీంనగర్-2 డిపోకు చెందిన ఈ- బస్సుల డ్రైవర్లంతా డిసెంబర్ 2న మెరుపు సమ్మెకు దిగారు. సీఐటీయూ సమ్మెకు సంఘీభావం తెలిపింది. దిగొచ్చిన ఏజెన్సీలు 3న డ్రైవర్ల డిమాండ్లు అంగీకరించాయి.

రాత్రి 11 గంటల వరకు కొనసాగిన అసెంబ్లీ

- మున్సిపాల్టీ సవరణ బిల్లు, పంచాయతీరాజ్ సవరణ బిల్లుకు ఆమోదం
- సభ శుక్రవారానికి వాయిదా
- నేడు భూ భారతిపై చర్చ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విమర్శలు, ప్రతి విమర్శలు, ఆరోపణలు, ప్రత్యారోపణల నడుమ రాష్ట్ర శాసనసభ గురువారం రాత్రి 11 గంటల వరకూ కొనసాగింది. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రతిపాదించిన మున్సిపాల్టీ సవరణ బిల్లు, మరో మంత్రి సీతక్క ప్రతిపాదించిన పంచాయతీరాజ్ సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. మున్సిపాల్టీ సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా దాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. పంచాయతీరాజ్ సవరణ బిల్లులో...' హైదరాబాద్ సమీపంలోని ఓ.ఆర్.ఆర్ పరిధిలో ఉన్న 51 గ్రామపంచాయతీలు, పట్టణ ప్రాంతాలకు దగ్గరగా ఉండి పట్టణ లక్షణాలను కలిగి ఉన్నాయి. ఈ పంచాయతీలను సమీప మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో విలీనం చేయాలి. రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో పట్టణ ప్రాంత లక్షణాలు కలిగి ఉన్న 80 గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లుగా మార్చాలి. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పంచాయతీ ఎన్నికలు జరపడానికి డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేశాం. దీనికి సంబంధించి పంచాయతీరాజ్ చట్టంలో సవరణలు చేయాలి. రాష్ట్ర ఎన్నికల సంఘం, పంచాయతీ ట్రిబ్యునల్ సలహా మేరకు సవరణలను పంచాయతీరాజ్ చట్టంలో పొందుపరిచాం. ఆ చట్టంలో షెడ్యూల్ 8 లోని 147 పంచాయితీలకు సంబంధించిన తప్పులను సవరించుటకు గాను కొన్ని సవరణలు ప్రతిపాదించాం...'అని ప్రభుత్వం పేర్కొంది. ఈ సవరణ చట్టాన్ని ఆమోదించిన అనంతరం సభ శుక్రవారానికి వాయిదా పడింది. భూ భారతిపై పూర్తి స్థాయిలో చర్చించేందుకు వీలుగా శుక్రవారం ప్రశ్నోత్తరాలను రద్దు చేశారు. దానిపై చర్చ అనంతరం సభ నిరవధికంగా వాయిదా పడే అవకాశాలున్నాయి.

అమిత్ షా దేశప్రజలకు క్షమాపణ చెప్పాలి

అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలకు ఖండన

- ఆ వ్యాఖ్యలను ప్రధాని మోడీ సమర్థించడం సరికాదు : సీపీఐ (ఎం) ఖమ్మం జిల్లా 22వ మహాసభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి : తమ్మినేని వీరభద్రం
- కేంద్ర హోం మంత్రి వ్యాఖ్యలను నిరసిస్తూ ఆందోళనలకు పిలుపు



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/ సత్తుపల్లి

దేశ ప్రజలకు అమిత్ షా క్షమాపణ చెప్పాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. దళితుల వెనుకబాటుతనాన్ని, అంటరానితనాన్ని తీవ్రంగా ప్రశ్నించి, తన జీవితాన్ని బడుగు, బలహీన వర్గాలకు అంకితం చేసిన మహనీయుడు అంబేద్కర్ అని తెలిపారు. అమిత్ షా అంబేద్కర్‌ను పలుచన చేస్తూ వ్యాఖ్యలు చేయడం, వాటిని ప్రధానమంత్రి మోడీ సమర్ధించడాన్ని ఖండించారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలోని లక్ష్మీ ప్రసన్న ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా 22వ మహాసభలకు హాజరైన తమ్మినేని.. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశ ప్రజలను ఎలా పాలించాలోనన్న సమానత్వ సిద్ధాంతాన్ని ముందుకు తీసుకువచ్చింది అంబేద్కర్ అనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. దళితులకు రిజర్వేషన్ కేటాయింపులో అంబేద్కర్ కృషి ప్రత్యేకమైనదని తెలిపారు. ఇంత చరిత్ర ఉన్న ఓ మహనీయున్ని చులకన చేస్తూ మాట్లాడటాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నట్టు ప్రకటించారు.

రాజ్యాంగ మార్పు అనేది బీజేపీ లక్ష్యమని, దాని స్థానంలో మనుధర్మ శాస్త్రాన్ని ప్రవేశపెట్టాలనే యోచనలో భాగంగానే అమిత్ షా అంబేద్కర్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు ఉద్దేశపూర్వకంగా చేసినవే తప్ప మరొకటి కాదన్నారు. హోంమంత్రి వ్యాఖ్యలకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.వెంకట్, పోతినేని సుదర్శన్, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బుగ్గవీటి సరళ, భూక్యా వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచవ్యాప్తంగా పాలకవర్గాలపై వ్యతిరేకత : కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్

ప్రపంచవ్యాప్తంగా పాలకవర్గాలపై వ్యతిరేకత కొనసాగుతోందని, కమ్యూనిస్టులకు అనుకూల వాతావరణం నెలకొన్న దృష్ట్యా దాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్ పిలుపునిచ్చారు. శ్రీలంకలో కమ్యూనిస్టులు అధికారంలోకి రావడం దీనికి నిదర్శనమన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక దళితులు, గిరిజనుల్లో అభద్రతాభావం పెరిగిందన్నారు. కులం, మతం పేరుతో ప్రజలను వర్గీకరిస్తుందని చెప్పారు. కమ్యూనిస్టులు జనంతో గడుపుతూ వర్గ పోరాటాలను ముందుకు తీసుకెళ్లాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. పార్టీ బలోపేతం ద్వారా వర్గ పోరాటాలను మరింతగా ముందుకు తీసుకెళ్లవచ్చు అని తెలిపారు. అస్థిత్వ రాజకీయాల్లోకి కమ్యూనిస్టులు ప్రవేశించొద్దని సూచించారు. మార్క్సిస్టు దృక్పథంతో సామాజిక న్యాయం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభల్లో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు పొన్నం వెంకటేశ్వర్లు, బుగ్గవీటి సరళ, చింతలచెరువు కోటేశ్వరరావు, వాసిరెడ్డి ప్రసాద్ తదితరులు ప్రసంగించారు.

దిష్టిబొమ్మ దహనం

అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ మహాసభల ప్రాంగణం లక్ష్మీ ప్రసన్న ఫంక్షన్ హాల్ ఎదుట గురువారం అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ.. అంబేద్కర్ దళిత హక్కులు, అంటరానితనం నిర్మూలన కోసం పోరాడిన విషయాన్ని ప్రస్తావించారు. దేశ ప్రజలకు ఓ రాజ్యాంగం ఉందని, దీనిలో సమానత్వ ప్రతిపాదనలు అనేకం ఉన్నాయని వెల్లడించారు. ఆర్థిక అసమానతలు రూపుమాపాలని, లౌకికతత్వం పాటించాలని, ప్రజాస్వామ్యం కాపాడబడాలని, రాజ్యాంగ సంస్థలను స్వతంత్ర ప్రతిపత్తితో నడపాలనే ప్రతిపాదనలు రాజ్యాంగంలో పొందుపరిచినట్టు వివరించారు. దేశ ప్రజలకు రాజ్యాంగం ద్వారా ప్రాథమిక హక్కులను కల్పించిన చరిత్ర అంబేద్కర్‌దేనని తెలిపారు. అటువంటి అంబేద్కర్‌ను అవమానించడం అమిత్ షా దురహంకారానికి నిదర్శనంగా పేర్కొన్నారు. అంబేద్కర్‌పై అమిత్ షాక్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ సీపీఐ (ఎం) 22వ మహాసభల్లో తీర్మానం చేశామని వెల్లడించారు. మహాసభల అనంతరం ఊరూరా నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు.



పెంచిన పరీక్ష ఫీజులు తగ్గించాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్.మూర్తి
- ఓయూ పరిపాలనా భవన్ ఎదుట ధర్నా
- అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసన

నవతెలంగాణ-ఓయూ

ఓయూ పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులకు పెంచిన పరీక్ష ఫీజులు తగ్గించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు, ఉస్మానియా పరిశోధక విద్యార్థి ఆర్ఎల్.మూర్తి డిమాండ్ చేశారు. ఓయూ అడ్మినిస్ట్రేషన్ ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థుల నుంచి పరీక్ష ఫీజుతోపాటు ఫెయిల్ అయిన ప్రతి పేపర్‌కు రూ.1000 వసూలు చేయడాన్ని నిరసిస్తూ గురువారం పరిపాలనా భవన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూనివర్సిటీ యాజమాన్యం ప్రయివేటు విశ్వవిద్యాలయంలాగా ఫీజులు వసూలు చేయడాన్ని ఖండిస్తున్నట్టు చెప్పారు. ఇదే విషయాన్ని యూనివర్సిటీ వీసీ, రిజిస్ట్రార్ దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటికీ పరిష్కారం చేయలేదన్నారు. జేఎన్టీయూలో ఒక రకమైన నిర్ణయం, ఉస్మానియాలో మరొక రకమైన నిర్ణయం వల్ల విద్యార్థులు నష్టపోతున్నారని అన్నారు. ఫెయిల్ అయిన ప్రతి సబ్జెక్టుకీ రూ.1000 చెల్లించాలన్న నిబంధన వల్ల పేద గ్రామీణ నేపథ్యం కలిగిన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. యూనివర్సిటీ ఎగ్జామినేషన్ బ్రాంచ్ నుంచి మొదటగా ఇచ్చిన సర్క్యులర్‌లో కేవలం ఎగ్జామ్ ఫీజు కట్టాలని ఇచ్చి, తర్వాత మరొక సర్క్యులర్‌లో ఎగ్జామ్ ఫీజుతోపాటు ప్రతి పేపరుకూ రూ.1000 కట్టాలని ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. అదేవిధంగా యూనివర్సిటీ ఎగ్జామినేషన్ బ్రాంచ్ రీవల్యూవేషన్ ఫలితాలు ఇవ్వకుండానే పరీక్ష ఫీజు కట్టించుకోవడమంటే కేవలం డబ్బులు వసూలు చేయడం అవుతుందన్నారు. వెంటనే రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల చేయాలని, పరీక్ష ఫీజు గడువును పొడిగించాలని కోరారు. విద్యార్థులకు న్యాయం జరిగేలా యూనివర్సిటీ అధికారులు నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ఎస్ఎఫ్ఐ ఓయూ కార్యదర్శి రవి నాయక్, ఉపాధ్యక్షులు అజేయ్, మణి, దినేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓయూలో అమిత్ షా వ్యాఖ్యలపై నిరసన

అంబేద్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలపై ఎస్ఎఫ్ఐ ఓయూ కమిటీ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఎదుట నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎల్.మూర్తి పాల్గొని మాట్లాడారు. కేంద్ర మంత్రి అమిత్ షాను బర్తరాఫ్ చేయాలని డిమాండ్ చేశారు. మనుధర్మ శాస్త్ర పరంగా దేశాన్ని పరిపాలించాలని అనుకుంటున్నారని, అదే అహంకారంతో వ్యాఖ్యలు చేశారని అన్నారు. మనుధర్మ శాస్త్రానికి ఆటంకంగా రాజ్యాంగం ఉందని, అందుకే దాన్ని తొలగించే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. విద్యారంగంలో కూడా మను ధర్మశాస్త్ర ఆలోచనలు, అమలు పరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అమిత్ షా వ్యాఖ్యలను కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఖండించాలన్నారు. ఎస్ఎఫ్ఐ ఓయూ అధ్యక్షులు, ఉదయ్, కార్యదర్శి రవి నాయక్, టీపీటీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ విజయ్ కుమార్, మణి, దినేష్, విజయ్ పాల్గొన్నారు.


చర్లపల్లి జైలు నుంచి పట్నం నరేందర్ రెడ్డి విడుదల

నవతెలంగాణ-చర్లపల్లి

మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి గురువారం రాత్రి చర్లపల్లి జైలు నుంచి విడుదలయ్యారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. పట్నం నరేందర్ రెడ్డి విజయ సంకేతం చూపుతూ.. పార్టీ క్యాడర్‌లో జోష్ నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. ఎట్టకేలకు న్యాయం గెలిచిందని, ఇందుకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. జైలు వద్దకు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ కార్పొరేటర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. లగచర్లలో అధికారులపై దాడి చేశారన్న అభియోగాలతో ఆయన అరెస్టు కాగా నాంపల్లి స్పెషల్ కోర్టు బుధవారం బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే.

కొడంగల్‌లో మెడికల్ కాలేజీ

వచ్చే ఏడాది నుంచి అడ్మిషన్లు ప్రారంభం / కౌన్సిల్‌లో వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ వెల్లడి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న కొడంగల్‌లో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తున్నామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొడంగల్ కాలేజీలో అడ్మిషన్లు ప్రారంభిస్తామని ఆయన వెల్లడించారు. మెడికల్ కాలేజీకి అనుబంధంగా నర్సింగ్, పారామెడికల్ కాలేజీలు కూడా ప్రారంభిస్తున్నామన్నారు. ఆరోగ్యరంగానికి సంబంధించి శాసన మండలి లో సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ఈ ఏడాది 8 కొత్త మెడికల్ కాలేజీలను ప్రారంభించామని మంత్రి గుర్తు చేశారు. ఒక్కో కాలేజీలో 50 సీట్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. అన్ని కాలేజీల్లో ఎన్ఎంసీ నిబంధనలకు అనుగుణంగా బోధనా సిబ్బందిని నియమించి నట్టు తెలిపారు. అన్ని హాస్పిటల్స్‌లో కలిపి 2500కుపైగా డయాగ్నస్టిక్స్ యంత్రాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. ఈ యంత్రాల నిర్వహణ, మరమ్మతులకు స్పెషల్ సెల్స్ ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. అవసరాన్ని బట్టి అవసరమైన చోట ఎంఆర్ఐ స్కానింగ్ సర్వీసులు అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. యంత్రాలు నడిపేందుకు అవసరమైన సిబ్బందిని కూడా రిక్రూట్ చేస్తామన్నారు. క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం మొబైల్ స్క్రీనింగ్ సర్వీసులు అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి వెల్లడించారు. అలాగే, రీజనల్ క్యాన్సర్ సెంటర్లను ఏర్పాటు చేయబోతున్నామని వెల్లడించారు. హైదరాబాద్‌తో పాటు, జిల్లాల్లోనూ సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించడానికి ప్రయత్నిస్తున్నా మన్నారు. ఆ ప్రయత్నంలో భాగంగానే హైదరాబాద్‌లో సుదీర్ఘ కాలంగా పని చేస్తున్న కొంతమంది సీనియర్ డాక్టర్లను జిల్లాలకు ట్రాన్స్‌ఫర్ చేశామన్నారు. రాబోయే రోజుల్లో 90 శాతం ట్రీట్‌మెంట్ జిల్లాల్లోనే అందేలా చర్యలు తీసుకుంటామని వివరించారు.

26 శాతం మందికి సంతానలేమి సమస్య

రాష్ట్రంలో సంతానలేమి సమస్య తీవ్రంగా ఉందని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. 26 శాతం మంది ఈ సమస్యతో బాధపడుతున్నారనీ, మారిన జీవనశైలి, ఒత్తిడి తదితర కారణాలతో ఈ సమస్య పెరుగుతున్నదన్నారు. రాష్ట్రంలో ప్రయివేటులో 358 సంతాన సాఫల్య కేంద్రాలుండగా, వాటిలో రూ.లక్షలు ఖర్చు పెట్టలేక పేదలు మానసిక క్షోభను అనుభవిస్తు న్నారని చెప్పారు. పేదలను ప్రయివేటు దోపిడీ నుంచి తప్పించి, వారి మానసిక క్షోభను తప్పించాల్సి ఉందన్నారు. గాంధీ, పేట్లబురుజు, వరంగల్ ఎంజీఎం ఆస్పత్రుల్లో ఐవీఎఫ్ సెంటర్ల ఏర్పాటు కోసం గత ప్రభుత్వం 2017లో జీవో 520 విడుదల చేసినా వాటిని ప్రారంభించలేదని చెప్పారు. డాక్టర్లు, రీఏజెంట్స్, డ్రగ్స్ లేకుండానే 2023 అక్టోబర్‌లో గాంధీలో ఓ సెంటర్ ప్రారంభించి, ఒక్కరికీ కూడా ఐవీఎఫ్ చేయలేదని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత గాంధీ హాస్పిటల్‌లోని ఐవీఎఫ్ సెంటర్‌లో ఎంబ్రయాలజిస్ట్, గైనకాలజిస్ట్, ఇతర డాక్టర్లను నియమించి, అవసరమైన అన్ని రీఏజెంట్స్, మెడిసిన్స్ పంపిణీ చేసినట్టు తెలిపారు. ఏఆర్టీ యాక్ట్ ప్రకారం అనుమతులు తీసుకొచ్చి, అక్టోబర్ 15వ తేదీన గాంధీలో ఐవీఎఫ్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చినట్టు వివరించారు. పేట్లబుర్జు ఆస్పత్రిలోనూ ఐవీఎఫ్ సేవలను ప్రారంభించామనీ, వరంగల్ ఎంజీఎంలో సెంటర్ ఏర్పాటు పనులు కొనసాగుతున్నాని అన్నారు. హైదరాబాద్‌లో మరో సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు.

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో రూ.7 లక్షల కోట్ల అప్పు

- హరీశ్ సభను, ప్రజలనూ తప్పుదోవ పట్టిస్తున్నారు
- కాగ్, కేంద్రం గత సర్కార్‌కు అక్షింతలు వేసింది : ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో రూ.7లక్షల కోట్లు అప్పు చేశారని ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. రాష్ట్ర అప్పులు, ఆర్థిక పరిస్థితిపై బీఆర్ఎస్ సభ్యులు హరీశ్‌రావు ఇచ్చిన ప్రివిలేజ్ మోషన్‌పై స్పీకర్ స్వల్పకాలిక చర్చకు అనుమతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేండ్లలో బీఆర్ఎస్ సర్కార్ ఆర్థిక విధ్వంసానికి పాల్పడిందని విమర్శించారు. వివిధ రకాలు చేసిన రూ.7 లక్షల కోట్ల అప్పులతో పాటు మరో రూ.40 వేల కోట్లు పలు విభాగాలకు బకాయిలు పెట్టారని గుర్తు చేశారు.

భారత దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో లేని విధంగా బడ్జెట్ పత్రాల్లో తప్పుడు లెక్కలు చెప్పారని విమర్శించారు. ఇప్పటి ఏ ఆర్థిక మంత్రి పెట్టని విధంగా నాన్ రిస్క్ అనే కొత్త పదాన్ని సృష్టించి అటు ఆర్బీఐని, కాగ్‌ను, కేంద్రాన్ని, రాష్ట్ర ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. హరీశ్ చెప్పినట్టుగా తాము చేసిన అప్పులు గత సర్కార్ వడ్డీలకే సరిపోతోందని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం ఏడాది కాలంలో రూ.1,06,247 చేసినా, రూ.1,18,306 కోట్లను బ్యాంకులు, వివిధ సంస్థలకు చెల్లించామని పేర్కొన్నారు. తామే అదనంగా రూ.12,117 కోట్లు చెల్లించామని గుర్తు చేశారు. వాస్తవాలు ఇలా ఉంటే హరీశ్‌రావు సభను, రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. అప్పులు చేసిన గత సర్కార్ వాటిన ఆస్తులు పెంచేందుకు కాకుండా దుబారా ఖర్చు చేసిందని ఆరోపించారు. సభను తప్పుదోవ పట్టించిన సదరు సభ్యునిపై ప్రివిలేజ్ మోషన్ ఇవ్వాలని అన్నారు.

మీకు తెలిసే జీవోలు వచ్చాయా ?

•సోమేష్, స్మితలకు ఘోష్ కమిషన్ ప్రశ్నలు •కాళేశ్వరంపై కొనసాగుతున్న విచారణ



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టులోని అంతర్భాగమైన మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీ డిజైన్ల లోపాలు, అవినీతి ఆరోపణలపై నిజాలు నిగ్గు తేలే సమయం ఆసన్నమైంది. ఈ ప్రాజెక్టు అవినీతిపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ చేపట్టిన విచారణ ముగింపు దశకు చేరుకున్నది. గత ఆరు మాసాల్లో విడతల వారీగా ప్రాజెక్టు నిర్మాణంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా భాగస్వాములైన అధికారులు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, కార్పొరేషన్ చైర్మెన్లు, గుత్తేదార్లను ప్రశ్నించిన పీసీ ఘోష్ కమిషన్, బహిరంగ విచారణలో కీలక అధికారులకు ముచ్చెమటలు పట్టిస్తున్నది. ఇప్పటికే తప్పుడు సమాచారం ఇచ్చే అధికారులపై చర్యలు తప్పవని స్ట్రాంగ్ మెసేజ్ ఇచ్చిన ఆ కమిషన్ కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణ లోపాలు, ఆర్థిక అవకతవకలపై గత ప్రభుత్వ హయాంలో ఉన్నత హోదాలో పని చేసిన కీలక అధికారులను ప్రశ్నిస్తున్నది. ఇందులో భాగంగా గురువారం అప్పట్లో సీఎంవోలో కార్యదర్శిగా విధులు నిర్వర్తించిన ఐఏఎస్ స్మితా సబర్వాల్ , మాజీ సీఎస్ సోమేష్ కుమార్‌పై కమిషన్ ప్రశ్నల వర్షం కురిపించింది. కాగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో స్మితా సబర్వాల్ సీఎంవోలో కీలకంగా వ్యవహరించగా, సోమేశ్‌కుమార్ సీఎస్‌గా విధులు నిర్వర్తించిన విషయం తెలిసిందే.


స్మితా సబర్వాల్‌ను ప్రశ్నించిన కమిషన్ క్యాబినెట్ ఆమోదం లేకుండానే మూడు బ్యారేజీలకు పరిపాలన అనుమతులు ఇచ్చారా ? అని వివరాలు రాబట్టే ప్రయత్నం చేసింది. కమిషన్ అడిగిన ప్రశ్నలకు స్పందించిన స్మితా సబర్వాల్ ఆ విషయం తనకు తెలియదనీ, అవగాహన లేదని సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎంవోకి వచ్చే ప్రతి ఫైల్‌కు సీఎం ఆమోదం ఉంటుందన్న ఆమె, అందులో తాను ఏడు శాఖలను పర్యవేక్షించానని వివరణ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో నా పరిధి పరిమితమే అన్న స్మిత సాధారణం సమన్వయాన్ని మాత్రమే చూసుకున్నట్టు తెలిపారని కమిషన్ తెలిపింది. మరోవైపు మాజీ సీఎస్ సోమేశ్ కుమార్‌ను ప్రశ్నించిన కమిషన్ చీఫ్ జస్టిస్ చంద్రఘోష్, సోమేశ్ ఇచ్చిన వివరణపై తీవ్రంగా మండిపడ్డారు. బహిరంగ విచారణకు కోర్టు హాల్లోకి పిలిచిన వెంటనే రాకపోవడంతో సోమేశ్ కుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనకూ స్మితా సబర్వాల్‌ను అడిగిన ప్రశ్నలూ అడగ్గా, తాను బాధ్యతలు స్వీకరించక ముందే బ్యారేజీల నిర్మాణం పూర్తయిందని సోమేశ్ కుమార్ బదులిచ్చారు. వాటి అనుమతులు, క్యాబినెట్ తీర్మానాల గురించి తనకు తెలియదన్నారు. ఇతర శాఖల గురించి ఆయన ప్రస్తావించగా... కేవలం బ్యారేజ్‌ల గురించి మాత్రమే చెప్పాలని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సూచించింది.

త్వరలో హరీశ్‌రావు వంతు..!

ఈ నెల 18న విచారణను ఎదుర్కొన్న మాజీ సీఎస్ ఎస్‌కే జోషి , మాజీ ఐఏఎస్ రజత్ కుమార్ కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాల విషయంలో విధానపరమైన నిర్ణయాలు తీసుకుంది మాజీ సీఎం కేసీఆర్ , అప్పటి నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు అని కమిషన్‌కు తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ అధ్యక్షతన వ్యాప్కోస్ , సీఈ-సీడీవో ,ఇంజినీర్లతో జరిగిన సమావేశంలో వారే ఈ నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. 2016 మే 2న మేడిగడ్డ వద్ద భూమి పూజ చేసి బ్యారేజీల నిర్మాణాలను కేసీఆర్ ప్రారంభించారని తెలిపారు. అదే రోజు ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్ట్ పేరును కాళేశ్వరం ప్రాజెక్టుగా మార్చేశారని కమిషన్‌కు వివరించారు. ఆయా అధికారులు ఇచ్చిన వివరణతో గత ప్రభుత్వ హయాంలో ముఖ్యంగా కాళేశ్వరం నిర్మాణ సమయంలో ఇరిగేషన్ శాఖ మంత్రిగా వ్యవహరించిన హరీశ్‌రావును ప్రశ్నించేందుకు కమిషన్ రంగం సిద్ధం చేసుకుంటున్నదనే ప్రచారం జరుగుతున్నది.

20 నెలల్లో ఉప్పల్ ఘట్ కేసర్ రోడ్డు పనులు పూర్తి

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాబోయే 20 నెలల్లో ఉప్పల్ ఘట్‌కేసర్ రోడ్డు పనులు పూర్తి చేయనున్నట్టు రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. గురువారం శాసనమండలిలో ప్రొఫెసర్ కోదండరాం అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ఉప్పల్-ఘట్ కేసర్ రోడ్డులో 7 సంవత్సరాల్లో 7 కిలోమీటర్ల ఫ్లైఓవర్‌ను నిర్మించలేని అసమర్థ బీఆర్ఎస్ ప్రభుత్వం గురించి మాట్లాడటం దండగ అని విమర్శించారు. ఉప్పల్, పీర్జాదీగూడ, బోడుప్పల్ ప్రాంతాల్లో ఎంతోమంది చనిపోయారని విచారం వ్యక్తం చేశారు. బీహెచ్ఈఎల్ జంక్షన్ వద్ద రూ.173 కోట్లతో ఎన్‌హెచ్-65 పై ఫ్లైఓవర్, రోడ్డు నిర్మాణంలో ఉందని తెలిపారు. ఈ రోడ్డును 2025 మార్చి నాటికి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు.లింగంపల్లి క్రాస్ నుంచి అమీన్‌పూర్ వరకు మున్సిపాలిటీ ఆధీనంలో ఉన్నప్పటికీ, మంత్రిగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అధికారులతో మాట్లాడి పనులు చేయిస్తున్నట్టు వెల్లడించారు. డిసెంబర్ 23న టెండర్ పిలుస్తున్నామనీ, సంక్రాంతి పండగ లోపల పూర్తి చేసి పనులు ప్రారంభించి 3 నెలల్లో ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. హైదరాబాద్ జంటనగరాలకు రూ.10 వేల కోట్లు కేటాయించడం వల్లే రూ.45 కోట్లు మంజూరీ చేసుకోగలిగామని తెలిపారు. ఎన్‌హెచ్-65 రోడ్డులో బీహెచ్ఈఎల్ ఫ్లైఓవర్ కాకుండా మదీనాగూడ నుంచి సంగారెడ్డి క్రాస్ రోడ్డు వరకు రూ.1స298 కోట్లతో 6 వరుసల రహదారి, 6 వరసుల సర్వీస్ రోడ్డు నిర్మిస్తున్నట్టు వివరించారు.

కోదండరాం చట్టసభకు రావడం సంతోషం

తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నాయకులు ప్రొఫెసర్ కోదండరాం గత పదేండ్లుగా ప్రజల గొంతుకగా ఉంటూ.. ఎమ్మెల్సీగా ఎన్నికై చట్టసభకు రావడంపట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఆయనతో కలిసి చేసిన సకల జనుల సమ్మె, సాగరహారం, మిలియన్ మార్చ్ వంటి చారిత్రాత్మకమైన పోరాటాల్లో పాల్గొన్నానని గుర్తు చేసుకున్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తర్వాత ప్రొఫెసర్ కోదండరాం గొప్ప నాయకులని కొనియాడారు. అలాంటి నాయకుని గురించి మాట్లాడుతున్నప్పుడు ఎవరికి బాధ అవసరం లేదని చెప్పారు. తెలంగాణ ఉద్యమకారునిగా కోదండరాం గురించి చెప్పడం తన బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రొఫెసర్ కోదండరాంలాంటి గొప్ప ఉద్యమకారుడు అడిగిన ప్రశ్నకు ఆర్ అండ్ బీ మంత్రిగా ప్రశ్నకు సమాధానం చెప్పే అవకాశం రావడం తనకు సంతోషంగా ఉందని తెలిపారు. అంతకు ముందు ప్రశ్నకు సమాధానం చెప్పకుండా కోదండరాం గురించి మాట్లాడుతుంటే బీఆర్ఎస్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి జోక్యం చేసుకుని, తెలంగాణ చరిత్ర కోదండరాం గురించి, కేసీఆర్ గురించి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మంత్రి పదవికి రాజీనామా చేసిన సంగతి ప్రజలందరికి తెలుసన్నారు. ప్రశ్నకు సమాధానం చెప్పాలని సూచించారు.

అంబేద్కర్ మాకు దేవుడితో సమానం

- కేంద్రమంత్రి అమిత్ షా తక్షణమే క్షమాపణ చెప్పాలి
- కేంద్ర మంత్రివర్గం నుంచి షాను తప్పించాలి
- అన్ని పీఎస్‌లలో అమిత్‌షాపై ఫిర్యాదు చేస్తాం
- కాంగ్రెస్ ఎమ్మెల్యేల ధర్నా



నవతెలంగాణ-సిటీబ్యూరో

అంబేద్కర్ తమకు దేవుడుతో సమానమని, ఆయనపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షా తక్షణమే క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. అమిత్ షాను కేంద్రమంత్రి వర్గం నుంచి తప్పించి, ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని ప్రధానమంత్రి మోడీని కోరారు. గురువారం అసెంబ్లీ ప్రాంగణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్, మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అంబేద్కర్ చిత్రపటాలను పట్టుకుని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. అమిత్ షా డౌన్ డౌన్, కేంద్రమంత్రి వర్గం నుంచి ఆయనను బర్తరఫ్ చేయాలంటూ నినాదాలు చేశారు. అనంతరం కాంగ్రెస్ ఎమ్మెల్యేలంతా కలిసి అసెంబ్లీ మీడియా పాయింట్‌కు వచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. అమిత్ షా వ్యాఖ్యలు "మనుస్మృతి"ని గుర్తు చేసేలా ఉన్నాయన్నారు. ఆయన వ్యాఖ్యలు దేశ భద్రతకు భంగం కలిగించేలా ఉన్నాయన్నారు. కేసీఆర్, కేటీఆర్ ఏ ఒక్కరోజు కూడా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించలేదని విమర్శించారు.

అదానీ విషయంలో జాయింట్ పార్లమెంటరీ కమిటీ మీద రాజ్యసభలోని బీఆర్ఎస్ ఎంపీల వైఖరి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. అంబేద్కర్‌ను బీజేపీ నాయకులు అవమానపరిస్తే బీఆర్ఎస్ ఎందుకు మౌనంగా ఉందో చెప్పాలని ప్రశ్నించారు. దానిపై ప్రతిపక్ష పార్టీగా శాసన సభలో తీర్మానం ప్రవేశపెట్టి అమిత్ షాను బర్తరఫ్ చేసి, అరెస్టు చేసి జైల్లో పెట్టాలనే మాట ఎందుకు చెప్పడం లేదన్నారు. అమిత్ షాపై తెలంగాణ వ్యాప్తంగా దళిత సంఘాలు పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేస్తాయని చెప్పారు. అంబేద్కర్‌పై బీజేపీ వైఖరి ఏమిటో మనవాద స్మృతులైన కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ చెప్పాలని డిమాండ్ చేశారు.

బీజేపీకి స్వాతంత్ర్య ఉద్యమంలో పాత్ర లేదని, ఆంగ్లేయులకు తావేదారులుగా పనిచేశారని విమర్శించారు. స్వాతంత్ర్య ఉద్యమ చరిత్ర కూడా బీజేపీ నేతలకు తెలియదని, కనీసం రాజ్యాంగ నిర్మాణంలో వారి పాత్ర లేదన్నారు. జ్ఞానసంపదతో అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రాయడంతో నేడు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఎన్నో ఉపాధి, ఉద్యోగ, రాజకీయ అవకాశాలు కలిగాయన్నారు.

రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- వ్యవసాయ విశ్వవిద్యాలయ వజ్రోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలన



నవతెలంగాణ-రాజేంద్రనగర్

నేడు, రేపు వజ్రోత్సవాల సందర్భంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి వచ్చే రైతులకు, ఇతర ప్రముఖులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ అధికారులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శుక్రవారం, శనివారం జరిగే వజ్రోత్సవ వేడుకల ఏర్పాట్లను మంత్రి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కార్యక్రమాల నిర్వహణలో సమయపాలన పాటించాలని, రైతులకి ఉపయోగపడేలా, ఆవరణలో అనువైన ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని తెలిపారు. గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన, ప్రసంగ కార్యక్రమాల్లో సమయపాలన పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, కమిషనర్ గోపి, ఉప కులపతి జానయ్య, తదితరులు పాల్గొన్నారు. కాగా, ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సభ ఏర్పాట్లను ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ కూడా పరిశీలించారు. వేడుకలకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాన్ని కేటాయించాలని సూచించారు.

ఆశా వర్కర్లకు రూ.18 వేల వేతనం ఇవ్వాలి

- సీఎం రేవంత్‌రెడ్డికి జూలకంటి లేఖ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఫిబ్రవరి తొమ్మిదిన, జులై 30న ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గురువారం ఆయన లేఖ రాశారు. వారి సమస్యలను పరిష్కరించకుండా ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ఈనెల 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన (బస్సుయాత్ర) చేస్తున్నారని తెలిపారు. 19 ఏండ్లుగా రేయింబవళ్లు ప్రజలకు అందుబాటులో ఉండి అతితక్కువ వేతనాలకే సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. సబ్‌సెంటర్లను క్లీన్ చేయడం, ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. బీపీ, షుగర్ పరీక్షలు చేయడం, ఎన్సీడీ బుక్స్ రాయడం, టీబీ రోగులకు స్పూటమ్ డబ్బాలు మోయడం, కంటి వెలుగు, సమగ్ర కుటుంబ సర్వే ప్రజాపాలన సర్వేలు, పరీక్షల విధులు వంటివి టీఏ, డీఏ లేకుండా చేస్తున్నారని వివరించారు. 106 రోజులు సమ్మె చేస్తే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఫిక్స్‌డ్ వేతనంగా నెలకు రూ.ఆరు వేల చెల్లిస్తామనీ, పీఎఫ్, ఈఎస్ఐ వంటి చట్టబద్ధ సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందని విమర్శించారు. టార్గెట్ పేరుతో వేతనాల్లో కోత విధించారని తెలిపారు. విధుల నుంచి తొలగిస్తామంటూ బెదిరింపులకు పాల్పడిందని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ, అధికారులు ఇచ్చిన హామీ అమలు కాకపోవడంతో తీవ్ర ఆందోళనతో ఉన్నారని తెలిపారు. వారంతా బడుగు, బలహీన వర్గాలకు చెందిన నిరుపేదలేనని వివరించారు. ఒకరకంగా నయా వెట్టిచాకిరీ విధానంలో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. వారికి పెరుగుతున్న ధరలకనుగుణంగా వేతనాలను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందిం చి ఆందోళనలో ఉన్న ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనంగా నెలకు రూ.18 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రసూతి సెలవులు, ఇతర చట్టబద్ధ సౌకర్యాలను కల్పించాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

'బలగం' మొగిలయ్య మృతి



నవతెలంగాణ-నర్సంపేట

బలగం సినిమా నటుడు, గాయకుడు పస్తం మొగిలయ్య(67) మృతి చెందాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన వరంగల్‌లోని సంరక్ష ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మరణించాడు. వరంగల్ జిల్లా దుగ్గొండి గ్రామానికి చెందిన మొగిలయ్య 'బలగం' చిత్రం ద్వారా ప్రేక్షకులకు, పల్లె ప్రజలకు సుపరిచితుడయ్యాడు. కొద్ది రోజుల క్రితం కిడ్నీలు దెబ్బతిని అస్వస్థతకు గురయ్యాడు. యేడాది కాలంగా డయాలసిస్ చికిత్స అందుకుంటున్న ఆయన మధుమేహం పెరిగి పరిస్థితి విషమించి చనిపోయారు. కొమురయ్యకు భార్య కొమురమ్మ, కుమారులు ఉన్నారు.

మొగిలయ్యకు పలువురి నివాళి

అసెంబ్లీ సమావేశాలు నడుస్తున్న వేళ మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.యాభై వేలు, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి రూ. యాభై వేలను దహన సంస్కారాల నిమిత్తం తమ ప్రతినిధులైన హుస్నాబాద్ నియోజకవర్గ పీసీసీ సభ్యుడు అశోక్‌రెడ్డి, నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి ద్వారా మృతుడు మొగిలయ్య భార్యకు అందజేశారు. బలగం మొగిలయ్య మృతి పట్ల పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ నివాళులర్పించారు. దుగ్గొండిలోని ఆయన సొంత ఇంటి వద్ద జబర్దస్త్ ఆర్టిస్టు రచ్చ, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మెన్ ఆకుల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ పొన్నం మొగిలి తదితర పార్టీల నాయకులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళ్లర్పించారు. బలగం సినిమాలో కొమరయ్య దంపతులు జానపద పాటలతో సినీ చలనచిత్ర రంగంలో కొత్త ఒరవడిని సష్టించారని, మొగిలయ్య మరణం సినీ రంగానికి, జానపద కళారూపాలకు తీరని లోటని కొనియాడారు.

టి డయాగ్నస్టిక్ సెంటర్ల సేవలను పూర్తిగా వినియోగించుకోవాలి

- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన టి డయాగ్నస్టిక్ సెంటర్ సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకునేందుకు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. గురువారం శాసనమండలి ప్రశ్నోత్తరాల సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలోని టి డయాగ్నస్టిక్ సెంటర్‌లో 25 శాతం మాత్రమే సేవలందిస్తున్నదని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో టెస్టులు చేసేందుకు కూడా ఇబ్బందులున్నాయని చెప్పారు. అక్కడి నుంచి నమూనాలను పంపించడం కూడా ఇబ్బందిగా ఉంటోందన్నారు. తక్షణమే పరీక్షలు చేసేలా చర్యలు తీసుకుంటే బాగుంటుందని సూచించారు. రాష్ట్రంలో దాదాపు ఏడు లక్షల మందికి ఈహెచ్ఎస్ ఉందనీ, మోడల్ స్కూళ్ళు, గురుకుల తదితర ఉపాధ్యాయులు 40 వేల మంది వరకుంటారనీ, వారికి కూడా వర్తింపజేయాలని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ టి డయాగ్నస్టిక్ సెంటర్లను బలోపేతం చేస్తామని తెలిపారు. మోడల్ స్కూళ్లు, గురుకుల ఉపాధ్యాయులకు ఈహెచ్ఎస్ వర్తింపజేసే అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

సభలో మాటల యుద్ధం

- యూజ్‌లెస్ ఫెలో అన్న హరీశ్
- క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్
- దొంగ అన్నందుకే అన్నానని వివరణ
- సభనే నడపలేరు.. రాష్ట్రాన్ని ఎలా నడుపుతారు: అక్బరుద్దీన్





నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో గురువారం అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం ముదిరి పాకాన పడింది. బీఆర్‌ఎస్ సభ్యులు బీఆర్‌ఎస్ హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు సభలో వివాదాస్పదమయ్యాయి. ఆయన మాట్లాడుతుండగా కాంగ్రెస్ సభ్యులు దొంగ అంటూ కామెంట్ చేశారు. దీంతో ఆగ్రహానికి గురైన ఆయన.. నన్ను దొంగ అన్న యూజ్ లెస్ ఫెలో ఎవరంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అసెంబ్లీలో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది. అధికార పక్ష సభ్యుల ఆందోళనతో హరీశ్ రావు వ్యాఖ్యలను స్పీకర్ రికార్డుల నుంచి తొలగించారు. కాగా హరీశ్‌రావు క్షమాపణ చెప్పాలని రాజగోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. సీనియర్ సభ్యులు మాట్లాడాల్సిన వ్యాఖ్యలు ఇవి కాదని ఆక్షేపించారు. నన్ను దొంగ అన్న వారిని యూజ్ లెస్ ఫెలో అనడం తప్పా? అని ఎదురు ప్రశ్నించారు. ఎవ్వరు అలా అన్నా క్షమాపణ చెప్పాల్సిందేనని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. స్పీకర్ జోక్యంతో వివాదం ముగిసింది. అంతకు ముందు ప్రివిలేజ్ మోషన్‌పై జరుగుతున్న స్వల్ప కాలిక చర్చ సందర్భంగా అక్బరుద్దీన్ ఒవైసీ సభను అడ్డుకున్నారు. సభ కార్యకలాపాలపై సభ్యులకు సరిగ్గా సమాచారం ఇవ్వట్లేదని అసహనం వ్యక్తం చేశారు. అసెంబ్లీనే సరిగ్గా నడపకలేపోతే.. ఇక ప్రభుత్వాన్ని ఎలా నడిపిస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కోపంతో తన చేతిలో ఉన్న పేపర్‌ను విసిరేశారు. అక్బర్ లేవనెత్తిన అంశంతో హరీశ్‌రావుతో పాటు బీజేపీ ఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి సైతం స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో విపక్ష, అధికార సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి.. సభలో గందరగోళం నెలకొంది. "విపక్ష సభ్యుల విమర్శలపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందించారు. సభ నిర్వహణలో కొంత సమాచార లోపం జరిగింది... దీనికే స్పీకర్ సారీ చెబుతారా?. స్పీకర్ కార్యాలయం తీసుకునే నిర్ణయాలకు అన్ని పార్టీలు కట్టుబడి ఉండాల్సిందే.. చిన్నపాటి సమాచార లోపానికి క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదు" అని శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు.. దాంతో తిరిగి హరీశ్ చర్చ ఆరంభించారు.

యూపీలో తెరుచుకున్న మరో ఆలయం

- బీజేపీ మత విభజన, ఓటు రాజకీయం : ప్రతిపక్షాలు

లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో మరో దేవాలయం తాళాలు తెరుచుకున్నాయి. హింసాకాండ చెలరేగిన షాహీ జామా మసీదుకు రెండు కిలోమీటర్ల దూరంలోని సరాయ్ తరిన్‌లో ఈ ఆలయం ఉంది. మసీదులో సర్వే నిర్వహించాలంటూ కోర్టు ఆదేశించిన నేపథ్యంలో సంభాల్‌లో అల్లర్లు జరిగిన సంగతి తెలిసిందే. పట్టణంలో ఉన్న ఖగ్గూ సరాయ్‌లోని దేవాలయాన్ని అధికారులు ఇదివరకే తెరవగా తాజాగా తెరిచింది రెండోది. ఈ రెండు దేవాల యాలు ముస్లింలు అధికంగా ఉన్న ప్రాంతంలోనే ఉండడం గమనార్హం. సరాయ్ తరిన్‌లో 32 సంవత్సరాల నాటి దేవాలయం బాలాజీది అని స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు, అధికారులు దాని తాళాలు తెరిచారు. దేవాలయం లోపల కృష్ణుడు, రాధ, హనుమంతుడి విగ్రహాలు ఉన్నాయి. ఆలయంలో తిరిగి పూజా కార్యక్రమాలు ప్రారంభించేందుకు ప్రయత్నాలు చేస్తున్నా ఓమని అధికారులు తెలిపారు. అక్కడ ఆక్రమణలు జరిగిన దాఖలాలు కన్పించలేదని వారు చెప్పారు. ముందు జాగ్రత్త చర్యగా ఆ ప్రాంతంలో భద్రతా దళాలను మోహరించారు. బుధవారం సుమారు యాభై మంది అక్కడికి వచ్చి ప్రార్థనలు జరిపేందుకు సిద్ధమయ్యారు. యోగి సర్కార్ చర్యలు ఓటు రాజకీ యంతో పాటు మత విభజనకు ముడిపడి ఉన్నదని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

రెండేండ్లలో ఎస్‌ఎల్‌బీసీ పూర్తి చేస్తాం

ఏడాదిలో బునాదిగాని, పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి కాలువలు పూర్తికి కృషి

- ఫలితంగా 60 వేల ఎకరాలు సాగులోకి వచ్చే అవకాశం
- ప్రాజెక్టులకు ఆటంకంగా భూసేకరణ
- ఎమ్మెల్యేలు స్థానికులను ఒప్పించేందుకు సహకరించాలి
- తక్కువ ఖర్చుతో ఎక్కువ సాగులోకి వచ్చే ప్రాజెక్టులకు ప్రాధాన్యం : నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎస్‌ఎల్‌బీసీని రెండేండ్లలో పూర్తి చేస్తామని అసెంబ్లీ సాక్షిగా నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రకటించారు. గురువారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాలువలు, పలు ప్రాజెక్టుల పనులు అనే అంశంపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సభ్యులు వేముల వీరేశం, రామారావు పవార్, మందుల సామేలు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, బీర్ల అయిలయ్య, ఆది శ్రీనివాస్, పాయల్ శంకర్, పాడి కౌశిక్‌రెడ్డి ప్రశ్నలు అడిగారు. వాటికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమాధానాలు ఇచ్చారు. ప్రాజెక్టుల నిర్మాణాలకు భూ సేకరణ ప్రధాన సమస్యగా మారిందని చెప్పారు. భూసేకరణ విషయంలో ఎమ్మెల్యేలు స్థానిక ప్రజలను ఒప్పించి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. తమ ప్రభుత్వం తక్కువ ఖర్చుతో ఎక్కువ సాగు అందుబాటులోకి తీసుకొచ్చే ప్రాజెక్టులకు తొలి ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు. సభ్యులు అడిగిన చాలా ప్రాజెక్టులు తమ తొలి ప్రాధాన్యంలోనే ఉన్నాయనీ, వాటిని వీలైనంత త్వరలో పూర్తి చేస్తామని హామీనిచ్చారు. బునాది గాని, పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి కాలువల పనులను పూర్తిచేస్తే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 60 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలోనూ ఈ కాలువలు పూర్తిచేసే ప్రయత్నం జరిగిందనీ, కానీ, ఆశించిన స్థాయిలో పనులు వేగంగా జరగలేదని తెలిపారు. తమ ప్రభుత్వం ఆ మూడు కాలువలను ఏడాదిలోగా పూర్తి చేస్తుందని హామీనిచ్చారు. మూసీ పునర్జీవంపై విమర్శలు మానుకో వాలని ప్రతిపక్షాలకు హితవు పలికారు. పునర్జీవం చేస్తే ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలకు ఎంతో మేలు చేసినవారమవుతామన్నారు. అయిటిపాముల లిఫ్ట్ ఇరిగేషన్‌కు భూసేకరణ అడ్డంకిగా మారిందని చెప్పారు. ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ పనులు యుద్ధ ప్రాతిపదికన చేస్తున్నామన్నారు. సభ్యులు చెప్పిన ట్లుగానే.. చిన్నచిన్న లిఫ్టు ఇరిగేషన్ల నిర్వహణకు సెక్యూరిటీ సమస్య ఉన్నమాట వాస్తవమన్నారు. మధ్యతరహా, చిన్నతరహా లిఫ్టు ఇరిగేషన్ల మెయింటెన్ కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని ప్రకటించారు. వాటి నిర్వహణ, సెక్యూరిటీ కోసం 1800 మంది లష్కర్‌లను నియమించాలని నిర్ణయించామని తెలిపారు. అయితే, రైతులు, సహకార, రైతు సంఘాలు కూడా బాధ్యత తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం మాదిరిగా ఒకే ప్రాజెక్టు మీద 1.81 లక్షల కోట్లు కేటాయించబోమనీ, తక్కువ ఖర్చుతో ఎక్కువ సాగుకు ఉపయోగపడే ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. గంధమల్ల ప్రాజెక్టును 1.5 టీఎమ్‌సీలకు కుదించి ముందుకెళ్తా మన్నారు. దేవాదులకు నిధులు విడుదలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీనిచ్చారు. చరటా కొరటా ప్రాజెక్టు మా ప్రభుత్వ తొలి ప్రాధాన్యంలో ఉందని చెప్పారు. గడ్డన్న వాగు ప్రాజెక్టు లైనింగ్ పనులు పూర్తి చేస్తామన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ కాలువ పనులకు టెండర్లు పిలిచామని తెలిపారు. తమ ప్రభుత్వం రాగానే 700 మంది అసిస్టెంట్ ఇంజినీర్లను నియమిం చిందనీ, వారిలో ఎక్కువగా ఐఐటీ, ఎన్ఐటీ నుంచి వచ్చినవారే ఉండటం శుభపరిణామం అని చెప్పారు. సంవత్సరానికి 30 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీళ్లివ్వాలనే లక్ష్యంతో ముందు కెళ్తామన్నారు. ముధోల్, వేముల వాడ, హుజు రాబాద్, ఆలేరు, భువనగిరి, జనగామ, ఆదిలాబాద్ ఎమ్మెల్యేలతో పాటు పలువురు సభ్యులు తమ దృష్టికి తీసుకొచ్చిన కాలువలు, ప్రాజెక్టులు, లిఫ్టు ఇరిగేషన్ల పనులను పూర్తిచేసేందుకు ప్రయత్ని స్తామనీ, అయితే, తక్కువ ఖర్చుతో పూర్తయ్యే వాటికి తొలి ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశారు.

పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో మళ్లీ పాముల కలకలం

- ఇద్దరు విద్యార్థులకు పాముకాటు
- ఆస్పత్రిలో చికిత్స.. నిలకడగా ఆరోగ్యం
- వరుస ఘటనలపై తల్లిదండ్రుల ఆందోళన
- మూడు నెలల కిందట ఇద్దరు విద్యార్థులు మృతి
- గురుకులాన్ని సందర్శించిన కలెక్టర్
- ప్రిన్సిపాల్ సస్పెండ్



పాఠశాలను సందర్శించిన కలెక్టర్

నవతెలంగాణ - మెట్‌పల్లి

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గ్రామంలోని గురుకుల పాఠశాలలో విద్యార్థులు మళ్లీ పాముకాటుకు గురయ్యారు. మూడు నెలల కిందట పాముకాటుతో గురుకులంలోని ఇద్దరు విద్యార్థులు మృతిచెందారు. బుధవారం రాత్రి ఎనిమిదో తరగతి విద్యార్థి ఓంకార్ అఖిల్‌ని పాము కాటు వేయగా, గురువారం ఉదయం మరో విద్యార్థి యస్విత్‌ను పాముకాటు వేసిందని తల్లిదండ్రులు తెలిపారు. విద్యార్థులు అస్వస్థతకు గురైనా సిబ్బంది పట్టించుకోలేదని, కనీసం ఆస్పత్రికి కూడా తీసుకుపోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సెప్టెంబర్‌లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ గురుకుల పాఠశాలను సందర్శించి సమస్యల పరిష్కారం కోసం రూ.50లక్షలు విడుదల చేశారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలూ కల్పించాలని అధికారులను ఆదేశించారు. అయినా పాములు రావడంపై పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం కనిపిస్తోందని తల్లితండ్రులు ఆరోపిస్తున్నారు. రహదారిపై బైటాయించి నిరసన తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం ఉందని, ఆమెను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులు పాముకాటుకు గురైన విషయం తెలుసుకొన్న జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆస్పత్రికి చేరుకుని పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అనంతరం పెద్దాపూర్ గురుకుల పాఠశాలను సందర్శించి సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళనా చెందొద్దన్నారు. గురుకుల పాఠశాల ఆవరణ, పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని, స్నేక్ క్యాచర్లతో పాములను పట్టించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. గురుకులం చుట్టూ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పొదలు, చెట్లు పెరిగిపోకుండా ఎప్పటికప్పుడూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. విష సర్పాలు, క్రిమికీటకాలు రాకుండా కిటికీలకు నెట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పాముకాటు నుంచి తప్పించుకునే మార్గాలు, ఒకవేళ పాము కాటుకు గురైతే ప్రథమ చికిత్స సంబంధించిన వాటిపై విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో, వైద్యాధికారులు ఉన్నారు. కాగా, విధుల నిర్వహణలో ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు గుర్తించి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ సాయంత్రం ఉత్వర్వులు జారీ చేశారు.

ఢిల్లీలో కుస్తీ.. గల్లీలో దోస్తీ

- అదానీ వ్యవహారంలో కాంగ్రెస్ వైఖరిదే : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ద్వంద్వ ప్రమాణాలంటూ రాహుల్ గాంధీకి లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అదానీ వ్యవహారంలో కాంగ్రెస్ ద్వంద్వ ప్రమాణాలను పాటిస్తోందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఈ విషయంలో ఆ పార్టీ వైఖరి 'ఢిల్లీలో కుస్తీ..గల్లీలో దోస్తీ...' మాదిరిగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి... కేటీఆర్ గురువారం లేఖ రాశారు. జాతీయ స్థాయిలో అదానీ పట్ల వ్యతిరేకతను ప్రదర్శిస్తున్న కాంగ్రెస్... తెలంగాణలో మాత్రం ఆయనకు అనుకూలంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. అదానీ అవినీతిపై ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలు ఆరోపణలు గుప్పిస్తోంటే, సీఎం రేవంత్ మాత్రం రాష్ట్రంలో అదానీ గ్రూప్‌నకు ఎర్ర తివాచీ పరుస్తున్నారని దుయ్యబట్టారు.

ఆ గ్రూప్ కోసం సుమారు రూ.12 వేల కోట్ల మేర భారీ ఒప్పందాలు కుదుర్చుకున్నారని గుర్తు చేశారు. అదానీ అవినీతిపై ఒకవైపు 'చలో రాజ్ భవన్' కార్యక్రమాన్ని నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్..మరోవైపు అదే అదానీతో అంటగాకుతున్నారని ఎద్దేవా చేశారు. ఆ నిరసన చేపట్టటం కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని కేటీఆర్ ఈ సందర్భంగా విమర్శించారు. ఆ నిరసనలన్నింటినీ కాంగ్రెస్ రాజకీయ డ్రామాలుగా అభివర్ణించారు. 'మీ పార్టీకి చెందిన సీఎం రేవంత్‌తో అదానీ అనుబంధం గురించి మీరు ప్రశ్నిస్తారా? లేక ఆయన వ్యక్తిగత ప్రయోజనాలను కాపాడటానికి మౌనంగా ఉంటారా?' అని రాహుల్‌ను సూటిగా ప్రశ్నించారు.

అవినీతే జరగనప్పుడు కేసు ఎలా నమోదు చేస్తారు ?

- ఇది ప్రభుత్వ దివాళాకోరుతనానికి నిదర్శనం
- ఫార్ములా ఈ-రేసు కేసుపై కేటీఆర్
- అసెంబ్లీలో చర్చించాలని డిమాండ్
- మేం ఉద్యమ నాయకుడి బిడ్డలం
- కుట్రలకు భయపడబోమని వ్యాఖ్య



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఫార్ములా ఈ-రేసుకు సంబంధించి అవినీతే జరగనప్పుడు అవినీతి నిరోధక చట్టం కింద తనపై కేసెలా నమోదు చేస్తారంటూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. ఈ చర్య రాష్ట్ర ప్రభుత్వ దివాళాకోరుతనానికి నిదర్శమని ఆయన ఎద్దేవా చేశారు. ఈ కేసుకు సంబంధించి గురువారం కేటీఆర్ శాసనసభలోనూ, లాబీల్లోనూ, అనంతరం తెలంగాణ భవన్‌లోనూ మీడియాతో మాట్లాడారు. తాము ఉద్యమ నాయకుడి బిడ్డలమనీ, రాష్ట్ర ప్రభుత్వ కుట్రలకు భయపడేది లేదని స్పష్టం చేశారు. అక్రమ కేసులు, అణచివేతలకు వెరవకుండా ప్రజల తరపున కొట్లాడుతూనే ఉంటామని చెప్పారు. ఫార్ములా ఈ-రేసుకు సంబంధించి తానెలాంటి తప్పు చేయలేదన్నారు. అందువల్ల న్యాయపరంగా కొట్లాడుతామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ కుటుంబం చేస్తున్న అవినీతి, అక్రమాలను బయటపెడుతున్నందుకే తమపై రాజకీయ వేధింపులకు పాల్పడుతున్నారంటూ ఆయన వాపోయారు. సీఎం ఎన్ని రకాలుగా అటెన్షన్ డైవర్షన్‌కు పాల్పడ్డా... కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలను అమలు చేసేదాకా ప్రభుత్వాన్ని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. తనపై బనాయించిన అక్రమ కేసులో రాష్ట్ర ప్రభుత్వానికి భంగపాటు తప్పదని కేటీఆర్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఈ కేసుకు సంబంధించి తగిన సాక్ష్యాధారాలుంటే అసెంబ్లీలోనే చర్చించాలని ప్రభుత్వానికి సవాల్ విసిరారు. ఇందుకు సంబంధించి వాస్తవాలను గమనించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

రాజకీయంగా ఎదుర్కోలేకనే : ఎమ్మెల్సీ కవిత

తమను, తమ పార్టీని రాజకీయంగా ఎదుర్కోలేకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి...కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఈ మేరకు ఆమె ఎక్స్ వేదికగా స్పందించారు. కాంగ్రెస్ అక్రమ కేసుల డ్రామాను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఫార్ములా ఈ-రేసు వ్యవహారంపై అసెంబ్లీలో చర్చించేందుకు ధైర్యం లేని సీఎం, అక్రమ కేసులతో భయపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారనీ, ఇది ఆయన అమాయకత్వానికి నిదర్శమని విమర్శించారు.

తాటాకు చప్పుళ్లకు భయపడబోం : మేడే రాజీవ్‌సాగర్

బీఆర్‌ఎస్ కార్యకర్తలుగా తాము తాటాకు చప్పుళ్లకు భయపడబోమని తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మెన్ మేడే రాజీవ్‌సాగర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయలేని సీఎం రేవంత్, ఆ అంశం నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే కేటీఆర్‌పై కేసులు బనాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మంత్రి కోమటిరెడ్డిపై బీఆర్‌ఎస్ సభాహక్కుల ఉల్లంఘన నోటీసు

శాసనసభలో బుధవారం తమ సభ్యుడు హరీశ్‌రావును ఉద్దేశించి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని బీఆర్‌ఎస్ పేర్కొంది. అందువల్ల ఆయనపై సభాహక్కుల ఉల్లంఘన నోటీసును ఇస్తున్నట్టు తెలిపింది. ఈ మేరకు ఆ పార్టీ ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, గంగుల కమలాకర్, కాలేరు వెంకటేశ్, పాడి కౌశిక్‌రెడ్డి తదితరులు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి నోటీసును అందజేశారు.

మనువాద దృక్పథాన్ని బయటపెట్టారు

- అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలకు సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో ఖండన

న్యూఢిల్లీ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హౌం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో ఖండించింది. ఈ మేరకు ఒక ప్రకటనను విడుదల చేసింది. "రాజ్యాంగం 75వ వార్షికోత్సవంపై రాజ్యసభలో జరిగిన చర్చలో అమిత్ షా.. అంబేద్కర్‌ను కించపరిచేలా చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా ప్రజల మనోభావాలను అవమానించేలా ఉన్నాయి. అంబేద్కర్ రూపొందించిన భారత రాజ్యాంగం గురించి మాట్లాడుతూ అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన తన మనువాద దృక్పథాన్ని బయట పెట్టారు. ప్రధాని మోడీ అమిత్ షాను సమర్థించిన విధానం అన్యాయమైనది. అమిత్ షాకు కేంద్ర హౌం మంత్రిగా ఉండే హక్కు లేదు" అని పేర్కొన్నది. అమిత్ షా వ్యాఖ్యలు పార్లమెంటుతో పాటు దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనకు దారి తీసిన విషయం విదితమే. కేంద్ర మంత్రి వ్యాఖ్యలను నిరసిస్తూ పార్లమెంటు ఆవరణలో ప్రతిపక్షాలు అంబేద్కర్ చిత్రపటాలతో ఆందోళన సైతం నిర్వహించిన విషయం తెలిసిందే.

సర్వేయర్లను నియమిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. రెవెన్యూ వ్యవస్థను సరిదిద్దుతామన్నారు. ఓఆర్‌సీలను పరిష్కరిస్తామనీ, బోగస్ వాటిని నిర్మోహమాటంగా తిరస్కరిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ భూముల రక్షణకు కృషిచేస్తామని హామీనిచ్చారు.

మాయల ఫకీర్ ఆడించినట్టు ధరణి ఆడింది

హైదరాబాద్ చుట్టూ ఉన్న ప్రభుత్వ భూములను కాపాడాలి : పాయల్ శంకర్

మాయల ఫకీర్ ఆడించినట్టు ధరణి ఆడిందని కేసీఆర్‌నుద్దేశించి బీజేపీ సభ్యులు పాయల్ శంకర్ వ్యాఖ్యానించారు. రైతులు తమ సొంత భూమిని కూడా అమ్ముకోలేని పరిస్థితిని గత ప్రభుత్వం కల్పించిందని విమర్శించారు. నిషేధిత జాబితాలో చాలామంది రైతుల భూములను పెట్టిందన్నారు. ఓ ఎమ్మార్వో వందల కోట్ల ఆస్తులు సంపాదించుకుని పట్టుబడ్డారని గుర్తుచేశారు. అనేక లిటికేషన్లు పెట్టి కోట్లాది రూపాయల భూములను లక్షల రూపాయలకే అమ్ముకునేలా చేసిందని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం ధరణి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఏరాష్ట్రంలో లేని విధంగా మన హైదరాబాద్‌లో ప్రభుత్వ భూములున్నాయనీ, వాటిని ప్రస్తుత సర్కారు కాపాడాలని విజ్ఞప్తి చేశారు. దావాలు వేయడానికి వీలు లేదనే నిబంధన ఎత్తేయాలని విన్నవించారు. అసైన్డ్ భూములను వారసులకు ఇచ్చేలా అవకాశం కల్పించాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో 1970 కంటే ముందు నుంచి సాగుచేసుకుంటున్న నాన్‌ట్రైబల్స్‌కు పట్టాలివ్వాలని సూచించారు. బీఆర్‌ఎస్ సభ్యులు గంగుల కమలాకర్ కోరారు.

పోడురైతుల శాపనార్థాలతోనే గత ప్రభుత్వం కూలింది : పాల్వాయి హరీశ్‌బాబు

పోడురైతుల శాపనార్థాలతోనే గత ప్రభుత్వం కూలిందని బీఆర్‌ఎస్ సభ్యులు పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. పోడు సాగుదారులపై అక్రమంగా పెట్టిన కేసులను ఈ ప్రభుత్వమైనా ఎత్తేయాలని డిమాండ్ చేశారు. తన నియోజకవర్గంలో కొండపల్లిలో 20 ఏండ్ల కింద 2000 ఎకరాలకు సంబంధించి పేదలకు అసైన్డ్ పట్టాలిచ్చారనీ, అవి ప్రభుత్వ భూములని గత ప్రభుత్వం రైతులను వేధించిందని విమర్శించారు. అక్కడ చెట్లు కూడా నాటించారని తెలిపారు.

సర్వే చేసి ఫారెస్టు-రెవెన్యూ భూముల లెక్క తేల్చాలి : మదన్‌మోహన్‌రావు

కాంగ్రెస్ సభ్యులు మదన్‌మోహన్‌రావు మాట్లాడుతూ..గిరిజనులు ఇండ్లు కట్టుకునేందుకు, బోర్లు వేసుకునేందుకు కూడా అటవీశాఖ అధికారులు అనుమతి ఇవ్వడం లేదని వాపోయారు. రెవెన్యూ భూములేవి? అటవీ భూములేవి? సరిహద్దులెలా ఉన్నాయి? అనే అంశాలను సర్వే చేసి తేల్చాలని కోరారు.

60,70 ఏండ్ల నుంచి సాగుచేసుకుంటున్న భూముల నుంచి వెళ్లగొట్టడమేంటి? : బాలూనాయక్

దేవరకొండ నియోజకవర్గంలో 60,70 ఏండ్ల నుంచి గిరిజన రైతులు సాగుచేసుకుంటున్న భూముల నుంచి అటవీశాఖ వెళ్లగొట్టడమేంటని కాంగ్రెస్ సభ్యులు బాలూనాయక్ ప్రశ్నించారు. కె.సత్యనారాయణ మాట్లాడుతూ.. శ్మశానవాటికలు, పల్లెప్రకృతివనాలు, డంపింగ్ యార్డుల పేరుతో పేదలకిచ్చిన అసైన్డ్ భూములను గత ప్రభుత్వం లాక్కున్నదని విమర్శించారు. వాటిని తిరిగి పేదలకు ఇప్పించాలని కోరారు. కాంగ్రెస్ సభ్యులు మురళీనాయక్ మాట్లాడుతూ..గిరిజన రైతులకు కరెంటు సౌకర్యం కూడా ఇవ్వడంలేదని ప్రస్తావించారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ..తన నియోజకవర్గంలో తమిళనాడు, కర్నాటక సరిహద్దుల్లో భూముల విషయంలో నిత్యం గొడవలు జరుగుతున్నాయనీ, సర్వే చేసి ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు.

పద్మమ్మ దశదినకర్మలో తీగల కృష్ణారెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అల్మాస్‌గూడలోని చప్పిడి అడవి రెడ్డి గార్డెన్స్‌లో 24వ డివిజన్ కార్పొరేటర్ ఏనుగు రామిరెడ్డి మాతృమూర్తి ఏనుగు పద్మమ్మ దశదినకర్మ కార్యక్రమానికి మహేశ్వరం నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు తీగల కృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా తీగల ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తర్వాత ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నవీన కళాశాల చైర్మెన్ చప్పిడి సుభాన్ రెడ్డి, చప్పిడి సంతోష్ రెడ్డి, కొంచె నాగేందర్ గౌడ్, సామ ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ వైస్ చైర్మెన్ చిగిరింత నర్సింహ రెడ్డి, కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నేరేడ్‌మెట్‌లోని రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో కమిషనర్ ఆఫ్ పోలీస్ సుధీర్ బాబుని గురువారం మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బడంగ్‌పేట్ కేంద్రంలో ప్రజా అవసరాల దృష్ట్యా నూతన పోలీసు స్టేషను ఏర్పాటు చేయాలని ఇటీవల కౌన్సిల్‌లో తీర్మానం చేసిన లేఖను మేయర్ కమిషనర్‌కు అందజేశారు. ఆమె వెంట కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ- బడంగ్‌పేట్

అభాగ్యులకు అండగా సీఎం సహాయ నిధి

టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస గుప్త

నవతెలంగాణ- నాగోల్

ముఖ్యమంత్రి సహాయ నిధి అభాగ్యులకు అండగా ఉంటుందని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస గుప్త అన్నారు. మేడిపల్లికి చెందిన అనసూయ మహాజన్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి చెక్కు మంజూరైంది. ఈ మేరకు ఆ చెక్కును నాగోలులోని తన క్యాంపు కార్యాలయంలో శ్రీనివాస్ గుప్త



గురువారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ అనారోగ్యాలకు గురై మరియు ప్రమాదాల బారిన పడి మెరుగైన వైద్యం అందుకోలేని నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు.

కుల, మతాలకు అతీతంగా ప్రతి పేదవారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనారోగ్యాలకు గురైన ప్రతి పేదవారు ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకొని, దానిని వినియోగించుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల వారికి అండగా నిలుస్తుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్, చికోటి సంపత్, జిల్లా వంశీ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 14వ అంతర్జాతీయ శిక్షణ

నవతెలంగాణ-నాగోల్

నవంబర్ 27 నుండి మూడు వారాలపాటు నాగోల్ డివిజన్ బండ్లగూడలో ఉన్న జీఎస్ఐ శిక్షణా సంస్థ కార్యాలయంలో భూ విజ్ఞాన శాస్త్రవేత్తల కోసం రిమోట్ సెన్సింగ్ మరియు డిజిటల్ ఇమేజ్ ప్రాసింగ్‌పై నిర్వహించిన 14వ అంతర్జాతీయ శిక్షణా కార్యక్రమం గురువారం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి జీఎస్ఐ శిక్షణ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, హెడ్ డాక్టర్ ఎస్. రవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శిక్షణా కోర్సు సమన్వయకర్త, డైరెక్టరు ఎ.బి. ఎక్కా మాట్లాడుతూ భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖచే స్పాన్సర్ చేయబడిన ఇండియన్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కోఆపరేషన్ కార్యక్రమం క్రింద ఈ శిక్షణా కోర్సు ప్రతి సంవత్సరం నిర్వహించబడుతోందని తెలిపారు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో సామాజిక, ఆర్థిక అభివృద్ధికి తోడ్పడే వృత్తిపరమైన నైపుణ్యాన్ని



సృష్టించడానికి, సాంకేతికతను పంచుకోవడం ప్రోగ్రామ్ యొక్క ముఖ్యమైన లక్ష్యం అని చెప్పారు. అనంతరం డిడిజి డాక్టర్ ఎస్. రవి మాట్లాడుతూ ఇండియన్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కో ఆపరేషన్ కార్యక్రమం భారత ప్రభుత్వ విజన్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆప్టికల్, థర్మల్ మరియు మైక్రోవేవ్ రిమోట్ సెన్సింగ్ యొక్క వివిధ అంశాలలో ఉపన్యాస తరగతులు, ప్రాక్టికల్స్‌తో పాటు హెరిటేజ్ సైట్ టూర్‌లో భాగంగా చార్మినార్, గోల్కొండ కోట, సాలార్‌జంగ్ మ్యూజియం, హుస్సేయన్ సాగర్ లేక్, బుద్ధ విగ్రహాన్ని తదితర వారసత్వ ప్రదేశాలు సందర్శించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో బెలారస్, ఈక్వెడార్, ఇథియోపియా, ఘనా, జోర్డాన్, కెన్యా, లైబీరియా, మడగాస్కర్, మొజాంబిక్, దక్షిణ సూడాన్, శ్రీలంక, టాంజానియా, థాయిలాండ్ మరియు ఉగాండా వంటి 14 అభివృద్ధి చెందుతున్న దేశాలకు చెందిన 22 మంది తదితరులు పాల్గొన్నారు.



పేదింటి అమ్మాయి పెండ్లికి
అండగా ఉప్పల ఫౌండేషన్

టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, ఉప్పల ఫౌండేషన్ చైర్మెన్ శ్రీనివాస్ గుప్త



నవతెలంగాణ- నాగోల్

పేదింటి అమ్మాయి పెండ్లికి ఉప్పల ఫౌండేషన్ అండగా ఉంటుందని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, ఉప్పల ఫౌండేషన్ చైర్మెన్ ఉప్పల శ్రీనివాసగుప్త అన్నారు. హైదరాబాద్‌లోని నాగోల్‌లో ఉప్పల శ్రీనివాస్ గుప్త క్యాంపు కార్యాలయంలో నాగోల్‌కి చెందిన లక్ష్మమ్మ - అంజయ్యల కుమార్తె లక్ష్మీ పావని (అన్నపూర్ణ) వివాహానికి సహాయం చేయాలని కోరుతూ గురువారం శ్రీనివాస గుప్తను కోరారు. స్పందించిన శ్రీనివాస్ గుప్త వెంటనే వారి ఆర్థిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. తర్వాత వారికి మంగళ సూత్రం, మెట్టెలు, చీర, గాజులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ఆడ బిడ్డల వివాహానికి ఉప్పల ఫౌండేషన్ ద్వారా అనేక మందికి చేయూత ఇచ్చిన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, శ్రీధర్, చికోటి సంపత్, జిల్లా వంశీ ఎస్సీ సంఘం నాయకులు శ్రీనివాస్, శంకర్ పాల్గొన్నారు.

మాదన్నపేట్‌లో భారీ అగ్నిప్రమాదం

నవతెలంగాణ - చంపాపేట్

హైదరాబాద్ జిల్లా యాకుత్‌పురా నియోజకవర్గం కుర్మగూడ డివిజన్ మాదన్నపేట్ పరిధిలోని ఓల్డ్ వీధి ఎదురుగా ఉన్న సూపర్ ఫైన్ వెల్డింగ్ షాప్‌లో గురువారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న మలక్‌పేట్ అగ్నిమాపక అధికారులు, సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకొని మంటలను అదుపు చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్టు అగ్నిమాపక సిబ్బంది ప్రాథమికంగా గుర్తించారు. కాగా ఈ ప్రమాదంలో కట్టెలు, స్టీలు స్పాంజి, ఐరన్ చైర్స్ టేబుల్ ఫైల్స్, ఫర్నిచర్, కంప్యూటర్లు అగ్నికి ఆహుతయ్యాయి. సంతోష్‌నగర్ ఏసీపీ మహమ్మద్ గౌస్, ఐఎస్ సదన్ సీఐ నాగరాజు, సంతోష్ నగర్ ట్రాఫిక్ సీఐ నరసింహ నాయక్, ఎస్ఐలు, స్థానిక నాయకులు, కార్పొరేటర్లు తదితరులు ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు.







‘దేశ ప్రజలకు కేంద్ర హెూం మంత్రి క్షమాపణ చెప్పాలి’





నవతెలంగాణ-ఎల్బీనగర్

ఎల్బీనగర్ చౌరస్తాలో (కేవీపీస్) కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఎల్బీనగర్ సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. తర్వాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమాన పరిచిన కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పి.. మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనకు ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి దుర్గారావు అధ్యక్షతన వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేవీపీఎస్ రాష్ట్ర నాయకులు జి. మనోహర్, కేవీపీఎస్ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు ఆలేటి ఎల్లయ్యలు హాజరై మాట్లాడారు. అహంకారపూరితమైన, తిరస్కార స్వరంతో అమిత్ షా భారతదేశ లౌకిక మరియు ప్రగతిశీల రాజ్యాంగ రూపశిల్పి పైన చూపిన అగౌరవాన్ని, అపహాస్యం చేయడానికి ప్రయత్నించారని అన్నారు. దళిత హక్కుల కోసం పనిచేస్తున్న వందలాది సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న దళిత హక్కులు మరియు సామాజిక న్యాయం కోసం పనిచేస్తున్న కోఆర్డినేషన్ కమిటీ ఈ అవమానకరమైన వ్యాఖ్యాలను ఖండించాలని పిలుపునిచ్చారు. హెూం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ వ్యాఖ్యలు కేవలం డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పైన చేసినవి మాత్రమే కాదు సామాజిక న్యాయం కోసం పోరాటాన్ని కొనసాగిస్తున్న లక్షలాది మంది అణగారిన వర్గాలకు జరిగిన అవమానంగా భావించాలని అన్నారు. భారత రాజ్యాంగంపై బీజేపీ చేస్తున్న దాడికి వ్యతిరేకంగా భారత ప్రజల నుంచి పెరుగుతున్న ప్రతిఘటన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బి రామస్వామి, ఎం యాదయ్య, శ్రీనివాసు, వెంకటయ్య, సిహెచ్ మల్లేష్, దుర్గారావు, ఎల్లయ్య, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నాగోల్

పార్లమెంటు సాక్షిగా భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమాన పరుస్తూ ఎగతాళి చేస్తూ కేంద్ర హెూమ్ శాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యాలు బాధాకరమని కుల వివక్షత పోరాట సమితి రాష్ట్ర కమిటీ సభ్యులు గంధం మనోహర్ అన్నారు. దేశ ప్రజలకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ.. సామాజిక సంఘాల నాయకులను కలుపుకొని రంగారెడ్డి జిల్లా సరూర్నగర్ సర్కిల్ ఎన్టీఆర్ నగర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యున్నత హెూదాలో ఉండి లోక్‌సభలో భారత రాజ్యాంగ రచయితను అవమానపరిచి మాట్లాడడం, రాజ్యాంగంపై ప్రమాణం చేసి ఆ విధంగా మాట్లాడడం భారత ప్రజానీకం ఎంతో మనోవేదనకు గురి అయిందని అన్నారు. వారి మాటలను వెనక్కి తీసుకొని భారతదేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు సిహెచ్ వెంకన్న, కట్ట శ్రీనివాస్, సీఐటీయూ నాయకులు మల్లెపాక వీరయ్య, ఆలేటి ఎల్లయ్య, గిరిజన సంఘం ఎం. గోపీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బడంగ్‌పేట్

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ను కించపరుస్తూ నిండు పార్లమెంట్ సభలో కేంద్ర హెూం శాఖ మంత్రి అమీషా మాట్లాడిన మాటలను నిరసిస్తూ బీఎస్పీ మహేశ్వరం అసెంబ్లీ అధ్యక్షులు కేతావత్ బహుగుణ నాయక్ ఆధ్వర్యంలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను కించపరుస్తూ మాట్లాడిన తీరు హేయమైన చర్య అని మండిపడ్డారు. బహుజనులు ఏకమై అమీషాకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ నిరసనలో నాయకులు దిలీప్ నాయక్, అఖిల్ నాయక్, యుగేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.





మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా గురువారం మాలల అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం పిలుపు మేరకు మాలలను ముందస్తు అరెస్టు చేసి బాలాపూర్ పీఎస్‌కు తరలించడం జరిగిందని బాలాపూర్ గ్రామానికి చెందిన మాలల సంక్షేమ సంఘం సీనియర్ నాయకులు, ఎస్సిఆర్‌పిఎస్ అధ్యక్షులు గుండె నాగార్జున తెలిపారు.

నవతెలంగాణ- బడంగ్‌పేట్

‘లార్డ్స్’ స్కూల్‌లో
జాతీయ గణిత దినోత్సవం



చైర్మెన్ సిద్దాల బీరప్ప

నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్‌లోని లార్డ్స్ ఒలింపియాడ్ స్కూల్‌లో జాతీయ గణిత దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించినట్టు లార్డ్స్ విద్యా సంస్థల చైర్మెన్ సిద్దాల బీరప్ప తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గణిత ప్రదర్శన శాలను చైర్మెన్ సిద్దాల బీరప్ప ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీ ప్రపంచంలో ప్రపంచాన్నే శాసిస్తున్న గణిత శాస్త్ర ఆవశ్యకత గురించి విద్యార్థుందరికీ చక్కగా వివరించినట్టు తెలిపారు. లార్డ్స్ వైస్ చైర్మెన్ బెర్ల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ‘అతి చిన్న వయసులోనే అపారమైన మేధస్సుతో భారత దేశపు కీర్తిని ప్రపంచ గణిత శిఖరాలపై ఎగురవేసిన ప్రసిద్ధ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా గణిత గురువులందరికీ, విద్యార్థులకు జాతీయ గణిత దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం విద్యార్థినులు వివిధ గణిత నమూనాలను రంగోలి రూపంలో ప్రదర్శించడం చూపరులను విశేషంగా ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో లార్డ్స్ డైరెక్టర్ సిద్దాల శ్రీలత, డీన్ సతీష్, ఒలింపియాడ్ ప్రిన్సిపాల్ బానూరు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

పేద ప్రజల సంక్షేమానికి సీఎం రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని మేయర్ పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 19వ డివిజన్‌లోని అమిత శ్రీశైలం చారితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వల్లపు సుభాన్ యాదవ్, బాలాపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు



సాయి నగర్ కాలనీ ఫేస్-2లో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి గురువారం కార్పొరేటర్ రామోజీ రవికాంత్ రెడ్డి, నాయకులు గిరి ముదిరాజ్, పురుషోత్తం గౌడ్, భాను, ఇక్కే శ్రీనివాస్, సత్యనారాయణ, కాలనీవాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

పెద్ద అంబర్‌పేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని తట్టి అన్నారం వార్డు కార్యాలయంలో చైర్‌పర్సన్ పండుగుల జయశ్రీ రాజు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో 25 ఎజెండా అంశాలపై చర్చించి ఆమోదించారు. అలాగే విజయవాడ జాతీయ రహదారి-65 పై పసుమాముల వెళ్లే రోడ్డు క్రాసింగ్ వద్ద, లక్ష్మారెడ్డి పాలెం హనుమాన్ గుడి వద్ద లిఫ్టుతో కూడిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించడానికి ఎన్‌హెచ్ఏఐ అధికారులకు ప్రతిపాదనలు పంపించడానికి కౌన్సిల్‌లో ఏకగ్రీవముగా తీర్మానం చేసి ఆమోదించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ చామ సంపూర్ణ, కౌన్సిలర్లు వడ్డేపల్లి విద్యావతి, మల్‌రెడ్డి దీపిక, ఓరుగంటి సుజాత, సామ అనూష, తొండపు రోహిణి, పాశం అర్చన, దేవిడి గీత, అనురాధ, మనెమ్మ, పబ్బతి లక్ష్మణ్, మద్ది నరేందర్ రెడ్డి, మండల కోటేశ్వరరావు, పసుల రాజేందర్, దండెము కృష్ణా రెడ్డి, చల్లూరి మురళీధర్ రెడ్డి, రమావత్ పరశు రామ్, కో-ఆప్షన్ సభ్యులు మహ్మద్ ఖలీమ్, శంకరయ్య గౌడ్ కమిషనర్ రవీందర్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించిన అదనపు కలెక్టర్ రాధిక గుప్తా



నవ తెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మున్సిపాలిటీలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను గురువారం అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి దీపిక నర్సింహా రెడ్డితో కలిసి 7, 8వార్డులలో పర్యటించి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. దరఖాస్తుదారులు ఖచ్చితమైన వివరాలు సర్వేయర్లకు ఇవ్వాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వేను డిసెంబర్ 31వరకు పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి. నాగిరెడ్డి, కౌన్సిలర్ నడికొప్పు నాగరాజు, మున్సిపల్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

ప్రజల కోసమే అభివృద్ధి పనులు చేపడుతున్నాం

నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి



నవతెలంగాణ-కీసర

ప్రజల కోసమే అభివృద్ధి పనులు చేపడుతున్నామని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. గురువారం నాగారం మున్సిపాలిటీ 5వ వార్డులో రూ.15 లక్షలతో అన్నపూర్ణ ఎన్‌క్లేవ్‌లో అండర్ గ్రౌండ్ డ్రయినేజీ, సీసీ రోడ్డు నిర్మాణం, శివసాయి ఎన్‌క్లేవ్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు చైర్మెన్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలోవైస్ చైర్మెన్ మల్లేష్ యాదవ్ , కౌన్సిలర్ అన్నంరాజు లావణ్య శ్రీనివాస్ , అనపూర్ణ కాలనీ ప్రెసిడెంట్ సత్తయ్య, నాగార్జున, వేణుగోపాల్, శివసాయి ఎన్‌క్లేవ్‌లో జంగారెడ్డి, రవీంద్రబాబు, వీరన్న కాలనీ వాసులు తదితరులున్నారు.

పిల్లలకు నాణ్యమైన భోజనం అందించండి

- మేయర్ శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్
- విద్యార్థులకు ప్లేట్లు అందజేత



నవతెలంగాణ - జవహర్ నగర్

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, నాణ్యత విషయంలో రాజీ పడకూడదని జవహర్ నగర్ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని బాలాజీ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిల్లలకు అందిస్తున్న మధ్యాహ్న భోజన ఏర్పాట్లు పర్యవేక్షించారు. వంటలు ఎలా ఉన్నాయని విద్యార్థులను అడిగి తెలుసుకొని, శ్రద్ధతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. వంటశాల శుభ్రంగా ఉంచుకోవాలని, నాణ్యమైన ఆహారాన్ని పిల్లలకు అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి, ఉచితంగా ప్లేట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అజా మొయినుద్దీన్, నాయకులు కోటేష్ గౌడ్, మంద ఆనంద్, టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు పెద్ద పీట వేస్తాం



- కౌన్సిలర్ అనిత సుధాకర్ రెడ్డి

నవతెలంగాణ-కీసర

ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అభివృద్ధి పనులకు పెద్ద పీట వేస్తున్నామని 9వ వార్డు కౌన్సిలర్ కొమురెల్లి అనిత సుధాకర్ రెడ్డి అన్నారు. గురువారం నాగారం మున్సిపాలిటీ 9వ వార్డు విష్ణుపురి కాలనీలో రూ.6.50 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రయినేజీని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 9వ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీవాసులు పైళ్ల మల్లారెడ్డి, యాకయ్య, వెంకటాచారి తదితరులున్నారు.

జర్నలిస్టు రమేష్‌ను పరామర్శించిన కార్పొరేటర్ శ్రీదేవి



నవతెలంగాణ-కాప్రా

ఇటీవల ప్రమాదానికి గురై తలకు గాయం కావడంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నమస్తే తెలంగాణ జర్నలిస్టు కడియాల రమేష్‌ను చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలని న్యూరాలజీ డాక్టర్ వంశీకృష్ణకు, నిమ్స్ డైరెక్టర్ బీరప్పను కోరారు.

సీఎం కప్ పోటీలలో సెరినిటీ విద్యార్థుల ప్రతిభ



- గోల్డ్ మెడల్ కైవసం
- క్రీడాకారిణిని కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి అభినందన

నవతెలంగాణ-కీసర

ఈ నెల 17, 18 తేదీలలో హకీంపేటలోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగిన 400 మీటర్ల రన్నింగ్ పోటీల్లో మేడ్చల్ జిల్లా స్థాయిలో నాగారం సెరినిటీ పాఠశాల క్రీడాకారిణి గగన్ ప్రియ (9 వ తరగతి) విద్యార్థి ప్రథమంగా నిలిచి గోల్డ్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా గగన్‌ప్రియను సెరినిటి పాఠశాల కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీలలో కూడా అత్యున్నత ప్రతిభను కనపర్చాలని సూచించారు. ఈ అభినందన కార్యక్రమంలో పాఠశాల ప్రధాన కార్యదర్శి నోముల వసంత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆన్‌లైన్ సేవలలో అంతరాయం




నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని ఎల్లంపేట గ్రామంలో ఉన్న తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆన్‌లైన్ సేవలలో ఈనెల 28వ తేదీ నుండి 31వరకు అంతరాయం ఏర్పడుతుందని బ్రాంచ్ మేనేజర్ అయిండ్ల సాయికుమార్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వ ఆర్థిక సేవల విభాగం వారి ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ వచ్చే సంవత్సరం జనవరి 1తేదీ నుండి తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విలీనం కానున్నట్లు తెలిపారు. ఈ కార్యాచరణ కారణంగా బ్రాంచ్ బ్యాంకింగ్ సేవలు, ఏటీఎం, యుపీఐ, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఎఈపీఎస్, సీఎస్పీ తదితర బ్యాంకింగ్ సేవలు ఈ నెల డిసెంబర్ 28 నుండి 31వరకు తెలంగాణ గ్రామీణ బ్యాంకు (టిజిబి)లో అందుబాటులో ఉండబోవని పేర్కొన్నారు. తిరిగి వచ్చే ఏడాది జనవరి 1నుండి రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఖాతాదారులు సహకరించి తమ లావాదేవీలను తదనుగుణంగా ముందుగా పూర్తి చేసుకోవాలని సూచించారు.

తెలంగాణలో తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యం





- తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు పొగాకు జయరాం చందర్
- సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

రానున్న కాలంలో తెలంగాణలో టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ నాయకులకు తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు పొగాకు జయరాం చందర్ పిలుపునిచ్చారు. మల్కాజిగిరి సర్కిల్ మిర్జాలగూడలోని ఎస్ఎస్ఏ ఫంక్షన్ హాల్‌లో గురువారం టీడీపీ తెలుగు యువత రాష్ట్ర నాయకులు చింతల నరేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పొగాకు జయరాం చందర్, మల్కాజిగిరి పార్లమెంటరీ నాయకులు అశోక్ గౌడ్‌లు ప్రారంభించారు. అనంతరం జయరాం చందర్ మాట్లాడుతూ.. ఏ పార్టీకైనా కార్యకర్తలే ప్రాణమని, వారు లేకపోతే పార్టీల మనుగడ కష్టమన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పార్లమెంట్ నియోజకవర్గాల్లో పార్టీలోకి యువతను స్వాగతించడమే లక్ష్యమన్నారు. తెలంగాణలో టీడీపీ జెండాను ఎగరడానికి కార్యకర్తలు, నాయకులు సిద్ధం కావాలన్నారు. ఎన్టీఆర్ తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసమే పార్టీని స్థాపించారని గుర్తు చేశారు. ఎన్టీఆర్ ఆశయసాధనకు యువత పాటుపడాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణను ముఖ్యంగా హైదరాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందన్నారు. ఐటీ అభివృద్ధికి చంద్రబాబు ఎంతో కృషి చేశారన్నారు. చంద్రబాబు కృషి ఫలితంగానే యువత నేడు విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారని చెప్పారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో, ఏడాది కాంగ్రెస్ పాలనతో తెలంగాణలో అభివృద్ధి ఏమీ జరగలేదని విమర్శించారు. మల్కాజిగిరి ఎంపీలుగా మల్లారెడ్డి, రేవంత్ రెడ్డి, ఈటల రాజేందర్‌లు గెలువడానికి టీడీపీ మద్దతు ఉందనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటూ పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాని తెలిపారు.

చింతల నరేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు

తెలుగు యువత రాష్ట్ర నాయకులు చింతల నరేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో తెలుగుదేశం రాష్ట్ర నాయకుల సమక్షంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో యువత భారీగా పాల్గొన్నారు. అనంతరం నరేష్ ముదిరాజ్ మాట్లాడుతూ.. యువత పెద్ద సంఖ్యలో సభ్యత్వం తీసుకొవడం చాలా సంతోషంగా ఉన్నదని, తెలుగు దేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు సాయ శక్తుల కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు సత్యనారాయణ పితాని, లలిత చౌదరి, విజయనేత, మురళీధర్ రెడ్డి, సుధకర్ రెడ్డి, పాలకళ శ్రీనివాస్, శ్రీధర్, అలీ, గోపి, రోహిత్, సాయి కిరణ్, భాను, రియాజ్, అనూష, కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

జలమండలి కార్మికులకు న్యాయం చేయాలి

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి సివరేజ్ జలమండలి ఔట్ సోర్సింగ్ కార్మికుల వినతి



నవతెలంగాణ-కాప్రా

జలమండలిలో పని చేసే ఔట్ సోర్సింగ్ సివరేజ్ కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి జలమండలి ఔట్ సోర్సింగ్ యూనియన్ అధ్యక్షుడు నారాయణ ఆదేశాల మేరకు 13,14 డివిజన్ కార్మికులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండలి అధికారుల తప్పిదంతో కార్మికులకు పెరిగిన వేతనాలు చేతికి రావడం లేదని తెలిపారు. ప్రభుత్వం రూ.19500 వేతనం ప్రకటించినప్పటికీ రూ.13500 మాత్రమే ఇస్తున్నారని ఎమ్మెల్యేకు చెప్పారు. సివరేజ్ కార్మికులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.1000 కూడా ఇవ్వడం లేదని, సేఫ్టీ కిట్లు ఇవ్వడం లేదని తెలిపారు. బిల్ కలెక్టర్స్‌కు సకాలంలో వేతనాలు లేదని తమ బాధను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. క్యాటగిరి విషయంలో అధికారుల తప్పులు, నిర్లక్ష్యం కారణంగా జీతాలు సరిపోక హరిగోస పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ అధైర్యపడకుండా ఉండాలని సూచించారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. జలమండలి ఎండీతో మాట్లాడి సమస్యను తెలుసుకుని పరిష్కరిస్తానని భరోసానిచ్చారు.

ప్రభుత్వం పెంచిన వేతనాలు చేతికి అందకపోవడం దారుణమన్నారు. కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని G4S నాయకులు మారుతి ప్రసాద్ ఎమ్మెల్యేకు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ డివిజన్ నాయకులు కిరణ్, బాబు, కుమార్,అశోక్,శ్రీనివాసరెడ్డి, ప్రదీప్, శ్యామ్, అనిల్, నరేష్, శ్రీకాంత్, ప్రసాద్, వెంకటేష్, కిరణ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

అడిషనల్ డీసీపీ రాందాస్ తేజవత్‌ను కలిసిన హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా ప్రతినిధుల ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ సిటీ అడిషనల్ డీసీపీ రాందాస్ తేజవత్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాటట్లా డుతూ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ బలోపేతానికి సహకరించాలని, ఆర్గనైజేషన్ ద్వారా తీసుకొచ్చే లీగల్ సెల్ ద్వారా వచ్చే సమస్యలను త్వరగా పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని కోరినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా ఫౌండర్, డైరెక్టర్, నేషనల్ ప్రెసిడెంట్ అయ్యప్ప అరుణాచల అడ్వకేట్, నేషనల్ చైర్మెన్ రాజా చిరంజీవి, అడ్వకేట్ సౌత్ ఇండియా చైర్మెన్ పి.ధనలక్ష్మి జాతీయ వైస్ ప్రెసిడెంట్, రాష్ట్ర ప్రెసిడెంట్ మోమిన్ భాష, రాష్ట్ర చైర్మెన్ కేవీఎల్ నారాయణరెడ్డి, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ సునీల్ చంద్ర, రంగారెడ్డి జిల్లా వైస్ ప్రెసిడెంట్ వెంకట్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా ఉమెన్ వింగ్ జాయింట్ సెక్రెటరీ కరుణ శ్రీ, రంగారెడ్డి జిల్లా జాయింట్ సెక్రెటరీ లక్ష్మీ, పాల్గొన్నారు.

పోచారం మున్సిపాలిటీకి చేంజ్ మేకర్స్ అవార్డు



నవతెలంగాణ - పోచారం

Cse (centre 0f science& environment వారు కండక్ట్ చేసినchange makers event నందు Delhiలో జరిగిన చేంజ్ మేకర్స్ conclave programకుగానూ పోచారం మున్సిపాలిటీ నుంచి తెలంగాణ నుండి శానిటరీ ఇన్‌స్పెక్టర్ వాణి కుమారి changemakerగా తెలంగాణ స్టేట్ నుంచి ఎంపిక చేశారు. మొత్తం తెలంగాణ స్టేట్ నుంచి 20 మున్సిపాలిటీలను సెలెక్ట్ చేసి వారికి delhiలో గల సిల్వర్ ఓక్ హాల్ ఇండియన్ habitat centreలో cse directoral journal Sunitha చేతులమీదుగా బహుమతి తీసుకున్నారు. ఈ కార్యక్రమం రూపమిశ్ర ఐఏఎస్ (మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ ఎఫైర్) (mouha) ఛీఫ్ గెస్టుగా హాజరయ్యారు.

రాజబొల్లారం తండాలో పశు వైద్య శిబిరం



నవతెలంగాణ-మేడ్చల్

మండల పరిధిలోని రాజబొల్లారం తండా గ్రామంలో గురువారం టీజీఎల్ డీఏ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు చూడి పరీక్షలు, గర్భకోశ వ్యాధి చికిత్స, ఆర్టిఫిషియల్ ఇన్సెమినేషన్ చేయడం, దూడలకు నట్టల నివారణ మందులు ఇతర సాధారణ చికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాంగ్య నాయక్, పశు వైద్యులు డాక్టర్ కూరుమూర్తి, గోపాలమిత్ర రహమతుల్లా రామకృష్ణ, అసిస్టెంట్‌లు బి.గణేష్, బి.శ్రీను, డి.తిరుపతి, రైతులు గోపాల్,ఎం ప్రకాష్, ఏమ్.రమేష్, ఎం. రాజు లక్ష్మణ్, తిరుపతి, ఏమ్ గోపాల్, శ్యామల పాల్గొన్నారు.

నాగారం మున్సిపాలిటీకి చేంజ్ మేకర్స్ అవార్డు



నవతెలంగాణ-కీసర

2021 నుంచి 2024 వరకు స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా స్వచ్ఛత కార్యక్రమాలు, స్వచ్ఛ సర్వేక్షన్‌లో మెరుగైన ప్రదర్శనలో భాగంగా చేంజ్ మేకర్స్ కన్‌క్లేవ్ కార్యక్రమంలో చేంజ్ మేకర్స్ అవార్డు నాగారం మున్సిపాలిటీకి వరించింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా స్వచ్ఛ్ కార్యక్రమాలు సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్‌లో ఉత్తమ ప్రతిభను కనబరిచిన మున్సిపాలిటీలకు ఢిల్లీలో డిసెంబర్ 19న సిల్వర్ హెూక్ హాల్‌లో ఏర్పాటు చేసిన చేంజ్ మేకర్స్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా డా. సునీత నరైన్(సి ఎస్ ఈ డైరెక్టర్) చేతుల మీదుగా చేంజ్ మేకర్ అవార్డును పర్యావరణ ఇంజనీర్ కే.ప్రశాంత్ అందుకున్నారు.

ఘనంగా బద్దం రామకృష్ణారెడ్డి నాలుగో వర్ధంతి



- విద్యార్థులకు షూస్ పంపిణీ చేసిన కుటుంబ సభ్యులు

నవతెలంగాణ - పోచారం

పోచారం మున్సిపాలిటీ పరిధి పోచారం గ్రామంలో గురువారం బద్దం రామకృష్ణారెడ్డి నాలుగోవ వర్ధంతిని ఆయన కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఆయన జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు పోచారం మున్సిపాలిటీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు షూస్ పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులందరికీ భోజనం ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు అతడి కుమారులు ఆయనను స్మరించుకుంటూ మంచికి మారుపేరుగా నిలిచి, కుటుంబ ఉన్నతికి, ప్రజాసేవ కోసం అహర్నిశలు శ్రమించారని గుర్తు చేశారు. ఆయన హుందాతనం, గంభీరత్వం, మధురస్మృతులు, ఎల్లప్పుడూ తమ గుండెల్లో పదిలంగా ఉంటాయని, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ యన కుటుంబ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు బద్దం లక్ష్మమ్మ మంగారెడ్డి, భార్య బద్దం విజయలక్ష్మి, కొడుకులు, కోడళ్ళు శ్రీకాంత్ రెడ్డి, మంజుల, రజినీకాంత్ రెడ్డి, మమత, శశికాత్ రెడ్డి, ఆశ, మల్లిఖార్జున్ రెడ్డి, లహరి, మనుమలు రిత్విక్ రెడ్డి, దుపీక్ రెడ్డి, రిషీకేశ్ రెడ్డి, రుషంక్ రెడ్డి, దైవాల్ష్ రెడ్డి, మనుమరాళ్ళు సోనాలి రెడ్డి,మానస రెడ్డి, తన్వీరెడ్డిలు పాల్గొన్నారు.

కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం



నవతెలంగాణ - పోచారం

పోచారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మెన్ బోయపల్లి కొండల్ రెడ్డి అధ్యక్షతన గురువారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముందుగా 8వ వర్డు కౌన్సిలర్ బైరా హిమాకుపూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం మరమ్మతులు, పారిశుధ్యసిబ్బంది పని ముట్లు, సామాగ్రి కొనుగోలు, స్వచ్ఛ సర్వేక్షన్, ఎనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రానికి మెయింటెనెన్స్, స్టేషనరీ కొనుగోలు, విలీన గ్రామాల సిబ్బందికి, సిబ్బంది వేతనాలకు మొత్తం రూ. 5కోట్ల 45లక్షల పనులకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. అన్ని వార్డులల్లోని సమస్యలపై చర్చించారు. యంనంపేటలోని శ్రీనిధి కాలేజ్, రాక్‌ఉడ్ పాఠశాలల ట్యాక్స్ రీ అసెస్మెంట్ చేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ రెడ్యా నాయక్, కమిషనర్ వీరారెడ్డి, కౌన్సిలర్స్ గోంగళ్ల మహేష్, ధనలక్ష్మీ రాజశేఖర్, సింగిరెడ్డి సాయి రెడ్డి, అఖిటీ శైలజ, మెట్టు బాల్ రెడ్డి, బలగొని వెంకటేష్ గౌడ్, బెజ్జంకీ హరిప్రసాద్ రావు, నల్ల వెల్లి లక్ష్మిసామల శ్రీలత, సుర్వి రవీందర్ గౌడ్, అబ్బవతి సరితా, మోటుపల్లి పోచమ్మ సుర్వి సుదలక్ష్మి, బద్దం మమత, కో ఆప్షన్ సభ్యులు అక్రమ్ అలీ, దాసరి శంకర్, మేనేజర్ అంజన్ రెడ్డి, ఏఈ మహిపాల్, మున్సిపల్ సిబ్బంది, నాయకులు కశయ్య,సామల బుచ్చిరెడ్డి, బాల్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

మాల మహానాడు నాయకుల ముందస్తు అరెస్ట్



నవతెలంగాణ-శామిర్‌పేట

మాల మహానాడు ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడికి కార్యక్రమంలో భాగంగా శామీర్‌పేట పోలీసులు మాల మహానాడు నాయకులను గురవారం ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా శామిర్‌పేట మండల మాల మహానాడు అధ్యక్షుడు బొమ్మెర్ల నాగరాజు మాట్లాడుతూ.. అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో భాగంగా మాల నాయకులు మందస్తు అరెస్టు చేయడం దారుణమని అన్నారు. అరెస్టు అయిన వారిలో శామిర్ పేట మండల మాల మహానాడు అధ్యక్షులు బొమ్మెర్ల నాగరాజు, జిల్లా అధ్యక్షుడు కందుల శ్రీనివాస్, నీరుడు బాలేష్ మండల జనరల్ సెక్రటరీ బందెల నరేష్, మండల నాయకులు కనకల సుధాకర్, కనుక కాళిదాస్, నీరుడి భరత్, మేడిపల్లి ప్రకాష్, కూర నరేష్, కనుకల రాజశేఖర్, బుర్కా వెంకటేష్ ఉన్నారు.

యువత గంజాయి, డ్రగ్స్ మత్తు పదార్థాలను వీడాలి



- క్రాంతి కళా బృందం నాయకులు వెంకటాచారి

నవతెలంగాణ - జవహర్ నగర్

సమాజాన్ని పట్టి పీడిస్తున్న డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలను వీడాలని, కష్టమైనా ఇష్టపడి కొనసాగించే బరువు, బాధ్యతలతో కూడిన జీవితంలోనే నిజమైన ఎంజాయ్‌మెంట్ ఉంటుందని క్రాంతి కళా బృందం వ్యవస్థాపకులు వెంకటాచారి అన్నారు. బుధవారం రాత్రి బాలాజీనగర్ చౌరస్తాలో క్రాంతి కళా బృందం ఆధ్వర్యంలో ఎంజాయ్ చేద్దాం రండి అనే ప్రోగ్రాం నిర్వహించారు. డిసెంబర్-31 పేరుతో కొంతమంది విద్యార్థి, యువత డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలను సేవిస్తే ఎంజాయ్‌మెంట్ ఉండదని, జీవితం అనే ప్రయాణంలో మంచి, చెడులు ఉంటాయని, వాటిలో చెడు అనే వ్యసనాలను వదులుకొని, మంచి అలవర్చుకున్నప్పుడే ఎంజాయ్‌మెంట్ ఉంటుందనే విషయాన్ని చాటి చెప్పడానికి 'ఎంజాయ్ చేద్దాం' అనే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన మాట, ఆటా, పాట, లాంటి కళారూపాలు సభికులను అలరించాయి. క్రాంతి కళా బృందం సాహసోపేతంగా గంజాయి పై చేపట్టిన చైతన్య వంతమైన కార్యమాన్ని పలు ప్రజా సంఘాల నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, బీజేపీ రంగుల శంకర్, కార్పొరేటర్లు కారింగుల నిహారిక గౌడ్, గొడుగు వేణు, కార్య నిర్వాహకులు జంగిడి శ్రీనివాస్, మంగళంపల్లి తిరుపతి, ఆకవరం బాలు, రుద్రవెల్లి బబ్లు, కోడూరి శ్రావణ్ ఎస్.కె.మీరా, శివబాబు, షేక్ షావలి తదితరులు పాల్గొన్నారు.

ఫిల్మ్ అండ్ ఎంటర్ టైన్‌మెంట్ పరిశ్రమలో విజయ సాధనకు నైపుణ్యాలు ముఖ్యం

- టీ-హబ్ సీఈఓ సుజిత్ జాగిర్దార్



నవతెలంగాన-సీటీబ్యూరో

ఫిల్మ్ ఎడ్యుకేషన్‌లో అగ్రగామి సంస్థ అయిన మీ స్కూల్, తన ప్రాముఖ్యమైన సినీప్రెన్యూర్ ప్రోగ్రామ్ యొక్క కోహర్ట్-5 ప్రారంభాన్ని ప్రకటించింది. గురువారం టీ హబ్‌లో జరిగిన కార్యక్రమంలో టీ-హబ్ సీఈఓ సుజిత్ జాగిర్దార్ విద్యార్థులకు ఉత్తీర్ణత పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మీ స్కూల్ ఫౌండర్ ప్రతిభ పులిజాల మాట్లాడుతూ "సినీప్రెన్యూర్ కోహర్ట్-5ను ప్రారంభించడం మాకు చాలా సంతోషంగా ఉంది. క్రియాశీల ప్రతిభను పెంపొందించడంలో, ఆశాజనకమైన చిత్రనిర్మాతలు, సృజనాత్మక వ్యాపారవేత్తలు వారి కలలను ప్రభావవంతమైన వాస్తవాలుగా మార్చడంలో మేము ముందుకు సాగుతున్నాము. మా విద్యార్థుల విజయాలు, విజన్, ప్యాషన్, పట్టుదల శక్తికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. "డీఓపీ డైరీస్" అనే పాడ్‌కాస్ట్ సిరీస్‌ను ప్రవేశపెట్టడం మాకు గర్వంగా ఉంది. ఈ వేదిక సినిమాటోగ్రాఫర్ల కళాత్మకతను, సవాళ్లను, కథలను వెల్లడిస్తుంది. ఈ కొత్త కార్యక్రమంతో మేము సరికొత్త కథా వ్యాసకర్తల తరం కోసం ప్రేరణనూ, విద్యని అందించాలని ఆశిస్తున్నాం" అని తెలిపారు. టీ-హబ్ సీఈఓ సుజిత్ జాగిర్దార్ మాట్లాడుతూ.. "మీ స్కూల్ సృజనాత్మకతను పెంపొందించడంలో ముందంజలో ఉంది. సినీప్రెన్యూర్ ప్రోగ్రామ్, వారి అంకితభావానికి నిదర్శనం. 'డీఓపీ డైరీస్' ఫిల్మ్ మేకింగ్ కళకు కొత్త కోణాలను అందిస్తూ, పరిశ్రమలో విలువైన అవగాహనను పంచుతుంది. ఈ సృజనాత్మక ఎకోసిస్టమ్ అభివృద్ధికి ఈ ప్రయత్నాలు కీలకంగా ఉన్నాయి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో మీ స్కూల్ ఫౌండర్ ప్రతిభ పులిజాల, టీ-హబ్ ఉపాధ్యక్షులు శ్రీనివాస తాలూక, మాజీ నిర్మాత పర్శురామ్, ప్రతిభావంతమైన సినిమాటోగ్రాఫర్లు పి.జి.విందా, విజయ్ శ్రీ పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్లు నిర్మించాలని వినతి పత్రం అందజేత..



నవతెలంగాణ-కూకట్‌పల్లి/కేపీహెచ్‌బీ

కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఫ్లై ఓవర్‌లను నిర్మించాలని.. తద్వారా ట్రాఫిక్ సమస్యతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మూసాపేట లోని ఆంజనేయ నగర్ సర్కిల్ వద్ద ఒకటి, వసంతనగర్ గోకుల్ చౌరస్తా నుంచి వసంత విహార్ వరకు మరో ఫ్లై ఓవర్‌లను నిర్మించాలన్నారు. అలాగే క్రీడాకారులకు అనువుగా ఉండేందుకు, స్టేడియం నిర్మాణం కోసం హుడా ట్రక్ పార్క్ స్థలాన్ని కేటాయించి తెలిపారు. క్రికెట్‌తో పాటు ఇతర క్రీడలకు అనువైన వసతులు కల్పించాలని కోరారు. అందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తూ.. తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



క్రిస్మస్ పండుగ సందర్భంగా ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, డివిజన్ పరిధిలో ఉన్న పాస్టర్లందరికి నూతన వస్త్రాలను అందించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ లోక రక్షకుడు, కరుణామయుడు, ఏసుక్రీస్తు పుట్టిన పవిత్రమైన రోజున జరుపుకునే క్రిస్మస్ పండుగను, అందరూ ఆనందంగా జరుపుకోవాలని అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ లోని ప్రజలందరూ, కుల మతాలకు అతీతంగా అన్ని పండుగలు కలిసిమెలిసి చేసుకోవడం ఆనందించదగ్గ విషయం అని అన్నారు,డివిజన్ లో ఉన్న క్రైస్తవ సోదర సోదరీమణులు అందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, పోశెట్టిగౌడ్, గుడ్ల శ్రీనివాస్, మోజెస్, పాస్టర్స్ ఇస్రాయిల్, ఎం.రాజు తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ- కూకట్‌పల్లి

టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ యూకేజీ 'ఫ్యూచర్ ఐకాన్స్ ఫెస్ట్' స్పోర్ట్స్ అండ్ లిటరరీ ప్రోగ్రామ్స్..



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ టి.వంశీ కృష్ణ రెడ్డి ఆధ్వ ర్యంలో.. గురువారం టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ యూకేజీ "ఫ్యూచర్ ఐకాన్స్ ఫెస్ట్" స్పోర్ట్స్ అండ్ లిటరరీ ప్రోగ్రామ్స్ ప్రారంభోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కుత్బుల్లాపూర్ మండల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శ్రీమతి జెమినీ ఎస్ఎస్ కుమారి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మెన్ టి.కోటి రెడ్డి ఆదేశాల మేరకు.. టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ బచ్పన్ చింతల్, బచ్పన్ సూరారం, బచ్పన్ ఆర్ఆర్ నగర్, టీవీఆర్ అపురూప కాలనీ, టీవీఆర్ చింతల్, సత్య వాణి విద్యా నికేతన్ స్కూల్స్ నుంచి యూకేజీ చిన్నారుల "ఫ్యూచర్ ఐకాన్స్ ఫెస్ట్-2024" అతను అవుతున్న విద్యావిధానానికి నూతన వరవడికి శ్రీకారం చుట్టడానికి రాబోయేతరం చిన్నారులన్నారు. చిన్నారులకు విద్యాబోధనతో పాటు సాంస్కృతిక సాంప్రదాయ విలువలను నృత్యాల ద్వారా, ఆటల పాటల ద్వారా అభివృద్ధి చెందుతాయని భావించి, గొప్ప కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమాలు తిలకించిన తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ యాజమాన్యాన్ని కొనియాడారు. యూకేజీ చిన్నారుల చేత చక్కటి నృత్య ప్రదర్శనలు ఆటోలలో మెలకువలు తెలియజేసి చిన్నారులకు బోధించే అధ్యాపక బృందాన్ని పాఠశాల యాజమాన్యం అభినందించింది. ఈ కార్యక్రమంలో మండల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సీనియర్ అసిస్టెంట్ రమేష్, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థిని విద్యార్థులు వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి

- 27-28 టోకెన్ సమ్మెను జయప్రదం చేస్తాం
- జీఓ 51ని సవరించాలి.
- మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలి.
- కేటగిరీల వారీగా వేతనాలను పెంచాలి.
- బకాయి వేతనాల చెల్లించాలి, సమస్యలను పరిష్కరించాలి
- తెలంగాణ రాష్ట్ర గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్





నవతెలంగాన-సిటీబ్యూరో

ఈ నెల 27-28 తేదీల్లో నిర్వహించనున్న టోకెన్ సమ్మెను జయప్రదం చేయాలి అని తెలంగాణ రాష్ట్ర గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి అని కోరుతూ మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా పంచాయతీ ఆఫీసర్ వెంకయ్యకు మెమొరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్. శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మిక, ఉద్యోగ సంఘాల జెఏసితో చర్చలు జరపాలని ఈ నెల 6న ప్రభుత్వనికి విన్నవించినప్పటికి ఏమాత్రం సమస్యలపైన దృష్టి పెట్టనందున సమస్యల పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన- పోరాటాలతో పాటు 27-28 తేదిలలో రెండు రోజుల పాటు టోకెన్ సమ్మెకు వెళ్ళుతున్నామని తెలిపారు. అయినప్పటికి ప్రభుత్వం స్పందించకుంటే జనవరి 4 తరువాత ఏరోజునుండైన నిరవధిక సమ్మెకు సిద్ధమౌతామని హెచ్చరించారు. జిల్లాలో ఉన్న గ్రామాలలో పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, వీధి లైట్లు, డంపింగ్ యార్డ్స్, హరితహారం, పల్లె పకృతి వనాలు, వైకుంఠధామాలు, డ్రైవర్లు, ఆఫీసు నిర్వహణ తదితర పనుల్లో వివిధ కేటగిరీల వారీగా పనులు చేస్తున్నామని, గ్రామీణ ప్రాంతాలలో ఎలాంటి అంటు వ్యాధులు, అనారోగ్యాలు రాకుండా ప్రజలకు సేవలందిస్తున్నారని తెలిపారు. 2018లో గత రాష్ట్ర ప్రభుత్వం జీఓ 51ని విడుదల చేసి సిబ్బంది వేతనాలను రూ.8,500 లకు పెంచిందని, వేతనాలు పెంచుతూనే పంచాయతీ కార్మికుల మెడకు ఉరితాళ్ళను బిగిస్తూ మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. మల్టీపర్పస్ వర్కర్లుగా మార్చిన తరువాత ఎవరైనా ఏపనినైనా చేయాలనే నిబంధన పెట్టి కార్మికులపై ఒత్తిడి పెంచి బలవంతంగా పనులు చేయించడంతో ఇతర పనులపై వారికి నైపుణ్యం లేక మండలలో ప్రమాదాలు జరిగి కార్మికులు మరణిస్తున్నారని తెలిపారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించడం లేదని, దీంతో ఆ కార్మికుల కుటుంబాలను ఆదుకోనే దిక్కులేక రోడ్డున పడ్డాయన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ప్రతి 500 మంది జనాభాకు ఒక కార్మికుడు చొప్పున 36,500 మందిని ఖరారు చేసి ఆన్లైన్లో పేర్లను పొందుపర్చారని, గడిచిన 15 సంవత్సరాల కాలంలో గ్రామ పంచాయతీల విస్తీర్ణంతో పాటు గ్రామలలో పారిశుద్ధ్య అవసరాలు పెరగడంతో సుమారుగా 13,500 మందిని అదనంగా నియమించారని, అధనంగా నియమించిన కార్మికుల పేర్లను ఆన్లైన్లో నమోదు చేయకపోవడంతో వేతనాలు నిర్ణయించిన దాని కంటే తక్కువ చెల్లిస్తున్నారని తెలిపారు. పాత కార్మికులు చెల్లిస్తున్న వేతనాలను అదనంగా నియమించిన కార్మికులకు కలిపి పంపిణీ చేస్తున్నారని, ఫలితంగా అతి తక్కువగా వేతనాలు అందుతున్నాయని తెలిపారు. 2023లో ప్రభుత్వ అధికారులు సేకరించిన లెక్కల ప్రకారం రాష్ట్రంలో 52 వేల మంది పంచాయితీ సిబ్బంది ఉన్నారని లెక్కలలో ప్రకటిస్తూ ప్రతి కార్మికుడికి రూ.5,00,000 ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశ పెట్టింది. కానీ ప్రభుత్వం 36,500 మందికే గ్రాంట్ ఇస్తున్నది. ప్రస్తుతం పనిచేసే వారందరినీ ప్రభుత్వం పరిగణలోకి తీసుకొని వేతనాలు చెల్లించక పోవడం సరైనది కాదు అన్నారు. చెల్లిస్తున్నదే అతితక్కువ వేతనాలు అని, అవి కూడా 5-6 నెలలుగా చెల్లించక పోవడం వేతనాలు సరైన సమయంలో అందక కుటుంబాల పోషణ భారమై కుటుంబ అవసరాల కోసం అప్పులు చేసి బతకాల్సిన పరిస్థితి పంచాయతీ సిబ్బందికి ఏర్పడిందని తెలిపారు. బకాయి వేతనాలు చెల్లించాలని జెఏసి ఆందోళనలు చేసిన తర్వాత కార్మికుల బకాయి వేతనాల కోసం ప్రభుత్వం బడ్జెట్ కేటాయించినప్పటికీ పంచాయతీలలో కార్మికులకు అందలేదు. సమస్య పరిష్కారం కాలేదు అన్నారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి ఉన్ని కృష్ణన్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కారం వెంటనే చేయకపోతే రాబోయే కాలంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు పోచాయ్, కృష్ణ, రమేష్, ప్రశాంత్, యాదయ్య శ్రీను, రాజు, గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి



- సీపీఐ,దళిత సంఘాల నాయకుల డిమాండ్
- జగద్గిరిగుట్ట బస్టాప్‌లో చిత్రపటం దహనం

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ప్రతిసారి అంబెడ్కర్ పేరు ఎందుకు తీసుకుంటున్నారని సీపీఐ,దళిత సంఘాల నాయకుల డిమాండ్ చేశారు. వారికి అంబెడ్కర్ పైన ఉన్న వ్యతిరేకతకు నిదర్శనమని వెంటనే ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని కోరుతూ..గురువారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి జగద్గిరిగుట్ట చివరి బస్టాప్‌లో గల అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఐ, దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలుపుతూ.. అమిత్ షా చిత్రపటాలను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఈ.ఉమామహేష్, రాష్ట్ర నాయకులు కే.ఏసురత్నంలు మాట్లాడుతూ హెూం మంత్రి అమిత్ షా అంబేద్కర్ గురించి తగ్గించి మాట్లాడేలా చెయ్యడం అవమానించడమేనని అన్నారు. రాజ్యాంగం రాయక ముందు భుస్వాములు, అగ్రవర్ణల వాళ్ళకే ఓటు హక్కు, చట్ట సభ్యులుగా ఉండేవాళ్ళని కానీ.. అంబేద్కర్ వల్లే అందరికి ఒక ఓటు ఒక హక్కు వచ్చిందన్నారు. చదువుకు, అగ్రవర్ణాలకు దూరంగా బడిలో రానియ్యన్ని పరిస్థితుల నుంచి అందరికి విద్యను, చదువు తమ హక్కే అని చెప్పి చైతన్యం తెచ్చారన్నారు. అగ్రవర్ణాల వాళ్ళే చదివి వాళ్ళే ఉద్యోగాలు కలిగివున్నారని చదువుకు దూరంగా ఉన్న బీసీ,ఎస్సీ,ఎస్టీ లకు రిజర్వేషన్లు ఉంటేనే ఉద్యోగాలు వస్తాయని చెప్పి రిజర్వేషన్లు కల్పించారన్నారు. అలాంటి బాబా సాహెబ్ అంబేద్కర్ తమకు దేవుడని, అమిత్ షా తను చేసిన వ్యాఖ్యలను బేషరతుగా పసంహరించుకోకపోతే భవిషత్తులో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

ఎం.జె.ఎఫ్ (మాదిగజర్నలిస్టు ఫోరం) జాతీయ, రాష్ట్ర నాయకులు డప్పు రామస్వామి, ఎర్ర యాకయ్యలు మాట్లాడుతూ పార్లమెంటులో అంబేద్కర్‌ను తక్కువ చేసి మాట్లాడటం వెనుకాల ఆర్.ఎస్.ఎస్, బీజేపీల కుట్ర అని అసలు ఎజండా రాజ్యాంగాన్ని రద్దు చెయ్యడమేనన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సయ్యద్ రషీద్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు బాబు, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు ఆకుబత్తిని ప్రవీణ్, ఏఐటీయూసీ అధ్యక్షుడు వి.హరినాథ్, శాఖ కార్యదర్శి సహదేవ్ రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటేష్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మైసూర్ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌లో సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ విద్యార్థులు



నవతెలంగాణ-మేడ్చల్

మైసమ్మ గూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు, మైసూర్‌లోని విద్యావర్ధక కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో స్మార్ట్ ఇండియా 2024, 36 అవర్స్ జాతీయ హ్యాకథాన్‌లో పాల్గొన్నారు. ఈ జాతీయ సదస్సులు జస్టర్ ఫ్లో ఎన్ హన్సింగ్ లాప్టాప్ యూసబిలిటీ విత్ ఎఫీషియెంట్ హ్యాండ్ జస్టిస్. లాప్టాప్‌ను కీబోర్డ్ మౌస్ లేకుండా వాటితో పని చేసే విధంగా హ్యాండ్ జస్టర్తో లాప్టాప్‌ను అనుసంధారించడం ద్వారా పని చేయవచ్చు. సమయాన్ని ఆదా చేయవచ్చని మిషన్ లెర్నింగ్ ద్వారా ప్రదర్శించారు. విద్యావర్ధక కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, మైసూర్‌లో ప్రదర్శించారు. 3,00,000 కన్నా ఎక్కువ ఐడియాస్‌ను సమర్పించారు. ఈ జాతీయ సదస్సుకు 51 నోడల్ సెంటర్స్ నుంచి 1000 ప్లస్ టీమ్స్ ఎంచుకున్నారు. మైసూర్ నోడల్ సెంటర్ నుంచి 30 టీములు పాల్గొన్నారు. ఆర్అండ్‌డి విభాగం డీన్ డా.అమ్ జాన్ షేక్, మెంటార్ ఎస్.వీరభద్రయ్య, టీం లీడర్ ఎం.సాయి తేజ, టీమ్ మెంబర్స్ ఏ.చరిష్మా, కే.దివ్య, ఎం.హర్షణ్, కే.జయంత్, కె.ప్రియతం పాల్గొన్నారు. ఈ జాతీయ సదస్సులో పాల్గొన్న మెంటర్ను, విద్యార్థులను కళాశాల సెక్రటరీ టి.వి.రెడ్డి ప్రిన్సిపాల్ డా.కె.శ్రీలత, అకడమిక్ డైరెక్టర్ సరోజా రెడ్డి అడ్మినిస్ట్రేటర్ డైరెక్టర్ అనురాగ్ రెడ్డి, పి.ఆర్.ఓ రవి సుధాకర్ అభినందించారు.

పర్యావరణ పరిరక్షణకు వర్చుసా ఫౌండేషన్ కృషి



నవతెలంగాన-సిటీబ్యూరో

వర్చుసా కార్పొరేషన్ సీఎస్ఆర్ విభాగమైన వర్చుసా ఫౌండేషన్ తాజాగా గీతం విశ్వ విద్యాలయం, గురునానక్ విశ్వవిద్యాలయంలలో 11,500 స్థానిక మొక్కలను నాటడం ద్వారా పెద్ద ఎత్తున మియావాకీ ప్లాంటేషన్ డ్రైవ్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో 3.1 ఎకరాల విస్తీర్ణంలో, గీతం విశ్వవిద్యాలయంలో 8,000, గురునానక్ విశ్వవిద్యా లయంలో 3,500 మొక్కలు విస్తృతంగా తెలిసిన మియావాకీ పద్ధతిలో నాటారు. ఈ కార్యక్రమంపై వర్చుసా కార్ప్ సస్టైనబిలిటీ అండ్ ఫెసిలిటీస్ గ్లోబల్ హెడ్, వర్చుసా శ్రీలంక జాయింట్ కంట్రీ హెడ్ డెన్వర్ డి జిల్వా మాట్లాడుతూ "వర్చుసాలో మేం మా వ్యాపార నమూనా ప్రధాన భాగంలో అన్ని కార్యకలాపాలలో సుస్థిరత్వాన్ని ఏకీకృతం చేయడం, కార్బన్ పాదముద్రను తగ్గించడం మాకు గర్వకారణం. ఈ ప్లాంటేషన్ డ్రైవ్ పర్యావరణం, మన సమాజంపై సానుకూల ప్రభావం చూపే దిశగా సాగుతున్న మా ప్రయా ణంలో ఒక ముందడుగు" అని అన్నారు. "అసమానమైన అంకితభావాన్ని ప్రదర్శించిన వలంటీర్లందరికీ, ఈ ఉదాత్తమైన కారణంలో సహకరించినందుకు ఆయా విశ్వవిద్యాలయాలకు మేం మా హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. ఈ కార్యక్రమాల్లో మా బృందం ఉత్సాహంగా పాల్గొనడం మంచి పర్యావరణాన్ని వాగ్దానం చేస్తుంది. ఇది సుస్థిరమైన భవిష్యత్తు పట్ల మా సామూహిక నిబద్ధతకు నిదర్శనం" అని ఆయన అన్నారు.

టీపీసీసీ లేబర్ సెల్ నాయకుల కృషి అభినందనీయం



- డాక్టర్ జి.సంజీవ రెడ్డి

నవతెలంగాణ-కూకట్‌పల్లి

కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తున్న టీపీసీసీ లేబర్ సెల్ నాయకుల కృషి అభినందనీయం అని డాక్టర్ జి.సంజీవ రెడ్డి అన్నారు. కార్మికుల వారి కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం, కర పత్రాల ద్వారా అవగాహన కల్పించారు. టీపీసీసీ లేబర్ సెల్ ద్వారా తెలంగాణలో అన్ని జిల్లాల నియోజకవర్గాల వారిగా కరపత్రాలు, సభల ద్వారా, తెలంగాణ భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికులు, అన్ని వాణిజ్య సంస్థల్లో, పరిశ్రమల్లో, సంక్షేమం కోసం, కార్మిక సంక్షేమ మండలి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, బీమా పథకాలు, సామజిక భద్రత కోసం, కార్మికుల హక్కుల కోసం మొదలగు ప్రొయోజనాలు కార్మికులకు వారి కుటుంబ సభ్యులకు, వాటి ప్రయోజనాలు, లబ్ధిపొందడం కోసం కార్మికులకు అవగాహన కార్యక్రమాలు టీపీసీసీ లేబర్ సెల్ ద్వారా చేపట్టారు. శ్రమించి కష్టపడి పని చేస్తున్న, లేబర్ సెల్ నాయకులకు అభినందనలు తెలియజేశారు. కార్మికుల సంక్షేమం దృష్టిలో ఉంచుకుని, లేబర్ సెల్ కూటమిగా ఏర్పడి, బృందాలుగా కలిసి ప్రచారం చేస్తే, కార్మికుల సందేమంలో అద్భుతమైన విజయం సాధిస్తామని ఆయన పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గోంగళ్ళ సత్యజీత్ ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏపి అండ్ తెలంగాణ, కుమార్ జై మంగల్ ఎమ్మెల్యే ఝర్ఖండ్ అండ్ ప్రెసిడెంట్ ఐఎన్‌టీ యూసీ ఝార్ఖండ్ రాంబాగ్ ప్రకాష్ గౌడ్ చైర్మెన్ లేబర్ సెల్, సప్పిడి భాస్కర్ కోర్డినేటర్ సోషల్ మీడియా, గోకర్ల లక్ష్మి నారాయణ ఆర్గనైజింగ్ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఆల్ఫాసైపర్ మెత్రిన్ కెమికల్ పిచికారీ



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి సర్కిల్ ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలో కూకట్‌పల్లి డిప్యూటీ కమిషనర్ ఆదేశాలతో.. ఎంటమలాజి సూపర్‌వైజర్ డి.నరసిం హులు సిబ్బందితో కలిసి, దోమల నివారణలో భాగంగా..ఎల్లమ్మ బండలోని పలు కాలనీలలో, ఇంటింటికి వెళ్లే ఏఎల్ఓ టీమ్ బృందాలు, సూపర్‌వైజర్ తనిఖీ చేశారు. దోమల నివారణ కోసం ఆల్ఫా సైపర్ మేత్రిన్ కెమికల్‌ను పిచికారి చేశారు. అదేవిధంగా కాలనీలోని పలు ఇండ్లలోని ఉన్నటువంటి, నీటి నిల్వలను తనిఖీ చేసి, ఇంటి లోపట గాని, ఇంటి బయట గాని, ఎక్కువ రోజులు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. నీటి నిల్వలపై ఎప్పుడూ మూతలు ఉంచాలన్నారు. దోమలు ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉన్నచోట, గుడ్లు పెట్టి పెరిగి పెద్దవి అవుతాయి. కావున వాటిని వెంటనే అరికట్టాలన్నారు. దోమ కాటు ద్వారా డెంగ్యూ ఫీవర్, మలేరియా చికెన్ గునియా, మెదడు వ్యాపు, బోదకాలు, మొదలగు వ్యాధులు వస్తాయి. కావున ప్రజలందరూ కూడా ఇంటింటిని తనిఖీ చేసే ఎంటమాలజీ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులున్నారు.

అమిత్ షాను మంత్రివర్గం నుంచి బహిష్కరించాలి..



నవతెలంగాణ-బాలానగర్

భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అవమానపరిచే విధంగా మాట్లాడిన కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా ను మంత్రివర్గం నుంచి బహిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, నాగరిగారి ప్రీతం ఆధ్వర్యంలో.. దళిత సంఘాల నేతలు, భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ మేరకు అమిత్ షా బాబాసాహెబ్ అంబేద్కర్‌కు బహిరంగ క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ నగరి ప్రీతం, కంటెస్టెడ్ ఎమ్మెల్యే బి. సంజీవరావు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎస్సీ చైర్మెన్ పత్తి కుమార్, బాలానగర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టే ప్రసన్నకుమార్, జిల్లా ఎస్సీ విభాగం వైస్ చైర్మెన్ మదన్ మోహన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొమ్ము బాబురావు, జావిద్, ఎ. రాజు, తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ లో కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా, భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్.బి.ఆర్. అంబేద్కర్‌పై అనుచిత వాఖ్యలు చేసినందుకు నిరసనగా .. ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద రాస్తా రోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వి. హనుమంత్ రావు, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ నాగరిగారి ప్రీతమ్, మేడ్చల్-మల్కాజ్ గిరి జిల్లా ఎస్సీ సెల్ పత్తి కుమార్, వైస్ చైర్మెన్ మదన్ మోహన్, చైర్మెన్ టీపీసీసీ కార్యదర్శి జావేద్ ఆలీ, చంద్రశేఖర్‌లను అరెస్టుచేసి ముషీరాబాద్ పోలీసు స్టేషన్‌కు తరలించారు.



క్రీడా పోటీలకు జోనల్ కమిషనర్‌ను ఆహ్వానించిన కుమార్ యాదవ్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

నెహ్రూ యువ కేంద్ర (మేరా యువభారత్) రంగారెడ్డి శాఖ ఆధ్వర్యంలో.. రేపు బికే మైదానం, ఆల్విన్ కాలనీలో నిర్వహించే.. క్రీడా పోటీలకు ముఖ్యఅతిథిగా రావాలని.. ఎన్వైకే సభ్యులు, బిజెవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్, జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహన్‌కు కేంద్ర ప్రభుత్వ అధికారిక లేఖను అందించి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ క్రీడలపై ఆసక్తి ఉన్న యువత క్రీడ పోటీలలో పాల్గొనాలన్నారు. అబ్బాయిలకు వాలీబాల్, అమ్మాయిలకు కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నాం అని తెలిపారు.యువత చెడు దారిన పోకుండా ఉండడానికి క్రీడలు దోహదపడతాయన్నారు. ఆసక్తి ఉన్న యువతి యువకులు 8008000724 నెంబర్‌ను సంప్రదించవచ్చు అన్నారు. ఈ ఆహ్వాన కార్యక్రమంలో తెలంగాణ యూత్ ఫోర్స్ అధ్యక్షులు బింగి రాములు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో టాలెంట్ పరీక్షలు



నవతెలంగాణ- జూబ్లీహిల్స్.

బోరబండ, సైట్-3 ఎన్.ఆర్.ఆర్.పురంలోని రాష్ట్ర గురుకుల బాలికల పాఠశాలలో జన విజ్ఞాన వేదిక గురువారం చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించింది. అందులో భాగంగా విద్యార్థులకి సరిఫికెట్‌లు, మెమెంటోళ్లు అందజేసింది. ఈ క్రమంలో గౌరవ అధ్యక్షులు చంద్రశేఖర రావు, జూబ్లీహిల్స్ వైస్ ప్రెసిడెంట్ వై యాదగిరి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదకు వీల్ చైర్ అందించిన హబీబా సుల్తానా



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

బోరబండ డివిజన్‌లో పక్షవాతంతో, అంగవైకల్యంతో బాధపడుతున్న మధురానగర్ వాసి, నిరుపేద కుటుంబానికి చెందిన మిర్చిల రాజుకు బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దిన్ సతీమణి హబీబా సుల్తానా ఆధ్వర్యంలో గురువారం వీల్ చైర్ అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మోండా మార్కెట్‌లో అగ్నిప్రమాదం

- ఐదు షాపులు దగ్ధం
- చలిమంటలే కారణమని చెబుతున్న ప్రత్యక్ష సాక్షులు

నవతెలంగాణ-బేగంపేట

సికింద్రాబాద్‌లోని మోండా మార్కెట్‌లో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఐదు షాపులు దగ్ధమయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం తెల్లవారుజామున మోండా మార్కెట్‌లోని ఓ పూజా స్టోర్‌లో మంటలు వ్యాపించాయి. క్రమంగా అవి పక్కనే ఉన్న నాలుగు దుకాణాలకు అంటుకున్నాయి. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజిన్లతో మంటలను ఆర్పివేశారు. చలిమంటల కారణంగా ఈ ప్రమాదం సంభవించిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. మూడు దుకాణాలు పూర్తిగా దగ్ధం కాగా మరో రెండు దుకాణాలు పాక్షికంగా దగ్ధమయ్యాయి. మూడు దుకాణాల్లో ఉన్న పూజా సామాగ్రి పూర్తిగా దగ్ధమైంది.

అగ్ని ప్రమాద ప్రాంతాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



నవతెలంగా-బేగంపేట్

మోండా మార్కెట్‌లో అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతాన్ని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ గురువారం సందర్శించారు. ప్రమాద వివరాలను తెలుసుకున్న ఆయన బాధితులకు అండగా ఉంటానని, ప్రభుత్వం నుండి సహాయం అందిస్తానని హామీనిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు చలి మంటలు పెట్టుకోవడంతో అందులోని నిప్పురవ్వలు ఎగిసిపడి మంటలు ఏర్పడ్డాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారని చెప్పారు. అయితే ఈ ప్రాంతంలో రాత్రి పూట కొంతమంది అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్టు తెలిసిందన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. వీధి దీపాలు లేవు, సీసీ కెమెరాలు లేవు, రోడ్లు కూడా సరిగా లేవని తన దృష్టికి తీసుకు వచ్చినట్టు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

'పది' పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి

- 90 శాతం కంటే తక్కువ ఫలితాలు సాధించిన పాఠశాలలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- మూడవ తరగతి పిల్లల్లో అనర్గళంగా చదవడం రావాలి
- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- బేగంపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల-2ను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ
- 3వ తరగతి, 10వ తరగతి పిల్లలతో మాట్లాడిన కలెక్టర్



నవతెలంగాణ -సిటీబ్యూరో

పదో తరగతి వార్షిక పరీక్షల్లో హైదరాబాద్ జిల్లాలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఉపాధ్యాయులకు ఆదేశించారు. గురువారం సికింద్రాబాద్ మండలంలోని బేగంపేట్ ప్రభుత్వ ఉన్నతపాఠశాల 2 ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని వాటర్ ట్యాంక్, పరిసరాలను, హాజరు రిజిస్టర్ లను పరిశీలించారు. అనంతరం మూడవ తరగతి క్లాస్ రూమ్ సందర్శించి విద్యార్థులు వైష్ణవి, గౌతమ్, నవ్యలతో పాఠాలు చదివించారు. పిల్లలు బాగా చదవడంతో అభినందించారు.మూడో తరగతి విద్యార్థులకు అనర్గళంగా చదవడం వచ్చేలా ఉపాధ్యాయులు దృష్టి సారించాలని ఆదేశించారు.

అనంతరం పదో తరగతిని సందర్శించి విద్యార్థులకు పరీక్షల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు చదువు పట్ల నిర్లక్ష్యం, భయంతో పరీక్షలు రాయ వద్దని, ఆత్మవిశ్వాసం, కృషి, పట్టుదలతో పరీక్షలు రాసినప్పుడే మెరుగైన ఫలితాలు సాధిస్తారని అన్నారు. రాబోయే మూడు నెలలు విద్యార్థులకు కీలకమని విద్యార్థులు పండుగలు, పెండ్లిలు, ఇతర కారణాలతో పాఠశాలకు గైర్హాజరు అవకుండా క్రమం తప్పకుండా హాజరై కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. పరీక్షలకు సరియైన ప్రణాళికతో సిద్ధం కావాలని అన్నారు.పదవ తరగతిలో 90 శాతం కంటే తక్కువ ఉత్తీర్ణత శాతం ఉన్న పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలని డిప్యూటీఈవో, డీఈవో ఉపాధ్యాయులను కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిఐఒ ఆర్ రోహిణి, ఈఈ షఫీ మియా, డిప్యూటీ ఈవో శ్రీధర్, డిప్యూటీ ఈఈ సంజీవ్, ప్రధానోపాధ్యాయులు యాదగిరి, ఏ ఈ శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.





ఐటీఎం యూనివర్సిటీలో తక్కువ ఖర్చుతో ఉన్నత విద్యా కోర్సులు

- యూనివర్సిటీ అడ్మిషన్స్ అధికారి రవిశర్మ

నవతెలంగాణ - బంజారాహిల్స్

తక్కువ ఖర్చుతో ఉన్నత విద్యా కోర్సులలో విద్యను అభ్యసించేందుకు ఐటీఎం యూనివర్సిటీ అవకాశం కల్పిస్తుందని యూనివర్సిటీ అడ్మిషన్స్ అధికారి రవిశర్మ తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో విశ్వవిద్యాలయం అందిస్తున్న కోర్సుల వివరాల బ్రోచర్‌ను స్మార్ట్ ఛాయిస్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ ఎండీ కృష్ణ తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలలో విద్య ఖర్చు విపరీతంగా పెరిగిపోయిందని అన్నారు. పేద మధ్యతరగతి విద్యార్థులకు కోర్సులలో అడ్మిషన్ కల్పించాలని లక్ష్యంతో యూనివర్సిటీతో ఒప్పందం కుదుర్చుకున్నట్టు కృష్ణ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు తమ వెబ్‌సైట్ ద్వారా వివరాలు తెలుసుకోవచ్చునని చెప్పారు.

ప్రొ. వై. జహంగీర్‌కు రతన్ టాటా ఎక్సలెన్స్ అవార్డు



నవతెలంగాణ-ఓయూ

ప్రముఖ బిజినెస్ మేనేజ్మెంట్ అధినేత ఉస్మానియా యూనివర్సిటీ డిపార్ట్మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్మెంట్ హెడ్ (హెచ్‌ఓడీ) సీనియర్ ప్రొ. వై. జహంగీర్‌ను రతన్ టాటా ఎక్సలెన్సీ అవార్డు 2024కు ఎంపిక చేసినట్టు తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ తెలిపారు. మార్కెటింగ్‌లో యూజీసీ ద్వారా 42 ఆర్టికల్స్ పబ్లిష్ అయ్యాయి. జహంగీర్ పర్యవేక్షణలో 20 మంది ఓయూ నుంచి పీహెచ్‌డీ పట్టాలు పొందారు. ఇంకా 8 మంది పీహెచ్డీ విద్యార్థులు పనిచేస్తున్నారు. బిజినెస్ అనా లైటిక్, రూరల్ మార్కెటింగ్‌లో నాలుగు పుస్తకాలు ఎడిటర్‌గా ఉండి ప్రచురించి అందరి మన్ననలు పొందారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సులు బిజినెస్ డైనమిక్‌లో నిర్వహించి నేషనల్ సెమినార్లు నిర్వహించి ఎన్నో ప్రశం సలు అందుకున్నారు. గతంలో ఓయూ వైస్ ప్రిన్సిపాల్‌గా ,అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ గా చేసి ప్రస్తుతానికి గెస్ట్ హౌస్ డైరెక్టర్ గా, ప్లేస్మెంట్ ఆఫీసర్ గా ఉండి విద్యార్థులకు ఎన్నో మార్గదర్శకాలు బిజినెస్ పైన ఎలా ఎదగాలని దానిపైన ఎన్నో సూచనలిచి అందరి మన్ననలు పొందారు .ఈనెల 28న, రతన్ టాటా జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని బొగ్గులకుంట ఆబిడ్స్‌లోని లోని తెలంగాణ సరస్వత పరిషత్ ఆడిటోరియంలో నిర్వహించే ఉత్సవాలలో ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

పడిపూజలో ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఓయూ

బీఆర్ఎస్ సీనియర్ నేత చంద్రశేఖర్ బుధవారం సీతాఫలమండీ మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన అయ్యప్ప స్వామి పడి పూజకు ఎమ్మెల్యే తీగుళ్ళ పద్మారావు గౌడ్ ముఖ్య అతిధిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, రాసూరి సునీత, నేతలు కంది నారాయణ, కరాటే రాజు లతో నేతలు, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు.

మత్స్య సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించండి



- మత్స్య పారిశ్రామిక సహకార సంఘం..

నవతెలంగాణ-బంజారాహిల్స్

రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా మత్స్య సహకార సంఘాలకు తక్షణమే ఎన్నికల నిర్వహించాలని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ప్రభుత్వాన్ని కోరింది. గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం నాయకులు బుస మల్లేశం, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు మన్నె రాజు మాట్లాడారు. గతంలో 100 శాతం చేప పిల్లలను ప్రభుత్వం పంపిణీ చేసేదని, ప్రస్తుతం దాన్ని 50 శాతానికి తగ్గించడమే కాక కొన్ని జిల్లాలలో పూర్తిగా సరఫరా నిలిపివేశారని తెలిపారు. దీంతో మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన దుస్థితి తలెత్తిందని చెప్పారు. చేప పిల్లల పంపిణీ టెండర్ల ద్వారా కాకుండా నేరుగా విక్రయించుకునేలా అవకాశం కల్పించాలని కోరారు. రైతుబంధు మాదిరిగా మత్స్య బంధును ఏర్పాటు చేయాలన్నారు. మత్స్యకారులకు వాహనాల కోసం ఇచ్చే సబ్సిడీని యధాతథంగా కొనసాగించాలని కోరారు. మత్స్యవాత పడ్డ మత్స్యకార కుటుంబాలకు 2017 నుంచి ఇవ్వాల్సిన ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మత్స్య పరిశ్రమ అభివద్ధికి ప్రత్యేక కార్యచరణ రూపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోపాల్,పుట్ట బాలరాజ్, సోమయ్య, రమేష్, నరసయ్య, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఏఐ సాంకేతికతతో ఆరోగ్య సంరక్షణ సులభతరం

- ఏసియానా యాప్ లాంచ్‌లో సీఈఓ కిషోర్, సి.టి.ఓ సత్య



నవతెలంగాణ - బంజారాహిల్స్

ఆధునిక ప్రపంచంలో సాంకేతిక పురోగతి నిష్ణాతులైన నిపుణుల ఆధ్వర్యంలో ఆరోగ్య వ్యవస్థను జన్యు శాస్త్ర పరిజ్ఞానం, ఏఐ ద్వారా కనుగొని పరిష్కరించడం ప్రధాన ఉద్దేశంగా ఏసియానా యాప్‌ను పరిచయం చేస్తున్నట్టుగా ఏసియానా సీఈవో కిషోర్ కురుమంచి, సిటీఓ సత్య వంటిపల్లి, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ గీతిక సాయిలు తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో యాప్‌ను వారు ఆవిష్కరించడంతోపాటు దాని విధివిధానాలను బంజారా హిల్స్ తాజ్ కృష్ణలో ఏర్పాటు చేసిన సమావేశంలో వెల్లడించారు. ఆరోగ్య సంరక్షణకు శక్తివంచన లేకుండా ప్రపంచవ్యాప్తంగా వైద్య నిపుణులు చేస్తున్న కృషి మాటల్లో వివరించలేనిదన్నారు.సమస్త మానవాళి ఆరోగ్య సంరక్షణకు కావలసిన అనేక మార్పులను నిత్యం మనం గమనిస్తూనే ఉన్నామన్నారు. ఆ మార్పులకు తగ్గట్టుగా నిత్యం ప్రతి ఒక్కరు వారి ఆరోగ్యాన్ని సంరక్షించుకోవడానికి తమ ఏసీయానా యాప్ ఉపయోగపడుతుందని తెలి పారు. భారతదేశంలోని వైద్య నిపుణులు అందరితోపాటు మెరుగైన ఆస్పత్రుల అన్నింటిలో దీన్ని వినియోగించుకోవడం పట్ల అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు.

బాబాసాహెబ్‌ను అవమానిస్తే సహించం







- పలు చోట్ల అమిత్ షా దిష్టిబొమ్మలు దహనం

నవతెలంగాణ-ఓయూ

బాబాసాహెబ్‌ను అవమానిస్తే సహించబోమని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ అన్నారు. కేంద్ర మంత్రి అమిత్ షా అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో సీతాఫల్మండి చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేల సంవత్సరాలుగా దోపిడీకి, అన్యాయానికి, అణచివేతకు గురవుతున్న ఈ దేశ ప్రజలకు అంబేద్కర్ భారత రాజ్యాంగం రాశారని, వారికి హక్కులు కల్పించి వేల సంవత్సరాలుగా మనువాద బ్రాహ్మణియా మనువాదుల దోపిడీ నుంచి ఈ ప్రజలను అభివృద్ధి పథంలోకి నడిపించారని గుర్తు చేశారు. పార్టీ సికింద్రాబాద్ సహాయ కార్యదర్శి కొమురెల్లి బాబు, జోగు రాములు, రమేష్, శ్రీహరి, తోకల కుమార్ పాల్గొన్నారు.

ఓయూలో అమిత్ షా దిష్టిబొమ్మ దహనం

ఓయూ : కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా ఓయూలో ఐక్య విద్యార్థి దళిత బహుజన విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆయన దిష్టి బొమ్మను గురువారం దగ్ధం చేశారు. అనంతరం భారీ ర్యాలీతో వెళ్లి లా కాలేజీ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని శుద్ధి చేశారు.వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ. అమిత్ షా వెంటనే దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యాఖ్యలపై ఆర్ఎస్ఎస్, మోడీ స్పందించి కేంద్ర మంత్రివర్గం నుంచి ఆయనను తప్పించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని రక్షించడం కోసం అందరూ ఐక్యం కావాలని కొరారు.వలిగొండ నరసింహ, జంగిలి దర్శన్, జాజుల లింగం గౌడ్, పాపా రావు, వేదాంత్ మౌర్య సమీర్ , విజయ్ నాయక్, అరుణ్, అంజి, అభి, నందు, సురేష్, వీర్,సతీష్, లోకేష్ ,మహేష్ ,చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఓయూలో అమిత్‌షా చిత్రపటాల దహనం

ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట అమిత్ షా చిత్రపటాలు దహనం చేశారు. భారత రాజ్యాంగం ద్వారా అనేకమందికి హక్కులు కల్పించి వేల సంవత్సరాలుగా హిందూ, బ్రాహ్మణియా మనువాదుల దోపిడీ నుంచి ఈ ప్రజలను అభివృద్ధి పథంలోకి నడిపించిన మహానుభావుడు అంబేద్కర్ అని ఓయూ విద్యార్థులు అన్నారు. అలాంటి బాబాసాహెబ్ పేరు తలవడం తమకు ఫ్యాషన్ కాదని.. అంబేద్కర్ పేరు ఒక విప్లవం అన్నారు. భారతదేశాన్ని హిందూరాజ్యంగా, మనువాదాన్ని అమలులోకి తీసుకవచ్చే ప్రయత్నంలో భాగంగా, దేశంలో అంబేద్కర్ వాదులు చైతన్యం అవుతున్నారనే అక్కసుతో అమిత్ షా పార్లమెంట్‌లో వ్యాఖ్యలు చేశారన్నారు. వెంటనే ఆయన తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని మంత్రి పదవికి రాజీనామా చేయాలనీ డిమాండ్ చేశారు. ఓయూ విద్యార్థి నాయకులు శ్రీకాంత్, క్రాంతిరాజ్ , శ్రావణ్, ఉదయ్, దివాకర్, ప్రశాంత్, మహేష్, జయప్రకాశ్, హన్సర్ పాల్గొన్నారు.

'అమిత్ షా నుంచి మంత్రి పదవీ నుంచి తొలగించాలి'

కేంద్ర మంత్రి అమిత్ షా అంబేద్కర్ ను అవమానించినందుకు వెంటనే ఆయన పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేసి మంత్రి పదవి నుంచి తొలగించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పబ్బతి శ్రీకష్ణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఓయూ లా కాలేజీ దగ్గర పబ్బతి శ్రీకష్ణ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అమిత్ షా క్షమాపణ చెప్పాలని కోరారు. అంబేద్కర్ రాజ్యాంగం రాశారు కాబట్టే నేడు మోడీతో పాటు ఆయన పార్టీ పార్లమెంట్‌లో ఉందనే విషయం తెలిసి కూడా అమిత్ షా అంబేద్కర్‌ను అవమానించడం రాజ ద్రోహం అవుతుందన్నారు. కనుక ఆయనను అరెస్ట్ చెయ్యాలని డిమాండ్ చేశారు. ఇకనైనా అమిత్ షా తన బుద్ధి మార్చుకొని ఒక మనిషిగా మారాలని కోరుకుంటున్నామన్నారు.



ఖైరతాబాద్ బడా గణేష్ వద్ద అంబేద్కర్ ఫోటో కింద అమిత్ షా ఫోటో పెట్టి మీరు చెరిపేయాలనుకునేది ఏది జరగనివ్వము అది అసాధ్యం అంటూ దేశ ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పి రాజీనామా చేయాలని గురువారం ఖైరతాబాద్ నియోజకవర్గ ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. నవతెలంగాణ - బంజారాహిల్స్

ఓయూలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ ఫౌండర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వలిగొండ నరసింహ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కాలేజ్ ప్రాంగణంలో గురువారం రాత్రి ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా స్టవ్ మినిస్ట్రీస్ పాస్టర్ అల్లూరి సతీష్ , వారి సతీమణి అల్లూరి సతీష్ రాజు విచ్చేసి క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఓయూ యుద్ధనౌక కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ మెంబర్ వరంగల్ రవి, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ, డి బి ఎస్ ఏ స్టేట్ కోఆర్డినేటర్ జంగిలి దర్శన్, ఓయూ ఎస్ఎస్‌యూఐ జనరల్ సెక్రెటరీ వెంకట్ ముదిరాజ్, టీడీఎస్ఎఫ్ అధ్యక్షులు విజయ్ నాయక్ ,విద్యార్థి నాయకులు ప్రణయ్, గడ్డం అశోక్, మంద రాజు మాదిగ, చరణ్ మౌర్య , సతీష్ , రవీందర్, రవి , ఏసు తదితరులు రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

'కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి'



- డీఎంహెచ్ఓ ఆఫీసు వద్ద నిరసన

నవతెలంగాణ-సిటీబ్యూరో

కాంట్రాక్ట్ ఏఎస్ఎంలను రెగ్యులర్ చేయాలని, రాత పరీక్ష రద్దు చేయాలని కోరుతూ వైద్య ఆరోగ్య ఉద్యోగుల జేఏసీ ఇచ్చిన 48 గంటల నిరసన పిలుపులో భాగంగా తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ డీఎం అండ్‌హెచ్‌ఓ ఆఫీస్ ముందు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నగర అధ్యక్ష ప్రధాన కార్య దర్శులు కుమారస్వామి కిరణ్ మై నగర ఉపాధ్యక్షుడు లక్ష్మీబాయి యూనియన్ నాయ కులు రమా షీలా అమ్మాజీ దైవమని మమత సునీత, సంతోషి, విజయ తదితరులు పాల్గొన్నారు.

డా.హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ బుక్ స్టాల్ ప్రారంభం





నవతెలంగాణ-సిటీబ్యూరో

37వ హైదరాబాద్ బుక్ ఫెస్టివల్‌లో డా.హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ బుక్ స్టాల్ నెంబర్ 245ను చొక్కాపు వెంకటరమణ , డా.హిప్నో పద్మా కమలాకర్ ఆధ్వర్యంలో బాల కళాకారులతో గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐనంపూడి శ్రీలక్ష్మి, జి.కృష్ణ వేణి, విశ్వైక, సమ్మెట విజయ, యశోద, భండారు విజయ, పూర్ణ కుమారి, విమల , చంద్ర, లక్ష్మీమల్లిశ్వరీ తదితరులు పాల్గొన్నారు. పిల్లలు పుస్తకాలు చదవడం వల్ల మానసిక ఆరోగ్యం గా ఉండగలరన్నారు. వారనుకున్న విధంగా అభివృద్ధి చెందుతారన్నారు.

'అభివృద్ధి పనులు వెంటనే చేయాలి'



నవతెలంగాణ-ధూల్‌పేట్

బస్తీలో అభివృద్ధి పనులు వెంటనే చేయాలని కార్వాన్ నియోజక వర్గం ఎమ్మెల్యే కౌసర్ మైనుద్దీన్ అధికారులకు ఆదేశించారు. లంగర్ హౌస్ డివిజన్ రాందేవ్ గూడ పద్మా నగర్ వెల్ఫేర్ కమిటీ అధ్వర్యంలో పలుమార్లు డ్రయినేజీ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో స్పందించిన ఆయన సందర్శించి వెంటనే ఫోన్‌లో అధికారులతో మాట్లా డి పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. ఎక్కడ నిర్లక్ష్యం చేయకుండా పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. వెల్ఫేర్ కమిటీ కన్వీనర్ జి.విఠల్ మాట్లాడుతూ.. గత కొంత కాలంగా డ్రయినేజీ ఓవర్ ఫ్లోతో స్థానికులు ఇబ్బందులకు గురయ్యారన్నారు. డ్రయినేజీ సమస్యలను బస్తీలో పరిష్కరించాలని అధికారుల, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎమ్మెల్యే చొరవ చేసుకుని సమస్య శాశ్వత పరిష్కారానికి పనులు చేపట్టడంతో ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

'జీవో 317 స్థానికత అంశాన్ని పరిష్కరించాలి'

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర పరిధిలోని 317 జీవో స్థానికత అంశాన్ని పరిష్కరించాలని జీవో 317 జేఏసీ నేతలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం జేఏసీ నాయకులు విజయకుమార్, నాగేశ్వరరావు, సందీప్, మధుసూదన్ చారి, చాముండేశ్వరి, వినోద, హారతి తదితరులు మాట్లాడుతూ శాసనమండలిలో జీవో 317 స్థానికత అంశాన్ని చర్చించిన ఎమ్మెల్సీలు ఏవైఎస్ రెడ్డి, తీన్మార్ మల్లన్న, ప్రొఫెసర్ కోదండరాం, జీవన్ రెడ్డి లకు ధన్యవాదాలు తెలిపారు. 32 మంది మరణాన్నికి కారణమైన చీకటి జీవో 317 పైన గురువారం చర్చకు రావడం శుభ పరిణామన్నారు.గత కొంతకాలంగా ఉద్యోగ ఉపాధ్యాయులు పడుతున్న వేదనను కష్టాలను పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర పరిధిలోని స్థానికత అంశాన్ని పరిష్కరించాలనే విషయంపై శాసన మండలిలో పలు సూచనలు సలహాలు చేసిన ఎమ్మెల్సీల కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్సీలు సూచించిన విధంగానే జీవో 317 పేర 28 ప్రొటెక్షన్ క్లాస్ ప్రకారం గ్రీవియన్స్ లో అప్లై చేసుకున్న ఉద్యోగ ఉపాధ్యాయులకు స్థానిక ఆధారంగా రీ అలకేట్ చేయాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్ష హెూదాల ఇచ్చిన మాట ప్రకారం జీవో 317 బాధితులకు న్యాయం చేయాలన్నారు.

ఉత్సాహభరితంగా సీపీఐ(ఎం) మహాసభలు



- సీపీఐ(ఎం) తుర్కయంజాల్ మున్సిపాలిటీ ప్రథమ మహాసభల్లో పతాకావిష్కరణ చేసిన బి. శంకరయ్య

నవతెలంగాణ-తుర్కయంజాల్

సీపీఐ(ఎం) తుర్కయంజాల్ మున్సిపాలిటీ ప్రథమ మహాసభలు తుర్కయంజాల్ పట్టణంలోని అరుణ కన్వెన్షన్ హాల్లో ఉత్సాహభరితంగా జరిగాయి మహాసభ ప్రారంభానికి ముందు పార్టీ సీనియర్ నాయకులు బి శంకరయ్య పతాకావిష్కరణ చేయగా ఇటీవల కాలంలో మరణించిన పార్టీ అఖిలభారత కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరికి, గత మూడు సంవత్సరాల కాలంలో పార్టీ ప్రజా ఉద్యమాల్లో పని చేసిన నాయకులు కార్యకర్తలకు, ప్రజాస్వామ్యవాదులకు మహాసభ ఘనంగా నివాళు లర్పించారు.

ఈ మహాసభలకు కే అరుణ్ కుమార్, కె శారద అధ్యక్ష వర్గంగా వ్యవహరించగా పార్టీ జిల్లా కార్యదర్శి కాడిగాళ్ళ భాస్కర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి సామేల్ డి.జగదీష్ లు అబ్జర్వర్లుగా వ్యవహరించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పగడాల యాదయ్య రాజకీయ రాజకీయ రిపోర్టు ఇస్తూ జాతీయ, అంతర్జాతీయ రాజకీయాలు ప్రస్తావించారు. ఈ మహాసభ తుర్కయంజాల్ ప్రాంతంలోని స్థానిక సమస్యలపైన ఎప్పటికప్పుడు పనిచేస్తూ వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల పట్ల రాజకీయ అవగాహనతో ప్రజలను చైతన్యం చేసి పోరాటానికి సన్నద్ధం చేయాలని పిలుపునిచ్చారు.

అనంతరం పార్టీ మున్సిపల్ కన్వీనర్ డి.కిషన్ గడిచిన మూడేండ్ల కాలంలో ఉద్యమ నిర్మాణ కర్తవ్యాలను, కార్యక్రమాలను మహాసభ ఎదుట ఉంచారు. శాఖలవారీగా చర్చించిన సభ్యులు కార్యదర్శి నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించారు. రానున్న కాలంలో సీపీఎం పార్టీగా ప్రజా ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని, ప్రజా సంఘాల నిర్మాణానికి కృషి చేయాలని, స్థానిక సమస్యలపై ఉద్యమించాలని, మహిళా, విద్యార్థి, యువజన, కార్మిక రంగాల్లో వారి సమస్యల పట్ల నిరంతరం అధ్యయనం చేసి, పార్టీ విస్తరణకు కార్యకర్తల బలోపేతానికి కృషి చేయాలని మహాసభ ఏకగ్రీవంగా తీర్మానించింది.అనంతరం సీపీఐ(ఎం) తుర్కయంజాల్ మున్సిపాలిటీ నూతన కమిటీని 9మందితో మహాసభ ఎన్నుకుంది. కార్యదర్శిగా డి.కిషన్, సభ్యులుగా ఎం.సత్యనారాయణ, కె.అరుణ్‌కుమార్, జె.ఆశీర్వాదం, కె.శ్రీరామమూర్తి, కె.వెంకటకృష్ణ, ఐ.భాస్కర్, కె.శారద, డి.శ్రీధర్‌లను మహాసభ ఎన్నుకుంది.





టీఎన్జీవోస్ హైదరాబాద్ జిల్లా నిర్వహిస్తున్న 11వ బి.స్వామినాథన్ క్రికెట్ టోర్నమెంట్-2025 మూడవ రోజు గురువారం గగన్ మహల్ మైదానంలో జరిగాయి. ఇరిగేషన్ డిపార్టుమెంట్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో డీఈవో జట్టు విజయం సాధించింది. ఇరిగేషన్ డిపార్టుమెంట్ క్రికెట్ జట్టు స్కోర్ 10 ఓవర్లలో 53 పరుగులు చేయగా..డీఈవో జట్టు 5 ఓవర్ల 2బంతుల్లో 57 పరుగులు చేసింది. టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని(ముజీబ్) మద్దతుతో టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా 11వ స్పోర్ట్స్ మీట్‌ను ఘనంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. జిల్లా అధ్యక్షులు ఎస్.విక్రమ్ కుమార్, ఉపాధ్యక్షులు కె.శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ ఖాలీద్ అహ్మద్, పబ్లిక్ సెక్రటరీ వైదిక్ శాస్త్ర, ఈసీ మెంబర్లు శ్రీధర్, ముఖీమ్ ఖురేషీతో పాటు కార్యవర్గం ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్, డీఈవో క్రికెట్ టీమ్ కెప్టెన్ కె.ఆర్.రాజ్‌కుమార్, ఎం.భాస్కర్‌తో పాటు వారి టీం సభ్యులకు వారు అభినందనలు తెలిపారు. నవతెలంగాణ-సిటీబ్యూరో

దళితరత్న రేనికుంట్ల ఎల్లయ్యకు సేవా భూషణ్ పురస్కారం ప్రదానం



నవతెలంగాణ-ముషీరాబాద్

ఆల్ ద బెస్ట్ ఆర్ట్ అకాడమీ 19వ వార్షికోత్సవం సంద ర్భంగా సేవా స్వర్ణ నంది, సేవా భూషణ్, ఉపాధ్యాయ రత్న నేషనల్ అవార్డులను ప్రధానం చేశారు. బాగ్ లింగం పల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఈ అవా ర్డుల కార్యక్రమానికి హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ జి.చంద్రయ్య ముఖ్యఅతిథిగా విచ్చేసి అవార్డులను ప్రధానం చేశారు. సీనియర్ దళిత నాయకుడు, దళితరత్న, సేవ రత్న, దళిత కళ్యాణ వేదిక అధ్యక్షులు రేణిగుంట ఎల్లయ్యకు 2024 సంవత్సరానికి గాను సేవా భూషణ్ పురస్కారాన్ని జస్టిస్ జి చంద్రయ్య చేతుల మీదగా అందజేశారు. ఈ సందర్భం గా రేణిగుంట ఎల్లయ్య మాట్లాడుతూ తమ దళిత కళ్యాణ వేదిక ఆధ్వర్యంలో దేశాంతర, కులాంతర, మతాంతర, వర్గాంతర, అన్ని కులాల వారికి ఇప్పటివరకు 5,616 వివాహాలు చేసి సమాజంలో తమకంటూ గుర్తింపును తెచ్చుకున్నట్లు తెలిపారు. దళితులను వివాహం చేసుకున్న వారికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఫౌండేషన్ న్యూఢిల్లీ వారిచే రెండు లక్షల 50 వేలను ఉచితంగా అందించను న్నట్లు ఆయన తెలిపారు. ఇది కేవలం సమాజంలోని కుల నిర్మూలన అంటరానితనం కుల వివక్ష, వరకట్న నిషేధం రూపుమాపటం కోసం తమ వంతు కృషి చేస్తున్నట్లు ఆయ న తెలిపారు. తమ సేవ కార్యక్రమాలను గుర్తించి సేవా భూషణ్ అవార్డును అందించినందుకు అకాడమీ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో ఇండోర్ క్రీడలు షురూ



- ప్రారంభించిన టీజీవో, టీఎన్జీవోస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని (ముజీబ్) ఆదేశాల మేరకు హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎస్.విక్రమ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో భాగంగా గురువారం పురుషులకు, మహిళలకు ఇండోర్‌గ గేమ్స్ తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు ఏలూరు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఏ.సత్యనారాయణ, కేంద్ర సంఘ అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ముజీబ్ ప్రారంభించారు. టీజీవో జిల్లా అధ్యక్షులు ఎంబీ కృష్ణ యాదవ్, కేంద్ర సంఘం అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకట్, నాయకులు ముహమ్మద్ నాజిర్, బోలిగిద్ద శంకర్, రంగారెడ్డి అధ్యక్షులు లక్ష్మణ్, సిటీ యూనిట్ కార్యదర్శి హరికృష్ణ, మాజీ కార్యదర్శి జి.ప్రభాకర్, మాజీ సభ్యురాలు జానకి, ప్రత్యేక ఆహ్వానితులు సీమ ముజీబ్ పాల్గొన్నారు. గురువారం మహిళలకు క్యారమ్స్, చెస్, షటిల్ గేమ్స్ పోటీలు నిర్వహించారు. స్వామినాథన్ క్రికెట్ మెమోరియల్ టోర్నమెంట్ భాగంగా మూడో రోజు డెంటల్ జట్టుపై సీఆర్వో జట్టు, ఇరిగేషన్‌పై డీఈవో జట్టు, స్టాంప్స్ రిజిస్ట్రేషన్ పై హైదరాబాద్ యూత్ ఫోర్స్, ఐజీ జట్టుపై సీటీవో, ఎక్సైజ్ జట్టుపై అగ్రికల్చర్ యూనివర్సిటీ జట్టు, గాంధీ ఆస్పత్రిపై సెంట్రల్ సెంట్రల్ లైబ్రరీ జట్టు విజయం సాధించాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ కె.ఆర్.రాజ్ కుమార్, ఉపాధ్యక్షులు కుర్రాడి శ్రీనివాస్, సభ్యులు ఖాలిద్ అహ్మద్, వైదిక్ శాస్త్ర, ముఖీమ్ ఖురేషి, శ్రీధర్ నాయుడు, గీతా సింగ్, సుజాత మరియు మొహమ్మద్ వహీద్ పాల్గొన్నారు. ఆట పోటీలకు వచ్చిన ఉద్యోగులందరికీ భోజన సదుపాయాలు కల్పించారు.

కొర్వి కృష్ణస్వామి వర్ధంతి



నవతెలంగాణ-ఓయూ

కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ వర్ధంతి సందర్భంగా వారాసిగూడలోని శివాజీ విగ్రహం వద్ద, సికింద్రాబాద్ జూబ్లీ బస్టాండ్ దగ్గర ఉన్న ఆయన విగ్రహానికి కార్పొరేటర్ డాక్టర్ సామల హేమ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. ఆంధ్రప్రదేశ్ ఏర్పడినాక హైదరాబాద్ తొలి మేయర్‌గా ఆయన వ్యవహరించారని, నాలుగో మేయర్‌గానూ ఎన్నికయ్యారని గుర్తు చేశారు. ఆయన పాలనా కాలంలో ఎన్నో సంస్కరణలకు శ్రీకారం చుట్టారని, హైదారాబాద్ నగర అభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలను ప్రారంభించారని తెలిపారు. మహా నగరానికి 'మాస్టర్‌ప్లాన్' రూపకల్పన కృష్ణస్వామి మేయర్‌గానున్న కాలంలోనే జరిగిందన్నారు. ఆయన త్యాగాలను స్మరించుకునేందుకు, ఆయన మార్గాన్ని భావితరాలకు ఆచరించేందుకు తమ తరం ఎప్పటికీ ఆయన బాటలో నడుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ నాయకులు సారంగపాణి ,యాదగిరి, నగేష్,గణేష్,అశోక్, అజయ్ పాల్గొన్నారు.



అమిత్ షా మనువాద ఆలోచనలు మానుకోవాలి

- సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కడిగాళ్ల భాస్కర్

నవతెలంగాణ-తుర్కయంజాల్

కేంద్ర మంత్రి అమిత్ షా ఒంటినిండా మనువాద భావజాలాన్ని నింపుకొని అంబేద్కర్ ని అవమానకరంగా మాట్లాడడం ఈ దేశ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరచడమేనని సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్ అన్నారు. ముఖ్యంగా ఈ దేశంలో ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు హక్కుల పరంగా బాధ్యతల పరంగా రక్షణలను కల్పిస్తూ వారి ఎదుగుదల కోసం అంబేద్కర్ రాసిన రాజ్యాంగం సర్వోన్నతమైనదని అది జీర్ణించుకోలేని మనువాద పాలకులు కులాధిపత్యమతాధిపత్య భావజాలాన్ని విస్తరింప చేయడానికి సమ సమానత్వాన్ని ఆకాంక్షించిన అంబేద్కర్ ని విస్మరిస్తున్నారని ఇది భారత రాజ్యాంగ ఆకాంక్షలకు వ్యతిరేకమని వారన్నారు. ప్రపంచ దేశాలు, ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ సంస్థలు అంబేద్కర్ ని మేధావిధిగా కీర్తిస్తుంటే మన దేశ పాలకులు మాత్రం అవమానిస్తున్నారని అవేధన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ దేశ ప్రధాని మోడీ, కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షాలు ఈ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అమిత్ షా రాజీనామా చేయాలన్నారు. ఈ దేశ ప్రజలు జీవించడానికి కావలసినటువంటి జీవించే హక్కు, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం,సామాజిక న్యాయం ఇలా అనేక రకాలైన ప్రజాస్వామిక విలువలను అందించిన మహనీయుడు అంబేద్కర్ ని "స్మరించడం" ఏ నేరం కిందికి వస్తుందో అమిత్ షా రుజువు చేయాలన్నారు. అంబేద్కర్ శాస్త్రీయమైన ఆలోచన లను అమలు చేయకుండా అశాస్త్రీయమైన మనువాద భావజాలాన్ని పదేపదే పార్లమెంట్ లో ప్రస్తావించడం అమిత్ షా అనాగరికమైన ఆలోచనలకు నిదర్శనం అన్నారు.అంబేద్కర్ ప్రచురణలను పదేండ్లుగా ముద్రించకుండా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యమే అంబేద్కర్ పట్ల వాళ్లకు ఉన్న అక్కసుకు నిదర్శనం అన్నారు. అంబేద్కర్ భావజాలాన్ని అంబేద్కర్ ఆలోచనలను విస్తరింప చేయాలనే చిత్తశుద్ధి ఈ పాలకులకు ఉంటే ఏ మేరకు అంబేద్కర్ పేరు పైన పథకాలను తీసుకొచ్చారో, ఎన్నిసార్లు అంబేద్కర్ గురించి పార్లమెంట్ లో ప్రస్తావించారో ఈ దేశ ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని కనుమరుగు చేయడంలో భాగంగానే అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేసినట్లుగా పౌర సమాజం భావిస్తుందన్నారు. తక్షణమే అమిత్ షాను కేంద్ర మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పగడాల యాదయ్య బి సామేల్ డి జగదీష్ జిల్లా కమిటీ సభ్యులు ఈ నరసింహ డి.కిషన్ టీవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శంకర్ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి గణేష్ మున్సిపల్ నాయకులు ఎం సత్యనారాయణ కే అరుణ్ కుమార్ జే ఆశీర్వాదం కే శారద శ్రీరామ్ మూర్తి భాస్కర్ శ్రీధర్ శారద మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు

అమిత్ షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలి



- కాంగ్రెస్ జవహర్ నగర్ అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్
- పలు చోట్ల షా దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ - జవహర్ నగర్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షాను మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పార్లమెంటులో చర్చల సందర్భంగా బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అవహేళన చేస్తూ, అవమానపరిచే విధంగా మాట్లాడిన కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను గురువారం బాలాజీ నగర్ చౌరస్తాలో దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, కార్పొరేటర్ బింగి లావణ్య సతీష్ గౌడ్, గొడుగు వేణు, శారద మనోహర్ రెడ్డి, కుతాడి సాయికుమార్, బల్లి శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మాట్ల వినయ్ కుమార్, నాయకులు కొత్తకొండ వేణు, భాస్కర్, బూడిద వెంకటేష్, మిట్టు, సునీత, సుగుణ, లతా, ధనమ్మ తదితరులున్నారు.

నేరేడ్‌మెట్‌లో..

రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్‌ను పార్లమెంట్‌లో కించపరిచే విధంగా కేంద్ర మంత్రి అమిత్ షా మాట్లాడడాన్ని వ్యతిరేకిస్తూ మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో గురువారం నేరేడ్‌మెట్ చౌరస్తాలో అమిత్ షాకు వ్యతిరేకంగా నిరసన తెలిపి, దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ ఆనంద్ బాగ్ కార్పొరేటర్ ప్రేమ్ కుమార్, ఎస్ఆర్ ప్రసాద్, చంద్రశేఖర్, సానాది శంకర్, మోతే సాయికుమార్, సత్యనారాయణ, కే.చెన్నారెడ్డి, యాది, కుమార్, ఏ బ్లాక్ అధ్యక్షులు అశోక్ రెడ్డి, కన్నె మల్ల నాగరాజు, మల్కాజిగిరి సర్కిల్ డివిజన్స్ అధ్యక్షులు సంపత్ గౌడ్, వైనాల ప్రవీణ్, వినోద్ యాదవ్, వెంకటేశ్వర్ రావు, కుమార్, ఇందిరా ప్రియదర్శిని, శారదా, ప్రభా, తదితరులు పాల్గొన్నారు.

దళిత సంఘాల ఆధ్వర్యంలో..

పార్లమెంట్ సమావేశంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్‌ను పొగడడం ఫ్యాషన్ అయిపోయిందని అంబేద్కర్ పేరు బదులు హిందూ దేవుళ్లను స్మరిస్తే స్వర్గానికి పోతారని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ హేళన చేస్తూ మంగళవారం రాజ్యసభలో అవమానకరంగా మాట్లాడిన కేంద్ర హెూంమంత్రి అమిత్ షా తీరును వ్యతిరేకిస్తూ గురువారం మల్కాజిగిరిలోని ఆనంద్ బాగ్ చౌరస్తాలో మల్కాజిగిరిలోని వివిధ దళిత సంఘాల నాయకుల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తూ అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని తీసివేయాలని, కులాల మధ్య రిజర్వేషన్ చిచ్చు పెట్టాలని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు రావుల అంజయ్య, గంగాధరి కృష్ణ. పి.ఎస్ శ్రీనివాస్. ఎలిమెల గణేష్, ఉపేందర్, నీలం సతీష్, లక్ష్మీ ఆనంద్, కవిత, బైరు అనిల్, జంగిలి శివకుమార్, ఎలిమెలి ప్రశాంత్, జి. నరేష్, సురేష్, చరణ్, గిరి, గోపీనాథ్, మేకల నర్సింగ్ రావు, మల్లేష్, నర్సింగ్ రావు, బాలరాజ్. భరత్ కుమార్, వెంకటేష్, తదితరులున్నారు.

అమిత్ షా వాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

ఎలిమేల ప్రశాంత్



అంబేద్కర్‌పై అమిత్‌షా చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను వెనక్కి తీసుకోని క్షమాపణలు చెప్పాలని దళిత జర్నలిస్టుల పక్షాన డిమాండ్ చేస్తున్నామని ఎలిమేల ప్రశాంత్ అన్నారు.అంబేద్కర్, అంబేద్కర్ అంటూ పదే పదే అనడం ఇప్పుడు ఓ ఫ్యాషన్‌గా మారిందని, దీనికి బదులుగా దేవుడిని ఇన్నిసార్లు స్మరిస్తే, స్వర్గానికి వెళ్లొచ్చని సాక్షాత్తు పార్లమెంట్‌లో అమిత్ షా అనడం బాధాకరమన్నారు. దేశంలోనే ఉన్నతమైన పదవుల్లో ఉండి అంబేద్కర్‌ను అవమానించడం సరికాదన్నారు. ప్రపంచ మేధావి అంబేద్కర్‌ను అవమానించే హక్కు అమిత్‌షాకు లేదని, అంబేద్క ర్‌ను అవమానించిన ఆయనను వెంటనే మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో దేశంలో దళితుల సంఘాలు ఏకమై పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.





తెలంగాణ రాష్ట్ర గవర్నర్ బిష్ణు దేవ్ వర్మను రాజ్ భవన్‌లో కలిసిన పాత బస్తీకి చెందిన ప్రముఖ హైదరాబాద్ సాంప్రదా యు వస్త్ర వ్యాపారి అభిద్ మోహియుద్దీన్ మఖ దుమ్
నవతెలంగాణ-ధూల్‌పేట్



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
శుక్రవారం | డిసెంబర్ 20, 2024 | www.navatelangana.com

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

- పీసీసీ మాజీ అధ్యక్షులు వీహెచ్ హనుమంత్ రావు



నవతెలంగాణ-అంబర్‌పేట

కేంద్ర హోంమంత్రి పదవి నుండి అమిత్ షాను వెంటనే బర్తరఫ్ చేయాలని పీసీసీ మాజీ అధ్యక్షులు వీహెచ్ హనుమంతరావు కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. లేనియెడల రాష్ట్రపతి అమిత్ షాను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు క్షమాపణలు చెప్పాలని సత్యాగ్రహ దీక్షను వీహెచ్ హనుమంతరావు నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణ గౌడ్, రామ్మోహన్, లక్ష్మణ్, తోలుపునూరి నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'అమిత్ షా వాఖ్యాలు వెనక్కి తీసుకోవాలి'

- ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్

నవతెలంగాణ-హిమాయత్ నగర్

రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా వేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, భేషరతుగా క్షమాపణలు చెప్పాలని అఖిల భార త యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు వలీ ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అమిత్ షా రాజ్యసభలో చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని, దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్‌కు, ఆయన సిద్ధాంతాలకు బీజేపీ వ్యతిరేకమని విమర్శించారు. సంఘ్ పరివార్‌పై అంబేద్కర్ ప్రధాన పాత్ర పోషించి రూపొందించిన భారత రాజ్యాంగంపై ఇసుమంత గౌరవం లేదని అనేక సార్లు రుజువైంద న్నారు. ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చిన అమిత్ షా నోటికొచ్చినట్టు అంబేద్కర్ అని ఐదు సార్లు, ప్రతి పక్షాలపై విరుచుకుపడ్డారని, అమిత్ షా ప్రతి పక్షాలను దుయ్యబట్టడానికే ఈ మాట ప్రస్తావించి ఉండవచ్చు కానీ అంబేద్కర్ ను తీవ్రంగా అవమానించారన్నారు.









బుక్ ఫెయిర్ ప్రారంభం

ఎన్టీఆర్ స్టేడియంలో 37వ బుక్ ఫెయిర్‌కు తరలివచ్చిన పుస్తక ప్రియులు







అంబేద్కర్‌ను అవమానిస్తూ మాట్లాడిన అమిత్ షా క్షమాపణ చెప్పాలి

- సీపీఐ(ఎం) గోషా మహల్ నేత పి.నాగేశ్వర్



నవతెలంగాణ-ధూల్‌పేట్

"అంబేద్కర్! అంబేద్కర్!! అంటూ మాట్లాడే బదులు దేవుడిని స్మరించుకుంటే ఏకంగా స్వర్గానికి పోవచ్చంటూ" అంబేద్క ర్‌ను అవమానించేలా సాక్షాత్తూ గతదినం పార్ల మెంట్‌లో మాట్లాడిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలను సీపీఐ (ఎం) గోషామహల్ జోన్ కమిటి తీవ్రంగా ఖండిస్తుందన్నారు. విభిన్న సంస్కృతులు, ఆచారాలు కలిగిన ప్రజలు ఐక్యమత్యంతో ఉండేలా ఓ ఉన్నత స్థానం లో ఉండి మాట్లాడటం సరికాదన్నారు. సామాన్య ప్రజల హక్కులు కలిగి ఉండేలా రాజ్యాంగ రచన చేసిన అంబేద్కం ను చులకన చేస్తూ అవమానకరంగా మా ట్లాడిన ఆయన తక్షణం దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నది. ఈ మేరకు సీపీఐ(ఎం) గోషా మహల్ జోన్ కన్వీ నర్ పి.నాగేశ్వర్ ఒక ప్రకటన చేశారు. ఈ దేశంలో బడుగు, బలహీన వర్గాలు అభివృద్ధి కావడానికి దోహదపడేలా అంబేద్కర్ రాజ్యాంగ రచన చేశారన్నారు. ఇది గిట్టని ఆర్ఎస్ఎస్ శక్తులు ఇప్పుడున్న రాజ్యాంగం స్థానంలో కులాల మధ్య అంతరాలు శాశ్వతంగా కొన సాగించాలనే మనుధర్మాన్ని తీసుకురావాలని చూస్తు న్నాయన్నారు. దానిలో భాగమే జమిలి ఎన్నికల బిల్లు తేవాలనే ప్రయ త్నం అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. మనువాద సిద్ధాంతానికి వ్యతిరేకంగా భారత రాజ్యాంగంలో అంబేద్కర్ పొందుపరిచిన అంశా లు గిట్టని అమిత్ షా పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌ను కించ పర్చడాన్ని సీపీఐ(ఎం) తీవ్రంగా ఖండించారు. అమిత్ షా తక్షణం దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. లేనిచో వారం రోజులపాటు సీపీఐ(ఎం) నిరసన కార్యక్రమాలు చేపట్టను న్నదని తెలిపారు. సామాజి క వర్గాలు, ప్రజాస్వామిక వాదులు ఈ ఘటనను ఖండిం చాలని కోరారు. 'స్వర్గం' అనేది ఒకటి ఉన్నట్లు ఇప్పటి వరకు ఎవరూ నిరూపిం చలేదన్నారు. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామ న్నారు. తక్షణమే దేశ ప్రజలకు హోం మంత్రి క్షమాపణ చెప్పాలని లేనిచో బీజేపీ మను వాద వైఖరిపై నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు.

అమిత్ షాపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయండి



- కేవీపీఎస్ నగర నాయకులు మహేందర్

నవతెలంగాణ-అంబర్‌పేట

రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన అవమానకరమైన వ్యాఖ్యలపై ఆయన పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేసి ఆయనపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని కేవీపీఎస్ అంబర్‌పేట జోన్ కమిటీ ఆధ్వర్యంలో అమిత్ షా దిష్టిబొమ్మను తిలక్ నగర్ చౌరస్తాలో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాటా డుతూ అమిత్ షా ఖబడ్దార్ అంబేద్కర్ జిందాబాద్ రాజ్యాం గం వర్ధిల్లాలి అంటూ కేవీపీఎస్ నాయకులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ నగర నాయ కులు మహేందర్, కేవీపీఎస్ గ్రేట్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ జిల్లా కార్యదర్శి బి.సుబ్బారావు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అవమానపరిచి మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను భర్తరఫ్ చేయాలని వారి డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలోనే కాకుండా ఆర్ఎస్ఎస్, బీజేపీ తర చుగా వ్యక్తం చేసే అసహనం, భారతదేశంలో సామాజిక న్యాయం, సమానత్వం కోసం డాక్టర్ అంబేద్కర్ పోరాడి నడిపిన ఉద్యమాలు, ఆదర్శాల పట్ల వారి లోతైన ద్వేషాన్ని వెల్లడిస్తుందన్నారు. డిసెంబర్ 20,21న అన్ని సామాజిక ప్రజాసంఘాలతో కలిసి రాష్ట్ర వ్యాప్త నిరసనలు చేపడు తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ నగర నా యకులు జి.రాములు నియోజకవర్గ సభ్యులు అర్జున్, జనా ర్ధన్, మహదేవ్, కిషన్, ఆంజనేయులు తదితరులున్నారు.

కుక్కల బెడద నుంచి ప్రాణాలను కాపాడాలి

- డీవైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి జావీద్



నవతెలంగాణ-అంబర్‌పేట

హైదరాబాద్ నగరంలో ప్రతి రోజు ఏదో ఒక చోట వృద్ధులు, చిన్న పిల్లల ప్రాణాలను కుక్కలు తీస్తున్నాయని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.డి జావీద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబర్‌పేట అలీ కేఫ్, మూసారాం బాగ్ ఎస్‌బిఐ కాలనీలో ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారిపై వీధి కుక్క దాడి చేయబోతుంటే స్థానికులు గమనించి చిన్నారిని ప్రాణాలు కాపాడరన్నారు. స్థానికులు గమనించకపోతే ప్రాణాలు పోతుండేవని గత కొన్ని రోజులుగా జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదన్నారు. ఇలాంటి పరిస్థితి అన్ని ప్రాంతాల్లో ఉందన్నారు. వార్డు ఆఫీస్‌లలో ఫిర్యాదు చేసిన స్పందించడం లేదన్నారు. వెంటనే జీహెచ్ఎంసీ కమిషనర్, కలెక్టర్, అధికారులు స్పందించి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి కుక్కలను తరలించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కలెక్టర్ కార్యాలయాల ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా నగరంలో గత కొన్ని రోజులుగా స్ట్రీట్ లైట్ల సమస్య కూడా విపరీతంగా ఉందని అక్కడక్కడ దొంగతనాలు కూడా జరుగుతు న్నాయని వెంటనే స్ట్రీట్ లైట్లపై ప్రభుత్వం దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

రెండు రాష్ట్రాల్లో గౌడ కులాల అభివృద్ధికి కృషి

- తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మెన్ బాలగౌని బాల్ రాజ్ గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్
- ఆంధ్ర ప్రదేశ్ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్‌కు వినతి



నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలలో గౌడ కులానికి అండగా ఉండి అభివృద్ధికి కృషి చేయాలని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మెన్ బాలగౌని బాల్ రాజ్ గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్, వర్కింగ్ చైర్మెన్ ఎలికట్టే విజయ్ కుమార్ గౌడ్‌లు అన్నారు. ఈ మేరకు గురువారం ఆంధ్ర ప్రదేశ్ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు గౌడ కులం తమ కల్లుగీత వృత్తి, మద్యం అమ్మకాలు చేసుకోవడం ఆనవాయితీ .. విడిపోయిన అన్నదమ్ముల మధ్య ఉన్న అనుబంధంతో రెండు రాష్ట్రాలలో గౌడ కులానికి అండగా ఉండి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. తెలంగాణలో వైన్స్‌లలో గౌడ్స్‌కు రిజర్వేషన్లు కల్పిస్తున్న ప్రభుత్వం, ఆంధ్ర ప్రదేశ్‌లోను తెలంగాణ మాదిరిగా వైన్ షాపులలో కల్లుగీత వృత్తిదారులకు 10శాతం రిజర్వేషన్లు ఇస్తున్నామన్నారు.

నవతెలంగాణ-ముషీరాబాద్



ముషీరాబాద్ నియోజకవర్గం అడిక్‌మెట్ డివిజన్ మేడిబావి బస్తీలో ప్రభాకర్ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడి పూజ కార్యక్రమం జరిగింది. విజయ్ గురుస్వామి ఆధ్వ ర్యంలో అయ్యప్ప పాటల భజన నిర్వ హించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ గురుస్వామి అయ్యప్ప స్వామికి విశిష్ట పూజలను చేశారు. ఈ పూజలో శ్రీధర్ రెడ్డి గురుస్వామి, ప్రవీణ్ గురుస్వామి, రాము గురుస్వామి తదితరులున్నారు.

'కాస్మోటిక్ డెంటిస్ట్రీ, టీత్ జ్యూయలరీ ప్రారంభం'

- సినీతారలు, మోడల్స్‌కు ఇదో వరం
- ప్రారంభం సందర్భంగా పక్షం రోజుల పాటు ప్రత్యేక రాయితీలు
- విదేశాల్లో లభ్యమయ్యే ట్రీట్‌మెంట్ ఇప్పుడు భాగ్యనగరంలోనే అందుబాటులో..
- బాలీవుడ్ స్టార్స్ దానీబోస్, స్నేహాషా సందడి



నవతెలంగాణ-హిమాయత్ నగర్

జంట నగరాల వాసులకు కాస్మోటిక్ డెంటిస్ట్రీ, టీత్ జ్యూయలరీ సేవలు అందుబాటులోకి వచ్చాయని ఓషన్ ఇంటర్నేషనల్ డెంటల్ హాస్పటల్స్ చైర్మెన్ డాక్టర్ పి.ప్రసాద్ తెలిపారు. గురువారం హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో కాస్మోటిక్ డెంటీస్ట్రీ, టీత్ జ్యూయలరీ బ్రోచర్‌ను బాలీవుడ్ స్టార్స్ దానీబోస్, స్నేహాషా చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.ప్రసాద్ మాటా డుతూ విదేశాల్లో లభ్యమయ్యే ఈ అరుదైన ట్రీట్‌మెంట్‌ను మాదాపూర్‌లోని దుర్గంచెరువు రోడ్డులో ఉన్న ఓషన్ ఇంట ర్నేషనల్ డెంటల్ హాస్పటల్ నందు నగర ప్రజలకు అందు బాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. ప్రారంభోత్సవం సందర్భంగా తమ హాస్పటల్ నందు సంప్రదించిన కాలేజ్ స్టూడెంట్స్, మోడల్స్, సినీతారలకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి రాయితీలు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ ట్రీట్‌మెంట్స్‌ను ఫిల్మ్, మోడల్స్, బిజినెస్ ఐకాన్స్, పొలిటీషి యన్స్, కాలేజ్ ఐకానిక్ యూత్‌కు ఇదో ప్రత్యేక వరమని చెప్పారు. ముఖ్యంగా విదేశాల్లో శిక్షణ పొందిన కాస్మోటిక్ డెంటల్ సర్జన్లు మాత్రమే ఈ చికిత్సలు తమ హాస్పటల్ లో చేస్తారని తెలిపారు. దేశ వ్యాప్తంగా తమ ఓషన్ ఇంటర్నే షనల్ డెంటల్ హాస్పటల్స్‌ను శాఖలుగా విస్తరిస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం బాలీవుడ్ స్టార్స్ దానీబోస్, స్నేహాషాలు మాట్లాడుతూ సినీతారలు, మోడల్స్‌కు ఈ ట్రీట్‌మెంట్‌ను అందుబాటులోకి తీసుకురావడం అభినంద నీయమన్నారు. ఒకప్పుడు ఈ ట్రీట్‌మెంట్ కోసం ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి విదేశాలకు వెళ్లాల్సి వచ్చేదని ఇప్పు డు ఆ పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌టీపీసీ అధ్యక్షులు చైతన్య జంగా, కార్యదర్శి పీవీఎస్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

హర్షవర్ధన్ రెడ్డి గెలుపునకు కృషి చేస్తాం

- 36 ఉపాధ్యాయ సంఘాల టీచర్స్ జేఏసీ



నవతెలంగాణ-ముషీరాబాద్

హర్షవర్ధన్ రెడ్డి గెలుపునకు కృషి చేస్తామని 36 ఉపాధ్యాయ సంఘాల టీచర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు తెలిపారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 36 ఉపాధ్యాయ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జేఏసీ చైర్మెన్ మణిపాల్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీ పర్వత సత్య నారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో టీచర్ సంఘాల జేఏసీ బలపరిచిన హర్షవర్ధన్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని తెలిపారు. హర్షవర్ధన్ రెడ్డిని ఎందుకు ప్రకటించామంటే ప్రస్తుత ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యపై ప్రత్యేక అవగాహన సమస్యల పరిష్కా రానికి కృషి చేయగలరని హర్షవర్ధన్ రెడ్డిని ఎన్నుకు న్నామన్నారు. ఉపాధ్యాయులందరూ అభ్యర్థి మద్దతు తెలిపి గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కో చైర్మెన్‌లు గోవింద్ నాయక్, లచ్చి రామ్, నర్సింలు, టి. సత్యనారాయణ, రఘునందన్ రెడ్డి, వైస్ చైర్మెన్ లింగస్వామి, బల్వంత్ రెడ్డి, ఉమాకర్ రెడ్డి, అంజన్న లింగస్వామి బీటీఎఫ్ యాదగిరి, చాగంటి ప్రభాకర్, ఆదర్శ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా విశ్వవిద్యాలయం బిల్లు ఆమోదం పట్ల హర్షం



- విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్లు, విద్యార్థినీల సంబరాలు..

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

తెలంగాణలో మహిళల విద్యను ప్రోత్సహిస్తూ వారి సంక్షేమాన్ని కోరుతూ వీరనారి చాకలి ఐలమ్మ పేరిట మహిళా విశ్వవిద్యాల బిల్లును సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టడం పట్ల హర్షం వ్యక్తం చేస్తు న్నామని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ సూర్య ధనుంజయ్ అన్నారు. గురువారం కోఠి లోని విశ్వవిద్యాలయంలో దర్బార్ హాల్ ముందు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాన్ని ప్రదర్శిస్తూ సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రానికి ఒక మహిళా యూనివర్సిటీ ఉంటే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధిలో విద్యావంతులైన మహిళల పాత్రను పెంచడానికి ఆస్కారం ఉంటుందన్నారు. అసెంబ్లీలో ఈ యూనివర్సిటీ బిల్లు ఆమోదం పొందడం పట్ల తెలంగాణ విద్యార్థినులు, ఆడ బిడ్డలు, తెలంగాణ సమాజం సీఎం రేవంత్ రెడ్డికి రుణపడి ఉన్నారన్నారు. ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం తరపున, మా ఆచార్యమణులు, అధ్యాపకులు, విద్యార్థినుల తరపున సీఎం రేవంత్ రెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. యూనివర్సిటీ స్వయం ప్రతిపత్తికి తనదైన అస్తిత్వం లభించినట్టయిందన్నారు .ఇన్నాండ్లు యూనివర్సిటీ అనేది ఉన్నా కొనసాగుతున్న అధికారిక చట్టం చేయబడకపోవడంతో ఓయూ పేరిటనే మా విద్యార్థి నుల పట్టాలు జారీయ్యాయి. నేటితో మాకంటూ ఒక ప్రత్యే క గుర్తింపు లభించిందన్నారు. యూనివర్సిటీ అభి వృద్ధిలో, కోర్సుల నిర్వహణలో, విద్యార్థినుల సంక్షేమం విషయంలో తమదైన శైలిలో ముందుకు నడిచే అవకాశం మాకు లభించిందని తెలిపారు. ప్రభుత్వం మరిన్ని మౌలిక వసతు ల కల్పన కోసం సహాయం అందించాలని కోరారు. 6 వేల మంది విద్యార్థినులకు విద్యను అందిస్తున్నామని తెలిపారు. వెయ్యి మంది విద్యార్థినిలకు వసతి కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వం సహకరిస్తే అందరికీ వసతి కల్పించనవచ్చు న్నారు. యూనివర్సిటీకి కావాల్సిన వసతుల కల్పన కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి ప్రొ ఫెసర్ సర్వస్వతమ్మ, ప్రొఫెసర్లు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

'నేడు ఆటో డ్రైవర్ల 'చలో అసెంబ్లీ'

- వేలాది మంది ఆటో కార్మికులతో అసెంబ్లీ ముట్టడి
- ఇది జీవన్మరణ పోరాటం, లాటీలు, తూటాలు తగిలిన వెనుకడుగు వేసే ప్రసక్తే లేదు
- తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ వెల్లడి



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఆటో డ్రైవర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని గత కొంత కాలంగా తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ చేస్తున్న ఆందోళనలను సీఎం ఎ.రేవంత్ రెడ్డి ప్రభుత్వం పట్టించుకోకుండా, మోసపూరిత వైఖరి అవలంభిస్తున్నందుకు నిరసిస్తూ డిసెంబర్ 20న (నేడు) ఆటో డ్రైవర్ల 'చలో అసెంబ్లీ' కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నామని, ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గత ఆరు నెలల నుండి చర్చల పేరుతో కాలయాపన చేస్తున్నారని తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ ఆరోపించి ంది. ఆటో డ్రైవర్లకు ఇది జీవన్మరణ పోరాటమని, లాటీలు, తూటాలు తగిలిన వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని, వేలాది మంది ఆటో కార్మికులతో హైదరాబాద్, హిమాయత్ నగర్, సత్యనారాయణరెడ్డి భవన్ నుండి భారీ ప్రదర్శన నిర్వ హించి అసెంబ్లీ ముట్టడి చేపడుతామని తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ నేతలు బి.వెంకటేశం (ఏఐటీ యూసీ), లక్ష్మణ్ (సీఐటీయూ), ఎంఏ.సలీం, ఎండి.నజీర్ (యుటిఏడబ్ల్యూఏ), వి.మారయ్య ఎస్.రాంకిషన్ (బీఆర్ టీ యు), ఏ.సత్తిరెడ్డి (టీఏడీఎస్), వి.ప్రవీణ్ (టీయుసీఐ), సి హెచ్.జంగయ్య, మల్లికార్జున్ (ఏఐటీయూసీ)లు వెల్లడిం చారు. గురువారం హైదరాబాద్, హిమాయత్ నగర్‌లోని ఎస్.సత్యనారాయణరెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమాజంలో జేఏసీ కన్వీనర్ బి.వెంకటేశం మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వం దగా చేసిందని, అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ తమ ఎన్నికల మానిఫెస్టోలో ఆటో కార్మికుల సమ స్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి నెరవేర్చకుండా అన్యాయం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరిస్తామని ఈ నెలలో జరిగిన చర్చల సందర్భంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్త 'ఆటో బంద్' ను విరమించుకు న్నామని, అనంతరం ఇప్పటి వరకు సమస్యలను పరిష్కరిం చకుండా దాటవేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తం గా ఉన్న ఆటో కార్మికులందరూ నేడు ఉదయం ఎస్. సత్యనారాయణరెడ్డి భవన్ చేరుకుని వేలాది మంది ఆటో డ్రైవర్లతో జరిగే 'చలో అసెంబ్లీ' కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని బి.వెంకటేశం విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రంలో బధీరులకు జూనియర్, డిగ్రీ కళాశాలు ఏర్పాటు చేయాలి

- డెవలప్మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ అధ్యక్ష ఉపాధ్యక్షులు, వల్లభనేని ప్రసాద్, కాటమోని వెంకటేశ్



నవతెలంగాణ-ముషీరాబాద్

రాష్ట్రంలో బధీరులకు జూనియర్, డిగ్రీ కళాశాలు ఏర్పాటు చేయాలని డెవలప్మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ అధ్యక్ష ఉపాధ్యక్షులు, వల్లభనేని ప్రసాద్, కాటమోని వెంకటేశ్‌లు అన్నారు. ఈ సందర్భంగా ఉమెన్స్ చిల్డ్రన్స్ డిసబుల్ అధికారి అనిత రామ చంద్రన్‌ను తన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఇంటర్ డిగ్రీ కాలేజీలు ప్రత్యే కంగా బధీరుల కోసం ఏర్పాటు చేయాల ని దివ్యాంగుల రాష్ట్ర కమిషనర్, డైరెక్టర్, 33 జిల్లాల వికలాంగుల సంక్షేమ శాఖ అధికారులుగా వికలాంగులను మాత్రమే నియమించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మా డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తామని అధికారి హామీ ఇచ్చినట్టు తెలిపారు.


'రతన్ టాటా జయంతి ఉత్సవాల సందర్భంగా వ్యాసరచన పోటీలు'

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో రతన్ టాటా జయంతి ఉత్సవాల సందర్భంగా ఈ నెల 23న ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు నగరంలోని వివిధ కళాశాలలు, యూనివర్సిటీల్లో ఎంబీఏ చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ భాషలలో వ్యాసరచన పోటీలను సరోజినీ నాయుడు వనిత మహా విద్యాలయం, ఎగ్జిబిషన్ గ్రౌండ్ ఎంబీఏ బ్లాక్‌లో నిర్వహిస్తున్నామని తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'రతన్ టాటా ఏ విజనరీ లీడర్ షేపింగ్ ఫిలాంత్రోపీ అండ్ బిజి నెస్ ఇన్ ఇండియా' అనే అంశంపై వ్యాసరచన పోటీలు ఉంటాయన్నారు. 28న శనివారం ఉదయం 10 గంటలకు ఆబిడ్స్ లోని బొగ్గులకుంట లోని తెలంగాణ సరస్వత పరిషత్ ఆడిటోరియంలో రతన్ టాటా జయంతి ఉత్సవాల ను పురస్క రించుకుని జరిగే కార్యక్రమంలో గెలుపొందిన విజేతలకు బహుమ తులు, సర్టిఫికెట్లు, మెడల్స్ ప్రధానం చేయనున్నట్లు ఆయన తెలిపారు.మరిన్ని వివరా లకు ఫోన్ నెంబర్: 9948882604ను సంప్రదించగలరని కోరారు.

అమిత్ షా వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన వాఖ్యలను వెనక్కి తీసు కోవాలని తెలంగాణ జన సమితి పార్టీ హైదరాబాద్ అధ్యక్షులు నరసయ్య అన్నారు. గురువారం అంబేద్కర్ మీద అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా దిష్టి బొమ్మను తెలంగాణ జన సమితి పార్టీ (టీజేఎస్)ఆధ్వర్యంలో టీజేఎస్ రాష్ట్ర కార్యాలయం ఎదుట దహనం చేశారు. ఈ సందర్భంగా టీజేఏస్ నేతలు నర్సయ్య, సర్దార్ వినోద్ కుమార్‌లు మాట్లాడు తూ.. భారత రాజ్యాంగం నిర్మించి దేశంలో కోట్లాది మంది అణగారిన వర్గాల గొంతుగా మారి అన్ని వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన బాబా సాహెబ్ అంబేద్కర్‌పై అమిత్ షా అవమానకర రీతిలో వాఖ్యాలు చేయడం దురదృష్టకరమని, వాఖ్యాలు వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అమిత్ షా క్షమాపణలు చెప్పని యెడల దేశ వ్యా ప్తంగా బీజేపీకి తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ నాయకులు బట్టల రాంచందర్, మనేపల్లి లక్ష్మణ్, పుష్పానీలగౌడ్, జైపాల్ రెడ్డి, హన్మంతు గౌడ్, రంజిత్ కుమార్, మాణిక్యం, భాస్కర్, భూషణ్, సురేష్ కుమార్, సయ్యద్ అబ్రార్, కృష్ణ, రమణ తదితరులున్నారు.

నవతెలంగాణ-అంబర్‌పేట

సిండికేట్ బ్యాంక్ తెలంగాణ మల్టీ పర్పస్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ ఎన్నికల్లో నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. గురువారం కాచిగూడలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా సయ్యద్ ఇక్బాల్, కార్యదర్శిగా పరమేశ్వర్, ఉపాధ్యక్షుడిగా వెంకటి, కోశాధికారిగా వినోద్ కార్యవర్గ సభ్యులుగా హనుమంతరావు, శ్రీనివాస్, శ్రీకాంత్, లక్ష్మయ్య ఎన్నిక య్యారు. ప్రతినిధులు వెంకటరమణ, వసంతసేన రాజు, శ్రీనివాస్ నాయక్, అబ్దుల్లాహ్, వెంకటేశ్వర్రావు. ఆనంద్ కుమార్, నవీన్కుమార్, రాజ్‌కుమార్, మహేష్ మురళీ తదితరులు పాల్గొన్నారు.





అనుపమ నాదెళ్ల... మైక్రోసాఫ్ట్ సీఈవో సత్యనాదెళ్ల భార్యగా అందరికీ తెలుసు. ఆమె తండ్రి కేఆర్ వేణుగోపాల్ ప్రధానమంత్రి కార్యాలయంలో ఉన్నత పదవుల్లో పనిచేసిన విశ్రాంత ఐఏఎస్ అధికారి. గ్రామీణ మహిళలని స్వయం ఉపాధి దిశగా నడిపిస్తే దేశం అభివృద్ధి బాట పడుతుందని బలంగా నమ్మేవారాయన. ఇదే విషయాన్ని తరచూ తన కూతురితో పంచుకునేవారు. అలాంటి ఆమె ఒకరికి భార్యగా, ఒకరికి బిడ్డగానే కాకుండా ఓ శక్తివంతమైన మహిళగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. అనంతపురం, ఛత్తీస్‌గఢ్ సహా పలు ప్రాంతాల్లో మహిళలు, పిల్లల కోసం కోట్ల రూపాయలతో సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు. అనారోగ్యంతో కొడుకును పోగొట్టున ఆమె పేద పిల్లల ఆరోగ్యం కోసం మరింత శ్రద్ధతో పని చేస్తున్నారు.



సేవా పథంలో అనుపమ

కరువుకు నెలవైన ప్రాంతం... నెర్రెలు విచ్చిన నేలలు.. చినుకు రాకకోసం దిగాలుగా ఎదురు చూసే రైతులు.. ఏండ్లు గడిచినా అనంతపురం ముఖచిత్రంలో పెద్దగా మార్పేమీ రాలేదు. ఏండ్ల తరబడి ఉపాధిలేమితో కొట్టుమిట్టాడుతున్న ప్రజలు. అలాంటి ఆ ప్రాంత వాసులకు ప్రత్యామ్నాయ స్వయం ఉపాధి అవకాశాలని అందించే ప్రయత్నం చేస్తోంది ఆర్‌డీటీ(రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్). దాని అనుబంధ సంస్థే యాక్షన్ ఫ్రేటెర్నా ఎకాలజీ సెంటర్. ఫాదర్ విన్సెంట్ ఫెరర్ ప్రారంభించిన ఈ సంస్థ ఇప్పటివరకు వేలాది మంది రైతులూ, మహిళలకు ఉపాధి బాటలు చూపించింది. ముఖ్యంగా వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్, కరవు నివారణ చర్యలు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై ఈ సంస్థ కృషి చేస్తోంది. 40 వేలమంది మెట్ట రైతులు, రైతు కూలీలతో కలిసి పనిచేస్తోంది. దీనికి ఆకర్షితురాలైన అనుపమ నాదెళ్ల ఈ సంస్థతో కలసి తనూ సేవాబాట పట్టారు.

కుటుంబం కోసం..

అనుపమ తమిళనాడులోని కళాక్షేత్ర, హైదరాబాద్‌లోని నాసర్‌స్కూల్, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, ఢిల్లీలోని ఢిల్లీ పబ్లిక్‌స్కూల్‌లో విద్యాభ్యాసం చేశారు. ఆమె తల్లి లక్ష్మీ టీచర్ కావడంతో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కి ఇద్దరూ కలిసివెళ్లేవారు. మణిపాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఆర్కిటెక్చర్ చదువుకున్నారు. ఉన్నత విద్యకోసం బ్రిటిష్ కొలంబియా ఆర్కిటెక్చర్ కళాశాలలో అవకాశం వచ్చినా కుటుంబం కోసం చదువుకు దూరమయ్యారు. ఇప్పటికీ భారతీయ వంటకాలని ఎలా చేయాలో తెలుసుకోవడం కోసం తల్లికి ఫోన్ చేస్తుంటారు. జంతువులంటే ప్రాణం పెడుతుంటారు. పెండ్లి తర్వాత ఆమె ఎక్కువ కాలం కుటుంబంపైనే దృష్టి పెట్టారు. తన ముగ్గురు పిల్లలు కాస్త పెద్దయిన తర్వాత సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

లోతైన అవగాహన కోసం...

ముఖ్యంగా మహిళలని వ్యవసాయేతర విభాగాల్లో ఉపాధివైపు నడిపించాలనేది అనుపమ లక్ష్యం. మహిళలకు చిన్నవ్యాపారాలు, పాడిపరిశ్రమలు, గొర్రెల పెంపకం వంటి పనుల్లో శిక్షణ అందిస్తే కరవుని తట్టుకుని నిలబడతారనేది ఆమె అభిప్రాయం. ఇందుకోసం రెండుకోట్ల రూపాయలను సాయంగా అందించారామె. అయితే గ్రామీణ భారత మహిళలకు ఏదో చేయాలనే ఆమె తపన ఈనాటిది కాదు. చిన్నతనంలోనే అనుపమ మెదడులో ఈ సేవాబీజాలు పడ్డాయి. ఆమె తండ్రి వేణుగోపాల్ పలుప్రాంతాల్లో కలెక్టర్‌గా పనిచేశారు. అనంతపురం వంటి వెనుకబడిన ప్రాంతాల్లో మహిళలని స్వయం ఉపాధి బాట పట్టించేందుకు కృషిచేశారు. ఉద్యోగరీత్యా ఆయన దేశమంతా పర్యటించాల్సి వచ్చింది. అప్పుడే దేశంలోని సమస్యలని అర్థం చేసుకునేందుకు తండ్రి సూచనల మేరకు 'ది ఇలస్ట్రేటెడ్ వీక్లీ ఆఫ్ ఇండియా' వంటి పత్రికలని అనుపమ చాలా ఆసక్తిగా చదివేవారు. పేదరికం, లింగవివక్ష, ఆర్థిక అసమానతలు వంటి విషయాలని తల్లిదండ్రులతో చర్చించేవారు. ఇలాంటి చర్చలు ఆయా సమస్యలపట్ల ఒక లోతైన అవగాహన తీసుకొస్తాయని నమ్మే అనుపమ తన పిల్లలతోనూ వీటిపై చర్చిస్తుంటారు.

గుండెకు అండగా...

ఏ పసిప్రాణానికి కష్టమొచ్చినా... ఆమె గుండె మెలిపెట్టినట్టవుతుంది. వాళ్లకోసం ఏదైనా చేయాలనే తపన ఆమెది. అమెరికాలోని ప్రఖ్యాత సియాటల్ పిల్లల ఆసుపత్రి, పరిశోధనా కేంద్రం కోసం గతకొన్నేండ్లుగా ఆమె స్వచ్ఛందంగా పనిచేస్తున్నారు. 'ఇట్ స్టార్ట్స్ విత్ ఎస్' పేరుతో ఆ ఆసుపత్రి సేవలపై అవగాహన తీసుకురావడంతోపాటు, నిధుల సమీకరణా చేస్తున్నారు. పిల్లల ఆరోగ్యం, అభివృద్ధి కోసం మనం కేటాయించే ప్రతిక్షణం ఎంతో విలువైంది. సియాటల్ ఆసుపత్రి పరిశోధనల్లో వేసే ప్రతి ముందడుగూ ఎంతోమంది పసిప్రాణాలకు అండగా ఉంటుంది' అనే అనుపమ మనదేశంలో చిన్నారులకు సైతం తనవంతు సాయం అందించడం మొదలుపెట్టారు. అందుకే ఛత్తీస్‌గఢ్ రాజధాని నయారాయ్‌పూర్‌లో ఉన్న సత్యసాయి సంజీవని కేంద్రానికి తన అత్తమామలు మాజీ ఐఏఎస్ అధికారి యుగంధర్, ప్రభావతీ జ్ఞాపకార్థం రెండుకోట్ల రూపాయలు సాయం అందించారు.

పిల్లలకు ఉచిత చికిత్స

సత్యసాయి సంజీవని పేరుకు తగ్గట్టుగానే వేలాదిమంది చిన్నారులకు అభయహస్తం ఇస్తోంది. ముఖ్యంగా చిన్నారుల్లో పుట్టుకతో తలెత్తే గుండెజబ్బులకు ఇక్కడ శస్త్రచికిత్సలు చేస్తుంటారు. ఒక్క మనదేశం నుంచే కాదు... పద్నాలుగుకు పైగా అభివృద్ధి చెందుతున్న దేశాల నుంచి వచ్చిన చిన్నారులు ఇక్కడ వైద్యసేవలు అందుకుంటున్నారు. వీటికి కొనసాగింపుగా 2020 జూన్ నుంచి 'హీలింగ్ లిటిల్‌హార్ట్స్' పేరుతో ఒక ప్రాజెక్టుకి శ్రీకారం చుట్టారు అనుపమ. అందులో భాగంగా 132 మంది గుండెజబ్బులున్న చిన్నారులకు ఉచితంగా శస్త్రచికిత్సలు అందించాలనేది ఈ ప్రాజెక్ట్ లక్ష్యం. ఆ ఏడాది సెప్టెంబర్ నాటికి 65 మంది చిన్నారులు విజయవంతంగా శస్త్రచికిత్సలు పూర్తిచేసుకొని నవ్వుతూ ఇంటిబాట పట్టారు. గుండెలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ ఆసుపత్రిలో అడుగుపెట్టిన సూయాష్‌సాహు, సాయికుమార్ లెంక, ఊర్వశి వంటి ఎందరో చిన్నారులు ఇప్పుడు హాయిగా నవ్వుతూ ఇంటికెళ్లారు. తక్కినవారికి కూడా డిసెంబర్ నాటికి శస్త్రచికిత్సలు పూర్తి చేశారు.



వలస కార్మికుల ఆకలి తీర్చేందుకు...

కొవిడ్‌పై దేశం మొత్తం పోరాడుతుంది. ఈ క్రమంలో కేంద్రం, తెలంగాణ రాష్ట్రప్రభుత్వాలకు నాలుగు కోట్ల రూపాయలు అందించి అండగా నిలిచారు. కొవిడ్ సమయంలో వలస కార్మికుల ఆకలి తీర్చేందుకు సంజీత్ బంకర్‌రాయ్ ప్రారంభించిన తిలోనియా స్వచ్ఛంద సంస్థతోపాటూ... హైదరాబాద్‌లోని హెచ్‌కేఎమ్ ఫౌండేషన్‌కి తనవంతు సాయం అందించారామె. 2022లో సెరిబ్రల్‌తో బాధపడుతున్న తన 26 ఏండ్ల కొడుకు చనిపోవడంతో అనుపమ చాలా కుంగిపోయారు. అప్పటి నుండి పిల్లల ఆరోగ్యం కోసం మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడం మొదలుపెట్టారు. ■

ఇలా శుభ్రం చేస్తున్నారా..?

సాధారణంగా ప్రతి ఇంట్లో దుస్తులు ఉతకడానికి, గిన్నెలు తోమడానికి రకరకాల సబ్బులు వాడుతుంటాం. వేటి కోసం అవే ప్రత్యేకమైన సబ్బులు మార్కెట్లో కూడా అందుబాటులో ఉంటాయి. అయితే సబ్బుతో అన్ని రకాల దుస్తులను ఉతకకూడదని నిపుణులు చెబుతున్నారు. అలాగే సబ్బుతో కొన్ని రకాల గిన్నెలు కూడా శుభ్రం చేయకూడదని అంటున్నారు. అవేంటో ఇప్పుడు చూద్దాం.

ఉన్ని దుప్పట్లు, దుస్తులు: ఉన్ని దుస్తులను సబ్బుతో శుభ్రం చేయకూడదంటున్నారు నిపుణులు. ఎందుకంటే వీటిని సబ్బుతో ఉతికితే అవి ముడుచుకుపోయి పాత వాటిలా కనిపిస్తాయి. ఇంకా వాటి లైఫ్ టైం కూడా తగ్గుతుందని అంటున్నారు. కొంతమంది బాగా శుభ్రపడతాయనే ఉద్దేశంతో ఉన్ని దుస్తులను గంటల తరబడి డిటర్జెంట్ పౌడర్‌లో నానబెడుతుంటారు. కానీ ఇలా చేయడం వల్ల ఉన్ని త్వరగా దెబ్బతింటుంది. కాబట్టి ఉన్ని దుస్తులను డిటర్జెంట్ పౌడర్ కలపని నీటిలో మాత్రమే పూర్తిగా మునిగేలా నాననివ్వాలి.



పట్టు చీరలు: పట్టుచీరలను ఎట్టిపరిస్థితుల్లోనూ సబ్బుతో ఉతకకూడదంటున్నారు. ఇలా చేస్తే వాటి రంగు, మన్నిక దెబ్బతింటుందని అంటున్నారు. వాటిని ఉతకడం కోసం ప్రత్యేకమైన లిక్విడ్‌లు మార్కెట్లో అందుబాటులో ఉంటాయని.. వాటిని ఉపయోగిస్తే మంచిదంటున్నారు. లేకపోతే వాటిని డ్రై వాష్‌కు ఇస్తే బెటర్ అని వివరిస్తున్నారు.

ఇనుప గిన్నెలు: ఈ మధ్యకాలంలో చాలా మంది క్యాస్ట్ ఐరన్ పాత్రల్ని ఉపయోగిస్తున్నారు. అయితే వీటిని సబ్బుతో శుభ్రం చేయకూడదు. దాని వల్ల ఆ గిన్నెలో ఉండే నాన్‌స్టిక్ ప్రాపర్టీస్ పోయి.. పదార్థాలన్నీ వాటికే అతుక్కుంటాయి. ఇంకా సబ్బుతో వాటిని శుభ్రం చేయడం వల్ల తుప్పు పట్టే ప్రమాదం కూడా ఉంది. కాబట్టి సబ్బుకు బదులుగా.. ఇతర పదార్థాలను ఉపయోగించి క్లీన్ చేయాలి. దీని కోసం.. ఒక పాత్రలో టేబుల్ స్పూన్ బేకింగ్ సోడా, నిమ్మరసం, కొన్ని వేడి నీళ్లు పోసి బాగా కలపాలి. తర్వాత మిశ్రమంలో స్క్రబ్బర్ ముంచి పాత్రలను బాగా రుద్దాలి. ఆపై నీటితో క్లీన్ చేస్తే సరి. ఐరన్ పాత్రలపై జిడ్డు, మరకలు పోయి తళతళా మెరుస్తాయి. ఎక్కువ కాలం పాటు మన్నికగా ఉంటాయి.

చాకులు: కూరగాయలు, పండ్లు కట్ చేయడం కోసం చాకు ఎంతగానో ఉపయోగపడుతుంది. అయితే దీన్ని సబ్బుతో శుభ్రం చేయడం వల్ల అంచు మందగించి, తుప్పు పట్టే అవకాశం ఉంది. కాబట్టి ఒక గిన్నెలో కొద్దిగా వెనిగర్, ఉప్పు వేసి కలపండి. చాకులను ఆ మిశ్రమంతో క్లీన్ చేసి నీటితో కడిగి క్లాత్‌తో తుడిస్తే సరిపోతుంది.

లెదర్ వస్తువులు : లెదర్‌తో చేసిన వస్తువులను కూడా సబ్బుతో శుభ్రం చేయకూడదు. వాటిని క్లీన్ చేయడానికి మార్కెట్లో ఎన్నో రకాల లిక్విడ్‌లు అందుబాటులో ఉన్నాయి. వాటితో క్లీన్ చేసుకోవాలి. లేకపోతే సోప్ నీళ్లలో ముంచిన క్లాత్‌తో శుభ్రం చేయమని నిపుణులు సలహా ఇస్తున్నారు. ■

ఓఆర్ఆర్ టెండర్లపై సిట్

(మొదటిపేజీ తరువాయి)



మెట్రో రైలును తీసుకొచ్చింది కూడా కాంగ్రెస్సేనని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. కానీ గత పాలకులు రూ.వేల కోట్ల విలువగల ఓఆర్ఆర్‌ను అప్పనంగా వేరే వారికి కట్టబెట్టారని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు తమను ఓడించబోతున్నారని తెలిసే... వారీ పని చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశం విడిచిపెట్టి పోవాలనే ఉద్దేశంతోనే బీఆర్ఎస్ పెద్దలు ఇలాంటి చర్యలకు పాల్పడ్డారని దుయ్యబట్టారు. సిట్ విచారణకు సీఎం ఆదేశించటంపై హరీశ్‌రావు స్పందిస్తూ...ఓఆర్ఆర్ టెండర్లపై తాను విచారణ కోరలేదన్నారు. అయినా దాన్ని స్వాగతిస్తున్నట్టు చెప్పారు. అయితే ముందు టెండర్లను రద్దు చేసి, ఆ తర్వాత విచారణ చేపట్టాలని సూచించారు.

కేటీఆర్‌పై 'ఎఫ్ఐఆర్'

(మొదటిపేజీ తరువాయి)



ఆదేశాల మేరకే హెచ్ఎండీఏకు సంబంధించిన రూ.54.88 కోట్లను సదరు నిర్వాహణ కంపెనీలకు బదిలీ చేసినట్టు అప్పటి హెచ్ఎండీఏ అధిపతి అరవింద్ కుమార్ గతంలోనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి పంపిన వివరణ నోటీసుకు సమాధానమిస్తూ వివరాలు పంపారు. ఈ డబ్బులను డాలర్ల రూపంలో మార్పిడి చేసి నిర్వాహణ కంపెనీలకు చెల్లించినట్టు వివరించారు. ఫార్ములా-ఈ కార్ రేసింగ్‌లో తనకు ఎలాంటి సంబంధమూ లేదని కూడా అరవింద్ కుమార్ ఆ సమయంలో సమాచారమిచ్చారు.

నిబంధనలు పాటించకుండానే..

విదేశీ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకొని ఫార్ములా-ఈ కార్ రేసింగ్‌ను నిర్వహిస్తున్న విషయమై నిబంధనల ప్రకారం ఇటు గవర్నర్‌కు తెలపటం, అటు క్యాబినెట్ అనుమతిని తీసుకోవటం వంటి ప్రక్రియను పాటించకుండానే కేటీఆర్ సొంతంగా నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వం ఇంత వరకు జరిపిన అంతర్గత పరిశీలనలో వెల్లడైంది. అలాగే, ఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో ఫార్ములా-10 కార్ రేసింగ్‌కు సంబంధించి ప్రభుత్వానికి గానీ, ప్రయివేటు కంపెనీకి గానీ ఎలాంటి ఒప్పందమూ లేదు. అదేసమయంలో, గతేడాది అక్టోబర్ 9న ఎన్నికల కమిషన్ కోడ్ అమలులోకి వచ్చింది. అయినప్పటికీ, ఈ ఫార్ములా-ఈ కార్ రేసింగ్‌కు సంబంధించి ఎన్నికల కమిషన్ నుంచి ఎలాంటి అనుమతిని కూడా తీసుకోలేదు. మరోవైపు, ఇంత భారీ మొత్తంలో ప్రభుత్వ నిధులను అమెరికాకు చెందిన ఎఫ్ఈఓ అనే విదేశీ కంపెనీకి చెల్లిస్తున్న విషయమై రాష్ట్ర ఆర్థిక శాఖకు సమాచారమివ్వటం కానీ, అనుమతిని తీసుకోవటం కానీ చేయలేదు. అదేసమయంలో, విదేశీ కంపెనీకి ఇంత పెద్ద మొత్తాన్ని చెల్లిస్తున్న విషయమై ఆర్బీఐ నుంచి కూడా ఎలాంటి అనుమతిని పొందలేదని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు.

ఆర్బీఐ రూ.8 కోట్ల జరిమానా

ఇందుకు గానూ, ఆ సమయంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) స్పందించి రూ.8 కోట్ల జరిమానా కూడా విధించినట్టు తెలుస్తోంది. ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సమాచారం వెల్లడైన సమయంలో కేటీఆర్ అసెంబ్లీలోనే ఉన్నారు. కాగా, ఫార్ములా-ఈ కార్ రేసింగ్‌పై దర్యాప్తును ప్రారంభించామని ఏసీబీ అధికార వర్గాలు తెలిపాయి. ఒకట్రెండ్రోజుల్లో కేటీఆర్‌తో పాటు ఇతర అధికారులకు ఏసీబీ నుంచి నోటీసులు వెళ్లనున్నట్టు తెలిసింది. మొదట కిందిస్థాయి అధికారులను, తర్వాత మాజీ సీఈఓను, అటు తర్వాత అరవింద్ కుమార్‌ను ఏసీబీ విచారించే అవకాశమున్నదని సమాచారం. వీరి నుంచి సమగ్ర సమాచారం తీసుకున్నాక చివరిగా కేటీఆర్‌ను ఏసీబీ విచారించనున్నదని తెలిసింది. కేటీఆర్‌తో పాటు అరవింద్‌కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలు హైకోర్టుకు వెళ్లి తమను అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్‌ను కోరే అవకాశమున్నదనే ప్రచారం జరుగుతుండగా.. కేటీఆర్ మాత్రం తాను ఎలాంటి ముందస్తు బెయిల్‌ను కోరననీ, న్యాయ పోరాటానికి సిద్ధమవుతానని ఇప్పటికే విలేకరులతో పాటు తన సహచరులకు స్పష్టం చేశారు.

నల్లగొండలో టీఎస్‌యూటీఎఫ్ 6వ విద్యా వైజ్ఞానిక మహాసభలు

(మొదటిపేజీ తరువాయి)



ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆహ్వాన సంఘం చైర్మెన్, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి మహాసభల గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో గత పదేండ్లుగా ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధికి, ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ బలమైన ఉపాధ్యాయ సంఘంగా ఎదిగిందని చెప్పారు. పాలకులు ఎవరైనా రాజీపడకుండా ఉపాధ్యాయుల పక్షాన నిలబడి పోరాడే సంఘంగా గుర్తింపు పొందిందని అన్నారు. గత ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందనీ, పదేండ్లలో విధ్వంసం చేసిందని విమర్శించారు. గురుకులాలు, కేజీబీవీలు ప్రారంభించినా ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిందన్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరారు. గత ప్రభుత్వం వాటిని పట్టించుకోలేదన్నారు. 2014-15లో ప్రభుత్వ పాఠశాలల్లో 51 శాతం విద్యార్థులుంటే, 2024-25 నాటికి 42 శాతానికి పడిపోయిందని వివరించారు. అదే కాలంలో ప్రయివేటు పాఠశాలల్లో 42 శాతం నుంచి 58 శాతానికి విద్యార్థులు పెరిగారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక విద్యారంగంపై చర్యలు పరవాలేదని అనిస్తోందన్నారు. 20 వేలకుపైగా ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించారనీ, 35 వేలకుపైగా బదిలీలు చేపట్టారని గుర్తు చేశారు. పాఠశాలల పారిశుధ్యానికి గ్రాంట్ ఇస్తున్నదని అన్నారు. 11,062 పోస్టులతో డీఎస్సీని నిర్వహించి, ఉపాధ్యాయ నియామకాలు చేపట్టిందని వివరించారు. పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి, ఉపాధ్యాయుల సంక్షేమానికి ఈ మహాసభల్లో చర్చించి పలు నిర్ణయాలు తీసుకుంటారని చెప్పారు. కేజీబీవీ టీచర్లకు మినిమం టైంస్కేల్ (ఎంటీఎస్) ఇవ్వాలనీ, మోడల్ స్కూల్ టీచర్లకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని కోరారు. గురుకులాల్లో సమయపాలన మార్చేందుకు కమిటీ వేసి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. వచ్చే విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగంలో ఉన్న అన్ని యాజమాన్యాల పాఠశాలలు, ఉపాధ్యాయుల సంక్షేమానికి టీఎస్‌యూటీఎఫ్ కృషి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ విద్యారంగం బలోపేతమే లక్ష్యం

రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం బలోపేతమే లక్ష్యంగా మహాసభల్లో చర్చించి తగు నిర్ణయాలు, తీర్మానాలు చేస్తామని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె జంగయ్య, చావ రవి అన్నారు. ఈనెల 28న ఉదయం 9.30 గంటలకు ఉపాధ్యాయుల మహాప్రదర్శనతో మహాసభ కార్యక్రమాలు ప్రారంభమవుతాయని చెప్పారు. ప్రారంభ సభలో ముఖ్యఅతిథులుగా శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రహదారులు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొంటారని వివరించారు. విశిష్ట అతిథులుగా విద్యా కమిషన్ చైర్మెన్ ఆకునూరి మురళి, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి, అతిథులుగా ఆ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరవుతారని అన్నారు. అదేరోజు మధ్యాహ్నం జరిగే విద్యా సదస్సులో సీనియర్ పాత్రికేయులు కె శ్రీనివాస్, ప్రముఖ మీడియా విశ్లేషకులు ప్రొఫెసర్ కె నాగేశ్వర్, జేఎన్‌యూ విద్యార్థి సంఘం పూర్వ అధ్యక్షులు అయిషీ ఘోష్ పాల్గొని వివిధ అంశాలపై ప్రసంగిస్తారని చెప్పారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలను ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ ప్రారంభిస్తారని వివరించారు. ఈనెల 29,30 తేదీల్లో ప్రతినిధుల సభ జరుగుతుందన్నారు. గత రెండేండ్ల కాలంలో విద్యారంగంలో నెలకొన్న పరిణామాలు, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై చర్చిస్తామని అన్నారు. విద్యారంగం, ఉపాధ్యాయ సమస్యలపై అవసరమైన తీర్మానాలు, కార్యాచరణను రూపొందిస్తామని చెప్పారు. రాబోయే రెండేండ్లకు నూతన రాష్ట్ర కమిటీని, కుటుంబ సంక్షేమ నిధి పాలకవర్గాన్ని ఎన్నుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి టి లక్ష్మారెడ్డి, కార్యదర్శులు ఎ సింహాచలం, ఎస్‌వై కొండలరావు, నాయకులు వెంకటప్ప, డి మస్తాన్ రావు, కె అశోక్, ఎ శ్యామ్ సుందర్, జయసింహారెడ్డి, మదన్‌రెడ్డి, జి రాజారావు, ఎ రాములు తదితరులు పాల్గొన్నారు.

రూపాయి చారిత్రాత్మక పతనం

(మొదటిపేజీ తరువాయి)

పడ్డాయని మరోసారి నిరూపణ అయ్యింది. రూపాయి చరిత్రలోనే అత్యంత కనిష్ట స్థాయికి పడిపోవడమే ఇందుకు నిదర్శనం. గురువారం డాలర్‌తో రూపాయి మారకం విలువ 14 పైసలు పతనమై 85.08కి దిగజారింది. రూపాయి విలువ 85 ఎగువకు పడిపోవడం భారత చరిత్రలోనే తొలిసారి. ఇంటర్ ఫారిన్ ఎక్స్చేంజీలో ఉదయం 85 వద్ద ప్రారంభమైంది. ఇంతక్రితం సెషన్‌లోనూ 3 పైసలు కోల్పోయి 84.94 వద్ద ముగిసింది. ప్రస్తుత ఏడాది నవంబర్‌లో అయితే రూపాయి విలువ అత్యంత పేలవంగా నమోదయ్యింది. ఈ ఒక్క నెలలోనే 0.5 శాతం విలువ కోల్పోయింది. అక్టోబర్ ముగింపు నాటికి రూపాయి విలువ 82.71గా ఉంది. గత కొన్ని రోజులుగా రూపాయి విలువ ఏ మాత్రం పుంజుకోకపోవడంతో ఆర్బీఐ వద్ద ఉన్న విదేశీ మారకం నిల్వలు భారీగా కరిగిపోతున్నాయి. నరేంద్ర మోడీ ప్రధాని కాకముందు 2014లో డాలర్‌తో రూపాయి విలువ 60లోపే ఉంది. అప్పటి సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో రూపాయి బలోపేతానికి మోడీ చేసిన ప్రగల్భాలకు ప్రస్తుత వాస్తవ పరిస్థితులకు పొంతన లేకుండా పోయింది. రూపాయి నష్టాన్ని అరికట్టలేకపోతున్నారని స్పష్టమవుతోంది.

మరింత పడొచ్చు..

ఇటీవల అమెరికా ఎన్నికల్లో డోనాల్డ్ ట్రంప్ విజయం తర్వాత డాలర్ విలువ మరింత పెరగడం, భారత మార్కెట్ల నుంచి భారీగా విదేశీ పోర్ట్‌ఫోలియో నిధులు తరలిపోవడంతో గడిచిన ఎనిమిది నెలల్లో ఎప్పుడూ లేని స్థాయిలో రూపాయి విలువ పడిపోయింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను పావు శాతం తగ్గించడంతో డాలర్‌కు మరింత విలువ పెరిగింది. దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస పతనమూ రూపాయి విలువపై ఒత్తిడిని పెంచుతోంది. దిగుమతులు పెరగడం, ఎగుమతులు తగ్గడంతో రికార్డు స్థాయిలో వాణిజ్య లోటు, మందగించిన భారత జీడిపి తదితర ప్రతికూలాంశాలు అంతర్జాతీయ మార్కెట్‌లో రూపాయి విలువ పడిపోవడానికి ప్రధాన కారణాలుగా ఉన్నాయి. రూపాయి మారకం తీరు ఇంకా ఒత్తిడిలోనే ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. నిరంతర భౌగోళిక అనిశ్చితులు, దేశీయ సవాళ్లతో రూపాయి మరింత బలహీనతను చూడవచ్చని భావిస్తున్నారు. అదే జరిగితే భారత దిగుమతులు మరింత భారం కానున్నాయి. దిగుమతి ఉత్పత్తుల ధరలు పెరగనున్నాయి. ప్రభుత్వ రుణ, వడ్డీ చెల్లింపులు మరింత భారం అవుతాయి. ఈ పరిణామాలు దేశ ఆర్థిక వ్యవస్థకు పెను సవాళ్లను సృష్టించనున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మార్చి 21 నుంచి 'పది' పరీక్షలు

(మొదటిపేజీ తరువాయి)

ఒకేరోజు పరీక్ష నిర్వహించే వారు. విద్యార్థులకు అసౌకర్యం కలుగుతుందనే అభిప్రాయం రావడంతో దాన్ని అధికారులు గ్రహించి ఆరు పేపర్లకు ఏడు పరీక్షలను నిర్వహించాలని నిర్ణయించారు. దీంతో ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ సబ్జెక్టులకు వేర్వేరు పరీక్షలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. అయితే ఆ రెండు సబ్జెక్టులనూ ఒకే పేపర్‌గా పరిగణిస్తామని స్పష్టం చేశారు. పదోతరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు సంబంధించి ప్రస్తుత విద్యాసంవత్సరంలో సంస్కరణలు చేపట్టిన విషయం తెలిసిందే. పదో తరగతి వార్షిక పరీక్షల్లో 24 పేజీల బుక్‌లెట్‌ను ఇచ్చే విధానం అమల్లోకి రానుంది. అయితే ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ పేపర్లకు మాత్రం 12 పేజీల చొప్పున బుక్‌లెట్‌లను ఇస్తారు. 20 ఇంటర్నల్ మార్కులను ఎత్తివేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం తొలుత ప్రకటించింది. విద్యాసంవత్సరం మధ్యలో మార్పులు చేయడంపై వ్యతిరేకత రావడంతో రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ప్రస్తుత విద్యాసంవత్సరంలో పాత పద్ధతిలోనే పదో తరగతి పరీక్షలను నిర్వహిస్తామని స్పష్టం చేసింది. 20 ఇంటర్నల్ మార్కులుంటాయని తెలిపింది. దీంతో 80 మార్కులకే వార్షిక పరీక్షలను నిర్వహిస్తామని పేర్కొంది. వచ్చే విద్యాసంవత్సరం (2025-26) నుంచి 20 ఇంటర్నల్ మార్కులను ఎత్తివేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో వచ్చే విద్యాసంవత్సరంలో పదో తరగతి వార్షిక పరీక్షలు వంద మార్కులకు జరుగుతాయి. గ్రేడింగ్ విధానం రద్దు విషయంలో ఎలాంటి మార్పు లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచే గ్రేడింగ్ విధానం ఉండదు. పదో తరగతి విద్యార్థులకు మార్కులతోనే మెమోలు ఇస్తారు.



పదోతరగతి పరీక్షల టైంటేబుల్

తేదీ	సబ్జెక్టు
(ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు)	
21.03.2025 (శుక్రవారం)	ఫస్ట్ లాంగ్వేజీ (గ్రూప్-ఎ) ఫస్ట్ లాంగ్వేజీ పార్ట్-1 (కాంపొజిట్ కోర్స్) (ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.50 వరకు) ఫస్ట్ లాంగ్వేజీ పార్ట్-2 (కాంపొజిట్ కోర్స్)
(ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.50 వరకు)	
22.03.2025 (శనివారం)	సెకండ్ లాంగ్వేజీ
24.03.2025 (సోమవారం)	థర్డ్ లాంగ్వేజీ (ఇంగ్లీష్)
26.03.2025 (బుధవారం)	మ్యాథమెటిక్స్
28.03.2025 (శుక్రవారం)	సైన్స్ (పార్ట్-1 ఫిజికల్ సైన్స్)
29.03.2025 (శనివారం)	సైన్స్ (పార్ట్-2 బయలాజికల్ సైన్స్)
02.04.2025 (బుధవారం)	సోషల్ స్టడీస్
03.04.2025 (గురువారం)	ఓఎస్ఎస్‌సి మెయిన్ లాంగ్వేజీ పేపర్-1 (సంస్కృతం, అరబిక్) ఎస్ఎస్‌సి ఒకేషనల్ కోర్స్ (థియరీ)
(ఉదయం 9.30 నుంచి 11.30 వరకు)	
04.04.2025 (శుక్రవారం)	ఓఎస్ఎస్‌సి మెయిన్ లాంగ్వేజీ పేపర్-2 (సంస్కృతం, అరబిక్)





ఎదురుదాడి

(మొదటి పేజీ తరువాయి)

వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేపట్టాయి. మరోవైపు, రాహుల్ గాంధీ కొట్టారని ఆరోపిస్తూ బీజేపీ ఎంపీలు కూడా గొడవకు దిగారు. నిమిషంలోనే మధ్యాహ్నం 2 గంటల వరకు సభ వాయిదా పడింది. తిరిగి మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమైన సభలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో సభ నేటికి వాయిదా పడింది. 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' బిల్లు కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) ఎంపికకు సంబంధించిన తీర్మానాన్ని సభా కార్యక్రమాల్లో చేర్చారు. కానీ, దానిని పరిగణనలోకి తీసుకోలేదు.

రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి నెలకొన్నది. తొలుత రెండు గంటల వరకు సభ రద్దయింది. రాహుల్ గాంధీ పార్లమెంట్‌లోకి ప్రవేశించినప్పుడు తనకు చేదు అనుభవం ఎదురైందని బీజేపీకి చెందిన ఫాంగ్నోన్ కొన్యాక్ ఆరోపించారు. ఈ విషయాన్ని స్పీకర్‌కు ఫిర్యాదు చేసినట్టు కూడా కొన్యాక్ సభకు తెలియజేశారు. కేంద్ర మంత్రి జె.పి నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు లు.. రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాహుల్ చర్యను సభ ఖండించాలని కూడా నడ్డా తెలిపారు. కొన్యాక్ ఫిర్యాదును స్వీకరించామనీ, దానిని విచారిస్తున్నామని చైర్మెన్ జగదీప్ ధన్కర్ తెలిపారు. అధికార, ప్రతిపక్షాల వాగ్వాదం కొనసాగడంతో సభ శుక్రవారానికి వాయిదా పడింది.

నన్ను బీజేపీ ఎంపీలు నెట్టేయటంతో కిందపడ్డా : ఖర్గే

ప్రతిపక్ష ఎంపీలను బీజేపీ సభ్యులు తోసేశారని రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే అన్నారు. తాను బ్యాలెన్స్ తప్పి పడిపోయాననీ, చివరకు నేలపై కూర్చోవాల్సి వచ్చిందని తెలిపారు. అంబేద్కర్‌ను అవమానించారనే అంశంపై దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతాయని ఖర్గే అన్నారు. మల్లికార్జున్ ఖర్గే.. తనను బీజేపీ ఎంపీలు నెట్టేశారని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. దీనిపై విచారణకు ఆదేశించాలనీ, ఇది తనపైనే కాకుండా రాజ్యసభ ప్రతిపక్షనేతపై జరిగిన దాడి అని వివరించారు. "మేము ఒక వరుసలో శాంతియుతంగా నిరసన చేస్తున్నాం. వాళ్ళు(బీజేపీ ఎంపీలు) ఏమనుకున్నారో నాకు తెలియదు. మేము నడుచుకుంటూ వెళ్తున్నాం. వారు మకరద్వార్ వద్దకు వచ్చి మమ్మల్ని ఆపడానికి అక్కడ కూర్చున్నారు. మేము లోపలికి వెళ్లాలనుకున్నాం. కానీ, వారు మమ్మల్ని గేటు వద్ద ఆపారు. వారికి చాలా మంది పురుష ఎంపీలున్నారు. మాతో మా మహిళా ఎంపీలున్నారు. వారిని కూడా ఆపారు. బలవంతంగా మాపై దాడి చేశారు. నేను ఎవరినీ నెట్టే స్థితిలో లేను. ఇప్పుడు మేము వారిని నెట్టామని వారు ఆరోపిస్తున్నారు" అని ఖర్గే అన్నారు.

రాహుల్ గాంధీపై కేసు నమోదు

పార్లమెంటు ప్రాంగణంలో గురువారం ఉదయం చోటు చేసుకున్న ఘటనలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై కేసు నమోదైంది. బీజేపీ ఎంపీలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయనపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్టు పోలీసులు చెప్పారు.

స్పీకర్ ఆదేశాలు బేఖాతరు

సాధారణంగా, ప్రతిపక్షాలు ఆందోళన చేస్తుంటాయి. ఇప్పుడు అధికార పక్షమే ఆందోళన నిర్వహించింది. ప్రధాన ద్వారం (మకరద్వార్) వద్ద ఆందోళన చేయొద్దని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా శీతాకాల పార్లమెంట్ సమావేశాల మొదటి రోజు ప్రతిపక్షాలనుద్దేశించి సభలోనే హెచ్చరించారు. ప్రధాన ద్వారం వద్ద ఆందోళన చేయడంతో ఇతర ఎంపీలకు అసౌకర్యం కలుగుతోందని అన్నారు. అప్పటి నుంచి ఇతర ఎంపీలు లోపలకి వెళ్లడానికి, బయటకు రావడానికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రతిపక్షాలు ప్రధాన ద్వారం పక్కన తమ ఆందోళనను తెలిపాయి. అయితే, అధికార పార్టీ మాత్రం లోక్‌సభ స్పీకర్ ఇచ్చిన ఆదేశాలను సైతం ఉల్లంఘించి, గురువారం ప్రధాన ద్వారం ఎదుట ఆందోళన చేసింది. ఇదే పార్లమెంట్‌లో చోటు చేసుకున్న ఘటనకు ప్రధాన కారణమైంది.

అమిత్ షాకు వ్యతిరేకంగా ఖర్గే ప్రివిలేజ్ నోటీసు

భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూం మంత్రి అమిత్ షాకు వ్యతిరేకంగా రాజ్యసభ ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే ప్రివిలేజ్ నోటీస్ ఇచ్చారు. బి.ఆర్ అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలను అవమానకరమైనవిగా, సభను ధిక్కరించేవిగా పరిగణిస్తూ ఆయనపై ప్రివిలేజ్ ప్రొసీడింగ్‌లు ప్రారంభించాలని నోటీసులో ఖర్గే అభ్యర్థించారు.



రాహుల్ స్వభావం కాదు : ఒమర్ అబ్దుల్లా

తమ ఎంపీలను లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తోశారన్న బీజేపీ ఆరోపణలను జమ్ముకాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తోసిపుచ్చారు. దురుసుగా, అనుచితంగా ప్రవర్తించడం ఆయన స్వభావం కాదని అన్నారు. రాహుల్ గురించి తనకు తెలుసునని, ఆయన పార్లమెంట్ సభ్యులే కాదు ఎవరినీ తక్కువ చేయరని అన్నారు.

అమిత్ షాను కాపాడేందుకే... : ప్రియాంక గాంధీ

కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా మాట్లాడుతూ.. "రాహుల్ గాంధీ.. బి.ఆర్ అంబేద్కర్ ఫొటోను పట్టుకుని పార్లమెంటు లోపలికి శాంతియుతంగా వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆయనను పార్లమెంటులోకి రాకుండా ఎవరు అడ్డుకున్నారు? మనం రోజూ నిరసనలు చేస్తూనే ఉన్నాం. కానీ, ఇంతకు ముందెన్నడూ ఇలాంటివి జరగలేదు. ఈరోజు (బీజేపీ) తొలిసారిగా నిరసన చేపట్టినప్పుడు ఇదంతా జరిగింది. వాళ్లు రాజ్యసభ ప్రతిపక్షనేత మల్లికార్జున్ ఖర్గేను నెట్టడంతో ఆయన పడిపోయారు. గాయపడ్డారు. అమిత్ షాను కాపాడేందుకే ఇదంతా చేస్తున్నారు" అని ఆమె విమర్శించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ప్రతిపక్ష సభ్యులను పార్లమెంట్‌లోకి రాకుండా అడ్డుకునేందుకు అధికార పార్టీ ఎంపీలు 'గూండాగిరి'కి పాల్పడ్డారని విమర్శించారు.

టాప్‌లోనే అర్జెంటీనా

వరుసగా రెండో ఏడాది అగ్రస్థానంలోనే.. ఫిఫా ర్యాంకింగ్స్

లాసనె: అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య(ఫిఫా) ప్రకటించిన తాజా ర్యాంకింగ్స్‌లో అర్జెంటీనా వరుసగా రెండో ఏడాది అగ్రస్థానంతో ముగించింది. ఫిఫా పురుషుల ర్యాంకింగ్స్‌లోను గురువారం వెల్లడించింది. ఈ ఏడాది అర్జెంటీనా 21 అర్జంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి అత్యధిక విజయాలను నమోదు చేసుకుంది. ఆ తర్వాత స్థానాల్లో య యూరోపియన్ ఛాంపియన్ ఫ్రాన్స్, స్పెయిన్ జట్లు ఉన్నాయి. ఈ క్రమంలోనే టాప్-10లో ఇంగ్లండ్, బ్రెజిల్, పోర్చుగల్, నెదర్లాండ్స్, బెల్జియం, ఇటలీ, మరియు జర్మనీ జట్లు ఉన్నాయి. ఫిఫా తాజాగా వెల్లడించిన ర్యాంకింగ్స్‌లో అంగోలా జట్టు 84వ స్థానం నుంచి ఏకంగా 32వ స్థానానికి ఎగబాకడం విశేషం. ఆ తర్వాత ఫిఫా 2025 ఏప్రిల్‌లో మళ్లీ ర్యాంకింగ్స్‌ను ప్రకటించనుంది.

ఆఫ్ఘనిస్తాన్‌కు భారీ విజయం

జింబాబ్వేపై 232పరుగుల తేడాతో గెలుపు



హరారే: ఆఫ్ఘనిస్తాన్ జట్టు వన్డేల్లో భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా జింబాబ్వేతో జరిగిన తొలి వన్డేలో ఆఫ్ఘనిస్తాన్ జట్టు ఏకంగా 232పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత ఆఫ్ఘనిస్తాన్ 50 ఓవర్లలో 287పరుగులు చేయగా.. ఆ తర్వాత జింబాబ్వేను 17.5ఓవర్లలో 54పరుగులకే ఆలౌట్ చేసింది. ఆఫ్ఘన్ బౌలర్ నవీద్ మూడు వికెట్లతో జింబాబ్వేను కట్టడి చేశాడు. ఆఫ్ఘనిస్తాన్ ఓపెనర్లు సెద్దికుల్లా(104) సెంచరీకి తోడు అబ్దుల్ మాలిక్(84) అర్ధసెంచరీలతో రాణించి తొలి వికెట్‌కు 191పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆ తర్వాత 37పరుగుల వ్యత్యాసంలో వరుసగా మూడు వికెట్లు కోల్పోయింది. ఈ క్రమంలో కెప్టెన్ షాహిది(29నాటౌట్) రాణించడంతో ఆ జట్టు 6వికెట్ల నష్టానికి 286పరుగులు చేసింది. జింబాబ్వే బౌలర్లలో నెవాన్‌కు మూడు, ట్రేవియర్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఆఫ్ఘన్ బౌలర్లు నవీద్(3/13), ఘజన్‌ఫర్(3/8)కి తోడు ఫారూఖీ(2/15) బౌలింగ్‌లో చెలరేగారు. జింబాబ్వే బ్యాటర్లలో విలియమ్సన్(16), సికిందర్ రాజా(19) మాత్రమే రెండంకెల స్కోర్ కొట్టారు. దీంతో మూడు వన్డేల సిరీస్‌లో ఆఫ్ఘనిస్తాన్ జట్టు 1-0 ఆధిక్యతలో నిలువగా.. రెండో వన్డే శనివారం జరగనుంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ షదీఖుల్లాకు దక్కింది.

రికార్డు పుటల్లో రీచా ఘోష్



టి20ల్లో 18బంతుల్లోనే అర్ధసెంచరీ

మళ్లీ మెరిసిన మంధాన

ముంబయి: వెస్టిండీస్ మహిళలతో జరిగిన మూడో టి20లో కీపర్ రీచా ఘోష్ రికార్డు కదం తొక్కింది. కేవలం 18బంతుల్లోనే అర్ధసెంచరీని కొట్టింది. దీంతో 2015లో సోఫీ డివైన్(న్యూజిలాండ్) పేర ఉన్న 18బంతుల్లోనే అర్ధసెంచరీ రికార్డును సమం చేసింది. రీచా అర్ధసెంచరీకి తోడు.. కెప్టెన్ స్మృతి మంధాన కూడా బ్యాట్ ఝుళిపించడంతో టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 217పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్ దిగిన భారత్ జట్టుకు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. తొలి ఓవర్ చివరి బంతికే ఓపెనర్ ఉమా ఛెత్రి (0) డకౌట్ అయ్యింది. హెన్రీ బౌలింగ్‌లో జోసెఫ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన రోడ్రిగ్స్‌తో కలిసి కెప్టెన్ మంధాన ఇన్నింగ్స్ నిర్మించింది. క్రీజులో నిలదొక్కుకుంటూ.. వీలుచిక్కినప్పుడల్లా బౌండరీలు బాదుతూ స్కోరు బోర్డును ముందుకు నడిపించింది. జోరుమీద ఉన్న ఈ జోడీని ఫ్లెచర్ విడగొట్టింది. జట్టు స్కోరు 99 పరుగుల వద్ద రోడ్రిగ్స్ ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగింది. అక్కడికి స్వల్ప వ్యవధిలోనే మంధాన కూడా డాటిన్ బౌలింగ్‌లో హెన్రీకి క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరింది. చివర్లో రిచా ఘోష్, బిస్త్ దూకుడుగా ఆడటంతో భారత్ భారీ స్కోరే చేసింది. కెప్టెన్ మంధాన(77; 47బంతుల్లో 13ఫోర్లు, సిక్సర్) వరుసగా మూడో అర్ధసెంచరీతో రాణించగా.. రోడ్రిగ్స్(39) ఫర్వాలేదనిపించింది. వీరిద్దరి నిష్క్రమణ తర్వాత రీచా ఘోష్ కేవలం 18బంతుల్లోనే అర్ధసెంచరీ చేసి ఈ ఫార్మట్‌లో వేగంగా అర్ధసెంచరీ రికార్డును సమం చేసింది. రీచా ఘోష్(54; 21బంతుల్లో 3ఫోర్లు, 5సిక్సర్లు) ధనా ధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగింది. దీంతో భారతజట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 217పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. వెస్టిండీస్ బౌలర్లు హెన్రీ, డోటిన్, అలియానే, ఫ్లెచర్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

స్కోర్‌బోర్డు...

భారత్ మహిళల ఇన్నింగ్స్: మంధాన (సి)హెన్రీ (బి)డోటిన్ 77, ఛెత్రి (సి)జోసెఫ్ (బి)హెన్రీ 0, రోడ్రిగ్స్ (ఎల్‌బి)ఫ్లేచర్ 39, బిస్త్ (నాటౌట్) 31, రీచా (సి)హెన్రీ (బి)అలియానే 54, సజన (నాటౌట్) 4, అదనం 12. (20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 217పరుగులు

వికెట్ల పతనం: 1/1, 2/99, 3/143, 4/213

బౌలింగ్: హెన్రీ 2-0-14-1, డోటిన్ 4-0-54-1, మాథ్యూస్ 4-0-34-0, కరిష్మా 3-0-44-0, అలియానే 4-0-45-1, ఫ్రేచర్ 3-0-24-1.

మహిళల టి20ల్లో టాప్-5 రికార్డులు..

అత్యధిక అర్ధసెంచరీ...

1. మంధాన(ఇండియా) : 30(142 ఇన్నింగ్స్)
2. సూజీ బేట్స్(న్యూజిలాండ్) : 29(168 ఇన్నింగ్స్)
3. బెత్ మూనీ(ఆస్ట్రేలియా) : 25(100 ఇన్నింగ్స్)
4. స్టఫనీ టేలర్(వెస్టిండీస్) : 22(122 ఇన్నింగ్స్)
5. సోఫీ డివైన్(న్యూజిలాండ్) : 22(139 ఇన్నింగ్స్)

తక్కువ బంతుల్లో అర్ధసెంచరీలు..

1. రీచా ఘోష్(ఇండియా) : 18బంతుల్లో వెస్టిండీస్‌పై, 2024
2. సోఫీ డివైన్(న్యూజిలాండ్) : 18బంతుల్లో ఇండియాపై, 2015
3. లిచ్‌ఫీల్డ్(ఆస్ట్రేలియా) : 18బంతుల్లో, వెస్టిండీస్‌పై, 2023
4. నదీ ధార్(పాకిస్తాన్) : 19బంతుల్లో, దక్షిణాఫ్రికాపై, 2019

టి20ల్లో భారత మహిళల అత్యధిక స్కోర్లు...

217 : వెస్టిండీస్‌పై 2024
210 : యుఏఇపై, 2024
198 : ఇంగ్లండ్‌పై, 2018
195 : వెస్టిండీస్‌పై, 2024
194 : న్యూజిలాండ్‌పై, 2018



ఇదొక అద్భుత పుస్తకం

- దర్శకుడు వంశీ

'భారతీయ భాషల్లో ఇటువంటి ప్రయత్నం ఎవ్వరూ చేయలేదు. ఇదొక అద్భుతం' అని దర్శకుడు వంశీ అన్నారు. ఆల్ఫ్రెడ్ హిచ్‌కాక్ 125వ జయంతి సందర్భంగా, అలానే ఆయన తొలి సినిమా విడుదలై వందేళ్లు అయిన సందర్భంగా హిచ్‌కాక్ సినీ జీవితంపై 'మాస్టర్ ఆఫ్ సస్పెన్స్ హిచ్‌కాక్' పేరుతో సీనియర్ జర్నలిస్ట్, సినీ రచయిత పులగం చిన్నారాయణ - ఐఆర్ఎస్ అధికారి రవి పాడితో కలిసి పుస్తకం తీసుకొచ్చారు. ఇందులో 45 మంది దర్శకులు, ఏడుగురు రచయితలు, పది మంది జర్నలిస్టులు రాసిన మొత్తం 62 వ్యాసాలు ఇందులో ఉన్నాయి.

హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో దర్శకులు వంశీ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించి తొలి ప్రతిని దర్శకులు హరీష్ శంకర్‌కు, రెండో ప్రతిని నటులు నాజర్‌కు అందజేశారు. తొలి ప్రతిని 'సంతోషం' మ్యాగజైన్ అధినేత, నిర్మాత సురేష్ కొండేటి ఐదు వేల రూపాయలు ఇచ్చి తీసుకున్నారు. ఈ బుక్ కవర్ పేజీ ఫ్రేమ్‌ని దర్శకులు మోహనకృష్ణ ఇంద్రగంటి, పుస్తకాన్ని పబ్లిష్ చేసిన అక్షౌహిణి మీడియా లోగోని దర్శకులు హరీష్ శంకర్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా దర్శకుడు వంశీ మాట్లాడుతూ, 'నేను 'అన్వేషణ' సినిమా తీయడానికి హిచ్‌కాక్ కూడా ఓ ప్రేరణ. నిర్మాత ఏడిద నాగేశ్వరరావు వీసీఆర్ కొన్నప్పుడు అందులో 'సైకో' చూశా. హిచ్‌కాక్ తీసిన మొత్తం 53 సినిమాలు చూసిన వ్యక్తిని నేను. సినిమాకు అవసరమైనవి మూడు... స్క్రిప్ట్, స్క్రిప్ట్, స్క్రిప్ట్ అని చెప్పాడు హిచ్‌కాక్. ఆయన మీద పులగం చిన్నారాయణ, రవి పాడి గొప్ప పుస్తకం తీసుకొచ్చారు. ఇదొక అద్భుతం. ఈ పుస్తకం తొలి ప్రతిని చూసి థ్రిల్ అయ్యా' అని చెప్పారు.

'మాస్టర్ ఆఫ్ సస్పెన్స్ హిచ్‌కాక్' పుస్తకావిష్కరణ కార్యక్రమానికి నటుడు నాజర్, దర్శకులు మెహర్ రమేష్, మోహనకృష్ణ ఇంద్రగంటి, వీరశంకర్ (తెలుగు దర్శకుల సంఘం అధ్యక్షులు), చంద్రసిద్ధార్థ, శివ నాగేశ్వరరావు, కరుణ కుమార్, వర ముళ్ళపూడి, దేవి ప్రసాద్, సునీల్ కుమార్ రెడ్డి, సాయి కిషోర్ మచ్చా, రమేష్ సామల, శ్రీమన్ వేముల తదితరులు పాల్గొన్నారు. అలాగే సీనియర్ రచయిత తోట ప్రసాద్, సీనియర్ జర్నలిస్టులు ప్రభు, సుబ్బారావు, ప్రసన్న ప్రదీప్, వడ్డి ఓం ప్రకాశ్, జలపతి తదితరులు పాల్గొన్నారు.



చాణక్య, మౌనిక

తెలంగాణ ఉద్యమానికి ప్రతిబింబం

కళా అర్ట్స్ బ్యానర్‌పై కళా శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'దక్కన్ సర్కార్'. చాణక్య, కియా రెడ్డి, మౌనిక హీరో, హీరోయిన్‌లుగా నటించిన ఈ సినిమా పోస్టర్, టీజర్ లాంచ్ వేడుక గురువారం ఫిలిం ఛాంబర్‌లో జరిగింది.

ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుడు గాదె ఇన్నారెడ్డి మాట్లాడుతూ,' 'తెలంగాణ ఉద్యమంలోని కష్టాలను ఈ సినిమాలో చూపించారు. ఉద్యమంలో పని చేసిన కళా శ్రీనివాస్ ఎన్నో వ్యయ, ప్రయాసలకోర్చి ఈ సినిమా తీశాడు. ఉద్యమాన్ని చూపిస్తున్న ఇలాంటి సినిమాను ప్రతి ఒక్కరూ ఆదరించాలి' అని అన్నారు. 'ఇలాంటి సినిమాలను మనమంతా ఆహ్వానించాలి. ఈ సినిమా విడుదల విషయంలో నా మద్దతు ఉంటుంది' అని తెలంగాణ ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్ చెప్పారు.

డైరెక్టర్ కళా శ్రీనివాస్ మాట్లాడుతూ,'తెలంగాణ ఉద్యమాన్ని తెరపై ఆవిష్కరించాం. నిజ జీవితంలో మంచి క్యారెక్టర్ ఉన్న వారినే సినిమాలో క్యారెక్టర్లుగా తీసుకున్నాను. పోరాటాలకు విరామం ఉండదనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా చేశాను. ఈ చిత్ర ఆడియో లాంచ్‌ని త్వరలో నిజామాబాద్‌లో భారీగా నిర్వహించబోతున్నాం' అని తెలిపారు.

నవచిత్రం

బరాబర్ ప్రేమిస్తాడంట..!



చంద్రహాస్ నటిస్తున్న కొత్త సినిమా 'బరాబర్ ప్రేమిస్తా'. ఈ చిత్రానికి సంపత్ రుద్ర దర్శకత్వం వహిస్తున్నారు.

కాకర్ల సత్యనారాయణ సమర్పణలో సిసి క్రియేషన్స్, ఏవిఆర్ మూవీ వండర్స్ బ్యానర్లపై గెడా చందు, గాయత్రి చిన్ని, ఏవిఆర్ నిర్మిస్తున్నారు.

మిస్ ఇండియా ఫైనలిస్ట్ మేఘనా ముఖర్జీ హీరోయిన్‌గా, అర్జున్ మహీ ('ఇష్టంగా' ఫేమ్) ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో గురువారం డైరెక్టర్ వి.వి.వినాయక్ ఈ సినిమా టీజర్‌ను రిలీజ్ చేశారు.

హీరో చంద్రహాస్ మాట్లాడుతూ, 'నా రీసెంట్ మూవీ 'రామ్ నగర్ బన్నీ' ప్రేక్షకులకు బాగా రీచ్ అయ్యింది. నేను నా నెక్స్ట్ మూవీ ఎలా ఉండాలని అనుకున్నానో అలాంటి సినిమా ఇది. ఈ సినిమాలో నేను హీరోగా నటించడానికి కారణం మా డీవోపీ శేఖర్. ఆయన నా 'బ్లాక్ డాగ్ వైట్ చిక్' సినిమా టీజర్ చూసి ఈ టీమ్‌కు పరిచయం చేశారు. అలాగే ఈ మూవీని దర్శకుడు సంపత్ ఎంతో క్లారిటీతో, మంచి క్వాలిటీతో రూపొందించారు' అని తెలిపారు.

'నేను గతంలో 'ఇష్టంగా, ఏక్' అనే చిత్రాలు చేశాను. మంచి ప్రయత్నంగా ఆ సినిమాలకు పేరు వచ్చింది. ఇదొక మంచి ఇంటెన్స్ లవ్ స్టోరీ. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా మా సినిమా ఉంటుంది' అని దర్శకుడు సంపత్ రుద్ర చెప్పారు.

నిర్మాత చిన్ని గాయత్రి మాట్లాడుతూ,'నేను పరుచూరి మురళి, జయంత్ దగ్గర డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేశాను. ఈ కథ వినగానే నచ్చి, నా ఫ్రెండ్స్‌తో కలిసి ప్రొడ్యూస్ చేశాను. మంచి క్వాలిటీతో మూవీ చేశాం. ఈ సినిమా మీ అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాం' అని అన్నారు.

కథే హీరో..



అనన్య నాగళ్ళ, సీయా గౌతమ్


వెన్నెల కిషోర్ టైటిల్ రోల్ పోషిస్తున్న క్రైమ్ థ్రిల్లర్ 'శ్రీకాకుళం షెర్లాక్ హెూమ్స్'. రైటర్ మోహన్ రచన, దర్శకత్వం వహించారు.

అనన్య నాగళ్ల, సీయా గౌతమ్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రాన్ని లాస్యారెడ్డి సమర్పణలో శ్రీ గణపతి సినిమాస్ బ్యానర్‌పై వెన్నపూస రమణారెడ్డి నిర్మించారు.

'క, పొలిమేర 2, కమిటీ కుర్రోళ్లు' చిత్రాలతో విజయాలు అందుకున్న వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఈ చిత్రం ఈనెల 25న థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్ సక్సెస్ రైడ్ ప్రెస్‌మీట్‌ని నిర్వహించారు.

నిర్మాత వంశీ నందిపాటి మాట్లాడుతూ,' ట్రైలర్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. 3 మిలియన్ డిజిటల్ వ్యూస్‌ని క్రాస్ చేయడం సినిమాకి బిగ్ ఎచీవ్‌మెంట్. ట్రైలర్‌కి మంచి రివ్యూస్ వచ్చాయి. ఈ సినిమా అందరినీ ఇంప్రెస్ చేస్తుంది. ఈ సినిమాలో కథే హీరో. కథని నమ్మే ఈ సినిమాతో ముందుకు వెళ్తున్నాను. ఇది సస్పెన్స్ థ్రిల్లర్. సినిమా కంప్లీట్ అయిన తర్వాత పార్ట్ 2 ఎప్పుడనే ఎగ్జైట్‌మెంట్‌ని క్రియేట్ చేస్తుంది. స్క్రీన్ ప్లే మైండ్ బ్లోయింగ్‌గా ఉంటుంది. స్క్రీన్‌ప్లేనే ఈ సినిమాకి బలం. చాలా ఎంగేజింగ్‌గా ఉండే సినిమా ఇది. ఈ నెల 25న అందరూ థియేటర్స్‌లో చూసి, సినిమాని పెద్ద హిట్ చేయాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. నిర్మాత రామణారెడ్డి మాట్లాడుతూ,'మోహన్ చెప్పిన కథ చాలా నచ్చింది. కథని నమ్మి ఈ సినిమాని చేశాను. సినిమా తప్పకుండా ప్రేక్షకులని అలరిస్తుంది' అని చెప్పారు.

సరికొత్త ప్రేమకథ 'దిల్ రూబా'



కిరణ్ అబ్బవరం

హీరో కిరణ్ అబ్బవరం కొత్త చిత్రానికి 'దిల్ రూబా' అనే టైటిల్ ఖరారు చేశారు. రుక్సర్ ఢిల్లాన్ హీరోయిన్. ఈ చిత్రాన్ని శివమ్ సెల్యులాయిడ్స్, మ్యూజిక్ లేబుల్ సారెగమ తమ నిర్మాణ సంస్థ అయినటు వంటి ఏ యూడ్లీ ఫిలిం సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి, సారెగమ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. విశ్వ కరుణ్ దర్శకుడు. ఈ సినిమా టైటిల్ అనౌన్స్‌మెంట్ సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్ ఇంట్రెస్ట్ క్రియేట్ చేస్తోంది. ఈ పోస్టర్‌లో కిరణ్ అబ్బవరం యూనిక్ స్టైల్, యాటిట్యూడ్‌తో కనిపిస్తున్నారు. 'హిస్ లవ్, హిస్ యాంగర్..' అనే కొటేషన్ కిరణ్ అబ్బవరం క్యారెక్టర్‌ను రిఫ్లెక్ట్ చేస్తోంది. లవ్, రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ప్రేక్షకుల్ని ఆకట్టుకోనుంది. ఈ సినిమాను ఫిబ్రవరిలో రిలీజ్ చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈచిత్రానికి ఎడిటర్ - ప్రవీణ్.కేఎల్, సినిమాటోగ్రఫీ - డానియేల్ విశ్వాస్, మ్యూజిక్ - సామ్ సీఎస్, రచన, దర్శకత్వం - విశ్వ కరుణ్

నిధి నేపథ్యంలో 'నాగన్న'



మహేష్‌కుమార్, సింధు

చాందిని క్రియేషన్స్ బ్యానర్ పై మహేష్ కుమార్ హీరోగా, చిత్రం శ్రీను ప్రధాన పాత్రలో నెక్కంటి నాగరాజు నిర్మిస్తున్న తాజా చిత్రం 'నాగన్న'.

ఈ చిత్రాన్ని సతీష్ కుమార్, మహేష్ కుమార్ ద్వయం దర్శకత్వం చేస్తున్నారు. సింధు సిరి, చందన, రూప, జనర్ధాన్, స్వాతి ఘట్కర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్ర ట్రైలర్ విడుదలైంది. ఈ సందర్భంగా డైరెక్టర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ,'ఆదిత్య మ్యూజిక్‌లో పాటలు వచ్చేలా కృషి చేసిన నిరంజన్, మాధవ్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు. సినిమా ఇంత బాగా రావడానికి ప్రొడ్యూసర్ నెక్కంటి నాగరాజు ఇచ్చిన ప్రోత్సాహం ఎంతో ఉంది' అని తెలిపారు.

హీరో, డైరెక్టర్ మహేష్ మాట్లాడుతూ,'12 సంవత్సరాలుగా ఇండస్ట్రీలో అనుభవం ఉంది. ఈ కథని చాలా మంది హీరోల దగ్గరకు వెళ్లి చెప్పాను. అలా నాలుగు సంవత్సరాలు గడిచిపోయాయి. ఇక ప్రొడ్యూసర్ నాగరాజు నన్నే హీరోగా పెట్టి చేయమన్నారు. ఒక ఊరిలో ఉండే కొంత మంది కుర్రాళ్ళు ఒక నిధి కోసం ప్రయత్నిస్తారు. ఈ వేటలో వారికి నిధి దొరికిందా లేదా అనే కథాంశంతో ఈ సినిమాని తెరకెక్కించాం. విడుదలైన ట్రైలర్‌కు మంచి ప్రశంసలు వస్తున్నాయి. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం. ఈ సినిమా ఓటీటీలోనే కాకుండా సొంతంగా థియేటర్లలో కూడా రిలీజ్ చేస్తున్నాం' అని అన్నారు.

హీరోయిన్ సింధు మాట్లాడుతూ,'తెలుగు అమ్మాయిగా పుట్టినందుకు సంతోషంగా ఉంది. ఓ మంచి కథతో రూపొందుతున్న చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం. మీరందరూ ఆదరిస్తారని ఆశిస్తున్నాం' అని చెప్పారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

అమిత్ వ్యాఖ్యలపై రగడ

దేశవ్యాప్తంగా వెల్లువెత్తుతున్న నిరసనలు

ఎన్డీఏలోనూ అసంతృప్తి

ఇంతకీ నితీశ్, చంద్రబాబు దారెటు..!





న్యూఢిల్లీ : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురించి కేంద్రహోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు అటు ఎన్డీఏలోనూ..ఇటు జనంలోనూ కలకలంరేపు తున్నాయి. మతవిభజన రాజకీయాలతో హిందూత్వ ఎజెండా అమలు చేస్తున్న బీజేపీకి అమిత్‌షా నోటిదూల మింగుడుపడటంలేదు. గతంలో ఎన్నడూ మీడియా ముందుకు రాని కేంద్రహెూంమంత్రి అమ్మతోడు..అంబేద్కర్ గురించి తప్పుగా మాట్లాడలేదని చెప్పుకోవటానికి నానా తంటాలు పడుతున్నారు. అనుహ్యంగా డిఫెన్స్‌లో పడిన బీజేపీ, మోడీ సర్కార్ ఏవిధంగా బయటపడాలో తెలియక నానా యాతనపడుతోంది.జమిలీ ఎన్నికలు మొదలుకుని..పార్లమెంట్‌లో పెట్టే ప్రతి అంశానికి మోడీ చేసేదంతా కరెక్టే అన్నట్టు జేడీయూ అధినేత, బీహార్ సీఎం నితీశ్ కుమార్, టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు వంతపాడుతుంటారు. తాజాగా అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలపట్ల సైలెంట్‌గా ఉండటం బెటరన్న తీరులో వారి వ్యవహారశైలి కనిపిస్తోంది. మరోవైపు ఎన్డీఏలోని భాగస్వామి, కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ కూడా అమిత్‌షా వ్యాఖ్యలు ఖండించక తప్పని పరిస్థితి. కానీ చంద్రబాబు, నితీష్‌లు మాత్రం నోరు మెదపట్లేదు.

అంబేద్కరిస్టుల గుస్సా

అంబేద్కర్ లాంటి మహోన్నత వ్యక్తిని అగౌరవపరిచేలా వ్యాఖ్యానించడానికి బీజేపీకి ఎంత ధైర్యమని దేశప్రజానీకం రోడ్లపైకి వచ్చి ఆందోళనలు..నిరసనలు చేపడుతోంది. అమిత్ వ్యాఖ్యలు లక్షలాది భారతీయుల మనోభావాలను గాయపరిచిన నేపథ్యంలో ఆయన తన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాల్సింది పోయి సమర్థించుకోవటంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. తన సోపత్‌దార్ అయిన అమిత్‌ను ప్రధాని మోడీ బహిరంగంగా సమర్థించడం పుండు మీద కారం చల్లినట్టయింది.

ఇంతకీ మీ వైఖరేంటీ..?



తమ వైఖరేమిటో చెప్పాలని ఆప్ అధినేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ గురువారం బీజేపీ మిత్రపక్షాలైన జేడీయూ, తెలుగుదేశం పార్టీలను ప్రశ్నించారు. ఈ మేరకు జేడీయూ అధినేత, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, టీడీపీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారు. అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై కేజ్రీవాల్ ఆ లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు.

కొత్తేం కాదు : అంబేద్కర్ మనుమడు ప్రకాశ్



భారత రాజ్యాంగ నిర్మాతపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను అంబేద్కర్ మనుమడు ప్రకాశ్ అంబేద్కర్ తప్పుపట్టారు. అమిత్ వ్యాఖ్యలు బీజేపీ 'పాత మనస్తత్వాన్నే' ప్రతిబింబించాయని ఎద్దేవా చేశారు. వంచిత్ బహుజన్ అఘాడీ (వీబీఏ) అధినేత అయిన ప్రకాశ్ పూణేలో విలేకరులతో మాట్లాడుతూ అంబేద్కర్ అందించిన సేవల విషయంలో బీజేపీ తృణీకార భావనను అమిత్ వ్యాఖ్యలు బయటపెడుతున్నాయని విమర్శించారు. 'బీజేపీ ఉనికిలోకి రాక ముందు దానికి ముందున్న జన్‌సంఘ్, ఆర్ఎస్ఎస్‌లు రాజ్యాంగాన్ని ఆమోదించే సమయంలో బాబాసాహెబ్‌ను వ్యతిరేకించాయి. అమిత్ ప్రకటనలో కొత్తేమీ లేదు. వారు తమ పాత ప్రణాళికలను అమలు చేయలేకపోతున్నారు. కాంగ్రెస్ కారణంగా కాదు...బాబాసాహెబ్ అంబేద్కర్ కారణంగా వారు నష్టపోతారు' అని చెప్పారు.

అమిత్ ఏమన్నారు?



అమిత్ షా మంగళవారం రాజ్యసభలో చేసిన వ్యాఖ్యలు రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. 'అంబేద్కర్... అంబేద్కర్...అంబేద్కర్...ఇప్పుడు ఈ మాట ఫ్యాషన్‌గా మారింది. దేవుడి పేరు తలచుకొని ఉంటే స్వర్గలోక ప్రాప్తి లభించేది' అంటూ కాంగ్రెస్‌ను ఉద్దేశించి అమిత్ షా వ్యాఖ్యానించారు. దీంతో సభలో పెద్ద దుమారం చెలరేగింది. అమిత్ షాను క్యాబినెట్ నుంచి తొలగించాలని విపక్షాలు ముక్తకంఠంతో డిమాండ్ చేశాయి. అయితే ప్రధాని నరేంద్ర మోడీ ప్రతిపక్షాల డిమాండ్‌ను తోసిపుచ్చి అమిత్‌ను వెనకేసుకొచ్చారు. అంబేద్కర్ చరిత్రను నామరూపాలు లేకుండా చేసేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నిందని, దానిని అమిత్ షా బయటపెట్టడంతో ఇప్పుడు కొత్త నాటకానికి తెర తీసిందని ఎదురు దాడికి దిగారు. సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఆయన ఐదు పోస్టులు పెడుతూ 'డాక్టర్ అంబేద్కర్‌ను అవమానించిన కాంగ్రెస్ చీకటి చరిత్రను, ఎస్సీ-ఎస్టీ సమాజాలను ఆ పార్టీ విస్మరించ డాన్ని అమిత్ షా ఎండగట్టారు' అని అన్నారు. అటు అమిత్ షా కూడా తాను అంబేద్కర్‌కు వ్యతిరేకంగా మాట్లాడలేదని, ఇకపై మాట్లాడబోనని చెప్పారు. తన వ్యాఖ్యలను కాంగ్రెస్ వక్రీకరించిందని నింద వేశారు. అయితే అమిత్‌షాను మోడీ మంత్రివర్గం నుంచి తీసేస్తారా..?లేక అంబేద్కరిస్టుల ఆగ్రహాన్ని మరో విధంగా కట్టడి చేయటానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తుందా..' అన్నదే ఇపుడు హాట్ టాపిక్.

స్థానికత అంశంపై బీఆర్ఎస్ తొందరపాటు

317 జీవో బాధితులకు న్యాయం చేసే ప్రయత్నం : మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి కీలకమైన స్థానికత అంశంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం తొందరపాటుతో 317 జీవో తీసుకొచ్చిందని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. గురువారం శాసనమండలిలో జీవో 317 బాధితులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. బాధితులకు న్యాయం చేసేందుకు జీవోలు 243, 244, 245 తీసుకొచ్చినట్టు చెప్పారు. స్పౌజ్ క్యాటగిరీలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులను పరిగణనలోకి తీసుకోవాలన్న వినతిని పరిశీలించనున్నట్టు చెప్పారు. అదే విధంగా సర్వీస్ 10 రూల్స్, 317 ఎక్సెప్షన్ క్లాజ్‌ను కూడా అవకాశం ఉన్న మేరకు ఉపయోగించుకునే విషయాన్ని పరిశీలిస్తున్నట్టు తెలిపారు.

కాంగ్రెస్ సభ్యులు టి.జీవన్‌రెడ్డి మాట్లాడుతూ స్థానికతకు శాశ్వత పరిష్కారం చూపించాలని కోరారు. ఉమ్మడి జిల్లాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ సభ్యురాలు కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ పదే పదే పదేండ్ల పాలన అంటూ విమర్శలు చేస్తున్నారనీ, ఏడాదిగా ఏం చేశారని ప్రశ్నించారు. ప్రస్తుతం మూడు జిల్లాల సమస్య అని మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం, గతంలో రాష్ట్ర సమస్యగా విమర్శించారని గుర్తుచేశారు. దానిపై ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ రాష్ట్రంలో బాధితులు చెప్పుకునేందుకు గతంలో వేదిక లేక తమ వద్దకు వస్తే వారి సమస్యలను ఎలుగెత్తామని తెలిపారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ మూడు జిల్లాల్లో అత్యధికంగా సమస్య ఉందనీ, మిగిలిన జిల్లాల్లోనూ సమస్య ఉందని మొదట్నుంచి చెబుతున్నారన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు న్యాయం చేసేందుకు వేసిన మంత్రివర్గ ఉపసంఘం 30,993 దరఖాస్తులను స్వీకరించిందనీ, ఉద్యోగ సంఘాలతో సమావేశాలు నిర్వహించిందనీ, ఉప సంఘం 12 సార్లు సమావేశమైందని, ఐదు సార్లు అడ్వొకేట్ జనరల్‌తో తెలిపారు. గత ప్రభుత్వం 317 జీవోను విడుదల చేసే సమయంలో 317 డిని పరిగణనలోకి తీసుకుంటే సమస్య వచ్చేది కాదని అభిప్రాయ పడ్డారు. భవిష్యత్తులో న్యాయ వివాదం కాకుండా అన్ని విషయాలు నిశితంగా పరిశీలిస్తూ ముందుకెళ్తున్నామని చెప్పారు. అందరిని సంప్రదించి ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు . శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలోని మూడు మండలాల్లో రాష్ట్ర అక్షరాస్యత శాతం కన్నా చాలా తక్కువగా ఉందని తెలిపారు. 317 జీవో తర్వాత అక్కడికి టీచర్లు వచ్చారని చెప్పారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాజకీయ వ్యూహంలో 317 జీవో ఉద్యోగుల పాలిట మరణశాసనమని తెలిపారు. 317 జీవో బాధితులను ఆదుకుంటూనే టీచర్లు పూర్తి స్థాయిలో విద్యార్థులున్న చోట ఉండేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

మరో ప్రశ్నకు మంత్రి శ్రీధర్ బాబు సమాధానామిస్తూ, ఉచిత బస్సు ప్రయాణంతో హైదరాబాద్ మెట్రో రైల్‌పై ప్రభావం పడలేదని తెలిపారు.చిన్నపాటి ఇబ్బందులుంటే విధాన రూపకర్తలుగా తామున్నామని భరోసా ఇచ్చారు.

శాసనమండలిలో బీఆర్ఎస్ వాకౌట్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

చెల్లింపులు, జీతాలు, పెన్షన్లు (సవరణ) బిల్లు, 2024కు వ్యతిరేకంగా శాసనమండలి నుంచి బీఆర్ఎస్ వాకౌట్ చేసింది. గురువారం ఈ బిల్లును మంత్రి శ్రీధర్ బాబు ప్రవేశపెట్టగా, బిల్లును తాము వ్యతిరేకిస్తున్నట్టు ప్రకటించి వాకౌట్ చేశారు. అనంతరం బిల్లు ఉద్దేశాలను మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. అనంతరం బిల్లు సభ ఆమోదం పొందినట్టు శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు.

ఆకుపచ్చ కండువాలతో బీఆర్ఎస్ సభ్యులు

గురువారం శాసనమండలి సమావేశానికి బీఆర్ఎస్ సభ్యులు ఆకుపచ్చ కండువాలతో హాజరయ్యారు. దీనిపై ఆ పార్టీ సభ్యురాలు కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు పంట పెట్టుబడి సహాయం అందక, రుణమాఫీ కాక, అన్ని పంటలకు బోనస్ రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అందువల్ల ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులకు ఈ యాసంగికి వానాకాలంతో కలిపి ఎకరాకు రూ.15 వేల చొప్పున పెట్టుబడి సహాయం అందించాలని డిమాండ్ చేశారు.

రూ.2 లక్షల వరకు రైతులందరికి రుణమాఫీ చేయాలనీ, అన్ని పంటలకు వెంటనే బోనస్ చెల్లించాలని కోరారు. ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆకుపచ్చ కండువాలతో వచ్చినట్టు తెలిపారు. అంతకుముందు రైతు సమస్యలపై చర్చించాలని బీఆర్ఎస్ ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తిరస్కరించారు.

నిషేధించినా ముమ్మరంగా వినియోగం

దేశంలో విచ్చలవిడిగా చైనా యాప్ 'కామ్‌స్కానర్' వాడకం

- **అధికారులు, ప్రభుత్వాలు సైతం**



న్యూఢిల్లీ : పత్రాలను స్కానింగ్ చేసే చైనా యాప్ కామ్‌స్కానర్‌ను కేంద్ర ప్రభుత్వం నాలుగు సంవత్సరాల క్రితమే నిషేధించింది. అయినప్పటికీ ప్రభుత్వ సంస్థలు ఇప్పటికీ దానినే వాడుతున్నాయి. చైనాతో నెలకొన్న సరిహద్దు ఘర్షణ సమయంలో 2020 జూన్‌లో కామ్‌స్కానర్ సహా ఆ దేశానికి చెందిన 59 యాప్‌లను కేంద్రం నిషేధించింది. ఈ యాప్‌లు భారత సార్వభౌమత్వానికి, సమగ్రతకు విఘాతం కలిగిస్తున్నాయని, దేశ రక్షణ, భద్రతకు ప్రమాదకరంగా మారాయని ఆ సమయంలో ప్రభుత్వం తెలిపింది. అయినా అది ఇప్పటికీ వాడకంలోనే ఉండడం గమనార్హం. ఉదాహరణకు కామ్‌స్కానర్‌ను ఉపయోగించి ఎన్నికల కమిషన్ స్కాన్ చేసిన డాక్యుమెంటును ప్రముఖ యూట్యూబర్ ట్వీట్ చేసింది.

నిషిద్ధ స్కానింగ్ యాప్‌ను కేంద్ర ఎన్నికల సంఘం మాత్రమే కాదు. వివిధ ప్రభుత్వ విభాగాలు, మంత్రిత్వ శాఖలు అప్‌లోడ్ చేసిన పత్రాలను కామ్‌స్కానర్‌తో స్కానింగ్ చేశారని రెస్ట్ ఆఫ్ వరల్డ్ అనే అమెరికా ప్రచురణ సంస్థ తెలిపింది. తన వాదనకు బలం చేకూర్చేలా 30 ఉదాహరణలను బయటపెట్టింది. ఇవన్నీ యాప్‌ను నిషేధించిన తర్వాతే జరిగాయి.

భారత రెవెన్యూ శాఖతో పాటు రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ అధికారులు ఈ యాప్‌ను తరచూ ఉపయోగిస్తున్నారు. నిషేధం తర్వాత జమ్మూకాశ్మీర్ అధికారులు కూడా దీనిని అనేక సందర్భాలలో వాడారు. కామ్‌స్కానర్ యాప్‌ను అనుకోకుండా ఉపయోగించామంటూ 2021లో ఢిల్లీ పోలీసులు సామాజిక మాధ్యమంలో క్షమాపణలు చెప్పారు. అయితే ఆ తర్వాత కూడా అనేక పత్రాలను ఈ యాప్‌తో స్కాన్ చేశారు. ప్రభుత్వం నిషేధం విధించినందున కొత్తగా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉండదు. అయితే తమ ఫోన్లలో కామ్‌స్కానర్లు ఉన్న వారు దానిని కొనసాగించవచ్చు. 2011లో ప్రారంభమైన కామ్‌స్కానర్‌ను నిషేధించడానికి ముందు మన దేశంలో వంద మిలియన్లకు పైగా డౌన్‌లోడ్లు జరిగాయి.

కామ్‌స్కానర్‌కు ఇంటర్నెట్ కనెక్షన్ అవసరం లేదు. దీంతో నిషేధం అమలులో ఉన్నప్పటికీ దానిని ఉపయోగించడం చాలా తేలికవుతోంది. అదీకాక యాప్‌ను పూర్తిగా నిషేధించడం చాలా కష్టం. కామ్‌స్కానర్‌కు ప్రత్యామ్నాయంగా అనేక స్కానర్లు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. గూగుల్ డ్రైవ్, ఐఫోన్ కెమేరా యాప్, అబోడ్, మైక్రోసాఫ్ట్ లెన్స్ వంటివి ఈ తరహా యాప్‌లే. కామ్‌స్కానర్‌ను నిషేధించడానికి కేవలం రెండు వారాల ముందు మార్కెట్‌లోకి వచ్చిన భారతీయ స్కానర్ 'కాగజ్'...నిషేధం తర్వాత 24 గంటల వ్యవధిలోనే లక్ష డౌన్‌లోడ్లను అందుకుంది. ఈ యాప్‌ను విద్య, ఎలక్ట్రానిక్స్-ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖలు అనుమతించడంతో ఇప్పుడు డౌన్‌లోడ్ల సంఖ్య మూడు కోట్లకు చేరింది. అయినప్పటికీ కొందరు వీర విధేయులు కామ్‌స్కానర్‌ను వదలడం లేదు. ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే కామ్‌స్కానర్‌ను ప్రభుత్వం నిషేధించిన తర్వాత ఏఐఆర్ స్కానర్, కార్బన్ స్కానర్, అప్నా స్కానర్ వంటి దేశీయ యాప్స్ అందుబాటులోకి వచ్చినప్పటికీ వాటిని సరిగా తాజా పరచడం లేదు. కొన్నేమో యాప్ స్టోర్స్ నుండి అదృశ్యమై పోతున్నాయి.

కామ్‌స్కానర్‌ను ఎందుకు నిషేధించాల్సి వచ్చిందో ప్రభుత్వం సరైన వివరణ ఇవ్వలేదు. డాటా భద్రత, వ్యక్తుల గోప్యత, జాతీయ భద్రతపై ఆందోళనలు....వంటి ఫిర్యాదుల దృష్ట్యా యాప్‌ను నిషేధించామని తెలిపింది. అయితే ఈ ఫిర్యాదులకు ప్రాతిపదిక ఏమిటో, వాటిపై విచారణ జరిపారో లేదో తెలియడం లేదని కొందరు నిపుణులు పెదవి విరిచారు. కాగా అమెరికా కూడా ఇటీవల చైనా టెక్ కంపెనీలపై కన్నెర్ర చేసింది. అమెరికా ప్రభుత్వంతో పాటు 30 రాష్ట్రాలు ప్రభుత్వోద్యోగులు, ప్రభుత్వ డివైస్‌లకు సంబంధించి టిక్‌టాక్ వాడకాన్ని నిషేధించాయి. కానీ సాధారణ ప్రజలు దీనిని ఉపయోగించవచ్చు. దేశ భద్రత పరిరక్షణ కోసం నిషేధం మేలైన అస్త్రం కాదని పలువురు నిపుణులు అభిప్రాయపడ్డారు. బలమైన సైబర్ సెక్యూరిటీ విధానాలు, డాటా రక్షణ చట్టాలు అవసరమని వారు సూచించారు.

నా మాటలు వక్రీకరించారు

- **రాజగోపాల్ రెడ్డి**

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

నూతన సచివాలయం పక్కనే కొత్త అసెంబ్లీ భవనం నిర్మిస్తే బాగుంటుందన్న తన వ్యాఖ్యలను వక్రీకరించారని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. అసెంబ్లీ లాబీలో మీడియా ప్రతినిధులతో ఆయన ముచ్చటించారు. ఎన్టీఆర్ అంటే నాకు గౌరవమనీ, ఆయన లెజెండరీ నాయకుడని అన్నారు. ఆయనంటే అందరికీ అభిమానమని కొనియాడారు. తాను ఎన్టీఆర్ ఘాట్ తొలగించి కొత్త అసెంబ్లీ కట్టాలని అన్నట్టుగా నేను అనని మాటల్ని అన్నానని వక్రీకరించి దుష్ప్రచారం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు .నా ఎదుగుదలను అడ్డుకునే కుట్ర జరుగుతున్నదనీ, దయచేసి మరోసారి ఇలాంటి అబద్ధపు ప్రచారాలు పునరావతం కాకుండా చూడాలని మీడియా సోదరులకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ వచ్చిన పదేండ్ల తరువాత కూడా ఆంధ్ర మీడియా రాష్ట్ర రాజకీయాలను శాసించాలని చూస్తున్నదని కీలక వ్యాఖ్యలు చేశారు. దీనిని మేము ఏ మాత్రం ఒప్పుకోబోమన్నారు. ఎన్టీఆర్ అంటే మాకు గౌరవం ఉందనీ, కానీ ఆంధ్ర మీడియా నా మాటలను వక్రీకరించిందని ఆరోపించారు. కొందరు మమ్మల్ని వివరణ అడుగుతున్నారనీ, మాకు కూడా ఆత్మగౌరవం ఉందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో గ్రావిటీ ద్వారా నీరు వచ్చే ప్రాణహిత- చేవెళ్లను పక్కకు పెట్టారన్న రాజగోపాల్‌రెడ్డి, రూ.లక్ష కోట్లు ఖర్చు చేసి కూలిపోయే కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని విమర్శించారు. ఎవరిని అడగకుండానే విపరీతంగా ప్రాజెక్టుల అంచనాలు పెంచుకున్నారని చెప్పారు. ఎక్కడి నుంచి నీరు తీసుకో వాలో నిర్ధారించకుండానే డిండి ఎత్తిపోతల చేపట్టారన్నారు. ఇంజినీర్లను అడగకుండానే కేసీఆర్ ఒక్కరే నిర్ణయాలు తీసుకున్నారని మండిపడ్డారు. రూ.2 లక్షల కోట్ల ఆదాయం వచ్చే ఓఆర్ఆర్‌ను రూ.7 వేల కోట్లకు అమ్మేశారని ఆరోపించారు.

పాస్టర్లు, ఖాదీమ్, గ్రంథీలకు గౌరవ వేతనం ఇస్తాం

- **మంత్రి సీతక్క**



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇమాములు, మౌజాన్‌లతో పాటు పాస్టర్లు, ఖాదీమ్, గ్రంథీలకు గౌరవ వేతనం ఇస్తామని మంత్రి సీతక్క తెలిపారు. గురువారం శాసనమండలిలో బీఆర్ఎస్ సభ్యురాలు కల్వకుంట్ల కవిత అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానమిచ్చారు. ఇమామ్, మౌజాన్‌లకు ప్రతి నెల ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున ఇస్తున్నట్టు తెలిపారు. ఎన్నికలకు ముందు మాటిచ్చామనీ, దాన్ని నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ముస్లీం మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్ హామీని ఏమి చేశారో తెలుసని ఎద్దేవా చేశారు. అంతకు ముందు కవిత మాట్లాడుతూ మైనార్టీ సబ్ ప్లాన్, షాదీ ముబారక్ కు రూ.1.60 లక్షలు, తులం బంగారం, మైనార్టీ సబ్‌ప్లాన్ ఎప్పటి నుంచి అమలు చేస్తారని అడిగారు. ఆంధ్రప్రదేశ్ కాలం నుంచి మైనారిటీ మంత్రి లేకుండా ఎప్పుడూ మంత్రి వర్గం లేదని విమర్శించారు. ఎంఐఎం సభ్యులు ఎఫెండీ మాట్లాడుతూ కేసీఆర్ గౌరవ వేతనాన్ని ఇచ్చారని చెప్పారు. బీఆర్ఎస్ సభ్యులు మహమూద్ అలీ మాట్లాడుతూ కాంగ్రెస్, టీడీపీలను ఎన్నిసార్లు విన్నవించినా గౌరవ వేతనం ఇచ్చేందుకు ముందుకు రాలేదని విమర్శించారు. ఎమ్మెల్సీ ఆమీర్ అలీ ఖాన్ మాట్లాడుతూ మక్కా మసీదు, పబ్లిక్ గార్డెన్‌లోని రెండు మసీదుల్లో పని చేసే 22 మందికి జీతాలు పెంచాలని కోరారు. మంత్రి సీతక్క స్పందిస్తూ, గత కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లీం మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించిందని గుర్తుచేశారు. ఆ రిజర్వేషన్లను 12 శాతం పెంచుతామని హామీ ఇచ్చి బీఆర్ఎస్ మోసం చేసిందని విమర్శించారు.

అంగన్‌వాడీ టీచర్లకు రూ.18 వేలు

బీఆర్ఎస్ సభ్యులు తక్కెళ్లపల్లి రవీందర్ రావు మాట్లాడుతూ అంగన్ వాడీ టీచర్లకు రూ.18 వేల జీతం చెల్లించాలని ప్రభుత్వం ప్రకటించిందా? అని ప్రశ్నించారు. దీనిపై మంత్రి సీతక్క బదులిస్తూ, అంగన్‌వాడీ టీచర్లకు రూ.18 వేలు ఇస్తామని తెలిపారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చామనీ, ఆ హామీ నెరవేర్చేందుకు ఇంకా తమకు సమయం ఉందని తెలిపారు. పరీక్షలు గతంల కూడా నిర్వహించారని గుర్తుచేశారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.2 లక్షలు పెంచుతామని తెలిపారు. మినీ అంగన్ వాడీలను మెయిన్ అంగన్ వాడీలుగా అప్‌గ్రేడ్ చేసినట్టు చెప్పారు.

మెరుగైన చికిత్సనందించాలి

- **కోరుట్ల ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్‌కు మంత్రి దామోదర ఆదేశం**

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జగిత్యాల జిల్లా పెద్దాపూర్‌లోని తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్‌కు చెందిన విద్యార్థులు పాముకాటుకు గురైన ఘటనపై వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పాముకాటుకు గురైనా విద్యార్థులకు మెరుగైన చికిత్సను అందించాల్సిందిగా కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు.

భారత మార్కెట్లకు ఫెడ్ దెబ్బ



- **సెన్సెక్స్ 965 పాయింట్ల పతనం**
- **రూ.3 లక్షల కోట్ల సంపద ఆవిరి**

ముంబయి : భారత స్టాక్ మార్కెట్లపై అమెరికా ఫెడ్ వడ్డీ రేట్ల పిడుగు పడింది. మరోవైపు దేశీయంగా ఎలాంటి సానుకూల ఆర్థిక సంకేతాలు కానరాకపోవడంతో అమ్మకాల ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో గురువారం బీఎస్ఇ సెన్సెక్స్ 964 పాయింట్లు లేదా 1.20 శాతం పతనమై 79,218కి పడిపోయింది. ఇంట్రాడేలో ఈ సూచీ 79,516.70- 79,218.05 పాయింట్ల మధ్య కదలాడింది. బీఎస్ఈ బాటలోనే ఎన్ఎస్ఈ నిఫ్టీ 247 పాయింట్ల నష్టంతో 23,952కు దిగజారింది. ఇంట్రాడేలో 24,005-23,870 మధ్య కదలాడింది.నిఫ్టీ-50లో 36 సూచీలు నష్టాలను చవి చూశాయి. బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్ సర్వ్, ఏషియన్ పెయింట్స్, జేఎస్ డబ్ల్యూ స్టీల్, గ్రాసిమ్ తదితర స్టాక్స్ 2.33 శాతం వరకూ అధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. మరోవైపు డాక్టర్ రెడ్డీస్, సిప్లా, బీపీసీఎల్, సన్ ఫార్మా అపోలో హాస్పిటల్ తదితర 14 స్టాక్స్ 4.04 శాతం వరకూ పెరిగి అధికంగా లాభపడిన వాటిలో ఉన్నాయి. మిడ్‌క్యాప్ 0.28 శాతం, స్మాల్ క్యాప్ 0.51 శాతం చొప్పున నష్టపోయాయి. బ్యాంక్ స్టాక్స్, ఐటి, ఫైనాన్సియల్ సర్వీసెస్, కన్జూమర్ డ్యూరబుల్స్, మెటల్ తదితర సూచీలు నష్టపోయిన వాటిలో ఉన్నాయి. తాజాగా అమెరికా ఫెడరల్ రిజర్వ్ 25 బేసిస్ పాయింట్ల మేర కీలక వడ్డీ రేట్లను తగ్గించినట్టు ప్రకటించింది.వచ్చే 2025లో మూడు, నాలుగు సార్లు రేట్ల కోతలను మార్కెట్లు అంచనా వేయగా.. కేవలం రెండుసార్లు మాత్రమే కోత ఉండొచ్చంటూ ఫెడ్ సంకేతాలు ఇవ్వడం మదుపర్ల విశ్వాసాన్ని దెబ్బతీసింది. ఫెడ్ నిర్ణయంతో నిన్న అమెరికా ప్రధాన సూచీలైన ఎస్అండ్‌పీ 500, నాస్‌డాక్ భారీ నష్టాల్లో ముగిశాయి. దీని ప్రభావం భారత మార్కెట్లతో పాటు ఇతర ప్రధాన మార్కెట్లపైనా పడింది. దేశీయంగా ఒక్క పూటలోనే మదుపర్ల సంపద రూ.3 లక్షల కోట్లు హరించుకుపోగా.. బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.450 లక్షల కోట్లకు పడిపోయింది. విదేశీ సంస్థాగత మదుపర్లు గత మూడు సెషన్లలో దాదాపు రూ.8వేల కోట్లను భారత ఈక్విటీ మార్కెట్ల నుంచి వెనక్కు తీసుకున్నారు.

రూ.3,626 కోట్ల స్పెక్ట్రం బకాయిల చెల్లింపు

- **భారతీ ఎయిర్‌టెల్ వెల్లడి**

న్యూఢిల్లీ: ప్రయివేటు టెల్కో భారతీ ఎయిర్‌టెల్ 2016లో కొనుగోలు చేసిన స్పెక్ట్రమ్‌నకు సంబంధించిన అన్ని బకాయిలను చెల్లించినట్లు భారతీ ఎయిర్‌టెల్ వెల్లడించింది. టెలికాం విభాగానికి రూ.3,626 కోట్ల చెల్లింపులు చేసినట్టు గురువారం ఆ సంస్థ తెలిపింది. ఈ చెల్లింపుతో తన స్పెక్ట్రమ్ ముందస్తు బకాయిలన్నింటినీ, వడ్డీ ఖర్చులు 8.65 శాతం కంటే ఎక్కువగా ఉన్నాయని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఏడాదిలో మొత్తంగా రూ.28,320 కోట్ల స్పెక్ట్రమ్ చెల్లింపులు చేసింది.

నథింగ్ ఒఎస్ 3.0 ఆవిష్కరణ

న్యూఢిల్లీ : లండన్‌కి చెందిన టెక్ బ్రాండ్ నథింగ్ కొత్తగా ఒఎస్ 3.0ను ఆవిష్కరించినట్టు తెలిపింది. ఆండ్రాయిడ్ 15కు మద్దతునిచ్చే ఈ కొత్త ఒఎస్ యూజర్ అనుభవాన్ని మరింత పెంచడానికి గాను కొత్త ఫీచర్లు, మెరుగుదలలను పరిచయం చేస్తున్నట్టు పేర్కొంది. ఇందులో ఆధునిక సెర్చ్ ఫంక్షన్, విస్తరించబడిన ఎడిటింగ్ సాధనాలైన ఫిల్టర్స్, మార్క్ అప్స్, సూచనలు సహా కొత్త నేటివ్ ఫోటో గాలరీ యాప్‌ను పరిచయం చేసినట్టు వెల్లడించింది.

వికాస్ ఎకోటెక్‌కు సీఐఐ అవార్డు

న్యూఢిల్లీ : స్పెషాలిటీ పాలిమర్స్ అండ్ స్పెషాలిటీ అడిటివ్స్, కెమికల్స్ వ్యాపారాలు కలిగిన తమ సంస్థకు కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ప్రతిష్టాత్మకంగా అందించిన ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్ అవార్డ్స్ 2024 దక్కిందని వికాస్ ఎకోటెక్ లిమిటెడ్ తెలిపింది. టాప్ 75 ఇన్నోవేటివ్ కంపెనీలలో ఒక్కటిగా నిలిచిందని పేర్కొంది. ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ గుర్తింపును పొందినట్లు పేర్కొంది. ఇది తమ ఆవిష్కరణలు, అసాధారణమైన పనితీరుకు నిదర్శనమని పేర్కొంది.

స్టూడెంట్ ట్రైబ్‌తో మారుట్ డ్రోన్ భాగస్వామ్యం

హైదరాబాద్ : సాంకేతికతలో విద్యార్థులకు అవకాశాలను పెంచేందుకు స్టూడెంట్ ట్రైబ్‌తో మారుట్ డ్రోన్ భాగస్వామ్యం కుదర్చుకున్నట్లు ప్రకటించింది. ఈ భాగస్వామ్యం ద్వారా విద్యార్థుకు డ్రోన్ సాంకేతికతలోని ఉన్నతమైన, ఆసక్తి కరమైన అవకాశాలను ప్రత్యక్షంగా అనుసంధానం చేసే ఒక వేదికను సృష్టిస్తున్నట్లు పేర్కొంది. ఇది కేవలం ఒక విద్యా కార్యక్రమాలకు మాత్రమే కాదని.. సాంకేతిక రంగాలలో విద్యార్థులు నేర్చుకునేతీరు, వాళ్ల అన్ని విషయాల్లో పాల్గొనే వైఖరి, వారి కెరీర్ కొరకు సమగ్ర అభివృద్ధి నిర్మించేందుకు ఒక ప్రత్యేక వాతావరణాన్ని రూపొందిస్తుందని మారుట్ డ్రోన్స్ వ్యవస్థాపకుడు సాయి కుమార్ తెలిపారు. "మా దష్టి అకడమిక్ జ్ఞానాన్ని, పరిశ్రమ అవసరాలను అనుసంధానించడమే. మేము విద్యార్థుల సాంకేతిక అభిరుచిని ప్రామాణిక కెరీర్ అవకాశాలుగా మార్చుకునే వాతావరణం సృష్టిస్తున్నాము." అని ట్రైబ్ వ్యవస్థాపకుడు చరణ్ లక్కరాజు పేర్కొన్నారు.

కియా నుంచి సైరాస్ ఎస్‌యువి



న్యూఢిల్లీ : అనంతపురం కేంద్రంగా కార్లను తయారు చేస్తోన్న దక్షిణ కొరియా సంస్థ కియా ఎస్‌యువి సెగ్మెంట్‌లో కొత్తగా 'సైరస్' మోడల్‌ను ఆవిష్కరించినట్లు ప్రకటించింది. ఈ కారు ఆరు వేరియంట్లలో లభిస్తుందని కియా మోటార్ ఇండియా వెల్లడించింది. జనవరి 3 నుంచి బుకింగ్స్‌ను తెరిచి.. ఫిబ్రవరి నుంచి డెలివరీలను ప్రారంభించనున్నట్లు పేర్కొంది. కాగా.. దీని ధరను వెల్లడించలేదు.

క్వాలీజీల్ మూడో యూనిట్ ప్రారంభం

హైదరాబాద్ : క్వాలిటీ ఇంజనీరింగ్, డిజిటల్ ఇన్నోవేషన్ సేవల అంతర్జాతీయ సంస్థ క్వాలీజీల్ హైదరాబాద్‌లో తమ కొత్త కేంద్రాన్ని ప్రారంభించినట్లు ప్రకటించింది. 2021లో భారత్‌లో తమ కార్యకలాపాలను ప్రారంభించినట్లు పేర్కొంది. తాజా విస్తరణ తమ అద్భుతమైన వృద్ధికి నిదర్శనంగా నిలుస్తుందని పేర్కొంది. వచ్చే నాలుగేళ్లలో 3500 ఉద్యోగాలను సృష్టించడం, 130 మిలియన్ డాలర్ల ఆదాయాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు క్వాలీజీల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సిఇఒ కళ్యాణ్ కొండా తెలిపారు. ఈ విస్తరణ సాంకేతికత, ప్రతిభ సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తుందన్నారు.

సిద్స్‌ఫార్మ్ నుంచి ఎ2 గేదె పాలు

హైదరాబాద్ : తెలంగాణలోని ప్రముఖ డి2సి డెయిరీ బ్రాండ్ అయిన సిద్స్ ఫార్మ్ తమ ఎ2 బఫెలో మిల్క్‌ను కొత్తగా ఒక్క లీటర్ అసెప్టిక్ ప్యాకేజింగ్ ఎస్కెయులో విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ఇది రూ.120కి లభించనుందని తెలిపింది. . స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన, కల్తీ లేని పాలు, పాల ఉత్పత్తులను అందిస్తున్నట్లు పేర్కొంది. కొత్త అసెప్టిక్ ప్యాక్ మొదట్లో హైదరాబాద్, బెంగళూరులో అందుబాటులో ఉంటుందని పేర్కొంది. త్వరలో ముంబయి, కొచ్చి, నాసిక్, అహ్మదాబాద్, సూరత్, రాజ్‌కోట్, వడోదరల్లోనూ ఆన్‌లైన్ వేదికల్లో అందుబాటులో ఉంటుందని సిద్స్ ఫార్మ్ వ్యవస్థాపకుడు డాక్టర్ కిషోర్ ఇందుకూరి తెలిపారు. ఎ2 గేదె పాలలో పోషకాలు సమృద్ధిగా ఉంటాయన్నారు.

34 శిక్షణ విమానాలకు ఎయిరిండియా ఆర్డర్

న్యూఢిల్లీ : టాటా గ్రూపులో భాగమైన ఎయిరిండియా ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ నెలకొల్పేందుకు వేగంగా ఏర్పాటు చేస్తోంది. ఇందుకోసం తాజాగా 34 విమానాలకు ఆర్డర్ ఇచ్చినట్లు గురువారం ఆ సంస్థ వెల్లడించింది. వీటితో దక్షిణాసియాలోనే అతిపెద్ద వైమానిక శిక్షణ కేంద్రాన్ని మహారాష్ట్రలోని అమరావతిలో ప్రారంభించనుంది. వచ్చే ఏడాది ద్వితీయార్థం నియంత్రణ సంస్థల నుంచి అనుమతులు తీసుకొని దీని కార్యకలాపాలు మొదలు పెట్టాలని లక్ష్యంగా పెట్టుకుంది. తాజాగా ఆర్డర్ ఇచ్చిన వాటిల్లో అమెరికాకు చెందిన పైపర్ సంస్థకు చెందిన 31 సింగల్ ఇంజిన్ విమానాలు కాగా.. డైమండ్ ఎయిర్ క్రాఫ్ట్ ఆస్ట్రియా నుంచి మరో మూడు ట్విన్ ఇంజిన్‌వి ఉన్నాయి.

బీఆర్ఎస్ నాయకులది రోజుకో వేషం

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ నాయకులు రోజుకో వేషం వేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి విమర్శించారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభా సమయాన్ని వృథా చేస్తున్నారన్నారు. వాళ్లు డ్రంకెన్ డ్రైవ్ పెట్టాలని అంటున్నారనీ, దానితో పాటు డ్రగ్స్ టెస్ట్ కూడా పెట్టాలని స్పీకర్‌ను కోరతామని అన్నారు. అభివృద్ధిపై సభలో చర్చ జరగకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. భూభారతి ద్వారా గత ప్రభుత్వంలో జరిగిన భూ అక్రమాలు బయటపడతాయన్నారు.

బీఏసీలో చర్చ లేకుండా సభ : కేపీ వివేకానంద

బీఏసీలో చర్చించకుండానే అసెంబ్లీ సమావేశాల నిర్వహించటం చరిత్రలో మొదటిసారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద విమర్శించారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. ఏ అంశంపై ఎప్పుడు చర్చించాలో స్పష్టత లేదన్నారు. నిబంధనలను బుల్డోజ్ చేసుకుంటూ సభ నిర్వహిస్తున్నారని విమర్శించారు. రైతులు, ఉద్యోగులు, యువత, నిరుద్యోగులు, మహిళలు సమస్యల్లో ఉంటే వాటిపై చర్చ పెట్టకుండా శాసన వ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. పేరుకే ప్రజా పాలన కానీ.. అన్ని అరాచకాలేనని విమర్శించారు.

అంబేద్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలు విడ్డూరం :ఎమ్మెల్యే మాణిక్‌రావు

అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయనీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం, వారి దయా దాక్షిణ్యాల వల్లనే ప్రజాస్వామ్యం నడుస్తున్నదని చెప్పారు. అంబేద్కర్ చరిత్ర అమిత్‌షాకు తెలియదని ఎద్దేవా చేశారు. బీజేపీ మనువాద పార్టీ అనీ, అంబేద్కర్‌ను రెండు సార్లు జన సంఘ్ ఓడించిందని గుర్తు చేశారు.

గల్లీగల్లీకి అంబేద్కర్ విగ్రహాన్ని నెలకొల్పుతాం :ఎమ్మెల్యే అనిల్ జాదవ్

అంబేద్కర్ విగ్రహాన్ని గల్లీగల్లీకి నెలకొల్పుతామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహం అవసరమా అని అమిత్ షా అనటంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. మనువాద భావజాలంతోనే ఇలా మాట్లాడుతున్నారని విమర్శించారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లే తాను ఎమ్మెల్యేను అయ్యాన న్నారు. కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిని అనుసరిస్తున్నదని విమర్శించారు.

అమిత్‌షా మాటలు వక్రీకరిస్తున్నారు : ఎమ్మెల్యే పాయల్ శంకర్

అమిత్‌షా మాటలను కావాలనే కాంగ్రెస్ వారు వక్రీకరిస్తున్నారని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ స్ఫూర్తితోనే మోడీ ముందుకు పోతున్నారన్నారు. ఏదో విధంగా అమిత్‌షా మాటలను రచ్చ చేయాలని కాంగ్రెస్ చూస్తున్నదని విమర్శించారు. ఫేక్ వీడియోలు వైరల్ చేస్తున్నారన్నారు. అంబేద్కర్‌ని దేవునితో సమానంగా బీజేపీ చూస్తుందని చెప్పారు.

అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలి :
ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్

అమిత్ షాను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని ఎమ్మెల్సీ బి మహేశ్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ దగ్గర ఆయన మాట్లాడుతూ అమిత్‌షా హోం మంత్రిగా బాధ్యతల్లో ఉండి, పార్లమెంటులో అంబేద్కర్ పై చేసిన వ్యాఖ్యలు క్షమించరాని వన్నారు. మొత్తం భారత జాతినే ఆయన అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది దేశ ప్రజలను బాధించిందన్నారు. అమిత్‌షాను హోం మంత్రి పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ఆయన మాటలు మనువాద సంస్కృతిని ప్రతిబింబించే విధంగా ఉన్నాయన్నారు. దేశం బహుళ కులాలు, మతాల కలయికతో ఉన్నదన్నారు. ఆయన మాటలు దేశ సమగ్రతకు విఘాతమని విమర్శించారు.

అమిత్‌షాపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి :
మంత్రి పొన్నం ప్రభాకర్

అమిత్‌షాపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మంత్రి మాట్లాడుతూ అంబేద్కర్‌ని అమిత్ షా అవమానపరిస్తే బీఆర్ఎస్ నేతలు ఎందుకు మాట్లాడుతలేరని ప్రశ్నించారు. కాంగ్రెస్ శ్రేణులు రాష్ట్ర వ్యాప్తంగా అమిత్ షాపై కేసులు పెడుతాయని చెప్పారు. అదానీపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయటంపై బీఆర్ఎస్ వైఖరి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

ఎన్‌టీఆర్ ఘాట్ జోలికొస్తే ఊరుకోం :
బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి

ఎన్‌టీఆర్ ఘాట్‌పై చేయేస్తే ఊరుకోబోమని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, మాధవరం కృష్ణారావు హెచ్చరించారు. ఎన్టీ రామారావు ట్యాంక్ బండ్, నెక్లెస్ రోడ్డులను పర్యాటక కేంద్రంగా చేశారని గుర్తు చేశారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద వారు మాట్లాడుతూ ఎన్‌టీఆర్ ఘాట్‌ను తొలగిస్తామంటూ కొందరు వ్యాఖ్యలు చేస్తున్నారని గుర్తు చేశారు. అదొక గొప్ప పర్యాటక ప్రాంతంగా ఉందన్నారు. ఎన్‌టీఆర్ అంటే ఎందుకంత భయమని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్‌టీఆర్, కేసీఆర్ మార్క్ లేకుండా కుట్ర చేస్తున్నదని విమర్శించారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి : టీజీఎస్

అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని తెలంగాణ గిరిజన సంఘం(టీజీఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం ధర్మానాయక్, ఆర్ శ్రీరాంనాయక్ ఒక ప్రకటన విడుదల చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా నేటి నుంచి 24వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. పార్లమెంట్ సాక్షిగా అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలతో దేశ ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. అమిత్ షా అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలు వ్యక్తిగతం కాదనీ, బీజేపీ, ఆర్ఎస్ఎస్ మూల సిద్ధాంతంలో భాగమేనని తెలిపారు. అమిత్‌షా వ్యాఖ్యలను మోడీ ఎందుకు ఖండించటం లేదని ప్రశ్నించారు.

గొల్ల కురుమలను మోసం చేస్తున్న ప్రభుత్వం

జీఆర్ఎస్ ప్రభుత్వం లాగే.. కాంగ్రెస్ వ్యవహారం :
గొర్రెలు, మేకల పెంపకదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కిల్లె గోపాల్



నవతెలంగాణ - ముషీరాబాద్

బీఆర్ఎస్ ప్రభుత్వం గొల్ల కురుమలను మోసం చేసినట్టే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వ్యవహరిస్తోందని గొర్రెలు, మేకల పెంపకదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కిల్లె గోపాల్ అన్నారు. గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో గొల్ల కురుమలకు రూ.2 లక్షలు బదిలీ ద్వారా రెండో విడత గొర్రెల పంపిణీ చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీనిచ్చిందని గుర్తు చేశారు. కానీ అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నా హామీని నెరవేర్చకుండా బీఆర్ఎస్ అడుగుజాడల్లో నడుస్తోందని విమర్శించారు. అవినీతి సాకుతో నేటి ప్రభుత్వం గొర్రెలివ్వకుండా డీడీ డబ్బులు రిటర్న్ ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. పశువైద్యశాలల్లో ఎలాంటి మందులూ అందుబాటులో ఉండటం లేదని, రెండేండ్ల నుంచి కనీసం నట్టల మందులు కూడా ఇవ్వడం లేదని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిరోజూ వీధి కుక్కల దాడులు, రకరకాల ప్రమాదాల్లో వందలాది గొర్రెలు మృత్యువాత పడుతున్నాయని, గొర్రెల కాపరులపై ఫారెస్టు అధికారుల దాడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, రైతు బీమా ఉందనే కారణం చూపి ప్రమాదవశాత్తు మరణించిన గొర్రెల కాపరులకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వడం లేదన్నారు. గొల్లకురుమల సంక్షేమం పట్ల ప్రభుత్వానికి ఒక స్పష్టమైన విధానం లేదని, ఇప్పటికీ పశుసంవర్ధక శాఖకు ప్రత్యేక మంత్రి లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి దగ్గరే ఆ శాఖ ఉండటంతో ఎవరనీ కలిసే అవకాశం ఇవ్వడం లేదని, శాఖకు శాశ్వత డైరెక్టర్‌ను ఇతర అధికారులను నియమించడం లేదని చెప్పారు. సమస్యలను ఎవరికి మొరపెట్టుకోవాలో అర్థం కావడం లేదన్నారు. దళారుల ప్రమేయం లేకుండా నగదు బదిలీ ద్వారా రెండో విడత గొర్రెల పంపిణీ చేయాలని, గొర్రెలు, మేకలకు ప్రభుత్వమే ఉచితంగా ఇన్సూరెన్స్ చేయించాలని, సబ్సిడీపై జీవాలకు దాణా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

50 సంవత్సరాలు దాటిన కాపరులకు రూ.5000 పెన్షన్ ఇవ్వాలని, వివిధ ప్రమాదాల్లో చనిపోతున్న గొర్రెల కాపరులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు. పాలనా సమయం ముగిసిన సొసైటీలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలన్నారు. కొత్త జిల్లాల్లో అంగళ్ల(సంత)ను గొర్రెల పెంపకందార్ల సొసైటీలకు కేటాయించి, జీవాల అమ్మకాలు తూకం పద్ధతిలో జరిపేలా చర్యలు చేపట్టాలన్నారు. ట్యాంక్ బండ్‌పై దొడ్డి కొమరయ్య విగ్రహం పెట్టాలని కోరారు. ఈ ధర్నాలో సంఘం గౌరవ అధ్యక్షులు కాసాని ఐలయ్య ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

సభను తప్పుదోవ పట్టించలేదు

- డీపీఆర్ ఉందని ప్రపంచబ్యాంకుకు చెప్పలేదు :
మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మూసీ పునరుజ్జీవన పథకానికి సంబంధించి ప్రపంచ బ్యాంకుకు డీపీఆర్ ఉందని చెప్పినట్టు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కొట్టిపారేశారు. గురువారం శాసనమండలిలో బీఆర్ఎస్ ఇచ్చిన ప్రివిలేజ్ మోషన్‌పై ఆయన వివరణ ఇచ్చారు. తాము సమర్పించిన ప్రిలిమినరీ ప్రాజెక్టు రిపోర్ట్ (పీపీఆర్) డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్ ఎఫైర్స్ వద్దనే ఉందనీ, ఇంకా ప్రపంచ బ్యాంకు వద్దకు పోలేదని స్పష్టం చేశారు. కన్సల్టెన్సీ ఇచ్చే దాని ఆధారంగా డీపీఆర్ ఉంటుందన్నారు. డీపీఆర్ వచ్చాక సభ ముందు ఉంచుతామని తెలిపారు. దీనిపై బీఆర్ఎస్ సభ్యురాలు కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ పీపీఆర్ లో డీపీఆర్ ఉందా అని అడిగినా కాలమ్‌లో అవును అని పేర్కొన్నారని ఆరోపించారు. దీనిపై మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ అది డిటెయిల్డ్ ఇంజినీరింగ్ డిజైన్ ఉందా అన్న దానికి అవును అని పేర్కొన్నట్టు వివరించారు. సభను తప్పుదోవ పట్టించే ఉద్దేశం లేదని తెలిపారు. సభ్యులు భానుప్రసాద్ మాట్లాడుతూ పదేండ్లలో ఒక మంత్రి ప్రివిలేజ్ మోషన్ ఎదుర్కొనడం మొదటిసారని తెలిపారు. కవిత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ఒకలా, ప్రపంచ బ్యాంకు మరోలా, సభకు ఇంకో ఇలా తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు.

22న పట్టు రైతుల రాష్ట్ర సమ్మేళనం

- పట్టు రైతుల సంఘం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని పట్టు రైతుల సమ్మేళనం ఈ నెల 22న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్టు పట్టు రైతుల సంఘం రాష్ట్ర బాధ్యులు మూడ్ శోభన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మల్బరీ పంటల సాగుకు ప్రోత్సాహం కరువైందనీ, క్రమంగా పంట విస్తీర్ణం పడిపోతుందని తెలిపారు. పంట దిగుబడి, లాభనష్టాలపై పూర్తిస్థాయిలో ప్రభుత్వం అవగాహన కల్పించకపోవడంతో మల్బరీ సాగుపై రైతులు ఆసక్తి చూపడం లేదని పేర్కొన్నారు. ఉద్యానవన శాఖలో విలీనం తర్వాత సెరికల్చర్ నిరాదరణకు గురైందని తెలిపారు. సెరికల్చర్‌లో రైతులకు అవగాహన కల్పించేందుకు విస్తరణ అధికారులు లేకపోవడం కారణంగానే సాగు విస్తీర్ణం తగ్గిందని పేర్కొన్నారు. పట్టు పరిశ్రమలో అనుసరించాల్సిన పద్ధతులు, మెళుకువలు, పరిష్కార మార్గాలపై ఈ సమ్మేళనంలో చర్చ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దండ రాజిరెడ్డి, సెరికల్చర్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ లత హాజరవుతున్నట్టు తెలిపారు.

స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే..

- ఆ చట్ట సవరణ బిల్లుల్లో ఆ అంశమేదీ..? :
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్

నవతెలంగాణ-సిటీబ్యూరో

స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. పురపాలక, జీహెచ్ఎంసీ, పంచాయతీ రాజ్ చట్ట సవరణ బిల్లుల్లో ఈ అంశం లేదని చెప్పారు. మూడు బిల్లులకు బీఆర్ఎస్ తరఫున సవరణలు ప్రతిపాదిస్తున్నామని తెలిపారు. గురువారం అసెంబ్లీలో మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. తమ సవరణలను కచ్చితంగా పరిగణనలోకి తీసుకోవాలన్నారు. అవసరమైతే సభలో డివిజన్‌కు కూడా పట్టుబడతామని చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. నవంబర్‌లోగా కులగణన పూర్తి చేస్తామని చెప్పిందన్నారు. కులగణనపై తేల్చకుండా చట్ట సవరణకు అసెంబ్లీలో ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 50 శాతానికిపైగా ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు దక్కకుండా చేస్తున్నారని విమర్శించారు. 42 శాతం రిజర్వేషన్లు ప్రస్తావించకపోవడం బీసీలను మోసం చేయడమేనన్నారు.

ఎడ్ల బండిపై అసెంబ్లీకి బీజేపీ ఎమ్మెల్యేలురైతుల సమస్యలు పరిష్కరించాలని నిరసన

రాష్ట్రంలోని రైతాంగ సమస్యలను అసెంబ్లీలో చర్చించేందుకు ప్రభుత్వం నిరాకరిస్తోందంటూ బీజేపీ ఎమ్మెల్యేలు గురువారం ఎడ్లబండిపై హాజరయ్యారు. ఎమెల్యే క్వార్టర్స్ నుంచి అసెంబ్లీ వరకు ఎడ్ల బండిపై వచ్చారు. ఈ సందర్భంగా బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. రైతు సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వానికి సమయమే లేదా అని ప్రశ్నించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తూ ప్రజలను మభ్యపెడు తోందన్నారు. అర్హులైన రైతులకు రుణమాఫీ నిధులు మంజూరు చేయాలని కోరారు. రైతు భరోసా పథకాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు సమస్యలపై సర్కార్‌కు కనువిప్పు కలగాలనే తాము ఎడ్ల బండిపై అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యామని చెప్పారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలేవి?

జీహెచ్ఎంసీ కమిషనర్‌కు హైకోర్టు ప్రశ్న

నవతెలంగాణ -హైదరాబాద్

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలో అక్రమ నిర్మాణాలపై అధికారులు నాన్చుడి వైఖరిని ఎందుకు అనుసరిస్తున్నారని హైకోర్టు ప్రశ్నించింది. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఫిర్యాదు చేస్తే అధికారులు పట్టించుకోవడం లేదని తప్పుపట్టింది. దీంతో ప్రజలు కోర్టులను ఆశ్రయిస్తున్నారని చెప్పింది. అనుమతి లేని నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా ఎందుకు రాజీ పడుతున్నారని ప్రశ్నించింది. టోలిచౌకిలో కూల్చివేతలపై దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ లక్ష్మణ్ గురువారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా జస్టిస్ పైన పేర్కొన్న విధంగా ప్రశ్నించారు. విచారణకు జీహెచ్ఎంసీ కమిషనర్ స్వయంగా హాజరయ్యారు. తాను, జీహెచ్ఎంసీ కేసును రాజీ చేసుకున్నామని పిటిషనర్ చెప్పడాన్ని తప్పుపట్టింది. ఈనెల 22లోగా జీహెచ్ఎంసీ తీసుకున్న చర్యలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.

మోహన్‌బాబుకు లభించని ఊరట

మంచు మోహన్‌బాబు, ఆయన కొడుకు మనోజ్ మధ్య వివాదంపై కవరేజీకి వెళ్లిన విలేకరిపై దాడి చేసిన కేసులో ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. తదుపరి విచారణ ఈ నెల 23న జరిగే వరకు ముందస్తు బెయిల్ ఇవ్వాలన్న ఆయన లాయర్ వినతిని తిరస్కరించింది. ఇరుపక్షాల వాదనలు గురువారం పూర్తయ్యాయి. మోహన్‌బాబు దుబాయ్ పారిపోయారని విలేకరి తరఫు లాయర్ చెప్పడంపై స్పందించిన హైకోర్టు, మోహన్‌బాబు ప్రయాణ వివరాలతో శుక్రవారం అఫిడవిట్ వేయాలని చెప్పింది.

ఫోన్‌ట్యాపింగ్ నిందితుడి కేసులో వాదనలు

ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుడు అదనపు రిటైర్డు ఎస్పీ ఎస్.భుజంగరావుకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలనే పిటిషన్‌పై గురువారం హైకోర్టులో వాదనలు జరిగాయి. ఇప్పటికే దర్యాప్తు పూర్తయినందున మధ్యంతర బెయిల్ ఉత్తర్వులను కొనసాగించాలని ఆయన లాయర్ కోరారు. అనారోగ్యంతో ఉన్నారని చెప్పారు. బెయిల్ ఇస్తే కేసుపై



ప్రభావం పడుతుందని పోలీసుల వాదన. బెయిల్ ఇస్తే సాక్ష్యాధారాలు తారుమారు అవుతాయని చెప్పారు. శుక్రవారం వాదనలు జరగనున్నాయి.

విచారణను ఎదుర్కోవాల్సిందే
బీజేపీ ఎంపీ అర్వింద్‌కి ఎదురుదెబ్బ

బీజేపీకి చెందిన నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్‌పై గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో దాఖలైన కేసులను కొట్టివేసేందుకు హైకోర్టు నిరాకరించింది. నాటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావును కించపరిచేలా విలేకరుల సమావేశంలో మాట్లాడారంటూ నమోదైన పోలీసు కేసులను కొట్టివేయా లంటూ ధర్మపురి వేసిన పిటిషన్‌ను కొట్టేసింది. కేసీఆర్‌ను దూషించారంటూ అరవింద్‌పై బంజారా హిల్స్, అబిడ్స్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన మూడు కేసుల విచారణను ఎదుర్కోవాల్సిందేనని స్పష్టం చేసింది. విచారణకు హాజరు మినహాయింపు ఇచ్చింది. ఒకవేళ హాజరు అవసరమని భావించి కింది కోర్టు ఆదేశాలు జారీ చేస్తే హాజరుకావాలని స్పష్టం చేసింది. తనపై కేసులను కొట్టివేయాలని ధర్మపురి అరవింద్ వేర్వేరుగా దాఖలు చేసిన మూడు పిటిషన్లను హైకోర్టు కొట్టేసింది. విలేకరుల సమావేశంలో కేసీఆర్‌ను కించపరుస్తూ దూషించిన అరవింద్‌పై పోలీసులకు ముగ్గురు వ్యక్తులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుల మేరకు బంజారాహిల్స్ పోలీసు స్టేషన్‌లో రెండు, అబిడ్స్ పోలీసు స్టేషన్‌లో మరో కేసు నమోదైంది. ఈ కేసులను కొట్టివేయాలని కోరుతూ అరవింద్ వేర్వేరుగా మూడు పిటిషన్‌లు దాఖలు చేశారు. వీటిపై విచారించిన జస్టిస్ కె.లక్ష్మణ్ పిటిషన్‌లను కొట్టివేస్తూ తీర్పు వెలువరించారు. నమోదైన కేసుల్లో ఆరోపణల తీవ్రత నేపథ్యంలో కింది కోర్టులో విచారణను ఎదుర్కోవాల్సిందేనని పేర్కొన్నారు. అయితే హాజరు మినహాయింపునిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

30లోగా పరిహారం చెల్లించండి

యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం గోపాలపురం వాటర్ ట్యాంకు, పాఠశాల, బస్టాండ్ నిర్మాణం కోసం సేకరించిన భూమి యజమానికి ఈనెల 30లోగా పరిహారం చెల్లించాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్డీవో, ఎంపీడీఓ, తహసీల్దార్లకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఒకవేళ పరిహారం చెల్లించని పక్షంలో వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించించింది. వివరణపై హైకోర్టు సంతృప్తి చెందకపోతే జైలుకు పంపాల్సి ఉంటుందని హెచ్చరించింది. వాటర్‌ట్యాంకు, పాఠశాల, బస్టాండ్ నిర్మాణం కోసం సేకరించిన 1.36 ఎకరాల భూమికి మార్కెట్ రేటు ప్రకారం పరిహారం చెల్లించాలంటూ 2022 ఆగస్టులో ఇచ్చిన తీర్పును అమలు చేయకపోవడంతో గోపాల పురానికి చెందిన రహీముద్దీన్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. 86 ఏండ్ల వృద్ధుడి భూమిని తీసుకుని, హైకోర్టు ఆదేశించినా పరిహారం చెల్లించకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఆర్డీవో నవంబరు 13న ప్రకటించిన అవార్డు మొత్తాన్ని ఈనెల 30లోగా చెల్లించాలని న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

ఆరు వారాల్లో విచారించి చర్యలు తీసుకోండి:
జూబ్లీహిల్స్ సొసైటీ వ్యవహారాలపై హైకోర్టు ఆదేశం


హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ వ్యవహారాలపై ఆరు వారాల్లో విచారణ జరిపి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సహకార శాఖ రిజిస్ట్రార్‌కు హైకోర్టు గురువారం ఆదేశాలు జారీ చేసింది. జూబ్లీహిల్స్ కోఆపరేటివ్ సంస్థ అధ్యక్షుడు రవీంద్రనాథ్ అక్రమంగా సభ్యత్వం పొంది ఎన్నికల్లో పాల్గొన్నందున అనర్హత వేటు వేయాలంటూ అక్టోబరు 26న ఇచ్చిన వినతి పత్రంపై సహకార శాఖ రిజిస్ట్రార్ చర్యలు తీసుకోకపోవడాన్ని సవాలు చేస్తూ కె.జ్యోతిప్రసాద్ తదితరులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై జస్టిస్ టి.మాధవీదేవి విచారణ చేపట్టగా ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ పిటిషనర్లు ఇచ్చిన వినతి పత్రంపై తగిన చర్యలు చేపట్టామనీ, ఇందు కోసం జిల్లా సహకారశాఖ అధికారికి విచారణ బాధ్యతలు అప్పగించారన్నారు. జూబ్లీహిల్స్ సొసైటీ వ్యవహారాలపై పిటిషనర్ల ఆరోపణలకు సంబంధించి విచారణ చేపట్టారన్నారు. ఇవి వీలైనంత త్వరగా పూర్తవుతాయనగా, పిటిషనర్ల తరపు న్యాయవాది జోక్యం చేసుకుంటూ నిర్దిష్ట గడువులోగా విచారణ పూర్తయ్యేలా ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థించారు. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయమూర్తి సొసైటీ వ్యవహారాలపై రికార్డును పరిశీలించి తగిన చర్యలను చట్టప్రకారం తీసుకోవాలని ఆదేశించారు. ఆరు వారాల్లో చర్యలు తీసుకుని వివరాలను పిటిషనర్లకు అందజేయాలని ఆదేశిస్తూ పిటిషన్‌పై విచారణను మూసివేశారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యే లేకుండా చెక్‌ల పంపిణీ వద్దు :
అధికారులకు హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్ కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరుకాకుండా ఎలాంటి చెక్కులను పంపిణీ చేయరాదంటూ అధికారులకు గురువారం హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీసీ, మైనారిటీ సంక్షేమ పథకాల కింద లబ్ధిదారులకు గత ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసి ఓడిపోయిన బండి రమేశ్ ఆధ్వర్యంలో అధికారులు చెక్కుల పంపిణీ చేపట్టడాన్ని సవాలు చేస్తూ మాధవరం కృష్ణారావు వేసిన పిటిషన్‌ను జస్టిస్ టి.మాధవీదేవి బుధవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ సంక్షేమ పథకాల అమల్లో భాగంగా కూకట్‌పల్లి డివిజన్ ఆర్డీవో, కూకట్‌పల్లి, బాలానగర్ తహసిల్దార్లు స్థానిక ఎమ్మెల్యే అయిన పిటిషనర్‌కు ఆహ్వానం ఇవ్వకుండా, కాంగ్రెస్‌కు చెందిన బండి రమేశ్‌ను ఆహ్వానిస్తున్నారన్నారు. బండి రమేశ్ సమక్షంలో చెక్కుల పంపిణీ కార్యక్రమం జరుగుతోందన్నారు. 2016లో జారీ అయిన జీవోలు 18, 25 ప్రకారం సంక్షేమ పథకాల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే భాగస్వామ్యం ఉండాలని స్పష్టమైన మార్గదర్శకాలున్నాయని తెలిపారు. ఈ మార్గదర్శకాలకు విరుద్ధంగా స్థానిక ఎమ్మెల్యేలను విస్మరించి అధికార పార్టీ నేతలను ఆహ్వానిస్తున్నారన్నారు. దీనిపై వివరణ తీసుకోవడానికి గడువు కావాలని ప్రభుత్వ న్యాయవాది కోరారు. వాదనలను విన్న న్యాయమూర్తి స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు లేకుండా ఏ రకమైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేయరాదని అధికారులను ఆదేశిస్తూ విచారణను ఈనెల 23కు వాయిదా వేశారు.

బంగ్లాదేశ్ లో ఎన్నికల వేళాయే..।

2025 చివరిలో లేదా 2026 ప్రారంభంలో ప్రక్రియ



ఢాకా : బంగ్లాదేశ్ తాత్కాలిక నాయకుడు ముహమ్మద్ యూనస్ ఎన్నికల సంస్కరణల పూర్తి జాబితాను అమలు చేయడం వల్ల ఎన్నికలు కొన్ని నెలలు ఆలస్యం అవుతాయని అన్నారు. బంగ్లాదేశ్‌లో సార్వత్రిక ఎన్నికలు 2025 చివరిలో లేదా 2026 ప్రారంభంలో జరుగుతాయని ఆగస్టులో జరిగిన తిరుగుబాటు తర్వాత ఏర్పాటు చేయబడిన తాత్కాలిక ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న ఆ దేశ తాత్కాలిక నాయకుడు ముహమ్మద్ యూనస్ ప్రకటించారు. "2025 చివరి నాటికి లేదా 2026 మొదటి అర్ధభాగం నాటికి ఎన్నికల తేదీలను నిర్ణయించవచ్చు" అని నోబెల్ శాంతి బహుమతి గ్రహీత నాయకుడు బంగ్లాదేశ్ స్వాతంత్ర్యం పొందిన 53వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ఒక జాతీయ ప్రసారంలో తెలిపారు.

మాజీ ప్రధాని షేక్ హసీనా ప్రభుత్వాన్ని కూల్చివేసిన విద్యార్థుల నేత ృత్వంలోని తిరుగుబాటు తర్వాత ఆ దేశ "ప్రధాన సలహాదారు"గా నియమితుడైన యూనస్‌పై ఎన్నికల తేదీని నిర్ణయించమని ఒత్తిడి పెరుగుతో ంది. హసీనాకు మద్దతు ఇవ్వడానికి నిరాకరించి, ఆమె నిష్క్రమణకు దారితీసిన వ్యక్తి, బంగ్లాదేశ్ సైన్యాధిపతి జనరల్ వాకర్-ఉజ్-జమాన్ 12 నుంచి 18 నెలల్లో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలని సెప్టెంబర్‌లో అన్నారు. అవామీ లీగ్‌తో పాటు దేశంలోని రెండు ప్రధాన పార్టీలలో ఒకటైన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ తో సహా ప్రతిపక్ష పార్టీలు కూడా వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించా లని పిలుపునిచ్చాయి.

యూనస్ అవసరమని భావిస్తున్న సంస్కరణలను పర్యవేక్షించడానికి కమిషన్లను ప్రారంభించారు. ఎన్నికల తేదీని నిర్ణయించడం రాజకీయ పార్టీలు అంగీకరించే దానిపై ఆధారపడి ఉంటుంది. "మొత్తం మీద, ఎన్నికల ఏర్పాట్లకు ముందు సంస్కరణలు జరగాలని నేను నొక్కి చెప్పాను" అని ఆయన అన్నారు. "రాజకీయ పార్టీలు దోషరహిత ఓటర్ల జాబితాను కలిగి ఉండటం వంటి కనీస సంస్కరణలతో ముందస్తు తేదీన ఎన్నికలను నిర్వహించడానికి అంగీకరిస్తే, 2025 చివరి నాటికి ఎన్నికలు నిర్వహించవచ్చు" అని ఆయన అన్నారు. కానీ ఎన్నికల సంస్కరణల పూర్తి జాబితాను చేర్చడం వల్ల ఎన్నికలు కొన్ని నెలలు ఆలస్యం అవుతాయని ఆయన అన్నారు.

యూనస్ ప్రవేశపెడుతున్న సంస్కరణల్లో ముఖ్యమైనది నవీకరించబడిన ఓటరు జాబితా. ఇది సంవత్సరాల తరబడి అల్లకల్లోలంగా ఉన్న ప్రజాస్వామ్య ప్రక్రియల తర్వాత ఒక "సంక్లిష్టమైన" సవాలు. వేగంగా పెరుగుతున్న యువ జనాభాలో జాబితాల నుంచి తప్పుడు పేర్లను తొలగించడం మరియు మొదటిసారి ఓటర్లను నమోదు చేయడం రెండూ అవసరం. ఎన్నికలలో "100 శాతం ఓటింగ్ శాతం నిర్ధారించడం" గురించి తాను కలలు కన్నానని యూనస్ అన్నారు. "ఇది సాధించగలిగితే, ఏ ప్రభుత్వం కూడా పౌరుల ఓటు హక్కులను మళ్ళీ తొలగించడానికి ధైర్యం చేయదు" అని ఆయన అన్నారు.

బంగ్లాదేశ్ చివరిసారిగా జనవరిలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించింది. ఆ సమయంలో హసీనా విజయాన్ని అందుకుంది. ఈ ఎన్నిక స్వేచ్ఛగా లేదా న్యాయంగా లేదని విమర్శకు గురైంది. వేలాది మంది ప్రతిపక్ష పార్టీ సభ్యులను అరెస్టు చేసిన తర్వాత ప్రత్యర్థులు దీనిని బహిష్కరించారు. గత ప్రభుత్వ హయాంలో దుర్వినియోగాలకు పాల్పడిన వారికి న్యాయం జరిగేలా చూడటంపై కూడా తన పరిపాలన దృష్టి సారించిందని, హసీనా అరెస్టుకు వారెంట్ జారీ చేయడంతో సహా అని యూనస్ చెప్పారు.

తాలిబన్ నేత హక్కానీ హత్య వెనుక..

ప్రపంచ సమకం



కాబూల్ : తాజాగా కాబూల్ లో జరిగిన ఆత్మాహుతి దాడిలో తాలిబాన్ శరణార్థుల మంత్రి ఖలీల్ ఉర్-రెహమాన్ హక్కానీ మరో నలుగురితో పాటు మరణించారు. మరణించిన మంత్రి హక్కానీ నెట్‌వర్క్ లో సీనియర్ నాయకుడు. ఇతను 2021 నుంచి ఆఫ్ఘనిస్తాన్‌లో సంయుక్తంగా అధికారాన్ని నియంత్రించే తాలిబాన్ కు అత్యంత సన్నిహితుడు. ఖోరాసన్ ప్రావిన్స్ లోని ఐసిల్(ఐసిస్) అనుబంధ సంస్థ, ఐఎస్ కేపి హక్కానీ హత్యకు బాధ్యతవహిసు న్నట్టు ప్రకటించింది.

మూడు సంవత్సరాల క్రితం అమెరికా మద్దతుగల మాజీ అధ్యక్షుడు అష్రఫ్ ఘనీ ప్రభుత్వాన్ని తొలగించిన తర్వాత ఆఫ్ఘనిస్తాన్ లో తాలిబాన్ నేత ృత్వంలోని పరిపాలనలో ఒక నాయకుడి అత్యంత ముఖ్యమైన హత్యగా విశ్లేషకు లు అంటున్నారు. బాంబు దాడి, తాలిబాన్, దాని మిత్రదేశాలలో అంతర్గత ఉద్రిక్తతలు, దేశంలో ఐఎస్ కేపి ప్రభావం, ఆఫ్ఘనిస్తాన్‌లో భద్రత గురించి ప్రశ్నలను లేవనెత్తిందని వారు అంటున్నారు.

హక్కానీ తాలిబాన్ అంతర్గత మంత్రి, హక్కానీ నెట్‌వర్క్ లో అత్యంత సీనియర్ నాయకుడు సిరాజుద్దీన్ హక్కానీకి మామ. శరణార్థుల మంత్రిగా నియమించబడటానికి ముందు, తాలిబాన్ దేశంపై నియంత్రణను సాధించిన వెంటనే ఖలీల్ ఉర్-రెహమాన్ హక్కానీకి మొదట కాబూల్ నగర భద్రతా బాధ్యతలను అప్పగించారు. అతను గతంలో ఆఫ్ఘనిస్తాన్‌లో అల్-ఖైదా సైన్యానికి సహాయం చేస్తూ హక్కానీ నెట్‌వర్క్ ఆపరేషనల్ కమాండర్‌గా ఉన్నాడు. అతని నెట్‌వర్క్ నిధుల సేకరణ ప్రయత్నాలలో కీలకంగా వ్యవహరించాడు.

2011లో అమెరికా ట్రెజరీ డిపార్ట్ మెంట్ అతన్ని "ఉగ్రవాదిగా" ప్రకటించింది. అతన్ని పట్టుకుని ప్రాసిక్యూట్ చేయడానికి కావలసిన సమాచారం కోసం 5 మిలియన్ల వరకు బహుమతిని ప్రకటించింది. "అతను చాలా ముఖ్యమైనవాడు" అని జెనీవా ప్రధాన కార్యాలయం ఉన్న సెంటర్ ఆన్ ఆర్మ్డ్ గ్రూప్స్ లో సహ-డైరెక్టర్ ఆష్లే జాక్సన్ అన్నారు. అతను "హక్కానీ నెట్‌వర్క్ సృష్టిలో కీలక పాత్ర పోషించాడు" అని అన్నారు. "అంతేకాకుండా, అతనికి ప్రభుత్వంలో బలమైన స్థానం ఉంది... ". పరిపాలన ప్రారంభంలోనే ఆయన ఐక్యరాజ్యసమితి సంస్థలపై అధికారం చెలాయించడానికి చర్యలు తీసుకోవడం మనం చూశాము. ఆయన చాలా స్వయంప్రతిపత్తి కలిగి ఉండేవాడు. ప్రాథమికంగా తన పని తాను చేసుకునేవాడు" అని జాక్సన్ జోడించారు.

నిజమే, 2021లో హక్కానీని మంత్రిత్వ శాఖకు నియమించడం పాశ్చాత్య అధికారులలో ఆశ్చర్యం కలిగించిందని ఇంటర్నేషనల్ క్రైసిస్ గ్రూప్‌లో సీనియర్ కన్సల్టెంట్ గ్రేమ్ స్మిత్ అన్నారు. "యుద్ధ సమయంలో వారు అతన్ని కఠినమైన కమాండర్‌గా గుర్తించారు. శరణార్థి మంత్రిత్వ శాఖకు ఎన్ జీ ఓ లతో బాగా పనిచేసే మృదువైన వ్యక్తిత్వంగల వ్యక్తి అవసరమని వారు ఆందోళన చెందారు" అని ఆయన అన్నారు. కానీ ప్రభుత్వం లోపల, హక్కానీ ఒక ఆచరణాత్మకవాదిగా పేరు పొందాడని స్మిత్ అన్నారు.

"బాలికలు, మహిళలు మాధ్యమిక పాఠశాలలు, విశ్వవిద్యాలయాలకు వెళ్లాలని తెరవెనుక లాబీయింగ్ చేస్తున్నట్టు ఆయనకు పేరుంది" అని స్మిత్ అన్నారు. తాలిబాన్ అధికారం చేపట్టినప్పటి నుంచి మహిళల స్వేచ్ఛపై అనేక ఆంక్షలు విధించినప్పటికీ, ఆఫ్ఘనిస్తాన్‌లో మహిళల ఉన్నత విద్యపై పూర్తి నిషేధానికి వ్యతిరేకంగా హక్కానీ నాయకత్వం నుంచి కొంత అంతర్గత ప్రతిఘటన ఉందని విశ్లేషకులు అంటున్నారు. "అతను హక్కానీ నెట్‌వర్క్ లో ఒక బలీయమైన వ్యక్తి", ఒక మంత్రి పదవి ఉన్న సభ్యుడిని కోల్పోవడం హక్కానీ శక్తిని తగ్గిస్తుంది "అని జాక్సన్ అన్నారు.

అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

- నేడు దిష్టిబొమ్మల దహనం : టీఏజీఎస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్ర హోం మంత్రి అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం(టీఏజీఎస్) రాష్ట్ర కమిటి డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మిడియం బాబురావు, పూసం సచిన్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అమిత్‌షా పార్లమెంటు సాక్షిగా అంబేద్కర్‌ను అవమానించారని పేర్కొన్నారు. దీనికి నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా నేడు దిష్టిబొమ్మ దహనం చేయాలని పిలుపునిచ్చారు. అమిత్‌షా మనువాద ఆలోచనలను బయట పెట్టుకున్నారని తెలిపారు. తక్షణమే ఆయన్ను కేంద్ర మంత్రి పదవినుండి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ పట్ల ఆర్ఎస్ఎస్, బీజేపీకి ఉన్న అవగాహన్ను బహిరంగ పర్చారని పేర్కొన్నారు. దీంతో మరో సారి వారు అట్టడుగు వర్గాల పట్ల వారి వైఖరిని స్పష్టం చేశారని తెలిపారు.

ఏడాదిలో కాంగ్రెస్ అప్పు రూ. 1.27లక్షల కోట్లు

- పదేండ్లలో బీఆర్ఎస్ అప్పు రూ.4.17లక్షల కోట్లు
- తప్పుని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం : బీఆర్ఎస్ సభ్యులు హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదేండ్లలో బీఆర్ఎస్ రూ.4.17లక్షల కోట్ల అప్పు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి సంవత్సరమే రూ.1.25 లక్షల కోట్ల అప్పు చేసిందని బీఆర్ఎస్ సభ్యులు హరీశ్‌రావు ఆరోపించారు. తాను చెప్పింది తప్పని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని సవాల్ విసిరారు. రాష్ట్ర రుణాలపై శాసనసభలో జరిగిన చర్చలో హరీశ్‌రావు మాట్లాడారు. ప్రివిలేజ్ మోషన్‌పై గురువారం అసెంబ్లీలో జరిగిన స్వల్పకాలిక చర్చ సందర్భంగా ఆయన కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. ఇదే తీరున కాంగ్రెస్ సర్కార్ అప్పులు చేస్తే ఐదేండ్లలోనే గత ప్రభుత్వ అప్పును మించిపోతారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లలో రూ.4.17లక్షల కోట్లు అప్పు చేస్తే, వీళ్ల అప్పు ఐదేండ్లలోనే రూ.7 లక్షల కోట్లు దాటిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు.. రెవెన్యూ రాబడి, రెవెన్యూ వ్యయం పరంగా చూసినా తాము మిగులు బడ్జెట్ రాష్ట్రాన్నే అప్పగించామని అన్నారు. భూములు కుదువపెట్టి అప్పులు తీసుకునేందుకు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. రూ.75 కోట్లకు ఎకరం చొప్పున టీజీఐఐసీ భూములు అమ్మే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. వాస్తవాలు ఇలా ఉంటే మాటి మాటికి గత సర్కార్ అప్పులంటూ రాష్ట్ర ప్రభుత్వం, సభను, ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని విమర్శించారు. తాను మాట్లాడిన మాటలు తప్పయితే స్పీకర్ ఫార్మట్ రాజీనామా చేస్తాననీ, అందుకు భట్టి సిద్ధమేనా అంటూ సవాల్ విసిరారు.

సర్వేల్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్



- యాదాద్రి కలెక్టర్ హనుమంతరావు ఉత్తర్వులు జారీ
- పాఠశాల ఎదుట విద్యార్థి సంఘాల ధర్నా

నవతెలంగాణ-సంస్థాన్ నారాయణపురం

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం సర్వేల్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశంపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు కలెక్టర్ హనుమంతరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం గురుకుల పాఠశాలలో రాగి జావా కాళ్ల మీద పడి శివరాత్రి శామ్యూల్ అనే 8వ తరగతి విద్యార్థికి తీవ్రగాయాలైన సంగతి తెలిసిందే. బాధితుడు హైదరాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గురువారం విద్యార్థి సంఘాల నాయకులు గురుకులం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని పట్టుబట్టారు. మరోవైపు ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థికి గాయాలైనట్టు గుర్తించి ఆయనను కలెక్టర్ సస్పెండ్ చేశారు.

జగిత్యాల సబ్ జైలులో రిమాండ్ ఖైదీ మృతి


(ఫైల్)

నవతెలంగాణ - జగిత్యాల టౌన్

జగిత్యాల జిల్లా కేంద్రంలోని సబ్‌జైల్‌లో ఓ రిమాండ్ ఖైదీ గుండెపోటుతో మృతి చెందాడు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్యాల మండలం రామన్నపేట గ్రామానికి చెందిన క్యాతం మల్లేశం 15 రోజుల కిందట ఓ కేసులో రిమాండ్ ఖైదీగా జగిత్యాల సబ్ జైలుకు వచ్చాడు. గురువారం తెల్లవారుజామున ఆయనకు గుండెపోటు వచ్చింది. వెంటనే జైలు సిబ్బంది స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మల్లేశం మృతి చెందాడు. గతంలో మల్లేశానికి ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగినట్టు బంధువులు తెలిపారు.

ఎయిడెడ్ టీచర్ల వేతనాలను విడుదల చేయాలి : టీఎస్‌యూటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఎయిడెడ్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు గతనెల వేతనాలను వెంటనే విడుదల చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 19వ తేదీ గడిచినా గత నెల వేతనాలు అందక ఉపాధ్యాయులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. కనుక ఆర్థిక శాఖ ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావును కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

ఎయిడెడ్ టీచర్ల నవంబర్ వేతనాలు విడుదల చేయాలి : టీపీటీఎఫ్

ఎయిడెడ్ టీచర్ల గతనెల వేతనాలు నేటి వరకు కూడా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయలేదని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ ప్రతినెల ఒకటో తేదీన జీతాలు ఇస్తున్నామని అనేక సమావేశాల్లో చెప్పున్నారని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కానీ ఎయిడెడ్ టీచర్ల వేతనాలు ప్రతి నెల ఎదురు చూసే పరిస్థితి ఉందని తెలిపారు. ఎయిడెడ్ పాఠశాలల్లోని మెజార్టీ టీచర్లు ఈనెలలో క్రిస్మస్ పండుగ జరుపుకుంటారని పేర్కొన్నారు. టీచర్లు జీతాలు రాక గృహరుణాలు, విద్యారుణాలు, వ్యక్తిగత రుణాలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎయిడెడ్ టీచర్ల గతనెల వేతనాలను చెల్లించాలని ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావుకు రాతపూర్వకంగా, మెయిల్ ద్వారా, వాట్సాప్ లో ద్వారా అనేకమార్లు ప్రాతినిధ్యం చేశామని తెలిపారు. అయినా జీతాలు విడుదల చేయటంలో జాప్యం ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు. ఎయిడెడ్ టీచర్ల గతనెల వేతనాలను వెంటనే విడుదల చేయాలనీ లేదంటే ఆందోళన బాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

హౌతి రెబెల్స్‌కి చెందిన ఓడరేవులు, ఇంధన సదుపాయాలపై ఇజ్రాయిల్ దాడులు

జెరూసలేం : యెమెన్‌లో హౌతి రెబెల్స్ ఉపయోగించే ఓడరేవులు, ఇంధన సదుపాయాలపై ఇజ్రాయిల్ దాడులు చేసింది. రెబెల్స్ నుండి వచ్చిన క్షిపణిని అడ్డుకున్న అనంతరం మీ దగ్గరకు కూడా వస్తామంటూ హౌతి నేతలకు హెచ్చరిక జారీ చేసింది. రాజధాని సానాలోని విద్యుత్ స్టేషన్లు, చమురు కేంద్రాలు, ఓడరేవుపై ఇజ్రాయిల్ దాడులు జరిపిందని, మరణాలు సంభవించాయని, గాయపడ్డారని హౌతి మీడియా తెలిపింది. అంతకుమించి వివరాలు వెల్లడించలేదు.

ప్రభుత్వ పాఠశాలలపై ఉన్న 'నామోషీ'ని తొలగించాలి

గ్రీన్ చానల్ ద్వారా కాస్మోటిక్ చార్జీలు

- వచ్చే విద్యా సంవత్సరానికి ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు సిద్ధం : గురుకులాలపై చర్చలో మంత్రి పొన్నం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నెలకొన్న 'నామోషీ'ని తొలగించాల్సిన అవసంముందని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అభిప్రాయపడ్డారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలనే చైతన్యం రావాలని ఆకాంక్షించారు. వాటిలో అడ్మిషన్లు తక్కువ కావడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని శాసనమండలిలో గురుకులాలపై చర్చను మంత్రి ప్రారంభించారు. ప్రతినెల 10న కాస్మోటిక్ చార్జీలు గ్రీన్ చానల్ ద్వారా చెల్లిస్తామని పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశామనీ, వచ్చే విద్యా సంవత్సరానికి అవి సిద్ధమవుతాయని తెలిపారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ,మైనార్టీ గురుకులాలకు సొంత భవనాల నిర్మాణానికి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. అది నిరంత ప్రక్రియ అన్నారు. అన్ని గురుకులాల్లో ఒకే రకమైన డైట్ మెనూను అమలు చేసినట్టు తెలిపారు. సోలార్ ఈటర్ల ద్వారా విద్యార్థుల స్నానానికి వేడి నీళ్లు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. అన్ని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు పెద్ద పీట వేయనున్నట్టు చెప్పారు. వార్డెన్లు, కేర్ టేకర్లు విద్యార్థుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గురుకులాల్లో ఏఎన్ఎంలను నియమించడం ద్వారా విద్యార్థుల ఆరోగ్యాలను పర్యవేక్షిస్తామని భరోసా ఇచ్చారు.



విద్యాశాఖకు మంత్రిని నియమించాలి
శాసనమండలి సభ్యులు సత్యవతి రాథోడ్

విద్యాశాఖకు మంత్రిని నియమించకపోవడం పట్ల శాసనమండలి సభ్యులు సత్యవతి రాథోడ్ తప్పుపట్టారు. రాష్ట్రంలో 40 లక్షల మంది విద్యార్థులు జీవితాలు ఆ శాఖ ముడిపడి ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించాలనే లక్ష్యంతో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం 700 గురుకులాలను పెంచిందని గుర్తు చేశారు. శాసనమండలిలో గురుకులాలపై చర్చలో ఆమె మాట్లాడారు. గురుకులాల ప్రతిష్టను దెబ్బతీసేలా ఇటీవల కొన్ని సంఘటనలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఫుడ్ పాయిజనింగ్, పాము, తేలు కాట్లు వంటి ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని చెప్పారు.

ఇటీవల రాష్ట్రంలో 54 మంది విద్యార్థులు మరణించడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 40శాతం మెస్‌చార్జీలు పెంచడాన్ని తాము స్వాగతిచ్చారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా ప్రతిఏటా మెస్‌చార్జీలు పెంచాలని కోరారు. బీఆర్ఎస్ సభ్యులు గోరటి వెంకన్న, పోచంపల్లి శ్రీనివాసరెడ్డి, తాతా మధు, నవీన్‌రావుతోపాటు



రఘోత్తమరెడ్డి, బీజేపీ సభ్యులు ఏవీఎన్‌రెడ్డి తదితరులు మాట్లాడారు.

విద్యాశాఖ సీఎం వద్ద ఉండాలని కోరుకుందాం
ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

క్యాబినెట్ విస్తరణ తర్వాత కూడా విద్యాశాఖ ముఖ్యమంత్రి వద్ద ఉండాలని కోరుకుందామని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆకాంక్షించారు.అప్పుడే ప్రభుత్వ పాఠశాలలు బలోపేమవుతాయనీ, వాటిపై పూర్తిగా సీఎం దృష్టి ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గురుకులాల పర్యవేక్షణకు నోడల్ అధికారులను నియమించాలని కోరారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలకు సొంత భవనాలను నిర్మించాలని సూచించారు. కాస్మోటిక్ చార్జీలు గత ఏడేండ్లుగా పెంచలేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 40శాతం పెంచడం పట్ల హర్షం ప్రకటించారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీలు మహేష్‌కుమార్‌గౌడ్, బల్మూరి వెంకట్, తీన్మార్ మల్లన్న తదితరులు చర్చలో పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను పునర్వ్యవస్థీకరించాలి : ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



ప్రభుత్వ పాఠశాలలను పునర్ వ్యవస్థీకరించాల్సిన అవసరముందని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అభిప్రాయపడ్డారు. విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగేండ్లుగా అడ్మిషన్ల వివరాలను వెల్లడించాలని కోరినా పట్టించుకోలేదని చెప్పారు. వెయ్యి గురుకులాల్లో 650 గురుకులాలు అద్దెభవనాల్లో నడుస్తున్నాయని చెప్పారు. వాటికి ఎంత అద్దె చెల్లిస్తున్నారో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. అనేక పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేవన్నారు. కాంపౌండ్ వాల్స్, మరుగుదొడ్లు, మంచినీరు, ఆటస్థలాలు, కొన్ని పాఠశాలలకు రహదారులు సక్రమంగా లేవని గుర్తు చేశారు. డిగ్రీ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎందుకు తక్కువగా ఉందో ప్రభుత్వం పరిశీలించాలని సూచించారు. ఫుడ్ పాయిజనింగ్ వంటి ఘటనలు కొన్నిచోట్ల బయటకు వస్తున్నవనీ, కొన్ని చోట్ల రావడం లేదని చెప్పారు. ప్రీ ప్రైమరీ విద్యార్థుల సంఖ్యను పెంచాల్సిన అవసరముందన్నారు.

4శాతం మేరా వృద్ధి చెందుతున్న రష్యా ఆర్థిక వ్యవస్థ

- రష్యా అధ్యక్షుడు పుతిన్ వెల్లడి



మాస్కో : రష్యా ఆర్థిక పరిస్థితి బాగుందని అధ్యక్షుడు పుతిన్ పేర్కొన్నారు. ఈ ఏడాది దాదాపు 4శాతం మేరా ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతోందని చెప్పారు. వినిమయ ద్రవ్యోల్బణం అధికంగా 9.3శాతం వుందని అంగీకరించారు. అయితే దాన్ని కుదించడానికి సెంట్రల్ బ్యాంక్ చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఆర్థిక వ్యవస్థ సుస్థిరంగా వుందని స్పష్టం చేశారు. ప్రతి ఏటా రష్యా అధ్యక్షుడు నిర్వహించే ఈ పత్రికా సమావేశం సుదీర్ఘంగా సాగుతుంది. దేశ రాజకీయ, ఆర్థిక స్థితిగతులపై అధ్యక్షుడి నియంత్రణను తెలియచేసేందుకే ఈ సమావేశం ఏర్పాటు చేయబడుతుంది. ఈసారి ప్రశ్నోత్తరాల సెషన్‌లా సాగిన ఈ సమావేశంలో అనేక అంశాలపై పుతిన్ మాట్లాడారు. దేశ విదేశీ జర్నలిస్టులు హాజరయ్యారు. మొదటిసారిగా కృత్రి మేథస్సును ఈ కార్యక్రమం కోసం వాడారు. రష్యాలోని 11 టైమ్ జోన్‌ల వ్యాప్తంగా ఈ పత్రికా సమావేశాన్ని ప్రభుత్వ టివి ప్రసారం చేస్తుంది. సాధారణంగా దేశీయ, స్థానిక అంశాలే ముఖ్య పాత్ర పోషిస్తాయి. ఈసారి సామాన్య ప్రజలు ఇప్పటికే 20లక్షలకు పైగా ప్రశ్నలు అధ్యక్షుడికి పంపించారని రష్యన్ ప్రభుత్వ మీడియా తెలియచేసింది. కాగా ఈసారి ఉక్రెయిన్‌లో రష్యా మిలటరీ చర్య, పశ్చిమ దేశాలతో పెరుగుతున్న ఉద్రిక్తతలకు సంబంధించి ప్రశ్నలు ఎక్కువగా వస్తాయని భావిస్తున్నారు. రష్యా ప్రత్యేక మిలటరీ చర్యకు విజయవంతమైన ముగింపు వుంటుందని పుతిన్ ప్రతిన చేశారు. ఈ ఏడాది రష్యా కదన రంగ విజయాల గురించి ఆయన గొప్పగా చెప్పారు.

'టిఫిన్ బాక్స్‌లో మాంసాహారం'

- ముగ్గురు బాలురకు అలహాబాద్ హైకోర్టు ఊరట



ప్రయాగ్‌రాజ్ : టిఫిన్ బాక్స్‌లో మాంసాహారం తీసుకొచ్చినందుకు పాఠశాల నుంచి బహిష్కరణకు గురైన ముగ్గురు బాలురకు అలహాబాద్ హైకోర్టు ఊరట కలిగించింది. ఈ విద్యార్థులు రెండు వారాల్లోగా వేరే పాఠశాలలో చేర్చేలా చూడాలని అమ్రోహా జిల్లా మేజిస్ట్రేట్‌ను ఆదేశించింది. జిల్లాలోని ఒక పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు తమ టిఫిన్ బాక్స్‌లో మాంసాహారం తెచ్చుకోవడంతో ప్రిన్సిపాల్ అభ్యంతరం వ్యక్తం చేసి, విద్యార్థులను బహిష్కరించారు. దీంతో బాధిత విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటీషన్‌ను జస్టిస్ సిద్ధార్థ, .జస్టిస్ ఎస్‌సి శర్మ తో కూడిన ధర్మాసనం విచారించింది. రెండు వారాల్లోగా విద్యార్థులను మరొక సిబిఎస్ఇ అనుబంధ పాఠశాలలో చేర్చాలని జిల్లా మేజిస్ట్రేట్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను జనవరి 6కి వాయిదా వేసింది.

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో వామపక్షాల అభ్యర్థుల వెల్లడి

- సంయుక్త ఎన్నికల ప్రణాళిక విడుదల

న్యూఢిల్లీ : నాలుగు వామపక్షాల ఢిల్లీ శాఖలు గురువారం సంయుక్తంగా వామపక్ష ప్రత్యామ్నాయ ప్రణాళికను విడుదల చేశాయి. దీంతో పాటూ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు సీట్లకు పోటీచేసే అభ్యర్థుల పేర్లను ప్రకటించాయి. గురువారం ఇక్కడ జరిగిన పత్రికా సమావేశంలో ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. కరవాల్ నగర్, బాదర్పూర్ స్థానాల్లో సిపిఎం, వికాస్ పురి, పాలెంల్లో సిపిఐ, నారెలా, కోంధి స్థానాల్లో సిపిఐ(ఎంఎల్) అభ్యర్థులు పోటీ చేస్తున్నారని ఆ ప్రకటన తెలియచేసింది. ఇవి కాకుండా, రాబోయే రోజుల్లో సిపిఐ, ఫార్వర్డ్ బ్లాక్‌లు మరికొన్ని సీట్లలో తమ అభ్యర్థుల వివరాలను ప్రకటించనున్నాయి. బిజెపిని ఓడించాలి, వామపక్షాలను గెలిపించాలనే నినాదంతో ఈ శాఖలు సంయుక్త ఎన్నికల ప్రణాళికను రూపొందించాయి.



విద్యార్థులకు పాఠాలు వివరిస్తున్న కలెక్టర్ నాగరాణి

ఏపీలో కలెక్టర్ టీచర్‌గా మారిన వేళ!

పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలం పాందువ్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి గురువారం టీచర్ అవతారమెత్తారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో పాటు బెంచ్ మీద కూర్చుని వారితో పాఠాలు చదివిస్తూ, తప్పులు సరి చేస్తూ విద్యార్థులతో మమేకమయ్యారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులను పేర్లు అడిగి తెలుసుకుని వారితో పాటలు పాడించారు.

ఇథనాల్ పరిశ్రమ రద్దుకు సమిష్టి పోరాటం

- సీపీఐ జాతీయ నాయకులు చాడ వెంకటొరెడ్డి
- సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలో నిర్మాణంలో ఉన్న పరిశ్రమ సందర్శన



నవతెలంగాణ-బెజ్జంకి

ప్రజల జీవనాధారం వ్యవసాయమేనని.. వ్యవసాయ సాగుకు, పర్యావరణానికి ముప్పుగా వాటిల్లనున్న ఇథనాల్ పరిశ్రమలను ప్రభుత్వం బేషరతుగా రద్దు చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటొరెడ్డి డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులు, ప్రజల అభిప్రాయం మేరకు సీపీఐ ఆధ్వర్యంలో ప్రభుత్వంపై సమిష్టి పోరాటం చేస్తామని హెచ్చరిం చారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం గుగ్గిల్ల గ్రామ శివారులో ప్రజాభిప్రా యానికి విరుద్ధంగా నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమల ప్రాంతాన్ని గుగ్గిల్ల, తిమ్మాయిపల్లి గ్రామాల రైతులతో కలిసి సీపీఐ నాయకులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇథనాల్ పరిశ్రమల రద్దుకు కృషి చేయాలని ఆయా గ్రామాల రైతులు చాడ వెంకటొరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంత రం ఆయన మాట్లాడుతూ.. స్థానిక రైతులు వ్యతిరేకిస్తున్నా ఇథనాల్ పరిశ్రమ నిర్మిస్తుండటం ప్రజాభిప్రాయాలను విస్మరించడమేనన్నారు. ఇథనాల్ పరిశ్రమల రద్దుకు ప్రజాభీష్టం ప్రకారం సీపీఐ నాయకత్వం ప్రణాళికలు రూపొందించి ప్రత్యక్షంగా పోరాటం చేస్తుందని తెలిపారు. గుగ్గిల్ల తిమ్మాయి పల్లి, పోతారం, నర్సింహులపల్లి గ్రామ రైతులు కమిటీ ఏర్పాటు చేసుకుని పోరాటానికి సిద్ధమవ్వాలని సూచించారు. రైతులు ఐక్యతతో పోరాటాలకు సిద్ధమవ్వాలని జిల్లా కార్యదర్శి మందపవన్ పిలుపునిచ్చారు. సీపీఐ మండల నాయకులు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కుల్గాంలో ఎన్‌కౌంటర్

- వెటరన్ కమాండర్‌తో సహా
- ఐదుగురు ఉగ్రవాదులు మృతి
- ఇద్దరు భద్రతా సిబ్బందికి గాయాలు



శ్రీనగర్ : జమ్మూకాశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో కమాండర్ ఫరూక్ అహ్మద్ భట్‌తో సహా ఐదుగురు హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాదులు మృతి చెందారు. మరో ఇద్దరు సైనికులు తీవ్రంగా గాయపడ్డారు. జిల్లాలోని ఖాదర్ ప్రాంతంలో తెల్లవారుజామున 3:30 గంటల ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నారనే ఖచ్చితమైన సమాచారంతో అక్కడకు చేరుకున్న భద్రతా సిబ్బంది ముందుగా వారిని లొంగిపొమ్మని కోరారని, అయినా వారు కాల్పులు ప్రారంభించడంతో ఈ ఎన్‌కౌంటర్ ఘటన జరిగిందని చెప్పారు. ఎన్‌కౌంటర్‌లో గాయపడ్డ సైనికులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, వారి పరిస్థితి నిలకడగా ఉందని చెప్పారు. కాగా, భట్ మృతిని భారీ విజయంగా భద్రతా సిబ్బంది పేర్కొంటున్నారు. దక్షిణ కాశ్మీర్‌లో ప్రముఖ హిజ్బుల్ ముజాహిదీన్ కమాండర్‌గా ఫరూక్ అహ్మద్ భట్ అలియాస్ నాలీకి పేరు ఉంది. ఈ ప్రాంతంలో ఉగ్రవాదాన్ని పునరుద్ధరించడంలో భట్ కీలక పాత్ర పోషించాడని చెబుతున్నారు. 2015 నుంచి ఫరూక్ చురుగ్గా ఉంటున్నాడని, యువకులను ఉగ్రవాదం వైపు మళ్లించడంతో కీలక పాత్ర పోషిస్తున్నాడని ఆర్మీ 2 సెక్టార్ రాష్ట్రీయ రైఫిల్స్ కమాండర్ బ్రిగేడియర్ అనిరుధ్ చౌహాన్ తెలిపారు. భట్‌పై 37 ఎఫ్ఐఆర్‌లు నమోదై ఉన్నాయని తెలిపారు. గురువారం ఎన్‌కౌంటర్‌లో భట్‌తో పాటు ఉగ్రవాదులు ఇర్ఫాన్ లోన్, ఆదిల్ హుస్సేన్, ముస్తాక్ ఇటూ, యాసిర్ జావేద్ మరణించినట్లు తెలిపారు. వీరంతా కుల్గాం జిల్లాకు చెందినవారే. అలాగే ఎన్‌కౌంటర్ స్థలం నుంచి ఐదు ఏకె-47 రైఫిళ్లు, రెండు గ్రెనేడ్లు, 20 మ్యాగజైన్లు, మందుగుండు సామాగ్రిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలకు ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఖండన

- దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్
- నేటినుంచి రాష్ట్రవ్యాప్త నిరసనలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన అవమానకర వ్యాఖ్యలను భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీలు తీవ్రంగా ఖండించాయి. ఈ మేరకు ఆయా సంఘాల రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కోట రమేష్, కార్యదర్శులు టి నాగరాజు, ఆనగంటి వెంకటేశ్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్లమెంట్‌లో అంబేద్కర్ పేరు పెట్టుకోవడం ఒక ఫ్యాషన్‌గా మారిందని వ్యాఖ్యానించిన అమిత్‌షా, హిందూ దేవుడి పేరును తరచూ పెడితే స్వర్గం ఏడు రెట్లు గ్యారెంటీ అని మాట్లాడారని గుర్తు చేశారు. అంబేద్కర్‌ను అవకాశవాదంగా ఆక్రమించుకుంటూ ఆర్ఎస్ఎస్-బిజెపి కులతత్వ మనస్తత్వాన్ని అమిత్‌షా వెల్లడించారని తెలిపారు. దేశంలో బీజేపీ ప్రభుత్వ హయాంలో అణగారిన వర్గాల హక్కులపై దాడులు నిరంతరం జరుగుతూనే ఉన్నాయని విమర్శించారు. విద్యారంగంలో కూడా మోడీ ప్రభుత్వం బహిరంగంగా దళిత వ్యతిరేక వైఖరిని ప్రదర్శిస్తోందని పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్-బీజేపీ ప్రభుత్వ హయాంలో విశ్వవిద్యాలయాలు కూడా ఆత్మహత్యా క్షేత్రాలుగా దిగజారాయని తెలిపారు. ఐఐటీ వంటి కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో 56 శాతం ఆత్మహత్యలు అణగారిన కులాలు, తరగతులు, గిరిజన వర్గాలకు చెందిన విద్యార్థులేనని వివరించారు. ఎస్సీల స్కాలర్‌షిప్‌లను కూడా తగ్గించిందని పేర్కొన్నారు. రోహిత్ వేముల సంస్థాగత హత్యకు బీజేపీ ప్రభుత్వ విధానాలే కారణమని విమర్శించారు. అంబేద్కర్ వారసత్వాన్ని తుంగలో తొక్కి, కఠోరమైన కులతత్వాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నదని తెలిపారు. సామాజిక న్యాయం కోసం వర్సిటీల ప్రాంగణాల్లో ప్రజాస్వామ్యం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ అసమానమైన వారసత్వాన్ని కాపాడుకోవడంలో ముందుభాగంలో ఉండాలని కోరారు. అంబేద్కర్‌ను అవమానపరుస్తూ వ్యాఖ్యానించిన అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన వ్యాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

ఇరాన్ ప్రభుత్వాన్ని కూల్చలేక పోయాం

- బహిరంగంగా అంగీకరించిన అమెరికా

న్యూయార్క్ : ఇరాన్‌లో ప్రభుత్వాన్ని మార్చేందుకు గత రెండు దశాబ్దాలుగా అనేక విధాలా ప్రయత్నించామని కానీ ఫలితం లేకపోయిందని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ బహిరంగంగా అంగీకరించారు. ఇస్లామిక్ రిపబ్లిక్ నాయకత్వాన్ని కూలదోయాలని చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయన్నారు. విదేశీ సంబంధాల మండలిలో బుధవారం మాట్లాడుతూ బ్లింకెన్ ఈ విషయం స్పష్టం చేశారు.గత 20 ఏళ్ళుగా మేం చేసిన ప్రయత్నాలను వెనక్కి తిరిగి చూసుకంటే అవేవీ కూడా ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేకపోయాయని తెలుస్తోందని అన్నారు. 1979లో బందీల సంక్షోభం తర్వాత అప్పటి అమెరికా అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ ఇరాన్‌తో 1980 ఏప్రిల్ నుండి దౌత్య సంబంధాలు తెగతెంపులు చేసుకున్నారు. రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు లేకపోవడ మే ఈ వైఫల్యానికి కారణమని ఆయన చెప్పారు. ఇరాన్‌లో ప్రభుత్వానికి కట్టుబడి వుండే వారి సంఖ్య గణనీయంగా వుంటుందని, సాంప్రదాయసిద్ధమైన ఈ అంశం వారికి బాగా కలిసివచ్చిన అంశమని ఆయన అంగీకరించారు.